అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

ఆదివారం 22-12-2024 | సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 353 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00



పాప్‌కార్న్‌పై మూడు రకాల పన్నులు

బీమాపై జీఎస్టీ తగ్గింపు వాయిదా

సెకండ్‌హ్యాండ్ కార్లపై 18 శాతం పన్ను : జీఎస్టీ కౌన్సిల్‌లో నిర్ణయం

వివరాలు 6లో

పదేండ్ల పాలనపై

- మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు
- ప్రతిపక్షనేత అసెంబ్లీకి వస్తే...కడిగేద్దామనే ఉన్నాం
- 80వేల పుస్తకాలు చదివిన మేథస్సుతో 'కూలేశ్వరం' కట్టారు
- రాళ్లు, గుట్టలకూ రైతుభరోసా ఇద్దామా?
- రూ.22వేల కోట్లను ఇలాగే అనర్హులకు కట్టబెట్టారు

సిగ్గు పడండి

రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు



ఎవర్నీ వదలం... చట్టం ముందు నిలబెడతాం : అసెంబ్లీలో బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్

నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో

పదేండ్ల బీఆర్ఎస్ పాలనపై ఆపార్టీ నేతలు సిగ్గుపడాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఫైర్ అయ్యారు. తొమ్మిదిన్నరేండ్ల ఆపార్టీ పాలన దోపిడీలు, దౌర్జన్యాలు, నిర్బంధాలతోనే సాగిందని విమర్శించారు. 80వేల పుస్తకాలు చదివిన అపర మేథావి, ప్రతిపక్షనేత అసెంబ్లీకి వచ్చి, తన జ్ఞానాన్ని ఎందుకు తెలంగాణ ప్రజలకు పంచట్లేదని ప్రశ్నించారు. ఆ పుస్తకాలు చదివి, లక్షల కోట్లు ఖర్చు చేసి 'కూలేశ్వరం' కట్టారని ఎద్దేవా చేశారు. పదేండ్లలో రాష్ట్రంలోని అన్ని వనరుల్ని దోపిడీ చేశారనీ, మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని ఇష్టం వచ్చినట్టు నిర్ణయాలు తీసుకొని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు. ఇలాంటి ఆర్థిక నేరగాళ్లను ఉరి తీసినా తప్పులేదనీ, దుబాయ్ వంటి దేశాల్లో వాళ్లను బహిరంగంగానే ఉరి తీస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అసెంబ్లీలో రైతు భరోసాపై స్వల్ప వ్యవధి చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఏకబిగిన దాదాపు గంటన్నరపాటు ప్రసంగించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనపై నిప్పులు చెరిగారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సహా ఎవర్నీ వదల్లేదు. అధికారంలో ఉన్నప్పుడు వారు తప్పుడు నిర్ణయాలు తీసుకున్నారనీ, రిజర్వుబ్యాంకు సహా ఆర్థిక సంస్థలన్నింటినీ మోసం చేసి, వేలకోట్లు దోచుకున్నారంటూ ఆయా గణాంకాలతో సహా వివరించారు. ఆ సమయంలో సభలోనే ఉన్న కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరూ ఎదురుదాడి చేసేందుకు ప్రయత్నించగా, స్పీకర్ అనుమతించలేదు. ఓ దశలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కే తారకరామారావు 'ఈ కామెడీ షో ఏంటి అధ్యక్షా' అనడం వినిపించింది. ప్రతిపక్షనేత కేసీఆర్ అసెంబ్లీకి వస్తే, ఆయన చేసిన అరాచకాలన్నింటినీ చెప్పి, కడిగి పారేయాలని ఏడాదిగా ఎదురు చూస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సభకు వస్తే, చేసిన తప్పులకు సమాధానాలు ఎక్కడ చెప్పాల్సి వస్తుందో అని ఆయన ముఖం చాటేస్తున్నారని విమర్శించారు.

రైతు భరోసాపై అనుమానాలొద్దు

రైతు భరోసాపై రాష్ట్ర రైతాంగం ఎలాంటి అనుమానాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అయితే గత పాలకులు ఇచ్చినట్టు రాళ్లు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు రైతు భరోసా ఇవ్వాలో వద్దో సూచించాలని ప్రతిపక్ష పార్టీలను కోరారు. దీనిపై ప్రధాన ప్రతిపక్షం సలహాలు తీసుకుని విధివిధానాలు రూపొందించి, ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్నామనీ, రాజకీయాల కోసం వారు సభలో నానా అల్లరి చేసినా, కనీసం స్పీకర్‌కు రాతపూర్వకంగా ... 5లో

గురివిందగింజలు

ఏడాది పాలనలో మేం ఏం చేశామని ప్రతిపక్ష సభ్యులు అడుగుతున్నారు. వారి పదేండ్ల పాలనపై వెనక్కి తిరిగి చూసుకుంటే గురివిందగింజ సామెత లెక్కే ఉంటుంది. ఆపార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఐదేండ్లలో లక్ష రూపాయల రుణమాఫీకి ఖర్చు చేసింది రూ.16,143 కోట్లు మాత్రమే. అది కేవలం వడ్డీకే సరిపోయిందని గణాంకాలు చెబుతున్నాయి. రెండోసారి అధికారంలోకి వచ్చాక వారు చేసిన రుణమాఫీ రూ.11,909.31 కోట్లు మాత్రమే. దీనిలో రూ.8,515 కోట్లు వడ్డీకే సరిపోయింది. దీన్నిబట్టి వారు చేసిన రుణమాఫీ కేవలం రూ.3,384 కోట్లే. మొత్తంగా పదేండ్లలో వారు చేసిన రుణమాఫీ రూ.27వేల కోట్లే.

- సీఎం రేవంత్‌రెడ్డి



ప్రజల ప్రాణాలతో చెలగాటమా ?

మానవత్వం లేనివాళ్లను అరెస్టు చేస్తే తప్పేంటి?

పోలీసులు చెప్పినా ఆ హీరో వినలేదు

- ఆయన రోడ్‌షో మాదిరిగా వెళ్లటం వల్లే ఘటన
- ఒకరు చనిపోయి..మరొకరు చావు బతుకుల మధ్య ఉన్నా పట్టదా!
- శ్రీతేజ కుటుంబాన్ని ఒక్క సినీ ప్రముఖుడైనా పరామర్శించారా?
- అల్లు అర్జున్ ఇంటికి క్యూ కట్టారు..ఏమైందని ఆయనకు పరామర్శలు!

పుష్ప-2 సినిమా ఘటనపై కొన్ని పార్టీలది పైశాచికత్వం : సీఎం రేవంత్‌రెడ్డి

వివరాలు 13లో



కావాలని చేసింది కాదు..

నాకు మానవత్వం లేదనడం సరికాదు

రోడ్ షో చేయలేదు.. ఏ పోలీస్ అధికారీ నాకు చెప్పలేదు..

- థియేటర్ నాకు దేవాలయంలాంటిది
- అభిమానుల కోసం ఎంత దూరమైనా వెళ్తా
- నాకూ ఆ వయస్సున్న కొడుకు ఉన్నాడు.. నేనూ బాధపడుతున్నా
- నా వ్యక్తిత్వాన్ని కించపరచడం బాధగా ఉంది.

నూటికి నూరు శాతం అన్నీ తప్పుడు ఆరోపణలే.. : సినీ నటుడు అల్లు అర్జున్

వివరాలు 13లో



కేజ్రీవాల్‌పై విచారణకు

ఎల్‌జీ అనుమతి?

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందే బీజేపీ టార్గెట్

న్యూఢిల్లీ : మద్యం స్కాం కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను విచారించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అనుమతి మంజూరు చేశారు. రాజధాని ఢిల్లీలో శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకున్నదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. బీజేపీని మరోసారి మట్టికరిపించి నాలుగో సారి జయభేరి మోగించాలని ఆప్ పట్టుదలగా ఉంది.

2002వ సంవత్సరపు మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద కేజ్రీవాల్‌ను విచారించేందుకు అనుమతించాల్సిందిగా ఈ నెల ఐదవ తేదీన లెఫ్టినెంట్ గవర్నరును ఈడీ కోరింది. మద్యం పాలసీ రూపకల్పన, అమలులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని సక్సేనాకు రాసిన లేఖలో ఈడీ తెలిపింది. గత నెల 6వ తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అందులో ప్రస్తావించింది. మనీ లాండరింగ్ ... 13లో



చలి చంపేస్తోంది

శ్రీనగర్‌లో రికార్డు స్థాయిలో కనిష్ట ఉష్ణోగ్రతలు | గడ్డ కట్టిన డాల్ సరస్సు

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లో తీవ్రమైన శీతాకాలంగా పేర్కొనే చిలై కాలన్ శనివారం నుంచి ప్రారంభమైంది. శ్రీనగర్‌లో రికార్డు స్థాయిలో కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 8.5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయింది. గత 50 ఏండ్లలో డిసెంబరు నెలకు ఇదే కనిష్ట ఉష్ణోగ్రత అని భారత వాతావరణ శాఖ తెలిపింది. కాశ్మీర్ లోయలో ఇతర ప్రాంతాల్లోనూ ఉష్ణోగ్రతలు క్షీణించాయని వెల్లడించింది. శ్రీనగర్‌లో గురువారం రాత్రి కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 6.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయిందని, శుక్రవారానికి ఇది మైనస్ 8.5కు పడిపోయిందని వాతావరణ శాఖ తెలిపింది. శ్రీనగర్‌లో 1974 డిసెంబరులో నమోదైన 10.3 డిగ్రీల సెల్సియస్ తరువాత ఇదే కనిష్ట ఉష్ణోగ్రత అని, ... 13లో

క్యూబాపై అమెరికా దుష్ప్రచారం

అమెరికా తీరును నిరసిస్తూ వేలాదిమంది క్యూబన్ల ప్రదర్శన



హవానా : తీవ్రవాదానికి క్యూబా ఊత మిస్తోందనే అమెరికా ఆరోపణలను క్యూబా అధ్యక్షుడు మిగ్వెల్ డియాజ్ కానెల్ తీవ్రంగా ఖండించారు. అవన్నీ అనైతికమైన, తప్పుడు ఆరోపణలని ఆయన వ్యాఖ్యానిం చారు. క్యూబా పట్ల అమెరికా అనుసరించే విధా నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ వేలాదిమంది క్యూబన్లు జోస్ మార్టి సామ్రాజ్యవాద వ్యతిరేక వేదిక వద్ద శుక్రవారం పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. అమెరికా అమలు చేస్తున్న ఆర్థిక ఆంక్షలకు ఇక స్వస్తి పలకాలని డిమాండ్ చేస్తూ క్యూబా ప్రభుత్వం ఈ ప్రదర్శనకు పిలుపునిచ్చింది. తీవ్రవాదానికి దోహదపడే దేశాల జాబితా నుండి క్యూబాను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. క్యూబా సామాజిక, ఆర్థిక వ్యవస్థలకు వ్యతిరేకంగా తీవ్రవాద కార్యకలాపాలు చేపట్టేందుకు పారా మిలటరీ బలగాలకు శిక్షణ ఇచ్చే దేశం ఇటువంటి ఆరోపణలు చేయడం చాలా అనైతికమని క్యూబా అధ్యక్షుడు తీవ్రంగా నిరసించారు. ఈ జాబితాలో క్యూబాను కొన సాగించడం సమర్ధనీయం కాదని విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ సహా అమెరికా ప్రభుత్వ సీనియర్ అధికారులు కూడా అంగీకరించారని క్యూబా అధ్యక్షుడు పేర్కొన్నారు. ఆ జాబితాలో ... 13లో

విషాహారంపై రాజకీయాలు తగవు

నిర్లక్ష్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలి



ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హదరాబాద్

గురుకులాలు, కేజీబీవీలు, స్కూళ్లలో విషాహార ఘటనలను రాజకీయాలకు వాడుకోవడం తగదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సూచించారు. శనివారం శాసనమండలిలో ఈ అంశంపై ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో... 13లో

పంటల బీమాను పునరుద్ధరిస్తాం

రైతు భరోసా ఇవ్వబోమని ఎక్కడా చెప్పలేదు

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. రైతుభరోసాలో కోతలు విధిస్తామని తామెక్కడా చెప్పలేదన్నారు. ప్రజలు, సభ్యుల సూచనలు, సలహాలు తీసుకుని ఏ విధంగా ఇవ్వా లనే దానిపై విధివిధానాలను రూపొందిస్తామని ... 13లో

7 రోజులు.. 37 గంటలు

నిరసనలతో మొదలై.. నిమ్మళంగా ముగిసిన శాసనసభ

- 28 గంటలపాటు శాసన మండలి కార్యకలాపాలు
- మొత్తం ఎనిమిది బిల్లులకు ఆమోదం
- ఉభయ సభలు నిరవధిక వాయిదా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర అసెంబ్లీ శీతాకాల సమావేశాలు వాడీవేడీగా కొనసాగాయి. ఈ సెషన్ ప్రారంభమైన నాటి నుంచి బయట వాతావరణంలో చలి తీవ్రత పెరిగినప్పటికీ... అటు శాసనసభ, ఇటు మండలిలో మాత్రం పరిస్థితి హీటెక్కింది. సమావేశాలకు ముందే అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగటంతో దాని ప్రభావం ఉభయ సభల్లో కనబడింది. ఇలాంటి ఉద్రిక్తతల మధ్య నిరసనలతో మొదలైన సమావేశాలు... శనివారం నిమ్మళంగా ముగిశాయి. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 9న అసెంబ్లీ సమావేశాలను ప్రభుత్వం ప్రారంభించింది. అయితే అదే రోజు 'రేవంత్-అదానీ' ఫొటోలతో ఉన్న టీ షర్టులను ధరించి రావటంతో బీఆర్ఎస్ సభ్యులను సభలోకి అనుమతించలేదు. ఈ క్రమంలో 'గులాబీ పార్టీ' కోరుకున్నదే జరిగింది. ఆ రోజు గన్‌పార్కు వద్ద, ఆ తర్వాత తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ హడావుడి చేసింది. అదే రోజు సభలో తెలంగాణ ఇచ్చినందుకు సోనియా గాంధీకి ధన్యవాదాలు తెలుపుతున్నామంటూ చెప్పిన సీఎం రేవంత్ సుదీర్ఘంగా ప్రసంగించారు. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సభను ఈనెల 16కు వాయిదా వేశారు. అదే రోజు సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం రేవంత్ ఆవిష్కరించారు. 'ఫార్ములా వన్ ఈ-కార్ రేస్‌పై ఏసీబీతో విచారణ' అనే వార్తల నేపథ్యంలో ఈనెల 16న తిరిగి ప్రారంభమైన శాసనసభలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. లగచర్లలో ... 6లో

సీఎం రేవంత్ రెడ్డిది అబద్ధాల పాలన

మాజీ మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అబద్ధాల పునాదుల మీద అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాల పాలనే చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. శనివారం ఆయన బీఆర్ఎస్ఎల్పీలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతుభరోసా ఎప్పుడిస్తారో చెప్పలేదన్నారు. రుణమాఫీ విషయంలో స్పష్టత లేదనీ, అప్పుల విషయంలో తప్పుడు లెక్కలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్మాసిటీలో తాము ఏ కంపెనీకి ఒక్క ఎకరం కేటాయించకుండానే, సీఎం తక్కువ ధరకు కంపెనీలకు కేటాయించినట్టు అబద్ధాలు చెబుతున్నారని తెలిపారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేయకుండా ఎగ్గొట్టారన్నారు. ఎస్సెల్బీసీని తాము 11 కిలోమీటర్లు తవ్వితే ఒక్క కిలోమీటర్ తవ్వలేదని అబద్ధం చెప్పారన్నారు. రూ.నాలుగైదు వేల కోట్లు ఖర్చు పెట్టి మూసీ ట్రీటమెంట్ ప్లాంట్లు కట్టామన్నారు. మూసీ కాలుష్యం 50 ఏండ్ల కాంగ్రెస్, 16 ఏండ్ల తెలుగుదేశం పాలన ఫలితమేనని విమర్శించారు. లగచర్లకు రావాలని సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి తప్పులకు వివరణ ఇద్దామనుకుంటే తమకు స్పీకర్ మాట్లాడే అవకాశమివ్వలేదన్నారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, 24 గంటల కరెంటు బీఆర్ఎస్ తెచ్చినవే అని తెలిపారు. కాళేశ్వరం ఉత్తర తెలంగాణకు సాగు, తాగునీరు అందిస్తున్నదని చెప్పారు. దానిపై సీఎం 50 వేల ఎకరాలే సాగవుతున్నదని చెప్పారన్నారు. కాళేశ్వరమే లేకపోతే, మల్లన్నసాగర్ లేదు, సీఎం హైదరాబాదుకు తెస్తమన్న 20



టీఎంసీల నీళ్ల లేవని ఎద్దేవా చేశారు.

రూ. 7500 కోట్లు వానాకాలం రైతుబంధు, రూ. 2500 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంటు, రూ. 2000 కోట్లు ముసలోళ్ల ఫించన్లు, రూ. 1000 కోట్ల బతుకమ్మ చీరెలు సీఎం ఎగ్గొట్టారని తెలిపారు. కేసీఆర్ కిట్స్ పథకాన్ని నాశనం చేశారన్నారు. పాక్షిక రుణమాఫీ మాత్రమే చేశారని తెలిపారు. రైతులపై వడ్డీ భారం పడిందని చెప్పారు. చర్చకు సీఎం లేదా మంత్రులు వస్తారా? అని సవాల్ చేశారు.

బీఆర్ఎస్ హయంలో ఒక్క ఇరిగేషన్ శాఖలోనే రెండు వేల ఉద్యోగాలిస్తే ఒక్క ఉద్యోగం ఇవ్వలేదంటారా? మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని ప్రశ్నించారు. కార్ రేస్ మీద చర్చ పెట్టమంటే ఎందుకు పారిపోయారో చెప్పాలన్నారు. ఏడాది పాలనలో 54 మంది విద్యార్థులు మరణించారన్నారు., 89 మంది ఆటో డ్రైవర్లు, 29 మంది నేతన్నలు, 450 పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. 1000 రేప్ కేసులు నమోదు, 390 ప్రొటెస్టులు జరిగాయన్నారు. రేవంత్ పాలనంతా అవినీతిమయమేననీ, బిల్లులు కావాలంటే 8 శాతం ఇవ్వాల్సిందేనంట అని విమర్శించారు.

అసెంబ్లీ సమావేశాలు నిరంకుశత్వంతో ప్రారంభమైన ప్రజా సమస్యలు లేవనెత్తామన్నారు. లగచర్లలో కాంగ్రెస్ ప్రభుత్వ దౌర్జన్యకాండను ప్రశ్నించామని తెలిపారు. నల్లచొక్కాలు, ఖాకీ షర్టులు వేసుకుని నిరసన తెలిపామని గుర్తుచేశారు. రైతుభరోసాపై తప్పుడు లెక్కలను కేటీఆర్ తిప్పికొట్టారని చెప్పారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజల పక్షాన పోరాడుతామని తెలిపారు.

భూసంస్కరణలచట్టం-1971పై ప్రకటనలివ్వాలి

• భూభారతిని ఆహ్వానిస్తున్నా : మండలిలో నర్సిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ధరణి పోర్టల్ సరికాదంటూ ఆనాడే చెప్పానని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతిని ఆహ్వానిస్తున్నానని చెప్పారు. శాసనమండలిలో శనివారం భూభారతి బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసంస్కరణల చట్టం-1971లో ఏముందో, దానిపై అవగాహన కల్పించేందుకు ప్రకటనలు ఇవ్వాలని సూచించారు. ఒక్కొక్కరు 600 ఎకరాలు, 200 ఎకరాలు ఉన్నాయంటూ ప్రకటించడం సరైంది కాదన్నారు. ఆ చట్టానికి విరుద్ధమని అన్నారు. ఆ చట్టం గురించి అందరికీ తెలిసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మట్టి పూసుకునే వారే నిజమైన రైతులని చెప్పారు. కౌలురైతులనూ ప్రభుత్వం గుర్తించాలని కోరారు. 2014, జూన్ రెండు కంటే ముందు వారికే సాదాబైనామా వర్తిస్తుందంటూ ప్రచారం జరుగుతున్నదనీ, దానిపై స్పష్టత ఇవ్వాలని సూచించారు. తన సొంత గ్రామంలో దేవాదాయ భూములే లేవన్నారు. పది మందికి దేవాదాయ భూములుగా ధరణిలో పొందుపర్చారని వివరించారు. జిల్లా కలెక్టర్ వద్దకు తాను స్వయంగా ఎమ్మెల్సీ హోదాలో వెళ్లి ఆ సమస్యను పరిష్కరించాల్సి వచ్చిందన్నారు. దీంతో వారికి విముక్తి కలిగిందని చెప్పారు. సామాన్యుల సమస్యలు పరిష్కారమయ్యే పరిస్థితి లేదన్నారు. ధరణి పార్ట్-బీలో ప్రభుత్వ భూములు, ఇతర సమస్యలపై సమస్య ఉంటే ఇబ్బంది లేదని అన్నారు. కానీ రైతుల భూములకు సంబంధించిన సమస్యలు కూడా ఉన్నాయని వివరించారు. అవి పరిష్కారం కావడం లేదన్నారు. పహానీ మాన్యువల్‌గా కూడా అందుబాటులో ఉండాలని కోరారు.

భూపరిమితి చట్టంపై అధికారులకు అవగాహన కలిగించాలి : చైర్మెన్ గుత్తా

భూ పరిమితి చట్టం-1971పై కొత్తగా వస్తున్న ఐఏఎస్‌లు, గ్రూప్-1, రెవెన్యూ అధికారులకు కనీస అవగాహన ఉండడం లేదని మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. భూమి గురించి, చట్టాల గురించి, సమస్యలు, వాటి పరిష్కారాలపై వారికి శిక్షణా తరగతులను నిర్వహించి అవగాహన కలిగించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఆయన సూచించారు.

'మోయ తుమ్మెద'ను అన్ని భాషల్లోకి అనువదించాలి

• పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు వెలుదండ నిత్యానంద రావు



నవతెలంగాణ - ముషీరాబాద్

మోయ తుమ్మెద పుస్తకాన్ని ప్రపంచంలోని అన్ని భాషల్లోకి అనువదించాలని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు వెలుదండ నిత్యానందరావు అన్నారు. జ్ఞానపీఠ పురస్కార గ్రహీత కవి విశ్వనాథ సత్యనారాయణ రాసిన మోయ తుమ్మెద 5వ ముద్రణ పుస్తకాన్ని హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వనాథ సత్యనారాయణ రచనల్లో ఇది విశిష్టమైన పుస్తకం అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది, బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ జనరల్ సెక్రటరీ తన్నీరు శ్రీనివాస్, డాక్టర్ చింతమనేని శ్రీనివాస్,వేల్చాల కొండలరావు, అడ్వకేట్ విశ్వనాథ సత్యనారాయణ, విశ్వనాథ శక్తిధర శ్రీపావకి, చార్టెడ్ అకౌంటెంట్ మనోహర శ్రీ పాణి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ హష్మి కుమార్తె మృతి బాధాకరం

• సీఎం సీపీఆర్ఓ అయోధ్య రెడ్డి సంతాపం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీనియర్ జర్నలిస్ట్ హష్మి కుమార్తె అమ్మారా అఫ్షామ్(24) మృతి బాధాకరమని సీఎం సీపీఆర్ఓ బి అయోధ్యరెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని హష్మీ నివాసానికి వెళ్లి ఆయన్నీ, ఇతర కుటుంబసభ్యుల్ని పరామర్శించారు. ఇది చాలా విషాదాకరమైన సంఘటననీ, ఎంతో భవిష్యత్ ఉన్న అఫ్షామ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. ఎంతో ధైర్యంగా ఉండే హష్మీ ఇంట విషాదం చోట చేసుకోవడం బాధను కలిగిస్తుందని అయోధ్య రెడ్డి అన్నారు. హష్మీ ని పరామర్శించిన వారిలో జేసీహెచ్ఎస్ఎల్ అధ్యక్షులు బ్రహ్మండభేరి గోపరాజు, సీనియర్ జర్నలిస్టులు పార్థసారథి, ఈశ్వర్ రెడ్డి, కిరణ్ కుమార్ ఉన్నారు.

దేశ వృద్ధిలో ఎగమతిదారులది కీలక పాత్ర


• ఎక్స్‌పోర్ట్ మీట్‌లో ఎస్బీఐ సీజీఎం రాజేష్ కుమార్

నవ తెలంగాణ- బిజినెస్ బ్యూరో

భారత దేశ వృద్ధిలో ఎగుమతులు, ఎగుమతిదారులది కీలక పాత్ర ఉంటుందని ఎస్బీఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో కమర్షియల్ క్లయింట్స్ గ్రూప్ (సీసీజీ) సహకారంతో ఎక్స్‌పోర్టర్స్ మీట్‌ను నిర్వహించారు. ఇందులో 120పైగా కీలక ఎగుమతిదారులు పాల్గొన్నారు. ఎఫ్ఐఈఓ, ఈసీజీసీ, ఎస్టీపీఐ సంస్థలు భాగస్వామ్యం అయ్యాయి. ఈ సందర్భంగా రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థకు ఎగుమతులు ఎంతో ముఖ్యమన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలోని ఫార్మాస్యూటికల్, ఐటీ ఆధారిత సంస్థలు, ఫుడ్ ప్రాసెసింగ్ ఎగుమతుల్లో కీలక వాటాను కలిగి ఉన్నాయన్నారు. ఎగుమతిదారులకు ఎస్బీఐ మద్దతును అందిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఆ బ్యాంక్ ఉన్నతాధికారులు సురేందర్ రాణా, రవి రంజన్ పాల్గొని ప్రతినిధుల ప్రశ్నలకు సమాధానాలు, ఈ రంగంలో అవకాశాల గురించి వివరించారు.

ఎనిమిది ప్రాజెక్టులపై చర్యలు

• తెలంగాణ హౌసింగ్ బోర్డు వెల్లడి



నవ తెలంగాణ - హైదరాబాద్

తెలంగాణ హౌసింగ్ బోర్డు 2005-07 మధ్య హైదరాబాద్, వరంగల్, ఖమ్మంలో పలు సంస్థలతో కలిసి 20 సంయుక్త భాగస్వామ్య ప్రాజెక్టులను చేపట్టినట్టు తెలిపింది. ఇందులో 12 ప్రాజెక్టులు పూర్తి కాగా.. వాటి రిజిస్ట్రేషన్లు జరిగాయని వెల్లడించింది. మిగతా ఎనిమిది ప్రాజెక్టులు పూర్తి కాలేదని.. పలు చిక్కుల్లో ఉన్నాయని పేర్కొంది. వాటిపైనా చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొంది. ఇందులో బండ్లగూడలోని ఇందు ఈస్టర్న్ ప్రావిన్స్ ప్రాజెక్ట్ ఎల్ఐజీ యూనిట్లను పూర్తి చేయలేదని తెలిపింది. ఆ కంపెనీతో ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు పేర్కొంది. మధుకాన్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ కూకట్‌పల్లిలోని ప్రాజెక్టులను అభివృద్ధి చేయలేకపోయిందని పేర్కొంది. ఆ సంస్థపై కూడా చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. గచ్చిబౌలిలోని యూనివర్సల్ రియల్టర్స్‌కు అప్పగించిన ప్రాజెక్టును పూర్తి చేయలేదని స్పష్టం చేసింది. ఆ సంస్థకు ఇచ్చిన అనుమతులను రద్దు చేసినట్టు పేర్కొంది.

ప్రమాదంలో భారత ప్రజాస్వామ్యం

• దేశంలో అనధికార అత్యయిక పరిస్థితి

• విద్యార్థులు, న్యాయవాదులు క్రియాశీల పాత్ర పోషించాలి : ఐలూ జాతీయ ప్రధాన కార్యదర్శి పివి.సురేంద్రనాథ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆల్‌ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) జాతీయ ప్రధాన కార్యదర్శి పివి.సురేంద్రనాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఐలూ, లా స్టుడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఎస్ఎఫ్ఐ) హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం సయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భారత రాజ్యాంగం మౌలిక సూత్రమైన లౌకిక భావన, ప్రజాస్వామ్య విలువలను రక్షించుకోవాల్సిన బాధ్యత విద్యార్థులు, న్యాయవాదులపై ఉందని గుర్తు చేశారు. ప్రొఫెసర్ జి.మోహన్ గోపాల్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో అనధికార అత్యయిక పరిస్థితి నెలకొందని అన్నారు. ఇందిరాగాంధీ చీకటి పాలనను ప్రస్తుత పాలకులు గుర్తు చేస్తున్నారని విమర్శించారు. న్యాయవ్యవస్థకు, సమాజానికి మధ్య సంబంధాలను దెబ్బతీసే విధంగా పాలకులు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని 80 శాతం మంది ప్రజలను 20 శాతం ఉన్నత వర్గాలు పాలించే వ్యవస్థను రూపుమాపాలని పిలుపునిచ్చారు. ప్రజలందరికి సమాన రాజకీయ, సామాజిక ప్రాతినిధ్యం ఉండేలా చూడాల్సిన బాధ్యత చట్టసభలు, న్యాయవ్యవస్థపై ఉందని గుర్తు చేశారు. ఐలూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి నర్ర శ్రీనివాసరావు మాట్లాడుతూ కొత్తగా న్యాయవాద వృత్తిలోకి వచ్చే వారు నిబద్ధతతో పని చేయాలని సూచించారు. ఐలూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పార్థసారధి, ఉపాధ్యక్షులు కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ న్యాయ విద్యను అభ్యసించే వారికి ఐలూ వృత్తి విలువల్ని నేర్పడానికి ఎప్పుడూ కృషి చేస్తుందని అన్నారు. ఈ సదస్సులో లా స్టుడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కన్వీనర్‌గా అలీహైదర్, కో కన్వీనర్‌గా క్రాంతి రణదీవే, సభ్యులుగా సంపత్, అనిల్, అలీజాన్, అశోక్, సాయితేజతో పాటు మొత్తం 36 మంది ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఐలూ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు సి.రామచంద్రరెడ్డి, డి.ప్రవీణ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వనజ, ఎ.వెంకటేశ్వర్లు, మాధవరెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, ఎన్,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల భూములు ఆక్రమించటం నేరం



• భూస్వామి విక్రమ్ రెడ్డి దొర, అపర్ణా, గ్రీన్ మార్క్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలి : గిరిజన సంఘాల డిమాండ్

నవతెలంగాణ -బంజారాహిల్స్

గిరిజనుల భూములు ఆక్రమించటం నేరమనీ, వారి భూములు వారికే అప్పగించాలని పలు గిరిజన సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం హైదరాబాద్‌లోని ప్రెస్ క్లబ్‌లో బాధిత రైతులతో కలిసి ఆయా సంఘాల నేతలు విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాంనాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ అంజయ్యనాయక్, లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎం రాంబాల్ నాయక్ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా ఆర్ సి పురం మండలం, వెలిమల తండా, రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం, కొండకల్ తండాల పరిధిలో 1973లో ఆనాటి ప్రభుత్వం గిరిజనులకు భూమిని అసైన్డ్ చేసిందని తెలిపారు. సీలింగ్ చట్టం వచ్చిన తర్వాత కొండకల్ గ్రామంలో ఉన్న జమీందారు విక్రమ్ రెడ్డి దొర నాయనమ్మ సుభద్ర బాయి పేరు మీద ఉన్న వందలాది ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తెలిపారు. సీలింగ్ చట్టం కింద సేకరించిన 600 ఎకరాల భూములను కొండకల్ తండా, వెలిమలతండా గిరిజనులకు ఆనాటి ప్రభుత్వం అసైన్డ్ , రక్షిత కౌవులు రైతుల కింద పట్టా హక్కులు దఖలుపరిచిం దన్నారు. నాటినుండి నేటి వరకు 70ఏండ్లుగా గిరిజనులు, దళితులు సాగు చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు.ఇటి భూములను విక్రమ్ రెడ్డి అనే భూస్వామి దొంగ రికార్డులు సృష్టించి,సర్వే నంబర్లను మార్చి అపర్ణ కన్‌స్ట్రక్షన్, గ్రీన్ మార్క్ కంపెనీలకు అమ్మేశారన్నారు. ప్రయివేటు గూండాలు, బౌన్సర్లతో రైతులను బెదిరించి, దాడులు చేయడమే కాకుండా వారిపైన్నే రౌడీషీటర్లు,అక్రమ కేసులు పెట్టి హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా గిరిజనులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వీటితో పాటు దేవాదాయ భూములు, చెరువులను సైతం అక్రమించారని ఆరోపించారు. చదువురాని అమాయక గిరిజనులను మభ్యపెట్టి బెదిరించి తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకుని ఆయా కంపనీలు వందలాది ఎకరాలు ఆక్రమించాయని ఆరోపించారు. వీరికి రెవిన్యూ అధికారులు, పోలీసులు కంపెనీ యాజమానులకు వంత పాడుతున్నారని విమర్శించారు. ఆక్రమణకు గురైన భూములను తిరిగి గిరిజనులకు అప్పగించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలోనే ఇందిరా పార్కు వద్ద వేలాదిమంది గిరిజనులతో మహాధర్నా నిర్వహించి రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారుస్తామని హెచ్చరించారు. గిరిజనులపై మరోసారి దాడులు చేస్తే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి తక్షణం అరెస్టు చేయాలనీ,వారిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.విలేకర్ల సమావేశంలో కొండకల్ వెల్లిమల్ల తండా బాధిత గిరిజన రైతులు రాథోడ్ శంకర్ నాయక్, రాథోడ్ రవి, శీను, లక్ష్మణ్ నాయక్ జుంకీ, నాగమణి, టోప్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'భారత రాజ్యాంగ మాతృమూర్తులు' ప్రత్యేక పోస్టల్ కవర్ విడుదల



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భారత రాజ్యాంగ రూపకల్పనలో ప్రత్యేక పాత్ర పోషించిన 15 మంది మహిళా సభ్యుల చిత్రాలతో కూడిన పోస్టల్ కవర్‌ను కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ కార్యదర్శి వందితా కౌల్ ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని డాక్ సదన్‌లో చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. 1950 జనవరి 24న భారత రాజ్యాంగ డాక్యుమెంటుపై వీరిలో 11 మంది సభ్యులు అధికారికంగా సంతకాలు చేశారు. 'భారత రాజ్యాంగ మాతృమూర్తులు' పేరుతో ఈ ప్రత్యేక కవర్‌ను విడుదల చేశారు. తొలి వరుసలో అమ్ము స్వామినాథన్, అన్నీ మస్కేరేన్, బేగం ఐజాజ్ రసూల్, దాక్షాయణి వేలాయుధన్, జీ దుర్గాభాయ్ పొట్రాయిట్ చిత్రాలు ఉన్నాయి. మధ్య వరుసలో హన్సా మెహతా, కమలా చౌధురి, లీలారాయ్, మాలతీ చౌదరి, పూర్ణిమా బెనర్జీ ఉన్నారు. ఆ క్రింది వరుసలో రాజకుమారి అమ్రిత్ కౌర్, రేణుకారాయ్, సరోజినీ నాయుడు, సుచేతా క్రిపాళని, విజయలక్ష్మి పండిట్ ఉన్నారు. ఈ కవర్ ఖరీదును రూ.25గా నిర్ణయించారు. అన్ని ప్రధాన పోస్టాఫీసులు, ఆన్‌లైన్‌లోనూ ఈ కవర్లు అందుబాటులో ఉంటాయని పీవీఎస్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్, హెడ్ క్వార్టర్స్ రీజియన్ల పోస్ట్‌మాస్టర్ జనరల్స్ సుమితా అయోధ్య, ఎస్ఆర్ విశాలాక్షి, తెలంగాణ సర్కిల్ పోస్టల్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ బీ ఆర్ముగం, అక్కౌంట్స్ డైరెక్టర్ (పోస్టల్) యూ సాయిపల్లవి పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలకు కార్మికవర్గం అండగా నిలవాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభను జయప్రదం చేద్దాం : రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు
- మహాసభ కోసం టీఐడీసీ, కిర్బీ కార్మికులు విరాళాలందజేత



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం, పటాన్‌చెరు

ప్రజా సమస్యలపై నిర్వహించే ఆందోళన, పోరాటాలకు కార్మిక వర్గం అండగా నిలవాలని, కార్మికవర్గ సమస్యలపై సీపీఐ(ఎం) ముందు భాగాన నిలిచి పోరాడుతోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభ జయప్రదం కోసం సంగారెడ్డి జిల్లా బొల్లారంలో టీఐడీసీ ఎంప్లాయిస్ యూనియన్, పటాన్‌చెరులో కిర్బీ కార్మికులు చుక్క రాములుకు శనివారం విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో జరిగే రాష్ట్ర మహాసభ జయప్రదం కోసం కార్మికవర్గం, కర్షకులు విరాళాలు ఇచ్చి తోడ్పాటునందించడం అభినందనీయమన్నారు. ఇప్పటికే సీపీఐ(ఎం) విధానాలు, పోరాటాలు, ఎర్రజెండా గొప్పదనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి మహాసభ విజయవంతానికి ప్రచారం చేస్తున్నామన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా, హార్థికంగా సహకరించాలని కోరారు. బూర్జువా పార్టీలకు భిన్నంగా ప్రత్యామ్నాయ విధానాలతో సీపీఐ(ఎం) పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రాజయ్య, యూనియన్ నాయకులు భాస్కర్ రెడ్డి, శేఖర్, వీఎస్.రాజు, మల్లేష్, శ్రీనివాసు, ఏడుకొండలు, నాగప్రసాద్, వెంకట్, సోమన్న, లక్ష్మణ్, రాములు, బిలాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంబానీ, అదానీలకు కేంద్రం ఊడిగం

- ఆరు గ్యారంటీల అమల్లో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం
- ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

గిట్టుబాటు ధర దక్కక పెరిగిన రైతు ఆత్మహత్యలు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అంబానీ, అదానీలకు దోచిపెడుతూ ప్రజలపై భారాలు మోపుతోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లాలో జనవరి 25–28 తేదీల్లో జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభ సందర్భంగా శనివారం స్థానిక కేవల్ కిషన్ భవన్‌లో "రైతాంగ సమస్యలు-ప్రభుత్వాల విధానాలు" అంశంపై నిర్వహించిన సెమినార్‌లో జూలకంటి మాట్లాడారు. మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ అనుకూల విధానాలు పెరిగాయన్నారు. కార్పొరేట్ శక్తులకు వ్యవసాయాన్ని కట్టబెట్టేందుకు నల్ల చట్టాలు తెచ్చారన్నారు. 500 రైతు, ప్రజా సంఘాలు ఐక్యంగా పోరాడి కేంద్రం మెడలు వంచిన ఫలితంగానే మోడీ వెనకడుగేశారని చెప్పారు. నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు సరఫరా చేయాల్సిన ప్రభుత్వం కంపెనీలకు ఊడిగం చేస్తోందన్నారు. రైతాంగానికి ఇవ్వాల్సిన సబ్సిడీలలో కోత విధించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉండాల్సిన విద్యుత్‌ను కేంద్రం తన చేతుల్లోకి తీసుకుని ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఉచిత విద్యుత్ దక్కకుండా కుట్ర చేస్తోందన్నారు. గిట్టుబాటు ధర రాకపోవడం, సబ్సిడీల కోత, సాగు పెట్టుబడులు పెరగడం వల్ల అప్పుల భారంతో రైతులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ 11 ఏండ్ల పాలనలో ఏటా 1200 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని చెప్పారు.

దేశంలో 90 శాతంగా ఉన్న రైతులు, కూలీలు, కార్మికులు, కర్షకులు కష్టపడి సంపదను సృష్టిస్తే 10 శాతంగా ఉన్న కార్పొరేట్ శక్తులు దేశ సంపదను దోచుకుని తింటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశీయంగా రైతులు పండించే పంటలను పక్కన పెట్టి కార్పొరేట్ల లాభాల కోసం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారని తెలిపారు.

ఆరు గ్యారంటీల అమల్లో రాష్ట్రం విఫలం

ఎన్నికల్లో ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని జూలకంటి అన్నారు. ఆరు పథకాల్లో ఏ ఒక్కటీ పూర్తిగా అమలు చేసిన పరిస్థితి లేదన్నారు. రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు. ఎన్నికల్లో చెప్పిన మాదిరే రైతులకు, కూలీలకు, కౌలుదారులందరికీ రైతు భరోసా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మరింత సమరశీలంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. సంగారెడ్డి జిల్లాలో 2025 జనవరి 25–28 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.రాజయ్య, నాయకులు ఎం.నర్సింలు, యాదవరెడ్డి, నర్సింహ్మారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హిట్లర్ తత్వంతో హిందూత్వం

- ఇది దేశానికి ప్రమాదం
- అదానీ వ్యవహారాన్ని డైవర్ట్ చేసేందుకే అమిత్ షా వ్యాఖ్యలు : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్
- ఇల్లందులో అమిత్ షా దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ కొత్తగూడెం

హిట్లర్ తత్వం.. హిందూత్వ ఆలోచనలతో అమిత్ షా అంబేద్కర్‌పై చులకన వ్యాఖ్యలు చేయడాన్ని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి. వెంకట్ ఖండించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి హేళనగా చులకనగా అత్యంత అగౌరవంగా వ్యాఖ్యలు చేశారని అన్నారు. అంబేద్కర్ పై అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా మూడో మహాసభలకు హాజరైన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ.. అమిత్ షా వ్యాఖ్యలను ప్రధాని మోడీ ఖండించకపోగా... క్షమాపణ చెప్పాలని కోరకపోగా వాటిని సమర్థించడం అత్యంత దుర్మార్గమన్నారు. అదానీ రాష్ట్ర ప్రభుత్వాలకు లంచాలు ఇస్తూ.. ఆయా ప్రభుత్వాల ద్వారా లబ్ధి పొందేందుకు చేస్తున్న ప్రయత్నాలను అమెరికా మీడియా సంస్థలు బయట పెట్టడంతో దానిని డైవర్ట్ చేసేందుకే అంబేద్కర్‌పై అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. కమ్యూనిస్టుల శక్తి ముందు నిలవలేక హిట్లర్ రెండో ప్రపంచ యుద్ధంలో ఓటమి భయంతో ఆత్మహత్య చేసుకున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. హిందూ మతతత్వ వాదులకు కూడా అలాంటి గుణపాఠమే చెప్పాలని పిలుపునిచ్చారు. 2025 సంవత్సరాన్ని భారత రాజ్యాంగ పరిరక్షణ ఏడాదిగా నిర్వహించాలని, నూతన సామాజిక చైతన్యానికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, పార్టీ సీనియర్ నాయకులు పి. సోమయ్య, మిడియం బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, బండారు రవికుమార్ , అన్నవరపు కనకయ్య, జిల్లా నాయకులు ఏజే రమేష్, కొక్కెరపాటి పుల్లయ్య, బాల నర్సారెడ్డి, అన్నవరపు సత్యనారాయణ, బ్రహ్మాచారి, మందలపు జ్యోతి, రేపాకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు బిల్లులకు మండలి ఆమోదం

సభ నిరవధిక వాయిదా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నాలుగు బిల్లులకు శాసనమండలి ఆమోదం తెలిపింది. శనివారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) సవరణ బిల్లు, తెలంగాణ మున్సిపాల్టీల సవరణ బిల్లు, తెలంగాణ పంచాయతీరాజ్ సవరణ బిల్లు, తెలంగాణ భూభారతి బిల్లులు ఆమోదం పొందినట్టు మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు చెప్పారు. జీహెచ్ఎంసీ సవరణ బిల్లు, తెలంగాణ మున్సిపాల్టీల బిల్లును ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారు. తెలంగాణ పంచాయతీరాజ్ సవరణ బిల్లును బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిపాదించారు. తెలంగాణ భూభారతి బిల్లును రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రవేశపెట్టారు. వాటిపై సభ్యులు మాట్లాడారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానమిచ్చారు.

నిబంధనల ప్రకారమే హైడ్రా కూల్చివేతలు : శ్రీధర్‌బాబు

నిబంధనలను పాటిస్తూనే ప్రభుత్వ భూముల ఆక్రమణలను హైడ్రా తొలగిస్తుందనీ, కూల్చివేతలు కొనసాగిస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. వ్యక్తి శాశ్వతం కాదన్నారు. ఆ వ్యక్తి సరిగ్గా పనిచేయకుంటే మరొకరిని నియమిస్తామని వివరించారు. పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. తెలిసి కూడా చట్టాలను ఉల్లంఘించిన బిల్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పేదల పేరుతో వాణిజ్యం, వ్యాపారం చేసే వారి పట్ల ప్రభుత్వం చూస్తూ ఊరుకోబోదని హెచ్చరించారు. పేదలకు సంబంధించి ఏమైనా లోటుపాట్లు జరిగితే ప్రభుత్వం దృష్టికి తేవాలని సభ్యులను కోరారు. ప్రజల్లో భయాందోళన సృష్టించొద్దని కోరారు. టౌనిప్లానింగ్ అనుమతి తీసుకుంటే వాటి జోలికి వెళ్లడం లేదన్నారు. మూసీ ప్రక్షాళన కోసం శ్రద్ధ చూపేందుకే హైడ్రాను ఏర్పాటు చేశామనీ, అందుకోసం ప్రత్యేకంగా ఏజెన్సీని నియమించామని అన్నారు. హైడ్రా నిబంధనలను రూపొందించి త్వరలోనే ప్రకటిస్తామన్నారు. రాజకీయ కోణం నుంచి ఆలోచన చేయబోమనీ, భావితరాలకు మంచి భవిష్యత్ ఇవ్వడం కోసమే చర్యలు చేపడతామని వివరించారు. రాష్ట్రం ఏర్పడక ముందు ఉన్న చెరువుల పునరుద్ధరణ కార్యక్రమం చేపడతామని చెప్పారు. పట్టణాల్లో ఉపాధి హామీని విస్తరించే ఆలోచన చేస్తున్నామని అన్నారు. మున్సిపాల్టీల్లో విలీన గ్రామాల అభివృద్ధికి సమగ్ర విధానాన్ని రూపొందిస్తామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రిజర్వేషన్ 50 శాతం సీలింగ్ మించకుండా ఏం చేయాలనే దానిపై ఆలోచన చేస్తున్నామని చెప్పారు.

పంచాయతీరాజ్ ఎన్నికల కోసమే డెడికేటెడ్ కమిటీ : పొన్నం

ఓఆర్ఆర్ పరిధిలో 51 గ్రామాలను సమీపంలోని మున్సిపాల్టీల్లో విలీనం చేశామనిమంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిచ్చారు. రాష్ట్రంలో 80 గ్రామపంచాయతీలు మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో కలిపామని అన్నారు. సుప్రీం ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ ఎన్నికలు జరపడానికి డెడికేటెడ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. పంచాయతీరాజ్ చట్టం షెడ్యూల్ ఎనిమిదిలోని నిబంధనను సవరణ చేశామని చెప్పారు.



అలాంటి తప్పులు జరగకుండా చూడండి : ప్రభుత్వానికి మండలి చైర్మెన్ గుత్తా సూచన

భూభారతి చట్టం రాకముందే పత్రికలకు ప్రకటన ఇవ్వడం లాంటి తప్పులు జరగకుండా చూడాలని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. శనివారం శాసనమండలి సమావేశం కాగానే గుత్తా సుఖేందర్ రెడ్డి, బీఆర్ఎస్ సభ్యుల అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారంటూ, ప్రభుత్వ కార్యక్రమాలు ఎక్కడా జరిగినా ఎమ్మెల్సీలను విధిగా ఆహ్వానించాల్సిందేనని స్పష్టం చేశారు. అదే విధంగా ఏసీడీఎఫ్‌కు సంబంధించి గతంలో కొంత ఖర్చు చేసిన వారికి మిగిలిన డబ్బులు ఇవ్వాలని కోరారు.

వచ్చే ఎన్నికల్లో 'భూభారతి' మాకు రెఫరెండం : పొంగులేటి

సమస్యల పరిష్కారం కోసమే ధరణి స్థానంలో భూభారతిని తెచ్చామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ధరణి సాఫ్ట్‌వేర్‌లో మార్పుల కోసమే తొమ్మిది నెలల సమయం పట్టిందన్నారు. వచ్చే ఎన్నికల్లో భూభారతి కాంగ్రెస్ ప్రభుత్వానికి రెఫరెండమని వివరించారు. చట్టంతోపాటు మార్గదర్శకాలు వచ్చిన తర్వాత మరింత స్పష్టత వస్తుందన్నారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి రెవెన్యూ అధికారిని నియమించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ధరణిని తాము తప్పుబట్టడం లేదనీ, దాన్ని తీసుకొచ్చిన విధానం కరెక్ట్ కాదని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 235 సర్వేయర్లు ఉన్నారనీ, మరో 850 నుంచి 900 మంది వరకు నియమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పారు. భూసంబంధమైన సమస్యల పరిష్కారానికి రెవెన్యూ ట్రిబ్యునళ్లు సైతం భూభారతి ద్వారా అందుబాటులోకి వస్తాయని వివరించారు. ధరణి రైతులు, అసాములకు శాపంగా మారిందన్నారు. పాసు పుస్తకం ఉంటేనే రైతుబంధు ఇచ్చారనీ, కానీ వాస్తవం వేరన్నారు. ధరణిలో కొన్ని లోపాలు ఉద్దేశపూర్వకంగా చేసినట్టుగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ నిర్ణయాలతో మంచి జరగక పోయినా, చెడు జరగొద్దని ఆయన అభిప్రాయపడ్డారు. ధరణికి సంబంధించిన లక్షలాది దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. సామాన్య ప్రజలు నరకం అనుభవించారని చెప్పారు. ప్రజలకు లబ్ది చేసేందుకే భూభారతి తెచ్చినట్టు వివరించారు.

వికలాంగ కళాకారులకు సమానావకాశాలు కల్పించాలి

- వికలాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి : తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.ఆనందాచారి
- ఎస్‌వీకేలో వికలాంగుల రాష్ట్ర స్థాయి సాంస్కృతిక ఉత్సవాలు



నవతెలంగాణ-ముషీరాబాద్

వికలాంగ కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, సమాన అవకాశాలు కల్పించి వారిని ముందుకు తీసుకెళ్లాలని తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.ఆనందాచారి అన్నారు. శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఎల్‌ఐసీ సౌజన్యంతో వికలాంగుల రాష్ట్ర స్థాయి సాంస్కృతిక ఉత్సవాలు.. రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్ అధ్యక్షతన జరిగాయి. వికలాంగ కళాకారుల నృత్యాలు, పాటలు, డ్యాన్స్, మిమిక్రీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆనందాచారి మాట్లాడుతూ.. సకలాంగులకు దీటుగా వికలాంగులు ముందుకు వస్తున్నారని తెలిపారు. వికలాంగులలో ఉన్న ఆత్మవిశ్వాసం చాలా గొప్పదని, వైకల్యం శరీరానికే తప్ప ప్రతిభకు కాదని చెప్పారు. సామాజిక అసమానతలపై వికలాంగులు చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. స్టీఫెన్ హాకింగ్ అంగవైకల్యం ఉన్నా ప్రపంచంలోనే ఉన్నత శ్రేణి శాస్త్రవేత్త అని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక సారథిలో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వైకల్యం ఉందని కుంగిపోకూడదని, పట్టుదలతో అంగవైకల్యాన్ని అధిగమించాలని, శ్రమ నుంచే పాట పుట్టిందని అన్నారు. పాటలు వికలాంగుల్లో చైతన్యం నింపాలని చెప్పారు.

ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య మాట్లాడుతూ.. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా 10 ఏండ్ల నుంచి ప్రతి ఏటా వికలాంగులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వికలాంగ కళాకారులను ప్రోత్సహించడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము వారిని ప్రోత్సహించేందుకు వికలాంగులతో ఆటాపాట, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వైకల్యం శరీరానికే తప్ప ప్రతిభకు కాదని అనేక మంది వికలాంగ కళాకారులు నిరూపించారని గుర్తు చేశారు. అవకాశాలు కల్పిస్తే వికలాంగులు ఏదైనా సాధిస్తారన్నారు. వికలాంగులకు సాంస్కృతిక శాఖ ద్వారా గుర్తింపు కార్డులు, పెన్షన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాంస్కృతిక సారథి ఉద్యోగాల్లో వికలాంగులకు 5 శాతం ఉద్యోగాలు కేటాయించాలని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేసే కార్యక్రమాల్లో వికలాంగులకు అవకాశం ఇవ్వాలన్నారు.

ఎల్‌ఐసీ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. వికలాంగులు ఆటా పాటలతో పాటు ఉన్నత చదువులు చదవాలని సూచించారు. వికలాంగులను ఆదుకునేందుకు ఎల్‌ఐసీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ఆర్.వెంకటేష్, ఎన్‌పీఆర్‌డీ మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ సాయమ్మ, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కన్వీనర్ ఎరపుల జంగయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు యశోద, దశరథ్, ఉపేందర్, స్వామి, లింగన్న, సహాయ కార్యదర్శులు కొనింటి నర్సిములు, యేశాల గంగాధర్, బాలీశ్వర్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.శశికల, ప్రకాష్, శేఖర్‌గౌడ్, దుర్గ, చంద్రమోహన్, లలిత, బాలయ్య, సుల్తాన్ రమేష్ పాల్గొన్నారు.

ఒక పంపు నుంచి నీళ్లిచ్చి షో చేశారు

- మంత్రి జూపల్లి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ది పొందేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం బీమా ప్రాజెక్టులోని ఒక మోటారు పంపు నుంచి నీళ్ల వదిలి షో చేసిందని ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. పాలమూరును సస్యశ్యామలం చేసినట్టు మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన మాట్లాడుతూ పాండిత్యం కాదు...నిజాయితీగా మాట్లాడాలని సూచించారు. రైతు భరోసా స్వల్పకాలిక చర్చ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం మహబూబ్ నగర్‌ను సస్యశ్యామలం చేసిందంటూ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన తిప్పికొట్టారు. ఒక ఎకరాకు అదనంగా నీళ్ల ఇవ్వలేదని విమర్శించారు. వైఎస్ఆర్ ప్రారంభించిన ప్రాజెక్టులకు కనీసం నిధులు కూడా కేటాయించలేదని చెప్పారు. లక్ష్మీదేవపల్లి ఏమైందని ప్రశ్నించారు.

కేసీఆర్ సమకాలికులు కోదండరామ్

- కవితకు మండలి చైర్మెన్ గుత్తా చురక



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భూభారతి బిల్లుపై మండలిలో చర్చ జరుగుతున్న క్రమంలో తమకు సమయం ఇవ్వడం లేదనీ, ఇతరులకు ఎక్కువ ఇస్తున్నారని కోదండరామ్ మాట్లాడుతున్న సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. ఇందుకు మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి స్పందిస్తూ 'సభలో ఎక్కువ సమయం మాట్లాడింది మీరే, మీ నాన్న కేసీఆర్ సమకాలికులు కోదండరామ్..ఆయన రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తి కాదు..ప్రభుత్వ నామినేటేడ్ ఎమ్మెల్సీ' అని చురక అంటించారు.

సిరిసిల్లలో మరో నేతన్న ఆత్మహత్య

నవతెలంగాణ - సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం తెల్లవారుజామున మరో నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సిరిసిల్లలోని బీవై నగర్‌కు చెందిన నక్క శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల వల్ల జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు శ్రీనివాస్ భార్య లావణ్య పోలీసులకు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ పేర్కొన్నారు. శ్రీనివాస్ గతంలో నేత కార్మికుడిగా పని చేసినప్పటికీ రోడ్డు ప్రమాదంలో చేయి విరుగగా అనేక రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడు. ఇద్దరు కూతుళ్ల వివాహం చేసే మార్గం కనిపించకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక శ్రీనివాస్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని కార్మిక సంఘం నేతలు పేర్కొన్నారు.



(ఫైల్)

ప్రభుత్వ విధానాలతో పవర్‌లూమ్ కార్మికుల ఆత్మహత్యలు : మూషం రమేష్

పవర్‌లూమ్ కార్మికుల వరుస ఆత్మహత్యలు జరుగుతున్నా వాటి నివారణకు ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటానికి నిరసనగా సిరిసిల్ల అంబేద్కర్ చౌక్ వద్ద పవర్‌లూమ్ వార్పిన్ వైపని అనుబంధ సంఘాలతో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లకార్డుల ద్వారా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూషం రమేష్ మాట్లాడుతూ పవర్‌లూమ్ కార్మికులు ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో వరుసగా ఆత్మహత్యలు జరుగుతున్నా సిరిసిల్ల ఉరిసిల్లగా మారుతున్నా ప్రభుత్వం ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకోకుండా ఏం సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఆత్మహత్యలు జరుగుతున్నాయని, సంవత్సరం కాలం నుంచి కార్మికులకు పని లేకుండా చేస్తే ఎట్లా బతుకుతారు అనే ఆలోచన కూడా ప్రభుత్వానికి లేదన్నారు. ఇప్పటిదాకా ఎన్నో చేసినామని చెప్పుతున్న ప్రభుత్వం కార్మికులకు ఏం ఉపయోగం జరిగిందో తెలపాలని డిమాండ్ చేశారు. యారన్ డిపోతో ఎవరికి మేలు జరిగిందని కార్మికులకు ఏం లాభం జరిగిందో చెప్పాలన్నారు. చనిపోయేది కార్మికుల అయితే ప్రభుత్వ నిర్ణయాలు పవర్‌లూమ్ యజమానులకు ఉపయోగపడే విధంగా ఉంటున్నాయని, ఈ విధానాన్ని మార్చుకొని కార్మికులకు ఉపయోగపడే పని ప్రభుత్వం చేయాలని, వెంటనే వర్కర్ టూ ఓనర్ పథకాన్ని పూర్తిచేసి కార్మికులకు అందించి ప్రభుత్వ వస్త్రాలను కార్మికులతో ఉత్పత్తి చేయించి శాశ్వత ఉపాధి కల్పించాలన్నారు.

ముగిసిన రాష్ట్రపతి శీతాకాల విడిది

- వీడ్కోలు పలికిన గవర్నర్, మంత్రులు, అధికారులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్/ సిటీ బ్యూరో

రాష్ట్రంలో భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము శీతాకాల విడిది, పర్యటన విజయవంతంగా ముగిసింది. ఈ నెల 17న హైదరాబాద్‌కు చేరుకున్న ఆమె... ఐదు రోజుల్లో పలు అభివృద్ధి, సంక్షేమ పనులు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ పర్యటన ముగించుకుని శనివారం హకీంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.

ఆమెకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కేంద్ర గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మేడ్చల్ -మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్, ఇతర అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు.

సీపీఐ(ఎం) భద్రాద్రి జిల్లా కార్యదర్శిగా మచ్చా

- 11 మందితో జిల్లా కార్యదర్శివర్గం... 34 మందితో జిల్లా కమిటీ
- విజయవంతంగా ముగిసిన జిల్లా మూడో మహాసభలు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

సీపీఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శిగా మచ్చా వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. పదకొండు మందితో జిల్లా కార్యదర్శివర్గాన్ని ఎన్నుకున్నారు. 34 మందితో జిల్లా కమిటీ ఏర్పాటైంది. ఇల్లెందులోని సింగరేణి 24 ఏరియా కమ్యూనిటీ హాల్‌లో శుక్ర, శనివారాల్లో నిర్వహించిన జిల్లా మూడో మహాసభలు విజయవంతంగా ముగిశాయి. చివరిరోజు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం నూతన జిల్లా కమిటీని ఎన్నిక అంశాన్ని ప్రతినిధుల ముందుంచారు. అన్నవరపు కనకయ్య జిల్లా కమిటీ సభ్యుల పేర్లు చదివి వినిపించారు. మహాసభలకు హాజరైన 340 మంది ప్రతినిధులు ఈ కమిటీకి ఆమోదం తెలుపుతూ తీర్మానం చేశారు. తదనంతరం జిల్లా కమిటీ సభ్యులతో కలిసి రాష్ట్ర కమిటీ నుంచి పార్టీ ఇన్‌చార్జి పోతినేని సుదర్శన్, పరిశీలకులు బండారు రవికుమార్ తదితరులు కార్యదర్శివర్గంపై చర్చించారు. తదనంతరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుల వివరాలను మహాసభ ముందుంచారు.

34 మందితో జిల్లా కమిటీ

సీపీఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శివర్గంలో మొత్తం 11 మందికి చోటు కల్పించారు. మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, ఏజే రమేశ్, కొక్కెరపాటి పుల్లయ్య, మొండెద్దు బాలనర్సారెడ్డి, మందలపు జ్యోతి, కారం పుల్లయ్య, కొలగాని బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్‌లకు కార్యదర్శివర్గంలో ఉన్నారు. వీరు కాక మరో 23 మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఈ సూపర్ టెక్నాలజీ పరుగులో, ఒత్తిడిలో పడి మనుషులు కొల్పోతున్నదేమిటో ఇప్పుడిప్పుడే గ్రహిస్తున్నారు యువకులు. ఇప్పుడు నవతరంలో రచనలు చేస్తున్న వాళ్లు పెరుగుతున్నారు. మానవసంబంధాలలో వచ్చిన మార్పులను, ఎదురౌతున్న సవాళ్లనూ సృజనాత్మకంగా చెబుతున్నారు. వారి ఆలోచనలెలా ఉన్నాయో వినాలి. అందుకు ఇదో సందర్భం. పిల్లలకు, పెద్దలకు, విద్యార్థులకు, ఉపయోగపడే వేలవేల పుస్తకాలు ఒక్క ప్రాంగణంలోకి వస్తున్న సమూహపు సమయాన సందర్శనే ఒక ఉత్సవం. పుస్తకాలే కాదు మనుషులు కలుస్తారు. సాహిత్య చర్చలు, కొత్త కొత్త ఆవిష్కరణలు, భావాల కలబోతలు, కవులు, రచయితలు, సృజనకారులు, మరి ముఖ్యంగా పుస్తకప్రియులు కలుస్తారు. అందుకే అది పుస్తకాల పండుగ. పరిమళాలు వెదజల్లును నిండుగా.

పుస్తకాల రుతువు

ఒక్క పుస్తకం తోడుంటే.. అనంత జ్ఞానం మనతో ఉన్నట్టే. అలసిపోయిన బాటసారికి చల్లని చెట్టు నీడ దొరికితే.. ఆ చెట్టుకు తియ్యటి పండ్లు ఉంటే..! అలా ఉంటుంది పుస్తకాలతో నేస్తం.. అక్షరాలతో సహవాసం. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా... పుస్తకాలు డిజిటల్ రూపంలోకి మారినా... పుస్తకాన్ని స్పర్శించే అనుభూతి... పఠనంతో వచ్చే జ్ఞానం శాశ్వతం. పుస్తకం మనకు విజ్ఞానం, వినోదం అందిస్తూ కొత్త ఆలోచనల ప్రపంచంలోకి తీసుకెళు తుంది. ఊహాశక్తిని పెంచి మరింత జ్ఞానవంతం చేస్తుంది. పుస్తకం నిజమైన నేస్తం.



పుస్తకం ఒక నిధి. భాషకూ, భావానికీ, వ్యక్తీకరణకూ ప్రధాన వారధి. తరతరాలుగా జ్ఞాన పరంపరను వారసత్వంగా అందిస్తున్న మాధ్యమం. మానవ జీవన సాంస్కృతిక పరిణామ క్రమంలో పుస్తకం పోషించిన పాత్ర చాలా గొప్పది, విశిష్టమైనది కూడా. ప్రపంచంలోని వందలాది భాషల్లో భావాల పరిణామాలను, ఉద్యమాలను, ఉద్వేగాలను, విలువలను ఒక్కటేమిటి మనిషి సమస్త మార్పులనూ పుస్తకం తనలో నిబిడీకృతం చేసుకొని సాక్షీభూతంగా నిలబడింది. అలాంటి పుస్తకాలు అనేకమందికి విస్తృతంగా చేరడం అత్యంత అవసరం. అందుకే అక్షరాల కుప్పల్ని పోసి, తలా ఇంత జ్ఞానాన్ని పంచుకుందాం రండి అని అందరినీ ఆహ్వానిస్తుంది' హైదరాబాద్ బుక్ ఫెయిర్'. ఈ ఏడాది చివరి మజిలీలో భాగ్యనగరంలో అక్షరాల విందు భోజనాల్ని ఆరగించి బుద్ధి బలశాలులమవుదాం.

విశాల విశ్వాన్ని ఓ పుస్తకాల గదిగా కుదించాలన్నా.. పుస్తకాల గదిలోనే ఓ విశాల విశ్వాన్ని సృష్టించాలన్నా అక్షరానికే సాధ్యం. 'పుస్తకంలో మునిగిన మనిషి పుట్టలో మునిగిన ముని' అని ఆరుద్ర చమత్కారం. మనసును సానబెట్టుకొనే చందనపు చెక్క గ్రంథం. పుస్తకాలు కొత్త ఆలోచనలను నింపుతాయి. అనుభూతులతో, ఆనందాలతో జీవితమంతా పరుచుకుంటాయి. అక్షరమంటేనే క్షయం లేనిది. ఒక మంచి పుస్తకం చదవడంలో ఉన్న ఆనందం అనుభవించిన వాళ్లకే తెలుస్తుంది. పుస్తకం అమ్మలా లాలిస్తుంది. నాన్నలా ఆదరిస్తుంది. గురువులా హితబోధ చేస్తుంది. ఒంటరి తనంలో స్నేహితుడిలా అక్కున చేర్చుకుంటుంది. ఒక కొత్త బలం సమకూరుస్తుంది. మనకెదురయ్యే సవాళ్లకు సమాధానాలనూ అందిస్తుంది. ఓదారుస్తుంది. అనేక జీవితాల అనుభవాల సారాన్ని తెచ్చి చేతుల్లో పెడుతుంది. మనల్ని పురికొల్పుతుంది. చైతన్యపరుస్తుంది. ప్రేరణనిస్తుంది. ప్రేమనూ పంచుతుంది. అందుకే పుస్తకం మన మస్తకాలకు పదునుపెట్టే ఆయుధం. అయితే అన్ని పుస్తకాలూ చదవాల్సినవే అయినా మంచి పుస్తకాలను ఎంచుకోవటం ముఖ్యమైన విషయం. మూఢత్వంలోకి దింపే పుస్తకాలూ వుంటాయి. విశ్వాసాల పేర మనుషుల్నీ విభజననూ, విభేదాన్ని పెంచే రచనలు కూడా ఉంటాయి. జాగ్రత్త వహించాల్సిందే. ఏ పుస్తకాలు నిజమైన జ్ఞానాన్ని అందిస్తాయో, మనసును వికసింపజేస్తాయో ఏరుకోవాల్సిందే మరి. అందుకోసం కసరత్తుచేయాలి. పుస్తకాలు మనం చదవాల్సిందే. అయితే మన సమాజ వాస్తవికత, పరిస్థితుల సమగ్రత ఏ పుస్తకాల్లో దొరుకుతాయో వెతుక్కోవాలి. కేవలం పుస్తకపూజ పనికిరాదు. ఆచరణశీలమైన అధ్యయనం అలవర్చుకోవాలి.

ఈ సూపర్ టెక్నాలజీ పరుగులో, ఒత్తిడిలో పడి మనుషులు కొల్పోతున్నదేమిటో ఇప్పుడిప్పుడే గ్రహిస్తున్నారు యువకులు. ఇప్పుడు నవతరంలో రచనలు చేస్తున్న వాళ్లు పెరుగుతున్నారు. మానవసంబంధాలలో వచ్చిన మార్పులను, ఎదురౌతున్న సవాళ్లనూ సృజనాత్మకంగా చెబుతున్నారు. వారి ఆలోచనలెలా ఉన్నాయో వినాలి. అందుకు ఇదో సందర్భం. పిల్లలకు, పెద్దలకు, విద్యార్థులకు, ఉపయోగపడే వేలవేల పుస్తకాలు ఒక్క ప్రాంగణంలోకి వస్తున్న సమూహపు సమయాన సందర్శనే ఒక ఉత్సవం. పుస్తకాలే కాదు మనుషులు కలుస్తారు. సాహిత్య చర్చలు, కొత్త కొత్త ఆవిష్కరణలు, భావాల కలబోతలు, కవులు, రచయితలు, సృజనకారులు, మరి ముఖ్యంగా పుస్తకప్రియులు కలుస్తారు. అందుకే అది పుస్తకాల పండుగ. పరిమళాలు వెదజల్లును నిండుగా. 'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో..కానీ, ఒక కొత్త పుస్తకం కొనుక్కో'మన్న సంస్కర్తల పిలుపు జ్ఞానసమాజ నిర్మాణం కోసం ఇచ్చిందే. అందుకే పుస్తకాల పండుగలు వర్ధిల్లాలి!. పుస్తకం ఆనందాన్నిస్తుంది, అలవాట్లను మారుస్తుంది. మంచి స్నేహితుడిలా జీవితానికి మార్గనిర్దేశం చేస్తుంది. తరాల మధ్య వారధి వేస్తుంది. వ్యక్తిత్వాలను తీర్చిదిద్దుతుంది. అందుకే పుస్తక పఠనాన్ని మన దినచర్యలో భాగం చేసుకోమంటూ జ్ఞాన సమాజ నిర్మాణానికి నేను సైతం అంటూ కదులుదాం. అక్షరాలన్నీ కూడబలుక్కొని, ఒక్కచోట చేరి పండుగ చేసుకుంటుంటే.. ఆ సందడే వేరు... ఆ కిక్కే వేరు. రుతువులన్నీ ఒక్కచోట చేరినట్లు... పుస్తకాలన్నీ ఒక్కచోట చేరితే... అదే పుస్తకాల రుతువు.

సంపాదకీయం

అంబేద్కర్‌కు అవమానం-పార్లమెంటుకు గ్రహణం



తెలకపల్లి రవి

దేశంపై తన నిరంకుశాధిపత్యాన్ని రుద్దడానికీ, ప్రత్యక్ష పరోక్ష పద్ధతులలో ప్రత్యర్థులపై ప్రతిపక్షాలపై దాడి చేయడానికి మోడీ ప్రభుత్వం ఎంత దూరమైనా పోవడానికి సిద్ధంగా వుందని ఈ వారం రోజుల పార్లమెంటు సమావేశాలు హెచ్చరిస్తున్నాయి. ఆఖరుకు అనుకున్నదాని కన్నా ముందే అర్ధంతరంగా ఏకపక్షంగా వాటిని ముగించి, కీలక చర్చలన్నింటికీ మంగళం పాడటం వ్యూహాత్మకంగా జరిగిందే. అటు రాజ్యాంగానికి ఎసరు పెడుతూ రాజకీయ రభస రగిలించడమే గాక భౌతికంగా ఇటు రాష్ట్రాల్లోనూ, అటు రాజధానిలోనూ బీజేపీ-సంఘ్ పరివార్ ప్రయోగిస్తున్న పాచికలు అన్నీఇన్నీ కావు. బడా మీడియా, అనేక కీలక ప్రాంతీయ పార్టీలూ వంత పాడుతున్నాయి గనక సామాన్య ప్రజలకు వీటి తీవ్రత అందకుండా పోతున్నది. ఒకదానికి ఒకటి అడ్డం పెడుతూ అనుకున్న దిశలో బండి నడిపించుకోవడానికి బీజేపీ-ఎన్డీయే భాగస్వాములను కూడా మద్దతుదారులుగా మార్చుకుంటున్నది. దేశ చరిత్రలోనే లేని విధంగా పార్లమెంటు వేదికపై అడ్డుకోవడాలు, అఘాయిత్యాలు జరిగినా తెలుగురాష్ట్రాల్లో కీలక ప్రాంతీయపార్టీలు నోరు మెదపకపోవడం ఇందుకో ఉదాహరణ మాత్రమే. తెలుగుదేశం, జనసేన నేరుగా ఎన్డీయేలో వుండి బలపరుస్తుంటే వైసీపీ బయటనుంచి తోడు నిలుస్తున్నది. బీఆర్ఎస్ అటూ ఇటూ కాకుండా కాంగ్రెస్, బీజేపీ ఒకట 'ననే వింతవాదనతో పరోక్షంగా సహకరిస్తున్నది. ప్రాంతీయ ప్రత్యర్థుల మధ్యనే ప్రదక్షిణలు చేస్తున్న తెలుగు మీడియా జాతీయస్థాయి చర్చలో స్పష్టమైన కోణాలను చూపించ కుండా రాష్ట్ర రాజకీయాల స్థాయికి దించేస్తున్నది. అందుకే ఇది తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకించి లోతుగా చర్చించాల్సి వుంది.

అదానీ టు సొరేస్

ఈ సమావేశాలు మొదలవడానికి ముందే అదానీ భాగోతం అమెరికాలో భగ్గుమన్నది. మోడీ నుంచి జగన్ వరకూ విస్తరించిన ఈ వ్యవహారంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కూడా ప్రస్తావనకు వచ్చింది. ఈ అంశం చర్చకు చేపట్టాలని ప్రతిపక్షాలు ఎంతగా పట్టుపట్టినా, పోరాడినా మొండిగా నిరాకరించిన బీజేపీ కుయుక్తులతో రాజ్యాంగ ఏర్పాటు 75వ వార్షికోత్సవాల ప్రహసనం చేపట్టి ప్రవచనాలు గుప్పించింది. నెహ్రూపై ద్వేషపూరితమైన వ్యాఖ్యలతో విషం కక్కింది. అదానీపై చర్చను పక్కదోవ పట్టించడం కోసం జార్జి సొరేస్ కథనం తీసుకొచ్చి సోనియాగాంధీ,కాంగ్రెస్‌లతో పాటు లౌకిక పక్షాలు కూడా ఆయన తరపున పనిచేస్తున్నారని దుష్ప్రచారానికి దిగింది. గతంలో సమాంతర మీడియాపై దాడికి కూడా ఇదే వాదన చేయడం గుర్తుండి వుంటుంది. ఏతావాతా సొరేస్‌తో చేతులు కలిపి భారతదేశానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయనేది సంఘ్‌పరివార్ అల్లుతున్న అబద్ధ పురాణం. అదే నిజమైతే పదేండ్లుగా అప్రతిహత అధికారం చెలాయిస్తున్నవారు ఎందుకు శోధించి బయటకు తీయలేక పోయారు? న్యూస్‌క్లిక్, వైర్ వంటివాటికి ఆండగా వున్న సింగం చైనా ఏజెంట్ అంటూ ఇదే ప్రచారం చేశారు గాని చివరకు చెప్పిందేమీ లేదు.ఇప్పుడు తామే చైనాతో సాధారణ సంబంధాలకు చొరవ తీసుకున్నారు. దేశద్రోహులుగా ప్రతిపక్షాలపై ముద్రవేయడం ఒక పథకం ప్రకారం సాగుతున్న కుట్ర. సీపీఐ(ఎం) సభ్యుడు జాన్‌బ్రిటాస్ రాజ్యసభలో దీనిపై చక్కటి చురకవేశారు. నెహ్రూ వ్యతిరేక ప్రచారం కోసం ఒక ప్రత్యేక మంత్రిత్వశాఖనే ఏర్పాటు చేస్తే పోతుందని ఆయన అన్నారు.మాజీ ప్రధాని వాజ్‌పేయి స్వయంగా రాజ్యసభలో ఒకప్పుడు నెహ్రూను రాముడితో పోల్చారని, అలాంటి నెహ్రూ ఇప్పుడు రావణుడై పోయాడని వ్యాఖ్యానించారు. కేరళలో నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని రద్దు చేసిన నెహ్రూతో తమకు విభేదాలున్నాయి. కానీ, ఆయనపై ద్వేషప్రచారానికి తాము వ్యతిరేకమన్నారు. ఎమర్జెన్సీని తాము వ్యతిరేకించాము కానీ, ఇప్పుడు దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తున్నదని హెచ్చరించారు. 56 అంగుళాల ఛాతీ గల ప్రధాని హయాంలో బయటనుంచి ఎవరో మన దేశాన్ని అస్థిరపర్చే కుట్ర చేస్తున్నారని చెప్పుకోవడం అవమానం కాదా? అని బ్రిటాస్ వేసిన ప్రశ్న ఎక్కడా కనిపించకపోవడం ఆశ్చర్యమే. సొరేస్‌తో సంబంధాలు దేశద్రోహం వంటి అంశాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)వేయాలని కోరారు. ఆ కమిటీ పత్యేక దర్యాప్తు చేపడితే ఆ మూలాలు మోడీ ఇంటి దగ్గరే తేలతాయని బ్రిటాస్ వ్యాఖ్యానించారు. ఎందుకంటే మనం ఐక్యరాజ్యసమితి ప్రజాస్వామ్య నిధికి విరాళం ఇస్తున్నాం. దానికీ సొరేస్‌కూ సంబంధం వుంది. మరి మనమే ఆయనకు డబ్బు పంపుతున్నామా? అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో అమెరికా పాత్ర గురించి ఎందుకు మాట్లాడటం లేదు? అదానీ గురించి విస్తారంగా వచ్చినదాన్ని దాటేసి కృత్రిమంగా సొరేస్ రచ్చ ఎందుకు తెచ్చినట్టు?ఇటలీ వెబ్‌సైట్ మీడియాపార్ట్ రఫేల్ హెలికాప్టర్ల గురించి బయటకు తీసినదాన్ని వదలిపెట్టి సొరేస్‌పై ఏదో రాసిందని ఇక్కడ మీడియాలో కథనాలు వదిలింది. తమ పేరును అనవసరంగా తీసుకొస్తున్నారని మీడియా పార్ట్ ఖండన కూడా ప్రకటించింది.

అంబేద్కర్‌కు పోటీగా దేవుడు

సొరేస్ అస్త్రం, అదానీ కథనం నుంచి కాపాడలేక పోవడం, రాజ్యాంగ చర్చ కూడా రాజకీయంగా దారి తప్పించకపోవడంతో మోడీ సర్కార్ వ్యూహాలకు చుక్కెదురైంది. జమిలి బిల్లును ఆలస్యం చేసి మరీ రాజ్యాంగ చర్చను సాగదీయాలని మొదట భావించి ఆ మేరకు ప్రకటించారు. అయితే ఈ క్రమంలో అంబేద్కర్ వివాదం స్వయంగా అమిత్ షా ద్వారానే తెరపైకి తెచ్చారు. రాజ్యాంగాన్ని రూపొందించడం ద్వారా హక్కులు కల్పించిన అంబేద్కర్ పేరు చెప్పడాన్ని ఫ్యాషన్‌గా చిత్రిస్తూ దానికి బదులు దేవుడి పేరు అన్నిసార్లు తల్చుకుని వుంటేనన్నా పుణ్యం వచ్చేదని చెప్పడమంటే అర్థమేమిటి? ఇందులో వున్నదీ మత రాజకీయమే. అమిత్ షా వక్రవ్యాఖ్య దేశ వ్యాపిత నిరసనలకు కారణమవడంతో బీజేపీ వ్యూహాలు బెడిసికొట్టాయి. దాంతో ఆలోచన మార్చుకుని ఆదరా బాదరగా జమిలి బిల్లునే సభలో ప్రవేశపెట్టారు. ఆ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టడానికి పాటించాల్సిన నిబంధనలకు తిలోదకాలు వదిలి మొండిగా ముందుకు తెచ్చారు.అయితే దాన్ని జేపీసీకి పంపించడం ప్రజాసామ్యం కోసమేనన్నట్టు కొత్తనాటకం నడిపించారు.అయినా అసలు వుద్దేశం బయటపడిపోయిందన్న నిస్పృహతోనే నేరుగా ప్రతిపక్ష నేతను అడ్డుకోవడానికి సిద్ధమయ్యారు. రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే సభలోకి వస్తుంటే మకరద్వారం దగ్గర అయిదుగురు బీజేపీ సభ్యులు అడ్డుతగలడమేమిటి? ఇలాంటిది గతంలో ఎప్పుడైనా జరిగిందా? తర్వాత బీజేపీ సభ్యులు ప్రతాప్ చంద్ర సారంగి,ముఖేష్ రాజ్‌పుత్ గాయపడ్డారంటూ ఆయనపై నాలుగు సెక్షన్ల కింద కేసు పెట్టారు. వారు అడ్డుకోవడం వల్లనే ఘర్షణ జరిగిందని, తనకూ గాయమైందని ఖర్గే ప్రకటించారు. కాంగ్రెస్ సభ్యులు దీనిపై ఎదురు కేసు పెట్టారు. కానీ పోలీసులు కేవలం పాలకపక్షం ఫిర్యాదులపైనే దర్యాప్తు చేస్తూ తమ ఫిర్యాదులను పెడచెవిని పెట్టారని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు. ఈ ఘర్షణలను సాకుగా చూపించి సభను ముందే వాయిదా వేశారు. అంతేగాక పార్లమెంటు ప్రాంగణంలో నిరసనలు నిషేధిస్తున్నట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఇది ఎప్పటినుంచో వున్న సంప్రదాయాలను హక్కులను నిరాకరించడమే.నిరసనల పట్ల మోడీ సర్కారు ఎంత అసహనంగా వుందో దీంతోనే తెలిసిపోతున్నది. ఇక రాజ్యసభ చైర్మన్ జగదీప్‌ధంకర్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసును తిరస్కరించడం ఇంకో పరిణామం.పైగా సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించడం తగదని ఆయన సూక్తులు చెబుతూ సభను ముగించారు.ఉభయ సభల్లోనలూ నిరసనలు లేకుండా అడ్డుకోవడం, ప్రతిపక్షాలు ఎంత అభ్యర్థించినా న్యాయమైన చర్చలకు అనుమతించ కుండా వాటిపైనే విద్రోహం ఆరోపణలు చేయడం బీజేపీ ఇరకాటానికి అద్దం పట్టింది. చర్చలు సవ్యంగా జరిగితే ఎదుర్కోలేమన్న భయంతోనే ముందే అడ్డుకోవడం ఇక్కడ వ్యూహం.అంతా అయ్యాక రాజ్యసభ 60 శాతం,లోక్‌సభ 45 శాతం సమయం వృథా అయిందని, పెట్టిన 16బిల్లులలో ఒక్కదాన్నే ఆమోదించగలిగిందని మొసలికన్నీళ్లతో నివేదికలు విడుదలయ్యాయి. అంబేద్కర్‌ను అవమానించినందుకు క్షమాపణలు చెప్పడం కానీ, కనీసం సర్దిచెప్పడం కానీ ఇప్పటికీ జరగలేదంటే మనువాద సిద్ధాంతకర్తల నిజస్వరూపం ఏమిటో తెలుస్తోంది. నిజానికి 1992లో అంబేద్కర్ వర్ధంతి రోజైన డిసెంబర్6న బాబ్రీ మసీదు విధ్వంసానికి పాల్పడినప్పుడే వారు లౌకికతత్వంతో పాటు పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపైనా, అంబేద్కర్‌పైనా తమకు ఏమాత్రం గౌరవం లేదని చేతల్లో చెప్పేశారు.

డబుల్ గేమ్

రాహుల్‌గాంధీపై కేసును నేరపరిశోధన విభాగానికి అప్పగించారు గనక ఏ మలుపు తిప్పుతారనేది చెప్పలేం. కాంగ్రెస్ వైపునా ఏమైనా లోపాలుంటే వుండొచ్చుగానీ అసలైన బాధ్యత అధికార పార్టీదే. ఇదే సమయంలో ఆరెస్సెస్ అధినేత మోహన్‌భగవత్ ప్రతి మసీదు కింద మందిరాలున్నాయని వివాదాలు విస్తరించడం సరికాదని నీతిపాఠాలు చెప్పడం కూడా సందేహాలు పెంచింది. ఎందుకంటే అన్నిచోట్ల కాదు కొన్నింటిపై కేంద్రీకరించాలనే వ్యూహం తీసుకోబోతున్నట్టు కనిపిస్తున్నది.అయోధ్య తర్వాత కాశీ మధు బాకీ హై అన్న వారి ప్రచారం బాగా తెలిసిందే గనక ఆ దిశలో వ్యూహాలు నడవొచ్చు. సంభాల్‌లో మసీదు సర్వేను సుప్రీంకోర్టు నిలిపేసినా అదే చోట మరేదో మందిరం బయటపడిందంటూ జాతీయ స్థాయిలోనే హడావుడి సాగిస్తున్నారు. అక్కడ సర్వేలు మొదలెట్టారు. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి శేఖర్ యాదవ్ విహెచ్‌పి సభలో విద్వేష ప్రసంగం చేయడాన్ని సుప్రీంకోర్టు కొలీజియం పిలిచి మందలిస్తే యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సమర్థిస్తున్నారు. మసీదులు, మందిరాలపై మోహన్ భగవత్ మాట్లాడిన దానికి భిన్నంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు వినిపిస్తున్నారు. ఈ ద్వంద్వ క్రీడ మనకు బాగా పరిచితమైన సంఘ్ పరివార్ పని విభజనలో భాగమే. తమ వాదనలు, వ్యూహాలు దాడులపై నిరసన వస్తున్నది గనకే సన్నాయి నొక్కులపని ఒకరు తీసుకుంటే మరొకరు షరామామూలుగా విద్వేషకాండ సాగిస్తున్నారని అర్థం చేసుకోవాలి. తిరుమల కొండపై అన్యమత ఉద్యోగుల తొలగింపు అంటూ మొదలుపెట్టి ఇప్పుడు షికారి తెగవారిపై ఆ ముద్రవేసి దుకాణాలు మూయించి వెళ్లగొట్టడం దేనికి నిదర్శనం? సనాతన మతమే భారతీయుల జాతీయ మతమని యోగి ఆదిత్యనాథ్ ఉవాచ.ఒకే దేశం,ఒకే ఎన్నిక, ఒకే మతం, ఒకే పార్టీ, ఒకే నేత అనే నినాద పరంపరకు పరాకాష్ట కాగానే వీటిని చూడకతప్పదు.ఇంతా చేసి లోక్‌సభలో మెజార్టీ కోల్పోవడం, రాజ్యసభలో అసలే లేకపోవడం బీజేపీకి మింగుడుపడని పరిస్థితిగా తయారైంది. తత్ఫలితంగానే పార్లమెంటును రణక్షేత్రంగా మార్చేందుకు సిద్ధమైపో యారని తాజా సమావేశాలు చేసిన హెచ్చరిక.

సొరేస్ అస్త్రం, అదానీ కథనం నుంచి కాపాడలేకపోవడం, రాజ్యాంగ చర్చ కూడా రాజకీయంగా దారి తప్పించకపోవడంతో మోడీ సర్కార్ వ్యూహాలకు చుక్కెదురైంది. జమిలి బిల్లును ఆలస్యం చేసి మరీ రాజ్యాంగ చర్చను సాగదీయాలని మొదట భావించి ఆ మేరకు ప్రకటించారు. అయితే ఈ క్రమంలో అంబేద్కర్ వివాదం స్వయంగా అమిత్ షా ద్వారానే తెరపైకి తెచ్చారు. రాజ్యాంగాన్ని రూపొందించడం ద్వారా హక్కులు కల్పించిన అంబేద్కర్ పేరు చెప్పడాన్ని ఫ్యాషన్‌గా చిత్రిస్తూ దానికి బదులు దేవుడి పేరు అన్నిసార్లు తల్చుకుని వుంటేనన్నా పుణ్యం వచ్చేదని చెప్పడమంటే అర్థమేమిటి? ఇందులో వున్నదీ మత రాజకీయమే.



అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి శేఖర్ యాదవ్ విహెచ్‌పి సభలో విద్వేష ప్రసంగం చేయడాన్ని సుప్రీంకోర్టు కొలీజియం పిలిచి మందలిస్తే యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సమర్థిస్తున్నారు. మసీదులు, మందిరాలపై మోహన్ భగవత్ మాట్లాడిన దానికి భిన్నంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు వినిపిస్తున్నారు. ఈ ద్వంద్వ క్రీడ మనకు బాగా పరిచితమైన సంఘ్ పరివార్ పని విభజనలో భాగమే. తమ వాదనలు, వ్యూహాలు దాడులపై నిరసన వస్తున్నది గనకే సన్నాయి నొక్కులపని ఒకరు తీసుకుంటే మరొకరు షరామామూలుగా విద్వేషకాండ సాగిస్తున్నారని అర్థం చేసుకోవాలి.

గణిత మార్గదర్శి రామానుజన్



మహేశ్వరం భాగ్యలక్ష్మి
9440580925

'ఈ విశాల విశ్వమంతటా అన్ని గణితీయంగానే సంభవిస్తాయి' అని లైబినిడ్జ్ అనే గణిత శాస్త్రజ్ఞుడు అంటాడు.మానవుడు పసిబిడ్డగా ఈభూమిపైకి వచ్చిన నాటి నుండి మరణం వరకు ప్రతిక్షణంలో, ప్రతి సందర్భంలోనూ గణితాన్ని ఉపయోగిస్తాడు.అందువలన గణితం మానవ జీవితంతో అవినాభావ సంబంధం కలిగి ఉంది. ఆటాడుకునే పిల్లవాని నుండి మొదలుకుని అంతరిక్ష యాత్రికుని వరకు గణితాన్ని ఉపయోగించకుండా ఎవరూ ఉండలేరు. అసలు గణితాన్ని వాడకుండా ఒక్కక్షణం కూడా ముందుకు సాగలేమంటే అతిశయోక్తి కాదేమో. గణితం అంతగా మానవ జీవితంతో పెనవేసుకుంది. కాలక్రమేణా మానవ నాగరికతతో పాటు గణితం కూడా అభివృద్ధి చెందుతూ వచ్చింది. అందువలనే మానవ మనుగడకు గణితం అద్దం లాంటిది. గణితశాస్త్రం అనగానే మనకు గుర్తుకొచ్చే పేరు శ్రీనివాస రామానుజన్. అతను గణితానికి చేసిన సేవలకు గుర్తుగా ఆయన జన్మదినమైన డిసెంబర్ 22ను భారత ప్రభుత్వం జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించింది.

శ్రీనివాస రామానుజన్ 1887 డిసెంబర్ 22న తమిళనాడు రాష్ట్రంలోని ఈరోడులో జన్మించాడు. 1920 ఏప్రిల్ 26న మరణించాడు. అతని జీవిత కాలం 32 సంవత్సరాల 4 నెలల 4 రోజులు మాత్రమే. అయినప్పటికీ వందల సంవత్సరాలకు సరిపడా చరిత్రను లిఖించాడు. రామానుజన్‌కు చిన్నప్పటి నుండి గణితంపై ప్రత్యేకమైన ఆసక్తి ఉంది. తన పదకొండవ యేటా గణిత శాస్త్రం పట్ల అద్భుతమైన దృష్టిని కన బరిచాడు. సంఖ్యలపై రామానుజన్‌కు సంపూర్ణ అవగాహన ఉంది. సాధారణమైన గణితానికి భిన్నమైన పద్ధతులు ఆవిష్కరించాడు. ఇతను ప్రధాన సంఖ్యలు, వింతచదరాలు, వితత భిన్నాలు, వర్గమూలాల గూడు, పార్టిషన్ ఆఫ్ నంబర్స్, ఎలిప్టిక్ ఇంటిగ్రాల్స్‌పై పరిశోధన చేశాడు. ఆయన పేరుపై గల రామానుజన్ సంఖ్య 1729 ఇందుకు ఒక ఉదాహరణ. ఫెలో ఆఫ్ ది రాయల్స్ సొసైటీ, ఫెలో ఆఫ్ ట్రినిటీ కాలేజీ గౌరవం పొందిన మొదటి భారతీయుడు. గణితంపై ఇతనికి ఉన్న పరిశోధనా శక్తి మాత్రం అమోఘం. అలాగే ఇండియన్ మేథమెటికల్ సొసైటీ అనే పత్రికలో ఇతని వ్యాసాలు అనేకం ప్రచురితమయ్యాయి. ఇక రామానుజన్ చివరి దశలో మాక్ తీట ఫంక్షన్స్‌పై చేసిన పరిశోధన ప్రసిద్ధమైంది. రామానుజన్ గణిత శాస్త్రజ్ఞుడు అనే కన్నా, ఆయన మానవ మేధస్సు ఎంత చేయగలదో నిరూపించిన శక్తిమంతుడు. ఒక మహనది లాంటిది రామానుజన్ జీవితం. నది ఎలాగైతే ప్రవహించినంత మేర పరిసరాలన్ని సస్యశ్యామలం చేస్తుందో, అలాగే రామానుజన్ వేసిన ప్రతి అడుగు గణిత శాస్త్రాన్ని ప్రకాశవంతం చేసింది.



రామానుజన్ జీవితం నుంచి నేటి విద్యార్థులు స్ఫూర్తిదాయకమైన పాఠాలను తీసుకోవాలి. గణితంపై గాఢమైన ఆసక్తి , అభిరుచిని చిన్న నాటినుంచే పెంపొందించుకోవాలి. స్వీయ అధ్యయనాన్ని అలవరుచుకోవాలి, ఆత్మవిశ్వాసంతో ఎదురైనా కష్టాలను అధిగమించడంలో నిబద్ధతను ప్రదర్శించాలి.సృజనాత్మకత, నూతన ఆలోచన పట్ల ఎలా ఓపికతో ఉండటం, తమ మీద తమకు నమ్మకం కలిగి ఉండటం అనేది అలవరుచుకోవాలి. ఇంతటి ప్రాముఖ్యత కలిగినందువలన గణితం ఆవశ్యకతను నేటి తరం నుండి ముందు తరాల వారికి వ్యాప్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.రామానుజన్ హార్డీ వంటి గొప్ప గణితశాస్త్రజ్ఞుని సలహాలు, సహకారం పొందడం ద్వారా గణితంలో గొప్పస్థాయికి ఎదిగారు. అలాగే నేటి విద్యార్థులు కూడా ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో ముందుకు సాగాలి.విద్యార్థులలో గణితశాస్త్రం పట్ల ఆసక్తిని, శ్రద్ధను పెంపొందించాలి, గణితానికి ఉన్న ప్రాముఖ్యతను వివరించాలి. విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేసేలా ప్రేరణ కల్పించాలి. గణిత శాస్త్రం ద్వారా విద్యార్థుల ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలు నిర్వహించాలి. అలాగే రామానుజన్ జీవిత చరిత్ర, ఆయన చేసిన అపూర్వ గణిత కృషిని గుర్తుచేసుకోవడం ఈగణితశాస్త్ర దినోత్సవం ముఖ్య ఉద్దేశం.

మిత్ర ధర్మం!

పెద్దాయన శయనమందిరంలోకి వచ్చాడు. నిద్రపోయే ముందు ఆరోజు చేసిన పనులను సమీక్షించుకుని, రేపటికి ఏం చేయాలో ప్రణాళికలు వేసుకోవడం ఆయనకు అలవాటు. దాని ప్రకారం సభలో జరిగిన దాని గురించి ఆలోచించాడు. గతవారం రోజుల నుండి సభలో జరిగిన చర్చలు పెద్దా యనకు చికాకు తెప్పించాయి. సరిగ్గా చెప్పాలంటే తీవ్ర ఆగ్రహం కలిగించాయి. ప్రత్యర్థి తన ప్రియమిత్రుడు తీవ్ర ఆగ్రహం కలిగించాయి. తన ప్రియ మిత్రుడు వ్యాపారంలో చేస్తున్న అక్రమాల గురించి ప్రత్యర్థి శిబిరం అదేపనిగా చర్చించటం పెద్దాయనకు నచ్చలేదు. పైగా తన ప్రియమిత్రుడినే అరెస్టు చేయాలని ఒత్తిడి చేయడం ఆయనకు ఆగ్రహం కలిగించింది.

యధావిధిగానే తానేమీ మాట్లాడలేదు. విమర్శలకు, ఆరోపణలకు సమాధానం తినేవాడు సమాధానం చెప్పలేదు. చెప్పబోడు కూడా. అందుకే మౌనం!

అయినా ప్రియమిత్రుడికి అతడు చేసే అన్నిరకాల పనులకు పూర్తి సహకారం అందించడం మిత్రధర్మం కదా! ఇది మన పురాణాల్లో ఇతిహాసాల్లో ఉన్నదే కదా! దాన్నే తాను ఆచరించాడు! పురాణాల గురించి పూర్తిగా తెలియని మూర్ఖులు తన మిత్రుడినే అరెస్టు చేయమంటే తాను అరెస్టు చేస్తాడా?

రాజకీయ నాయకులకు ఆదర్శపురుషుడైన శ్రీకృష్ణుడు పాటించిన మిత్రధర్మాన్నే తాను అను సరించాడు కదా! తన ప్రియమిత్రుడైన కుచేలుడి వద్దనున్న అటుకులు తీసుకుని, అందుకు బదులుగా కుచేలుడికి సకల సంపదలు ప్రసాదించాడు కదా! రుక్మిణి అడ్డుపడకపోతే తన రాజ్యాన్ని కూడా ధార పోసేవాడే! కుచేలుడు అటుకులు పెట్టడానికి మొహమాటపడితే, స్నేహితుని వద్ద మొహ మాటా లెందుకని, కుచేలుడి వద్దనున్న అటుకుల మూట్లె శ్రీకృష్ణుడు లాక్కోలేదూ? అటుకులను లంచం అనగలరా ఎవరైనా? స్నేహితుడికి ఏం కావాలో చేసి పెట్టడమే కాదు, స్నేహితుడి వద్ద నుండి తీసుకోవడం కూడా మిత్రధర్మమే! అటుకులు తిన్నాకే శ్రీకృష్ణుడు, కుచేలుడికి సకలసంపదలు ఇచ్చాడు! తాను కూడా అంతేకదా! గతంలో తీసుకున్నాడు, ఇపుడు తిరిగి ఇస్తున్నాడు! ఇంత చిన్న ధర్మసూక్ష్మం అర్థం కాకపోతే ఎట్లా!

పెద్దాయన మదిలో ఆలోచనలు కొనసాగుతూనే ఉన్నాయి.

సకల జనులకి, సకల ప్రాణులకీ ఆదర్శమూర్తియైన శ్రీరామచంద్రమూర్తి మిత్రధర్మానికి ఎంత ప్రాధాన్యత ఇచ్చాడో, వీళ్ళకి ఎప్పుడు తెలుస్తుంది? మాతా సీతను వెతికే క్రమంలో సుగ్రీవుడితో స్నేహం కలిసింది. స్నేహితుడైన సుగ్రీవుడి కోసం అత్యత బలశాలియైన వాలితో శ్రీరాముడు వైరం పెట్టు కోలేదా? స్నేహితుడి కోసం వాలిని చంపటమే కాదు! వాలి రాజ్యాన్ని సుగ్రీవుడికి అప్పగించలేదా? మరి శ్రీరాముడు హత్యచేశాడని ఎవరైనా అనగలరా? వాలి భార్య తారను సుగ్రీవుడు ఏలుకుంటుంటే శ్రీరాముడు మౌనం దాల్చలేదూ! సుగ్రీవుడు కూడా శ్రీరాముడి కోసం ఏకంగా సముద్రంపై వారధినే కట్టినాడు కదా! వారధిని లంచం అనీ, తర్వాత శ్రీరాముడికి సమర్పించుకున్నాడని ఎవరైనా అనగలరా? అదంతా మిత్రధర్మం కదా!

సుగ్రీవుల స్నేహం ప్రపంచానికి మేలు చేస్తుందని హనుమాన్ ఆనాడే సెలవి చ్చాడు కదా! తాను, తన ప్రియమిత్రుడి కోసం చేస్తున్న దానిని ఇలాగే చూడాలి కదా! తమ స్నేహం భారతదేశం ఎల్లలుదాటి, శ్రీలంక, బంగ్లాదేశ్, కెన్యా లాంటి విదేశాలకు విస్తరించింది కదా! త్రేతాయుగంలో హనుమాన్ చెప్పిన మాటలు కలియుగంలో పునరావృతం అవుతున్నాయని అందరూ అనుకుంటుంటే, తన మిత్రుడినీ తానే అరెస్టు చేయాలని డిమాండ్ చేయటం హాస్యాస్పదం కదా?

శ్రీరాముడి స్నేహతత్వమును వీరెప్పుడు అర్థం చేసుకుంటారో! రాముడితో యుద్ధం చేసే సమయంలో నరుకుతున్న రావణుడి తలలు తిరిగి పుట్టుకొస్తున్న సమయంలో తన స్నేహితుడైన విభీషణుడి సలహాతోనే రావణుడి నాభిలోని అమృతభాండాన్ని శ్రీరాముడు బద్దలు కొట్టి విజయం సాధించాడు కదా! ఆతర్వాత లంకకు విభీషణుడినే రాజుగా చేశాడు. విభీషణుడు ఇచ్చిన సలహాను లంచం అనీ, భ్రాతృద్రోహం అని ఎవరైనా అంటారా? తన స్నేహితుడైన శ్రీరాముడిని గెలిపించుటకు విభీషణుడు సలహా ఇచ్చాడు! రాజులేని లంకకు రాముడు విభీషణుడిని రాజుగా చేశాడు! ఇద్దరూ తమ మిత్ర ధర్మాన్ని పాటించారు! ఇందులో ఆక్రమం, లంచం, భ్రాతృద్రోహం ఇలాంటి వాటి ప్రసక్తి ఎక్కడ?

శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, తాను అంతా మిత్రధర్మాన్నే పాటిస్తున్నాము. అంటే తాము అంతా ఒకే కోవకు చెందిన వారము కదా! సరిగ్గా చెప్పాలంటే తాము ముగ్గురం ఒకటే! ఈ విషయం చాలామంది భక్తులు తెలుసుకున్నారు! ఈ దైవ రహస్యాన్ని ఇంకా తెలుసుకోలేని మూఢులు కొందరు సభలో, సభ బయటా అరెస్టులు అంటూ అవాకులు, చెవాకులు పేలుతున్నారు! వారిని దారి మళ్లించేందుకు తాను రెండు రోజుల కిందట వేసిన ప్రణాళిక చక్కగా పనిచేసింది! ఇందులో కూడా మిత్రధర్మమే పనిచేసింది! తన మరో మిత్రుడు తన ప్రణాళికను చక్కగా సభలో అమలుచేసి మిత్రధర్మాన్ని చాటుకున్నాడు.



నజర్

ఈ దేశంలో బడుగు, బలహీన, దళిత, బహుజన ప్రజానీకం దేవుడిగా భావించే నాయకుడిని తన మిత్రుడు తృణీకరిస్తూ సభలో మాట్లాడారు! ఆ నాయకుడిని తలుచుకునే బదులు దేవుడిని తలుచు కుంటే స్వర్గం దక్కేదని తన మిత్రుడు సభలో ప్రకటించి, ప్రత్యర్థులను విజయవంతంగా దారి మళ్లిం చాడు! ఇప్పుడు తన స్నేహితుడి అక్రమాల గురించి చర్చించేవారులేరు! అరెస్టు చేయమని డిమాండ్ చేసేవారు అసలే లేరు! అంతా ఒకటే చర్చ! దళిత నాయకుడు - దేవుడు - స్వర్గం అంతే! తన మిత్రుడి గురించి చర్చ జరిగినన్ని రోజులు తాను మౌనంగా ఉండాల్సి వచ్చింది! ఇప్పుడు జూలు విదిల్చిన సిం హంలా సభలో గర్జిస్తున్నాడు.తన ప్రత్యర్థుల తాతముత్తాతల గురించి గంటలకొద్దీ ఏకిపాకం పెడుతున్నాడు!

ఏదేమైనా సకాలంలో మిత్రధర్మం పాటించిన తన మరో మిత్రుడికి మనసులోనే అభినందనలు తెలిపి, పెద్దాయన గాఢ నిద్రలోకి జారుకున్నాడు.

- ఉషాకిరణ్

ప్రభుత్వంలో క్రైస్తవులకు సముచిత స్థానం

- సీఎం రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వంలో క్రైస్తవులకు సముచిత స్థానం కల్పించి భాగస్వాములను చేస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని ఎల్.బీ.స్టేడియంలో నిర్వహించిన అధికారిక క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని సహచర మంత్రులు, పీసీసీ అధ్యక్షులు తదితరులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పీసీసీ కార్యవర్గంలోనూ సముచిత స్థానం, హోదాను క్రైస్తవులకు కల్పించాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను కోరారు. క్రైస్తవులు కోరకపోయినా సరే.. వారికి స్థానం కల్పించాలని సూచించారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పార్టీలో క్రియాశీలకంగా ఉన్న క్రైస్తవులను గుర్తించి మహేష్ కుమార్ గౌడ్‌కు అందజేయాలని క్రైస్తవ పెద్దలకు విజ్ఞప్తి చేశారు. తాను ఎన్నికలకు ముందు కాంగ్రెస్ గెలుపు కోసం పలువురు మత బోధకులను కలిసి హామీని, వారి ఆశీర్వచనాన్ని తీసుకున్నానని గుర్తుచేశారు. హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగను నిర్వహిస్తున్నామనీ, అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా ఈ పండుగ జరుపుతున్నామని చెప్పారు. తమ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా చూసే ప్రభుత్వమని తెలిపారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ తదితర సంక్షేమ కార్యక్రమాల్లో క్రైస్తవులు, దళిత క్రైస్తవులు అత్యధికంగా లబ్దిదారులుగా ఉన్నారని తెలిపారు. సంక్రాంతి తర్వాత ఇవ్వబోయే ఇందిరమ్మ ఇండ్లలోనూ నిరుపేద దళితులు, దళిత క్రైస్తవులకు లబ్ది చేకూరనుందన్నారు.

ప్రభువు పలికిన ఆ ఒక్క మాటలో సంపూర్ణ సందేశం

యేసుప్రభువు మానవాళికి చెప్పిన ఒక్క మాటలో సంపూర్ణ సందేశముందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. నిన్ను నువ్వు ప్రేమించుకున్నట్టే .... ఇతరులను ప్రేమించు అని ప్రభువు చెప్పిన దాంట్లో అన్ని అంశాలు సంక్షిప్తమై ఉన్నాయని తెలిపారు. మానవ సేవే మాధవ సేవ, సకల జన సుఖినోభవంతు అంటే అందరూ బాగుండాలని కోరుకోవడమన్నారు. స్వాతంత్ర్యానంతరం విద్య, వైద్యం ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు క్రైస్తవులు ప్రభుత్వాలతో పోటీ పడి సేవలందించారని కొనియాడారు.

అంతకు ముందు హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 2000 ఏండ్ల నుంచి యేసుక్రీస్తు నిత్యనూతనుడిగా అందరికీ కాంతిని అనుగ్రహిస్తున్నారని తెలిపారు. ఆ ప్రభువు ఆకాంక్షల మేరకు ప్రజాపాలన ఏడాదిపాటు విజయవంతంగా పూర్తి చేశామనీ, మరో నాలుగేండ్ల పాటు సంక్షేమ కార్యక్రమాలు దిగ్విజయంగా కొనసాగేందుకు తగిన శక్తిని, బలాన్ని, మనోధైర్యాన్ని ఇచ్చేలా ప్రార్థనలు చేయాలని కోరారు.

క్రీస్తు జననంతో కాలం క్రీస్తు పూర్వం, క్రీస్తు శకంగా విభజింపబడిందని రెవరెండ్ జయపాల్ తెలిపారు. కార్యక్రమంలో క్రిస్మస్ సందేశాన్నిచ్చారు. చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్ఐ) మోడరేటర్, కరీంనగర్ బిషప్ రెవరెండ్ రూబెన్ మార్క్ ప్రారంభ ప్రార్థన చేశారు.

సీఎం, మంత్రులు చిన్నారులకు క్రిస్మస్ కిట్లను అందజేశారు. అనంతరం సంతోషానికి ప్రతీకగా క్రిస్మస్ ట్రీని ముఖ్యమంత్రి ప్రారంభించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన 15 మందికి ముఖ్యమంత్రి అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మైనార్టీ కార్పొరేషన్ ఎండీ కాంతి వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

ఎంయూజీలో విద్యార్థిపై పడిన స్లాబ్ పెచ్చులు

- తలకు గాయం



నవతెలంగాణ-నల్లగొండ

నల్లగొండ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో నీలగిరి హాస్టల్ బాత్రూంలో శనివారం ఉదయం పై పెచ్చులు ఊడి విద్యార్థిపై పడ్డాయి. వివరాల్లోకి వెళితే.. నీలగిరి హాస్టల్‌లో ఉదయాన్నే విద్యార్థి బాత్రూంలో బ్రష్ చేసుకుంటుండగా పెచ్చులూడి తలమీద పడ్డాయి. విద్యార్థి తలకి గాయమైంది. దీంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

- అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన ఇనుప కంచె



నవతెలంగాణ-చిట్యాల

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని చిట్యాల మండలం వెంచర్ల గ్రామ పంట పొలాల వద్ద అడవి పందుల కోసం అమర్చిన కరెంటు తీగలు తగిలి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శనివారం జరిగింది. ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. టేకుమట్ల మండలం బోర్నపల్లి గ్రామానికి చెందిన లోకిని గణేష్(24) శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇంట్లో బయటకు వెళ్లాడు. శనివారం ఉదయం 7గంటల సమయంలో వాట్సప్ గ్రూప్‌లలో తన భర్త లాగే ఒక వ్యక్తి చనిపోయి ఉన్నాడని చూసి వెతుక్కుంటూ గణేష్ భార్య వెళ్లింది. అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన ఇనుప కరెంట్ వైర్లు తగిలి మృతిచెందాడు. ఆ పక్కనే ఒక అడవి పంది చనిపోయి ఉందని మృతుడి భార్య అపర్ణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలానికి వెళ్లిన సీఐ మల్లేష్ యాదవ్, ఎస్ఐ శ్రావణ్‌కుమార్ పరిశీలించి వివరాలు సేకరించారు.

చెరువులో పడి తల్లి, ఇద్దరు పిల్లలు మృతి

- ప్రాణాలతో బయటపడిన మరో చిన్నారి



నవతెలంగాణ- నవాబ్ పేట

ప్రమాదవశాత్తు చెరువులో మునిగి, తల్లి ఇద్దరు పిల్లలు మృతి చెందారు. మరో చిన్నారి ప్రాణాలతో బయటపడింది. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండల పరిధిలోని పోమాల గ్రామంలో శనివారం జరిగింది. ఎస్ఐ విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం.. పోమాల గ్రామ సమీపంలో ఉన్న పెద్ద చెరువుకు మల్లేష్ భార్య సరోజ(28), కొడుకు, ఇద్దరు కుమార్తెలతో కలిసి బట్టలు ఉతకడానికి వెళ్లింది. ఈ క్రమంలో తల్లి, ఇద్దరు పిల్లలు ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయారు. అది గమనించిన అదే గ్రామానికి చెందిన యాదయ్య, మహేష్ వారిని కాపాడేందుకు ప్రయత్నించారు. కానీ ఫలితం లేకపోయింది. పెద్ద కూతురు మాత్రం ప్రాణాలతో బయటపడింది. మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పునాదుల్లోకెళ్లి రైతుల సమస్యలను పరిష్కరించాలి


సాగు చేసేటోళ్లందరికీ రైతు భరోసా ఇవ్వాలి

15 ఎకరాల వరకు అమలును పరిశీలించాలి

వ్యవసాయ, వ్యవసాయేతర భూముల లెక్కలు తీయాలి

వాస్తవ సాగుదారులకు విపత్తు సహాయం అందేలా చూడాలి :

రైతు భరోసాపై స్వల్పకాలిక చర్చలో సీపీఐ పక్ష నేత కూనంనేని



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పునాదుల్లోకి వెళ్లి రైతు సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేయాలని సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు కోరారు. సాగు చేసే రైతులందరికీ రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలనీ, కనీసం 15 ఎకరాల వరకు అమలును పరిశీలించాలని ప్రభుత్వానికి సూచించారు. పోడు, అసైన్డ్, అటవీ, దేవాదాయ ఇలా సాగుచేసే ప్రతి రైతునూ పరిగణలోకి తీసుకోవాలని కోరారు. కౌలు రైతులకు భరోసా కల్పించాలని విన్నవించారు. గత ప్రభుత్వం మాదిరిగా కొండలు, గుట్టలు, వెంచర్లు, వ్యవసాయేతర భూములకు అమలు చేయవద్దని సూచించారు. 45 లక్షల ఎకరాలకు సంబంధించి వ్యవసాయంతో సంబంధం లేని వారు రైతుబంధు నిధుల పొందడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల లెక్కలను తీయాలని సూచించారు. కొత్తగూడెంలో పంట దెబ్బతిన్న రైతులకు ఇప్పటి వరకు పంట బీమా అందినట్టు తాను వినలేదన్నారు. పంట బీమాతో పాటు కరువు బీమాను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్ఎస్‌స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు రైతులకు గిట్టుబాటు అయ్యేలా మద్దతు ధరలు ఉండేలా చూడాలని కోరారు. వ్యవసాయ రంగంలో జపాన్‌లో 90 శాతం, అమెరికాలో 80 శాతం, కొలంబియాలో 61 శాతం, యూరప్‌లో 48 శాతం, చైనా 31 శాతం, పాకిస్తాన్ 26 శాతం సబ్సిడీలు ఇస్తుంటే మన పాలకులు మాత్రం 3 శాతమే ఇస్తున్న విషయాన్ని వివరించారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలను మరింత పెంచాలని కోరారు. వ్యవసాయానికి సంబంధించిన చట్టాలన్నీ కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం ఫలితంగా రైతు భరోసా, రైతుబీమా లాంటి ఎన్ని పథకాలు తీసుకొచ్చినా అన్నదాతల ఆత్మహత్యలు ఆగడం లేదని వాపోయారు. దేశ వ్యాప్తంగా 30 ఏండ్లలో మూడు లక్షల మంది రైతులు ఆత్మహత్యతో మరణించారని, ఇందులో ఏపీలో 25వేల మంది, తెలంగాణలో 30వేల మంది మరణించారని తెలిపారు. తెలంగాణ వచ్చాక పదేండ్లలో ఏడు వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించే పనిలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉందని విమర్శించారు. రైతులకు నష్టం చేకూర్చే మూడు భయానకమైన చట్టాలను కేంద్రం తీసుకొచ్చిందన్నారు. వాటి వెనుక వేల ఎకరాల భూములను, మార్కెట్లను కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర ఉందన్నారు. దీంతో రైతులు పండించిన పంటలకు అదానీ,అంబానీలు ధరలను నిర్ణయించే పరిస్థితి రాబోతుందని హెచ్చరించారు. నిత్యావసర ధరల చట్టాన్ని రద్దు చేసేందుకు చట్టం తీసుకొస్తుందన్నారు. విద్యుత్ కూడా కేంద్రం పరిధిలోకి వెళ్లిన నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తితో పటు ధరలను కేంద్రమే నిర్ణయించే అవకాశాలు ఉంటాయన్నారు. పంజాబ్, హర్యానా, యూపీ, తదితర రాష్ట్రాల రైతులు కేంద్రం తీరును నిరసిస్తూ ఢిల్లీలో వేలాది మంది రైతులు దేశంలో వ్యవసాయ రంగాన్ని బతికించుకునేందుకు పోరాటం చేస్తున్నారని చెప్పారు.

జీహెచ్‌ఎంసీ అధికారాల బదలాయింపు

మంత్రి శ్రీధర్ బాబు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, విపత్తు నిర్వహణ, విపత్తు స్పందనపై జీహెచ్‌ఎంసీకున్న కొన్ని అధికారాలకు బదలాయింపు అవసరమని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. శనివారం శాసనమండలిలో మంత్రి శ్రీధర్ బాబు జీహెచ్‌ఎంసీ (సవరణ) బిల్లు, 2024, ది తెలంగాణ మున్సిపాల్టీస్ (సవరణ) బిల్లు, 2024ను ప్రవేశపెట్టగా, మరో మంత్రి పొన్నం ప్రభాకర్ ది తెలంగాణ పంచాయతీ రాజ్ (సవరణ) బిల్లు, 2024ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ కమిషనర్‌కు ఉన్న అధికారాలను ఇతరులకు అప్పగించనున్నట్టు తెలిపారు. ఒఆర్ఆర్‌లోపు దీని పరిధి ఉంటుందని చెప్పారు. మున్సిపల్ చట్ట సవరణ ద్వారా జీహెచ్‌ఎంసీలోకి 59 ఒఆర్ఆర్ లోపల ఉన్న గ్రామాలను విలీనం చేస్తున్నట్టు చెప్పారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో కొన్ని గ్రామ పంచాయతీలను తీసుకొస్తున్నట్టు చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశంతో పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

సవరణ బిల్లులపై చర్చలో పాల్గొంటూ శాసనమండలిలో బీఆర్ఎస్ పక్షనేత మధుసూదనాచారి స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామన్న కాంగ్రెస్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు రాజ్యాధికారంలో దక్కాల్సిన వాటా ఇంకా దక్కలేదని చెప్పారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు బ్రహ్మాండమైన బీసీ డిక్లరేషన్ ను ప్రకటించిందని గుర్తుచేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కు అత్యంత ప్రాధాన్యత ఉందని తెలిపారు. అయితే సవరణ బిల్లులో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా అని పేర్కొనడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపాల్టీల్లో విలీన గ్రామాల పరిస్థితి అటు గ్రామపంచాయతీకి కాకుండా, ఇటు మున్సిపాల్టీకి కాకుండా అన్నట్టుగా తయారయ్యాయని విమర్శించారు.

బీఆర్ఎస్ సభ్యురాలు సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ నర్సంపేట రాజుపేట, రాములు నాయక్ తండా మున్సిపాల్టీలోకి వస్తే ఐదో షెడ్యూల్ లో ఉన్న బెనిఫిట్స్ కొనసాగుతాయా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ సభ్యులు శంభీపూర్ రాజు మాట్లాడుతూ, అన్ని అనుమతులు తీసుకుని, బ్యాంకు లోన్లతో నిర్మాణమైన ఇండ్లను కూల్చివేశారనీ, ఆ ఇండ్లకు తీసుకున్న బ్యాంకు రుణాలను ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ సభ్యులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, సబర్మతీ ప్రాజెక్టు నిర్వాసితులకు ఒక్క ఇల్లు నిర్మించి ఇవ్వలేదని తెలిపారు. హైడ్రాకు చట్టబద్ధత ఉందనీ, దీనిపై ప్రజలకు ఇంకా అవగాహన కల్పించాల్సిందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ ప్రజలకు భద్రమైన భవిష్యత్తును అందించేందుకే హైడ్రా ఏర్పాటు అని తెలిపారు. బీఆర్ఎస్ సభ్యులు తాత్తా మధు మాట్లాడుతూ ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) లోపల నిర్మాణాలు చేపట్టిన ప్రజా ప్రతినిధులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. ఇప్పటికీ మూసీలో ఆక్రమించి నిర్మిస్తున్నారని చెప్పారు. సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ మున్సిపాల్టీలో విలీన గ్రామాల ప్రజలు ఉపాధి హామీ కోల్పోతున్నారనీ, వారికి పట్టణాల్లో ఉపాధి కల్పించాలని సూచించారు. బీఆర్ఎస్ సభ్యులు విలీన గ్రామ పంచాయతీలకు నిధులిచ్చేలా నిబంధనలు పాటించాలని కోరారు. కాంగ్రెస్ సభ్యులు బల్మూరి వెంకట్ మాట్లాడుతూ, పేదలకు ఇబ్బంది కలిగిన మాట వాస్తవమేననీ, అయితే అలాంటి నిర్మాణాలకు అనుమతులిచ్చిందెవరని ప్రశ్నించారు. కాంగ్రెస్ సభ్యులు టి.జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చెరువులు, కుంటలను పరిరక్షించడం ప్రధాన బాధ్యతగా తీసుకుందని అభినందించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను తగ్గించిందని విమర్శించారు. బీఆర్ఎస్ సభ్యులు బండా ప్రకాశ్ మాట్లాడుతూ రెవెన్యూశాఖకు ఉమ్మడి ఆస్తులను కాపాడే బాధ్యత ఉందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసేందుకు ప్రభుత్వానికి ఎవరు అడ్డంగా ఉన్నారని ప్రశ్నించారు.సభ్యులు భానుప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కాంగ్రెస్ సభ్యులు తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ఎవరి జనాభా ఎంతో వారికంత వాటా అన్నది కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ సభ్యురాలు వాణిదేవి మాట్లాడుతూ విలీన గ్రామాల కొత్త సమస్యలు రాకుండా చూడాలని సూచించారు.

ఈ ప్రిన్సిపల్ మాకు వద్దు

- గురుకుల పాఠశాల విద్యార్థుల ధర్నా
- వెంటనే అక్కడికి వచ్చిన అదనపు కలెక్టర్ చంద్రశేఖర్
- ప్రిన్సిపల్, విద్యార్థులతో వేర్వేరుగా చర్చలు
- జిల్లా కలెక్టర్‌కు నివేదిక



నవతెలంగాణ-జోగిపేట

'నానా రకాలుగా వెట్టిచాకిరీ చేయిస్తూ ప్రిన్సిపాల్ వేధిస్తున్నాడని.. ఇలాంటి ప్రిన్సిపాల్ వద్దంటే వద్దు' అంటూ సంగారెడ్డి జిల్లా అందోల్ గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థులు శనివారం ఉదయం పాఠశాల మెయిన్ గేటు ముందు ధర్నాకు దిగారు. ప్రిన్సిపల్ సద్గుణ మేరీ గ్రేస్ వేధిస్తున్నారని ఆరోపించారు. ఆమె సొంత కారును కడిగించుకోవడం, పర్సనల్ రూమ్ శుభ్రం చేయించుకోవడం, తిన్న ప్లేటు కడిగించుకోవడం, అకారణంగా తిట్టడం వంటివి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి కారణాలు లేకుండా పీడీ మౌనిక, ఇతర కాంట్రాక్టు లెక్చరర్‌లపై వేటు వేస్తున్నారని, దాంతో సిలబస్ ఇబ్బంది అవుతోందని అన్నారు. సుమారు రెండు గంటలపాటు ధర్నా చేపట్టారు. పాఠశాల నుంచి ప్రిన్సిపాల్ తక్షణమే వెళ్లిపోవాలంటూ డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఆర్డీఓ పాండు, తహసీల్దార్ విష్ణు సాగర్, మండల స్పెషల్ ఆఫీసర్ గీత, ఎంపీడీవో రాజేష్, ఉపా తహసీల్దార్ మధుకర్ రెడ్డి పాఠశాలకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. సీఐ అనిల్ కుమార్ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని విద్యార్థులను లోపలికి పంపించే ప్రయత్నం చేశారు. ప్రిన్సిపాల్‌తో మాట్లాడిస్తానని చెప్పినా ఆందోళన విరమించలేదు. ఈ విషయం తెలుసుకున్న పీఆర్టీయు జిల్లా అధ్యక్షులు ఆకుల మానయ్య నాయకులు మంజ నాయక్ అక్కడికి వచ్చి విద్యార్థులకు మద్దతు పలికారు. ప్రిన్సిపాల్ వైఖరిపై జిల్లా అధికారులకు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానని నచ్చజెప్పడంతో ధర్నా విరమించారు. విద్యార్థుల ధర్నా విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తోపాటు గురుకుల పాఠశాలల ఉమ్మడి మెదక్ జిల్లా సమన్వయకర్త నిర్మల పాఠశాలకు వచ్చారు. విద్యార్థులు, ప్రిన్సిపల్‌తో వేర్వేరుగా చర్చలు జరిపారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. విద్యార్థుల సమస్యలపై పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నట్టు అదనపు కలెక్టర్ తెలిపారు.

కేరళ ఆర్థిక దిగ్బంధానికి కేంద్రం కుట్ర

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్



నవతెలంగాణ-నారాయణపేట

ప్రజల హక్కుల పరిరక్షణ కోసం నిలబడుతున్న కేరళ ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం ఆర్థిక దిగ్బంధంలో ఉంచుతోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ అన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం జరిగిన కేరళ సంఘీభావ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాల హక్కులను కాలరాసే జమిలీ ఎన్నికలకు వ్యతిరేకంగా ఉన్న కేరళపై కేంద్రం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ రాష్ట్రంలో16 రకాల కూరగాయలు, పంటలకు మద్దతు ధర అందిస్తున్నట్టు చెప్పారు. వరి క్వింటాలుకు మద్దతు ధర రూ.2,850, రైతు ఆత్మహత్యల నివారణకు రైతు రుణ విమోచన చట్టాన్ని తీసుకొచ్చిన మొట్టమొదటి రాష్ట్రం కేరళ అని, మత సామరస్యాన్ని కాపాడటంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నదని వివరించారు. 100 శాతం అక్షరాస్యతను సాధించిన రాష్ట్రం కేరళ కాబట్టి.. ప్రజా ఉపయోగకర విధానాలను అవలంబిస్తోన్న ఆ ప్రభుత్వంపై కేంద్రం కక్షపూరితంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని అన్నారు. జీఎస్టీలో 63 శాతం కేంద్రం తన వాటాగా తీసుకోవడం రాష్ట్రాలను దోపిడీ చేయడమేనని విమర్శించారు.

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలను, మానవ మనుగడకు ముప్పు వాటిల్లే వైరస్‌లను కేరళ వీరోచితంగా ఎదుర్కొంటోందని చెప్పారు. అనేక విపత్తులకు గురవుతున్న కేరళకు విదేశీ సహకారం అందకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యుత్ సవరణ బిల్లుతో రైతులకు, సామాన్యులకు తీవ్రనష్టం వాటిల్లుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య గౌడ్, ప్రజా సంఘాల నేతలు అశోక్, బాలప్ప, దస్తప్ప, బాలప్ప, జోషి, గోవింద రాజ్, శివకుమార్, లాలప్ప పాల్గొన్నారు.

పదేండ్ల పాలనపై సిగ్గు పడండి

(మొదటిపేజీ తరువాయి)

సలహాలు, సూచనలు ఇస్తే, వాటిని పరిశీలించి, నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

రాళ్లు, గుట్టలకూ ఇద్దామా?

బీఆర్ఎస్ హయాంలో రైతు బంధు ఉద్దేశం పెట్టుబడి సాయం పథకమనీ, గడచిన పదేండ్లలో రూ.72,817 కోట్లు దీనికోసం ఖర్చు చేశారని సీఎం వివరించారు. వీటిలో రూ.22 వేల కోట్ల ప్రభుత్వ సంపదను సాగులో లేని భూములు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణం కోసం సేకరించిన భూములు, దొంగ పాస్‌బుక్కులు సృష్టించిన వారికి, క్రషర్ యూనిట్లకు, మైనింగ్ భూములకు, అనర్హులకు ఆయాచిత లబ్ధి చేకూర్చారని ఆక్షేపించారు. ఇప్పుడు కూడా రైతు భరోసాను అలాగే ఇద్దామా... అని ప్రతిపక్షాలను ఉద్దేశించి అడిగారు. గతంలో గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని రాజీవ్ రహదారికి, ఆమన్‌గల్ ప్రాంతంలో శ్రీశైలం రోడ్లకు కూడా రైతు బంధు ఇచ్చారని గుర్తుచేశారు. హైదరాబాద్ చుట్టుపక్కల 50కి.మీ పరిధిలో 70 నుంచి 80శాతం వ్యవసాయం చేయడం లేదనీ, కానీ మూడు కోట్ల ఎకరాలకు రైతుబంధు డబ్బులు చెల్లించారని విమర్శించారు. రైతుబంధు రూపంలో వేలాది కోట్లు కొల్లగొట్టారని చెప్పారు. తమ ప్రభుత్వ లక్ష్యం చివరి పేదవాడికి కూడా ప్రభుత్వ పథకాల ఫలాలు అందజేయడమేననీ, వాళ్లు ఇచ్చారు కాబట్టి మమ్మల్నీ అందరికీ ఇవ్వాలంటూ, వాళ్లనే ఆదర్శంగా తీసుకోమంటున్నారని ఎద్దేవా చేశారు.

సిగ్గుండాలె...

2019లో తాను పార్లమెంట్‌లో రైతు ఆత్మహత్యలపై అడిగిన ప్రశ్నకు 2014, 2015, 2016 సంవత్సలకు సంబంధించి, అప్పటి కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి సమాధానం ఇచ్చారంటూ ఆ వివరాలను సభలో ప్రస్తావించారు. ఆ గణాంకాల ప్రకారం పై మూడేండ్లలో తెలంగాణలో 2,888 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారనీ, ఇది రైతు ఆత్మహత్యల్లో దేశంలోనే రెండో స్థానమని వివరించారు. అంత ఘనత వహించి, రైతాంగానికి ఇంకా ఏదో చేశామని చెప్పుకోవడానికి సిగ్గుండాలని ఆక్షేపించారు. తెలంగాణ కంటే అత్యధిక జనాభా ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇన్ని ఆత్మహత్యలు జరగలేదన్నారు. ఇన్ని ఘోరాలకు కారణభూతులైన బీఆర్ఎస్ పాలకులు సభలో ముక్కు నేలకు రాసి, తల దించుకుని, రాష్ట్ర రైతాంగానికి క్షమాపణలు చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏడాదిలో రూ.20వేల కోట్లు రుణమాఫీ

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో కేవలం 27 రోజుల్లో 25,35,963 రైతులకు రూ.20,616 కోట్లు రుణమాఫీ చేశామనీ, దేశంలోని ఏ రాష్ట్రం ఈ ఘనతను సాధించలేదని స్పష్టం చేశారు. రుణమాఫీని బాధ్యతగా భావించి, రైతుల రుణం తీర్చుకున్నామని అన్నారు. దీనికి సంబంధించిన వివరాలు, గణాంకాలను సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు.

అప్పుల కుప్ప

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను 60 ఏండ్లు పాలించిన 16 మంది ముఖ్యమంత్రులు రూ.72వేల కోట్ల అప్పులు చేశారని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. స్వరాష్ట్రం సిద్ధించాక కేవలం పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో 7.11 లక్షల కోట్లు అప్పులు చేశారని తెలిపారు. ఇలాంటి ఆర్థిక ఉగ్రవాదుల్ని ఏం చేయాలంటూ సభాపతిని ప్రశ్నించారు. ఎక్కడా లేనట్టు 11.5 శాతం అధిక వడ్డీకి రుణాలను తీసుకున్నారనీ, ప్రతినెలా రూ.6,500 కోట్లు వాటి చెల్లింపులకే సరిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

బాధ్యత లేకుండా మాట్లాడొద్దు

ప్రజలు విశ్వసించి, పదేండ్లు అధికారాన్ని కట్టబెడ్తే, ఎలాంటి బాధ్యత లేకుండా, ఇష్టంవచ్చినట్టు మాట్లాడవద్దని సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ సభ్యులను ఉద్దేశించి అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్, ట్రిబుల్ ఆర్, కొడంగల్‌లో పరిశ్రమల ఏర్పాటు కోసం భూసేకరణ సహా ఏ అభివృద్ధి పని మొదలు పెడదామని ప్రయత్నించినా, కాళ్లలో కట్టె పెట్టి పడేసే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. అధికారంలో వారు తప్ప, ఇతరులు ఎవ్వరు ఉన్నా సహించలేక, అసహనంతో రగిలిపోవడం సరికాదన్నారు. 2014లో పార్లమెంటులో కేసీఆర్ లేకున్నా, సోనియాగాంధీ తెలంగాణ బిల్లుకు ఆమోదం తెలపడంలో ప్రధాన భూమిక పోషించి, స్వరాష్ట్రాన్ని ఇచ్చారని చెప్పారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అదే సోనియాగాంధీ కాళ్లముందు సాష్టాంగ నమస్కారాలు చేసిన విషయాలను మర్చిపోవద్దని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

అదానీకి తిరిగిచ్చేశాం

"స్కిల్ యూనివర్సిటీ కోసం అదానీ రూ.100 కోట్లు ఇచ్చారు. దీనిపై ప్రతిపక్షం చేసిన నానాయాగీ వల్ల ఆ మొత్తాన్ని అదానీకి తిరిగి ఇచ్చేశాం. దానివల్ల రాష్ట్రానికే నష్టం. రెండు సార్లు సీఎం అయ్యి.. పదేండ్లు పాలించి, వందేండ్ల విధ్వంసం సృష్టించి, వెయ్యేండ్లకు సరిపడా సంపాదించుకున్నారు" అని సీఎం రేవంత్‌రెడ్డి సభలో బీఆర్ఎస్ నాయకత్వాన్ని ఉద్దేశించి అన్నారు.

మణిపూర్ ప్రజల ఎదురుచూపు

- కువైట్‌కు ప్రధాని మోడీ : కాంగ్రెస్



న్యూఢిల్లీ : ప్రధాని మోడీ కువైట్ పర్యటనపై కాంగ్రెస్ పార్టీ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. 'తరచూ ప్రయాణించే ప్రధాని' మణిపూర్‌లో పర్యటించకుండా కువైట్‌కు పయనమయ్యారని పేర్కొన్నది. రక్షణ, వాణిజ్య రంగాల్లో సంబంధాల బలోపేతం కోసం మోడీ కువైట్‌లో రెండ్రోజులు పర్యటించనున్నారు. ఆయన శనివారం బయలుదేరి వెళ్లారు. దీంతో ఆయన పర్యటనపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. " వారి విధి అలాంటిది. మణిపూర్ ప్రజలు ప్రధాని రాకకోసం ఎదురు చూస్తుంటే, ఆయన(మోడీ) మాత్రం కువైట్‌కు బయలుదేరారు" అని పేర్కొన్నారు. మణిపూర్‌లో పర్యటించ టానికి ఆయనకు సమయం దొరకటంలేదని వివరించారు. జాతి హింసతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో పర్యటించాలనీ, అక్కడ శాంతి, భద్రతలను పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ తరచూ డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల ముగిసిన పార్లమెంటు సమావేశాల్లోనూ ఇదే డిమాండ్‌ను వినిపించింది.

నేడు ఉద్యాన శాఖలో కూరగాయల సాగుపై శిక్షణ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల అవసరాలకనుగుణంగా ఉద్యాన శాఖ కూరగాయాల సాగును ప్రోత్సహించేందుకు దృష్టి సారించింది. ఆదివారం హైదరాబాద్‌లోని రెడ్‌హిల్స్ ఉద్యాన శాఖ ట్రైనింగ్ సెంటర్‌లో రైతులకు ఒక రోజు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని ఆ శాఖ డైరెక్టర్ తరుపున రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంటలకు ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

ప్రస్తావించి ప్రయోజనమేంటీ?

- ప్రభుత్వ కార్యాచరణ లేకుంటే... : మండలిలో బీఆర్ఎస్ సభ్యులు టి.రవీందర్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రత్యేక ప్రస్తావనలతో ప్రయోజనమేంటని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ టి.రవీందర్ రావు ప్రశ్నించారు. శాసనమండలిలో ప్రత్యేక ప్రస్తావనల సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక ప్రస్తావనల సమయంలో తాము లేవనెత్తుతున్న అంశాలకు సంబంధించి ఏం జరుగుతుందో తమకు సమాచారం ఉండటం లేదన్నారు. తాము చెప్పిన అంశాలు సంబంధిత శాఖకు చేరుతున్నాయా? వాటిపై ఏమైన కార్యాచరణ తీసుకుంటున్నారా? కనీస సమాచారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ రవీందర్ రావుతో ఏకీభవిస్తున్నట్టు తెలిపారు. పార్లమెంటులో లేవనెత్తే అంశాలపై యాక్షన్ టేకెన్ రిపోర్ట్ ఇచ్చే వారని గుర్తుచేశారు. దీంతో చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జోక్యం చేసుకుని, ఇది వరకే దీనికి సంబంధించి వేగంగా స్పందించాలని ఆదేశించినట్టు తెలిపారు.

7 రోజులు.. 37 గంటలు

(మొదటిపేజీ తరువాయి)

రైతులకు బేడీలు వేసిన ఘటనలపై చర్చించాలంటూ బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. దీంతో తీవ్ర గందరగోళం చెలరేగటంతో సభ పట్టుమని పది నిమిషాలే కొనసాగి, మరుసటి రోజుకు వాయిదా పడింది. ఈనెల 17న కూడా లగచర్ల అంశంపైన్నే సభ అట్టుడికింది. నల్లచొక్కాలు ధరించి, చేతులకు బేడీలు వేసుకుని వచ్చిన బీఆర్ఎస్ సభ్యులు తమ నిరసనను తెలిపారు. అప్పులు, ఆర్థిక పరిస్థితికి సంబంధించిన అంశంపై అధికార, ప్రధాన ప్రతిపక్షాల వాదోపవాదాలు కొనసాగాయి. ఈనెల 18న మాజీ మంత్రి హరీశ్‌రావు 'కొంతమంది సభ్యులు సభకు తాగొస్తున్నారు...' అంటూ సభలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. అదే రోజు బీఆర్ఎస్‌కు చెందిన కేపీ వివేకానంద...'ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్' పథకంలో అధికార పార్టీ నేతలు కమీషన్లు దండుకుంటున్నారంటూ చేసిన ఆరోపణలు సభను మరింత హీటెక్కించాయి. ప్రతిగా మంత్రి సీతక్క... బీఆర్ఎస్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 19న ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) టెండర్ల అంశం సభను ఒక ఊపు ఊపింది. బీఆర్ఎస్ సభ్యుడు హరీశ్‌రావు కోరిక మేరకు ఓఆర్ఆర్ లీజు టెండర్లపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్)ను ఏర్పాటు చేస్తున్నామంటూ ముఖ్యమంత్రి రేవంత్ శాసనసభలో ప్రకటించటంతో ప్రధాన ప్రతిపక్షం సైలెంటయ్యింది. ఆ మరుసటి రోజైన శుక్రవారం (ఈనెల 20) భూ భారతి బిల్లుపై చర్చ సందర్భంగా సభలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. పేపర్లు విసిరేసుకోవడాలు, వాటిని చించటం, ఒక పక్షానికి చెందిన సభ్యులు మరో పక్షానికి చెందిన వారి వైపు దూసుకురావటం తదితర ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇక చివరి రోజైన శనివారం మాత్రం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేస్తూ సభ సజావుగా నడవటం గమనార్హం. రైతు భరోసా పథకంపై చర్చ, పుష్ప సినిమా విడుదల సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై సీఎం స్పందించటం తదితరాంశాలతో చివరి అంకం పూర్తయింది. ఇక్కడ శాసనసభలో కొనసాగిన నిరసనలు, నినాదాల హోరే మండలిలోనూ దాదాపు కొనసాగింది. మొత్తం మీద ఈనెల 9న ప్రారంభమైన శాసనసభ సమావేశాలు ఏడు రోజులపాటు కొనసాగాయి. 37.44 గంటలపాటు సభా కార్యకలాపాలు నడిచాయి. మండలి కార్యకలాపాలు 28.03 గంటలపాటు కొనసాగాయి. మొత్తం ఎనిమిది బిల్లులు... యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ బిల్లు, యూనివర్సిటీల చట్ట సవరణ బిల్లు, తెలంగాణ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ సవరణ బిల్లు, భూ భారతి బిల్లు, తెలంగాణ పేమెంట్ ఆఫ్ శాలరీస్ అండ్ పెన్షన్ సవరణ బిల్లు, జీహెచ్ఎంసీ సవరణ బిల్లు, తెలంగాణ మున్సిపాల్టీల చట్ట సవరణ బిల్లు, తెలంగాణ పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును ఉభయ సభలు ఆమోదించాయి. తెలంగాణ పర్యాటక పాలసీ, ప్రభుత్వ బడులు, గురుకులాల్లో మౌలిక వసతుల కల్పన, రాష్ట్ర ప్రభుత్వ అప్పులు, ఆర్థిక పరిస్థితి, రైతు భరోసాపై లఘు చర్చలు కొనసాగాయి. తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణపై ముఖ్యమంత్రి రేవంత్ శాసనసభలో ఒక ప్రకటన చేశారు. సమయాభావం వల్ల మండలిలో రైతు భరోసాపై లఘు చర్చను చేపట్టలేదు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు దీనిపై ప్రకటన చేసిన అనంతరం.. చర్చ జరిగినట్టుగా భావించాలంటూ మండలి చైర్మెన్ గుత్తా ప్రకటించారు. మొత్తం మీద రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తీవ్ర ఉద్రిక్తల మధ్య ఈనెల 9న ప్రారంభమైన శాసనసభ, మండలి శనివారం నాటి కార్యకలాపాల అనంతరం నిరవధికంగా వాయిదా పడ్డాయి.



అమిత్ షాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి

నవతెలంగాణ-హైదరాబాద్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మాజీ ఎంపీ వీహెచ్ హనుమంత రావు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆయన శనివారం అంబర్‌పేట్ సీఐ అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. వీహెచ్ హనుమంతరావు వెంట పీసీసీ కార్యదర్శి శంబుల శ్రీకాంత్ గౌడ్, ఆర్ లక్ష్మణ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ పులి జగన్, ఖైరతాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ గౌడ్, రావుల సుధాకర్, కోట అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం సాక్షిగా వివాహం

- ఛత్తీస్‌గఢ్‌లో ఒక్కటైన జంట



రాయ్‌పూర్ : రాజ్యాంగాన్ని ఎక్కువగా గౌరవించింది మేమంటే మేమేనంటూ పార్లమెంట్ ఉభయ సభల్లో అధికార, విపక్ష సభ్యులు పరస్పరం ఘర్షణకు దిగిన విషయం తెలిసిందే. అయితే ఈ వివాదాన్ని ఛత్తీస్‌గఢ్‌లోని ఓ మారుమూల గ్రామంలో ఉన్న షెడ్యూల్డ్ కులాల జంట సులభంగా పరిష్కరించింది. ప్రతిమ, యమన్ లహ్రే రాజ్యాంగ పీఠికపై ప్రమాణం చేసి ఒక్కటయ్యారు. సంప్రదాయబద్ధంగా జరిగే వివాహ తంతుపై కంటే వారిద్దరూ రాజ్యాంగం పైనే నమ్మకం ఉంచడం విశేషం. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటం సాక్షిగా వారిద్దరూ పూల మాలలు మార్చుకొని వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టారు.

ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌కు 350 కిలోమీటర్ల దూరంలోని జష్‌పూర్ జిల్లా కాపు గ్రామంలో ఈ వివాహ వేడుక నిరాడంబరంగా జరిగింది. యువ దంపతులిద్దరూ షెడ్యూల్డ్ కులమైన సత్నామీ తెగకు చెందిన వారు. తమ తెగ వ్యవస్థాపకుడు గురు ఘాసీదాస్ జయంతిని పురస్కరించుకొని వారిద్దరూ వివాహం చేసుకున్నారు. తాము హిందూ సంప్రదాయాలను పాటించడం లేదని వారు స్పష్టం చేశారు. మంగళసూత్రం లేదు...వధువు నుదుటిపై సింధూరం లేదు...ఏడు అడుగులు నడవడం లేదు...కనీసం భాజాభజంత్రీలు కూడా లేవు...రాజ్యాంగ పీఠికను చేతిలో ఉంచుకొని ప్రమాణం చేస్తూ వివాహ బంధాన్ని ప్రారంభించారు. 'రాజ్యాంగం సాక్షిగా ఒక్కటవ్వాలని నిర్ణయించుకున్నాము. కేవలం మా కుటుంబాలు, బంధువులే కాదు. మా తెగకు చెందిన వారందరూ ఎంతో సంతోషించి మా నిర్ణయాన్ని ఆమోదించారు. వివాహానికి హాజరై మమ్మల్ని ఆశీర్వదించారు. అనవసరపు ఖర్చును నివారించాలని కూడా మేము భావించాం' అని యమన్ లహ్రే, ప్రతిమ తెలిపారు. ఈ వివాహం ద్వారా వారు సమాజానికి ఏం చెప్పాలని అనుకున్నారు? అతిగా ఖర్చు చేయకుండా సాదాసీదాగా వివాహం చేయాలని అనుకుంటున్న వారికి ఈ ఉదంతం స్ఫూర్తిని ఇస్తుందని స్థానిక పాత్రికేయుడు రమేష్ శర్మ చెప్పారు. రాజ్యాంగం అనేది ప్రేమకు చిహ్నమైన పుస్తకమని, ప్రజలను ఏకం చేసే ఆలోచనలు అందులో ఉన్నాయని వారు అర్థం చేసుకున్నారని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

- ఒకరికి గాయాలు
- రోడ్డు పక్కన కూర్చున్న వారిపైకి దూసుకెళ్లిన డీసీఎం

నవతెలంగాణ -దేవరకొండ

రోడ్డు పక్కన కూర్చున్న వారిపైకి డీసీఎం దూసుకెళ్లడంతో ముగ్గురు మృతిచెందారు మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన శనివారం నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణ శివారులోని దర్గా వద్ద జరిగింది. పోలీసులు, మృతుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ మండలం తాటికోలు గ్రామానికి చెందిన హాజీమియా(52), డిండి మండలం ఎర్రారం గ్రామానికి చెందిన నబీన(22), తాడూరు మండలం మేడ్పూరు గ్రామానికి చెందిన అబ్దుల్ ఖాదర్(19), అదే గ్రామానికి చెందిన అన్వర్ దేవరకొండ నుంచి కొండమల్లేపల్లికి వెళ్లే రోడ్డు మార్గంలో పెద్ద దర్గా ఉర్సులో పాల్గొన్నారు. ఉర్సులో చిన్న స్వీట్ దుకాణం పెట్టుకున్నారు. శనివారం ఉదయం తమ తమ గ్రామాలకు వెళ్లేందుకు దర్గా వద్ద ఉన్న చిన్న గది ముందు కూర్చున్నారు.

కొండమల్లేపల్లి మండలం చిన్న అడిశర్లపల్లికి చెందిన డీసీఎం దేవరకొండకు వెళ్తూ అతివేగంగా వచ్చి రాళ్లతో కట్టిన గదిని ఢీకొట్టింది. దీంతో గది ముందు కుర్చున్న వారిపై పెద్ద పెద్ద రాళ్లు మీద పడిపోవడంతో హాజీమియా, నబీన, అబ్దుల్ ఖాదర్ అక్కడికక్కడే మృతిచెందారు.

పాప్‌కార్న్‌పై మూడు రకాల పన్నులు

- బీమాపై జీఎస్టీ తగ్గింపు వాయిదా
- సెకండ్‌హ్యాండ్ కార్లపై 18 శాతం పన్ను
- జీఎస్టీ కౌన్సిల్‌లో నిర్ణయం



న్యూఢిల్లీ : పాప్‌కార్న్‌పై మూడు రకాల పన్ను రేట్లను అమలు చేయాలని జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించింది. రుచిని బట్టి రేటు ఉంటుందని తెలిపింది. సాల్ట్ లేదా మసాలా పాప్ కార్న్ ప్యాక్ చేయకుండా అమ్మితే దానిపై 5 శాతం జీఎస్టీ పడనుంది. ఇక ప్యాక్ చేసి అమ్మితే 12 శాతం, షుగర్ కలిపిన పాప్ కార్న్ అయితే 18 శాతం పన్నులు వసూలు చేయాలని నిర్ణయించింది.

కాగా జీవిత బీమా, ఆరోగ్య బీమా పాలసీ ప్రీమియంలపై వస్తు సేవల పన్ను (జీఎస్టీ) తగ్గింపు అంశాన్ని జీఎస్టీ కౌన్సిల్ వాయిదా వేసింది. శనివారం జై సల్మేర్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన 55వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగింది. ప్రస్తుతం బీమా ఉత్పత్తులపై 18 శాతం పన్ను రేటు అమల్లో ఉంది. ఇది చాలా ఎక్కువని.. ముఖ్యంగా ప్రజలను బీమాకు దూరం చేసేలా పన్ను విధానం ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. తాజా కౌన్సిల్‌లో దీనిపై ఆరంభంలోనే చర్చించారు. మరింత లోతైన చర్చ అవసరమని పలువురు సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేయడంతో ఈ నిర్ణయాన్ని వాయిదా వేసినట్టు మంత్రుల బందానికి నేతృత్వం వహించిన బీహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి తెలిపారు. రూ.5 లక్షల వరకూ సీనియర్ సిటిజన్ల ఆరోగ్య బీమా, టర్మ్ జీవిత బీమా పాలసీపై జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించాలని సామ్రాట్ చౌదరి బృందం ప్రతిపాదించింది. జనవరిలో మరోమారు మంత్రుల బృందం సమావేశం కానుందని తెలిపింది. గ్రూప్ ఇన్సూరెన్స్, వ్యక్తిగత బీమా పాలసీ లేదా సీనియర్ సిటిజన్ల బీమా పాలసీ తదితర అంశాలపై మరోసారి చర్చిస్తామని పేర్కొంది. బీమా పాలసీల ప్రీమియంలపై జీఎస్టీ తగ్గించడం వల్ల తమ ఆదాయం పడిపోతుందని పలు రాష్ట్రాల ఆర్థిక మంత్రులు అభ్యంతరం వ్యక్తం చేశారని చౌదరి తెలిపారు. రూ.5 లక్షలు దాటిన ఆరోగ్య బీమాపై 18 శాతం జీఎస్టీ రేటు యధాతథంగా కొనసాగనుంది. దీంతో సామాన్యులకు మరోసారి నిరాశే ఎదురైంది.

జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణకు సంబంధించి ఏర్పాటైన మంత్రుల బృందం 148 వస్తువుల రేట్లను హేతుబద్ధీకరించాలని ప్రతిపాదించింది. అందులో సిగరెట్లు, శీతలపానీయాలు, పొగాకు ఉత్పత్తులు ఉన్నాయి. ప్రస్తుతం వీటిపై ఉన్న 28 శాతం జీఎస్టీని 35 శాతానికి చేర్చాలన్న కీలక ప్రతిపాదనపై కౌన్సిల్‌లో చర్చించినట్టు సమాచారం. స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లపై విధిస్తున్న 18 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించేందుకు ఫిట్‌మెంట్ కమిటీ ప్రతిపాదించింది. దీనిపై నిర్ణయం వాయిదా వేయాలని కౌన్సిల్ భావించింది. పెట్రోల్, డీజిల్ చిన్న కార్లపై ప్రస్తుతం ఉన్న 12 శాతం జీఎస్టీని 18 శాతానికి పెంచాలని నిర్ణయం తీసుకుంది. పాత ఎలక్ట్రిక్ వాహనాలకు కూడా ఇది వర్తిస్తుంది. ప్రస్తుతం పెద్ద కార్లకు 18 శాతం జీఎస్టీ వర్తిస్తోంది. ఇప్పుడున్న జీఎస్టీతో 5, 12, 18, 28 పన్ను శ్లాబులు ఉన్నాయి. కొత్తగా 35 శాతం శ్లాబ్‌ను తీసుకురావాలని మంత్రుల బృందం ప్రతిపాదించింది. హానికర ఉత్పత్తులకు ఈ శ్లాబు రేటును వర్తింప జేయాలని పేర్కొంది. ఫోర్టిఫైడ్ బియ్యంపై జీఎస్టీ 5 శాతానికి తగ్గించాలని కౌన్సిల్ నిర్ణయించింది. జన్యు చికిత్సలకు పన్ను మినహాయింపునిచ్చింది. రుణ గ్రహీతలపై బ్యాంకులు, బ్యాంకింగేతర విత్త సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు) వేసే జరిమానాలపై జీఎస్టీని ఎత్తివేశారు.

పంట సాయంపై సలహాలు, సూచనలు ఇవ్వండి

- కోతలు విధిస్తామని తాము చెప్పలేదు
- శాసనసభ నిర్ణయం మేరకే 'రైతు భరోసా' :

'రైతు భరోసా' పై స్వల్పకాలిక చర్చలో మంత్రి తుమ్మల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



పంట పెట్టుబడి సాయం అందించే విషయంలో సలహాలు, సూచనలు ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శాసనసభ్యులను కోరారు. రైతు భరోసా'లో కాంగ్రెస్ ప్రభుత్వం కోతలు విధిస్తున్నట్టు ప్రతిపక్ష సభ్యులు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అందులో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. శనివారం హైదరాబాద్ లోని శాసనసభలో రైతు భరోసాపై స్వల్పకాలిక చర్చను ఆయన ప్రారంభించారు. 'మేం ఇచ్చిన నోట్‌లో రైతు భరోసాపై ఏమీ చెప్పలేదు. గత ప్రభుత్వంలో జరిగిన విధి, విధానాలే సభ ముందు ఉంచాం. బీఆర్ఎస్ చెప్పిందే అమలు చేయాలనే ఆలోచన వారికి ఉంది. ఏ పంటకు ఎంత ఇస్తామనేది ఇంకా నిర్ణయించలేదు. అది తప్పుడు ప్రచారమే. సభలో సభ్యుల సూచనల తర్వాతే నిర్ణయిస్తాం. పత్తి, చెరుకుకు ఏం చేయాలనేది సభ్యులు చెబితే దానిపై చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ప్రజలు, సభ్యుల అభిప్రాయం ప్రకారం విధి,విధానాలను నిర్ణయిస్తాం' అని చెప్పారు. కాంగ్రెస్ సభ్యులు విజయరమణారావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో క్వింటాల్‌కు 15 కేజీల తరుగు తీసి రైతులను దోపిడీ చేశారని విమర్శించారు. సన్న ధాన్యానికి బోనస్ ఇచ్చిన రైతులను ఆదుకుంటున్నదని చెప్పారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇస్తున్నామని తెలిపారు. రైతు రుణమాఫీ విషయంలో బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తున్నదని విమర్శించారు. పెద్దపల్లి నియోజకవర్గంలో 72శాతం మందికి రుణమాఫీ పూర్తి అయిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైస్‌మిల్లర్లతో కుమ్మక్కై వేలకోట్లు దోచుకుందని ఆరోపించారు. రైతు బంధు సర్వరోగ నివారిణి అన్నట్టు ప్రచారం చేశారని తెలిపారు.

అందరికీ రైతు భరోసా ఇవ్వాల్సిందే..

- కోతలు పెట్టి భూమితో ఉన్న అనుబంధాన్ని తుంచేస్తారా?

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



రాష్ట్ర ప్రభుత్వ విధానం చూస్తుంటే రైతు భరోసాకు కోతలు పెట్టే సూచనలు కనిపిస్తున్నాయని మాజీ మంత్రి కేటీఆర్ అనుమానం వ్యక్తం చేశారు. సాగు విస్తీర్ణం, పంటల ఉత్పత్తిని పెంచేందుకు అందరికీ రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని శాసనసభలో రైతు భరోసా స్వల్పకాలిక చర్చపై ఆయన మాట్లాడారు. పాన్‌కార్డు, ఐటీ చెల్లిస్తున్న వారికి, పోడు రైతులకు, పత్తి, కంది పంటల కాల పరిమితి ఎనిమిది నెలలు కాబట్టి వారికి రైతు భరోసా ఇస్తారా? కోత పెడతారా? చెప్పాలని డిమాండ్ చేశారు. వారికి భూమితో ఉన్న అనుబంధాన్ని తుంచేస్తారా? అని ప్రశ్నించారు. రైతు భరోసా స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందుకు రైతుబంధుపై కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు ప్రచారం చేసిందని విమర్శించారు. రైతు పచ్చబడితే కొందరికి కండ్లు ఎర్రబడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాత బాగుపడితే కొందరు ఓర్వలేకపోయారని చెప్పారు. వందల ఎకరా లున్న రైతులకు, పెద్ద రైతులకు పెట్టుబడి సాయం ఇచ్చామని తమపై దుష్ప్రచారం చేశార న్నారు. 'నూటికి 95శాతం మంది చిన్న సన్నకారు రైతులే ఉన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం తెలంగాణలో 91.33 శాతం మంది లబ్దిదారులు ఐదెకరాలు అంతకంటే తక్కువ ఉన్నవారే. 7.28 శాతం మంది ఐదు నుంచి 10 ఎకరాల మధ్య ఉన్నారు. పదెకరాలపై ఉన్నవారు కేవలం 1.39 శాతమే. 25 ఎకరాలున్నవారు 0.9 శాతం' అని అన్నారు. రూ.72 వేల కోట్లు రైతుబంధులో పెద్ద రైతులకు ఇచ్చింది 1.39 శాతం మాత్రమేనని వెల్లడించారు. అందులో 80శాతం మంది లబ్దిదారులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన వారే ఉన్నారని తెలిపారు. అందులో బీసీలు 54 శాతం, ఎస్సీలు 13శాతం, ఎస్టీలు 13 శాతం ఉన్నారనీ, 70 శాతం రైతుబంధు పైసలు వారి ఖాతాల్లో పడ్డాయన్నారు. 4.5 లక్షల ఎకరాల ఆర్వోఎఫ్ఆర్ భూములను గిరిజనులకు ఇచ్చామన్నారు. ఆ భూముల్లో ఒక్క పంట మాత్రమే పండుతుందనీ, వారికిచ్చే పంటసాయంలో కోత పెట్టొద్దని ఆయన సూచించారు.

రాజీనామాకు సిద్ధం

వంద శాతం రుణమాఫీ జరిగినట్టు నిరూపిస్తే స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేసి వెంటనే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని కేటీఆర్ ప్రభుత్వానికి కేటీఆర్ సవాల్ విసిరారు. రుణమాఫీ కోసం రూ. 49,500 కోట్లు చెప్పి చివరకు రూ. 26వేల కోట్లకు పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. రుణమాఫీ చేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌలు రైతుకు, భూయజమానికి రైతుబంధు ఇస్తామన్నారు. తప్పకుండా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రైతుభరోసాకు బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు కేటాయించారనీ, 70 లక్షల మంది రైతన్నలకు రూ. 23 వేల కోట్లు కావాలని గుర్తు చేశారు. రైతుబంధు కోతలకు సిద్ధపడ్డ తర్వాతనే కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారని ఆరోపించారు. మంత్రివర్గ ఉపసంఘం వేసి టైంపాస్ చేస్తున్నారని విమర్శించారు. వానకాలం రైతుబంధు ఎగ్గొట్టినట్టే...యాసంగికి కూడా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండారెడ్డిపల్లి, కొడంగల్, సిరిసిల్ల పోదామా? ఏ ఒక్క ఊర్లో అయినా 100 శాతం రుణమాఫీ జరిగినట్టు నిరూపించాలని సవాల్ విసిరారు.

బీఆర్ఎస్ ఎల్పీ మొత్తం రాజీనామా చేస్తాం

24 గంటల కరెంట్ ఇస్తున్నట్టు చూపెడితే, బీఆర్ఎస్ శాసనసభాపక్షం మొత్తం రాజీనామా చేస్తామని కేటీఆర్ చెప్పారు. రైతు భరోసా స్వల్పకాలిక చర్చ సందర్భంగా 24 గంటల కరెంట్ ఇస్తున్నట్టు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యలను ఆయన తిప్పికొట్టారు. సభ వాయిదా వేసి అందరం నల్లగొండ పోదాం.. ఈ రోజు ఒక్క లాగ్‌బుక్‌లో అయినా 24 గంటల కరెంట్ ఇస్తున్నట్టు చూపెడితే, బీఆర్ఎస్ శాసనసభా పక్షం మొత్తం రాజీనామా చేస్తామని మంత్రి కోమటిరెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. నల్లగొండ జిల్లా అభివృద్ధిపై కూడా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.



25, 26 తేదీల్లో రాష్ట్రంలో ఉపరాష్ట్రపతి పర్యటన

- ఉన్నత స్థాయి అధికారులతో సీఎస్ సమీక్ష

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఈ నెల 25,26న రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్ల పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శనివారం రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపరాష్ట్రపతి తన పర్యటనలో భాగంగా 25న మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికి ఐసీఏఆర్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శిస్తారనీ, అక్కడే సేంద్రీయ విధానంలో సాగు చేస్తున్న 500 మంది రైతులతో ముఖాముఖిలో పాల్గొంటారని సీఎస్ తెలిపారు. అదే రోజు రాత్రి కన్హా శాంతివనంలో బస చేస్తారని పేర్కొన్నారు. ఉప రాష్ట్రపతి పర్యటన జరిగే రెండు రోజుల పాటు బ్లూ బుక్ ప్రకారం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రంగా రెడ్డి, మెదక్ జిల్లా కలెక్టర్‌లు, ఉప రాష్ట్రపతి కార్యాలయంతో, రాష్ట్రంలోని అన్ని విభాగాల ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుని పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలీసు శాఖ పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్, బందోబస్తు చేయాలని డీజీపీకి సూచించారు. ఈ పర్యటనలో సరిపడా వైద్య సిబ్బందితో వైద్య సౌకర్యాలు కల్పించాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. భారత ఉపరాష్ట్రపతి ప్రయాణించే దారిలో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బీ శాఖకు సూచించారు. అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఎండీని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ విభాగం తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ నెల 26న ఆయన ఉదయం ఢిల్లీకి తిరుగు ప్రయాణమయ్యే వరకు సంబంధిత విభాగాల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశించారు. సమావేశంలో డీజీపీ జితేందర్, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి, టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఎండీ ముషారఫ్ అలీ, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ హరీష్, ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకట్ రావు, రంగా రెడ్డి, మెదక్ జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

కోమటిరెడ్డి బ్రదర్స్ ప్రజాశాంతి పార్టీలో చేరండి

- కేటీఆర్ తప్పులు చేస్తే అరెస్టు చేయండి..

రాజకీయ కక్షతో కాదు : ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఏ.పాల్

నవతెలంగాణ-నల్లగొండ

కోమటిరెడ్డి బ్రదర్స్ ప్రజాపార్టీలో చేరాలని ఆ పార్టీ అధ్యక్షులు డాక్టర్ కెఏ.పాల్ అన్నారు. వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ తరపున యువ అభ్యర్థులను బరిలో దింపనున్నట్టు వెల్లడించారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సీఎం కాగల వ్యక్తి అని, కానీ కాంగ్రెస్ పార్టీలో కోమటిరెడ్డి బ్రదర్స్‌కు అన్యాయం జరుగుతోందని అన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ ప్రజాశాంతి పార్టీలో చేరాలని, వారు రేవంత్ రెడ్డికన్నా వెయ్యిరెట్ల బలం కలిగిన సీనియర్ నాయకులని అన్నారు. ఒక బ్రదర్ సీఎం క్యాండిడేట్ అయితే, తమ్ముడు హెూమ్ మినిస్టర్ క్యాండిడేట్ కలిగిన, వాళ్లకు ఇంత బలం ఉన్నా నల్లగొండ జిల్లాకు చేసిందేమీ లేదని విమర్శించారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి సొంత జిల్లాలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, దేవరకొండ నుంచి నల్లగొండ రోడ్డు మార్గం చూస్తే వీరి పాలన ఎలా ఉందో ప్రజలకు తెలిసిపోతుందన్నారు. గత ప్రభుత్వాలు శంకుస్థాపన చేసిన వాటిని ప్రారంభం చేసి తామే చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం గప్పాలు కొడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి బ్రదర్స్ ఆర్ ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. నల్లగొండను దత్తత తీసుకుంటా అన్న కేసీఆర్ కనుమరుగైపోయారన్నారు. కేటీఆర్ తప్పులు చేస్తే అరెస్టు చేయాలని, కానీ రాజకీయ కక్షతో కాదని చెప్పారు. అంతకంటే ముందు వందల మంది తప్పులు చేసిన, వారు మోసం చేసిన వారు ఉన్నారని, వాళ్లను రేవంత్ రెడ్డి ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక లక్ష కోట్ల అప్పు చేసిందని తెలిపారు. ఆర్ఆర్ ట్యాక్స్ కట్టని వారి 432 బిల్డింగులను హైడ్రా పేరుతో కూల్చారని, పర్మిషన్లు ఇచ్చిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను, ఇంజినీర్లను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి గురు శిష్యులని, ఎవరి పాలన బాగుందంటే ఎవరు మర్డర్ బాగా చేశారు.. అని అడిగినట్టుందని ఎద్దేవా చేశారు. ఆర్.కృష్ణయ్య లాంటి మంచి నేత కూడా బీజేపీకి సపోర్ట్ చేయడం బాధాకరమని అభిప్రాయపడ్డారు.

రవాణా అధికారులకు పోస్టింగులు

- విజిలెన్స్ జేటీసీగా మామిండ్ల, అడ్మినిస్ట్రేషన్‌కు శివలింగయ్య
- ఏస్టీఏ డీటీసీగా అఫ్రీన్ సిద్దిఖీ, రంగారెడ్డి డీటీసీగా సదానందం



నవతెలంగాణ-సిటీబ్యూరో

రవాణాశాఖలో జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్లుగా, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్లుగా ఉద్యోగోన్నతులు పొందిన అధికారులకు ఎట్టకేలకు పోస్టింగులిచ్చారు. శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జేటీసీలుగా ప్రమోషన్ పొందిన మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్‌కు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఐటీ, శివలింగయ్యకు అడ్మినిస్ట్రేషన్, ప్లానింగ్ జేటీసీగా పోస్టింగ్ ఇచ్చింది. అలాగే, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లుగా ఉద్యోగోన్నతులు పొందిన రవీందర్ కుమార్(ఆదిలాబాద్ డీటీసీగా), ఎస్.వాణి(నల్లగొండ), అఫ్రీన్ సిద్దిఖీ కమిషనర్ కార్యాలయం(హైదరాబాద్),కిషన్ (మహబూబ్‌నగర్), సదానందం(రంగారెడ్డి)కు డీటీసీలుగా పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

రైతులకు సమాజం రుణపడి ఉంటుంది

- వ్యవసాయ విద్య, వృత్తి చాలా గొప్పది : రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి
- ముగిసిన వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలు

నవతెలంగాణ-రాజేంద్రనగర్



రైతులకి, వ్యవసాయ శాస్త్రవేత్తలు, విద్యార్థులకు సమాజం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి అన్నారు. అందరికీ అన్నం పెట్టేది రైతులు, వ్యవసాయ రంగమేనని అటువంటి విద్యని, వృత్తిని ఎన్నుకున్న వారిని అందరూ అభినందించాలన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం ఉదయం 'విద్యార్థులు-విద్యావేత్తలు- పరిశ్రమల ప్రతినిధుల మధ్య' చర్చాగోష్టిని రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వ్యవసాయ విద్యార్థీ వృత్తిలో భాగంగా మూడు అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రైతాంగంలో ధనిక, మధ్యతరహా, సన్న చిన్న కారు రైతులు ఉంటారని వారందరికీ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. రైతాంగంలో అధిక శాతం మంది పేదరికంలోనే ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అదే సమయంలో వ్యవసాయంలో ఏ ఆవిష్కరణ ప్రవేశపెట్టినా దానివల్ల ఉత్పత్తి, ఉత్పాదకతల పెరుగుదల ఉండాలని, అది సుస్థిరతకు అవకాశం కల్పించాలన్నారు. ఇతర దేశాల వ్యవసాయానికి మన దేశ వ్యవసాయానికి చాలా అంతరాలు ఉన్నాయని, మన పరిస్థితులకు తగ్గట్టుగా విధానాలు ఉండాలని చెప్పారు.

కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ డి.రాజిరెడ్డి మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల్ని, వర్షపాత అంతరాలని తట్టుకొని వ్యవసాయం చేయడం అనేది ప్రధానాంశమని అన్నారు. తెలంగాణలో వరి, పత్తి సాగు అధికంగా ఉందన్నారు. ఉద్యాన పంటలు, కూరగాయలు, పౌల్ట్రీ, పశుసంవర్ధనం వైపు వైవిధ్యీకరణ జరగాలని అన్నారు. అందుకు సంబంధించిన ప్రణాళికపై తమ విశ్వవిద్యాలయం కృషి చేస్తోందన్నారు. అదేవిధంగా వ్యవసాయ యాంత్రీకరణ, మార్కెటింగ్ సదుపాయాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. కొన్నేండ్లుగా ఎరువులు, పురుగు మందుల వినియోగం అధికమవడం బాధాకరమని, దీన్ని కట్టడి చేయాల్సిన అవసరముందని అన్నారు. వ్యవసాయ విద్యార్థుల నుంచి కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు వచ్చేలా శాస్త్రవేత్తలు, అధ్యాపకులు ప్రోత్సహించాలని సూచించారు.

ఈ సదస్సులో 'మారుతున్న వాతావరణానికి అనుగుణంగా వ్యవసాయ ఆహార వ్యవస్థల పరిణామం' అన్న అంశంపై ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ ప్రిన్సిపల్ క్లైమేట్ చేంజ్ స్పెషలిస్ట్ అంచా శ్రీనివాసన్ కీలకోపన్యాసం చేశారు. రానున్న రోజుల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయం అత్యుత్తమ ర్యాంక్‌ని సాధించాలని ఆయన అభిలాషించారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకొనేందుకు స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రణాళికలు అమలు చేయాలన్నారు. కొత్త సవాళ్లు ఎదుర్కొనేందుకు అవసరమైన వ్యూహాల్ని రూపొందించడంలో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వంటి సంస్థలది కీలకపాత్ర అన్నారు.

మల్లన్న సాగర్ కెనాల్‌లో పడి మామా అల్లుళ్ల మృతి

- చేపల వేటకు వెళ్లగా ఘటన

నవతెలంగాణ-కొండపాక

చేపల వేటకు వెళ్లిన మామా అల్లుళ్లు ప్రమాదవశాత్తు మల్లన్నసాగర్ కెనాల్‌లో పడి మృతి చెందారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండల పరిధిలోని మంగోల్ గ్రామ శివారులో శనివారం జరిగింది. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లన్నసాగర్ ముంపు గ్రామమైన పల్లెపహాడ్‌కు చెందిన గొడుగు శివకుమార్(30) కుకునూరుపల్లి గ్రామంలో నివాసముంటున్నాడు. వీరింటికి శుక్రవారం రాయపోల్ మండలం ఎలికంటి గ్రామానికి చెందిన అతని మామ గడ్డమీది కిష్టయ్య(52) వచ్చాడు. మధ్యాహ్న భోజనం అనంతరం మామాఅల్లుళ్లు కలిసి చేపల కోసం మల్లన్నసాగర్ కెనాల్‌కు వెళ్లారు. రాత్రి అయినా వారు ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు, బంధువులు కెనాల్ వద్దకు వెళ్లి చూశారు. అక్కడ వారి ద్విచక్ర వాహనం, దుస్తులు కనిపించాయి. దీంతో వారు కెనాల్‌లో పడి మృతి చెంది ఉంటారని పోలీసులకు సమాచారం అందించారు. కుకునూరుపల్లి ఎస్ఐ అక్కడికి చేరుకొని స్థానికులతో కలిసి కెనాల్‌లో గాలింపు చేపట్టారు.ఇద్దరి మృతదేహాలను బయటకు తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

నవతెలంగాణ
ఎల్బీనగర్ - మహేశ్వరం
ఆదివారం | డిసెంబర్ 22, 2024 | www.navatelangana.com



ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని కర్మన్ ఘాట్ పరిధిలోని శ్రీ చైతన్య పాఠశాలలో డాక్టర్ శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శనివారం గణిత శాస్త్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం సతీష్, ఆర్ఐ రవీందర్ రెడ్డి, ప్రిన్సిపల్ ఫణి మాధవి, వైస్ ప్రిన్సిపల్ సుందర్ సింగ్, ప్రాథమిక కార్యనిర్వాహ అధికారి లక్ష్మీ గణిత శాస్త్ర ఉపాధ్యాయులు, వాణి, సునీత, శ్వేత, శిరీష, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - చంపాపేట్

సర్కారు చెట్టును నరికిన అపార్ట్మెంట్ నిర్వాహకుడు

సుమారు 10 ఏండ్ల చెట్టు నరికివేత



నవతెలంగాణ - హయత్‌నగర్

ఒక్క పక్క రోజు రోజుకూ వాతావరణంలో కాలుష్యం పెరుగుతుంటే.. ప్రయివేటు నిర్వాహకులు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెట్లను నరికి వేస్తున్నారు. అయినా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో చెట్లు నరకడం మరింత ఎక్కువ అవుతుందనే చెప్పవచ్చు. హయత్ నగర్‌లోని వసంత నగర్ కాలనీలో ఓ అపార్ట్మెంట్ బిల్డర్ సర్కారు చెట్టును శనివారం నరికివేశారు. ఆ చెట్టు నాటి సుమారు 10 ఏండ్లు కావస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై సంబంధించిన అధికారులకు అనుమతి కోసం దరఖాస్తు పెట్టుకోగా అనుమతి రాలేదని సమాచారం. మరి అధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి మరి.

సమస్యలపై ఎర్ర జెండా పోరాటం ఆగదు



కాషాయానికి కాలం చెల్లింది

రాజ్యంగా బద్ధమైన పదవిలో ఉండి అంబేద్కర్ పై అనుచిత వాఖ్యలు చేయడం సిగ్గుచేటు

సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగుడాల యాదయ్య, బోడ సామేల్

నవతెలంగాణ - అబ్దుల్లాపూర్ మెట్

ప్రజా సమస్యలపై ఎర్ర జెండా చేసే పోరాటం ఎప్పటికీ ఆగదని సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగుడాల యాదయ్య, బోడ సామేల్ లు అన్నారు. సీపీఐ(ఎం) పార్టీ 3వ మండల మహా సభలను శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు విజయవాడ జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగుడాల యాదయ్య, బోడ సామేలు మాట్లాడుతూ.. దేశంలో ప్రజా స్వామ్యం కూని అయిందని, ప్రపంచం మేధావి బాబా సాహెబ్ అంబేద్కర్ పట్ల పార్లమెంట్ సాక్షిగా అమిత్ షా అనుచిత వాఖ్యాలు చేయడం దారుణమన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కుల, మత కల్లోలు పెచ్చు మీరుతున్నాయని ఆరోపించారు. దళిత, మైనార్టీల మీద దాడులు చేస్తూ మతం సెంటిమెంట్‌ను ప్రజలకు రుదుతూ బీజేపీ ప్రభుత్వం తన రాజకీయ అధికారాన్ని కాపాడుకుంటుందని ఆరోపించారు. కార్మిక, రైతు చట్టాలను, అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కించపరుస్తూ.. అవహేళన చేస్తూ అమిత్ షా మాట్లాడం సిగ్గుచేటని అన్నారు. వెంటనే అమిత్ షాను మంత్రి వర్గం నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ లో భూ సమస్యలు చాలా ఉన్నాయన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలో భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాల కోసం పోరాటం చేపట్టనున్నట్లు తెలిపారు.

మండల నూతన కార్యవర్గం కమిటీ ఎన్నిక..

అనంతరం మండల నూతన కార్యవర్గం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా ఏర్పుల నర్సింహ, సభ్యులుగా గుండె శివకుమార్, పరకాల ముత్యాలు, ఆలేటి ఆటం, పారంద శ్రీను, బి.సరిత, ఇరుగు బిక్షపతి, చిర్ర శివ, మేడిపల్లి శ్రీశైలం ఉన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం)పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ కారత్, జిల్లా కమిటీ సభ్యులు డి.కిషన్, గుండె శివ, మండల కమిటీ నాయకులు ముత్యాలు, సరిత, శీను, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ మార్కెట్‌ను

అవుటర్ రింగ్ రోడ్డుకు తరలిస్తాం

రైతు సంక్షేమం కోసం పనిచేస్తున్న సర్కార్.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



నవతెలంగాణ - దిల్‌సుఖ్‌నగర్

హైదరాబాద్ మార్కెట్‌ను అవుటర్ రింగ్ రోడ్డుకు తరలిస్తామని తెలంగాణ ప్రభుత్వ నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం సమావేశానికి శనివారం మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ మార్కెట్‌ను అన్ని సౌకర్యాలతో ఆధునికరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పని చేస్తుందని చెప్పారు. రైతు రాజ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం రాజీపడకుండా ముందుకు పోతుందని స్పష్టం చేశారు. రైతులకు నేరుగా రుణాలను మాఫీ చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదే అని కొనియాడారు. ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్ మార్కెట్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. మౌలిక సదుపాయాలు తాగునీరు, భూగర్భ డ్రైనేజీ, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ సౌకర్యం తదితర సౌకర్యాలు కల్పించడానికి నిధులు మంజూరు చేస్తున్నారు. ప్రధానంగా రైతులకు విశ్రాంతి గదులు, పంట తాజాదనం పోకుండా కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. 1980 సంవత్సరంలో నిర్మించిన షెడ్లు నేటికీ అవే కొనసాగుతున్నాయని వివరించారు. వాటిని ఆధునీకరించి మరి కొన్ని షెడ్లను అదనంగా నిర్మిస్తామన్నారు. మార్కెట్ లో సమస్యలు తీవ్ర స్థాయిలో ఉన్నాయని, వాటి పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా కృషి చేస్తానన్నారు.



మాజీ పార్లమెంటు సభ్యులు మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ మలక్‌పేట ప్రాంతంలో తన బాల్యం గడిచిందని గుర్తు చేసుకున్నారు. మార్కెట్ అభివృద్ధితో పాటు రైతుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. మార్కెట్ కమిటీ నూతన ఛైర్మెన్ చెకోలికర్ లక్ష్మి శ్రీనివాస్ మాట్లాడుతూ 1980లో 42 ఎకరాలను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. 1991 నుంచి మార్కెట్ క్రయవిక్రయాలు జరుగుతున్నాయని వివరించారు. అయితే నలభై ఏళ్ల క్రితం నిర్మించిన మార్కెట్ నేటికీ కొనసాగుతోందని పేర్కొన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పెరిగిన వ్యాపార క్రయవిక్రయాలు కారణంగా మార్కెట్‌కి ఒక మూడు వందల ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. వైఎస్ ఛైర్మెన్ కోట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ కుమార్‌తో సుదీర్ఘ కాలంగా ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కరోనా సమయంలో తన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు నేలపాటి రామారావు, బుడ్డ సత్యనారాయణ, పాశం అశోక్ గౌడ్, పన్నాల రాజేందర్ రెడ్డి, షకీల్, శివాజీ, ప్రత్యూష, కృష్ణ, జగదీష్ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ చిలుక నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి జాలె వెంకటరెడ్డి, అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించిన మేయర్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 19వ డివిజన్‌లోని గాయత్రీనగర్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి శనివారం స్థానిక కార్పొరేటర్ రామోజీ అమిత శ్రీశైలం చారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయటం కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కారం చేయడంలో పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారీగా పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రామోజీ శ్రీశైలం చారి, కాలనీ వాసులు లక్కీశెట్టి మనోహర్, దనేశ్వర్ రెడ్డి, భాను, సుధాకర్, కాలనీ వాసులు మహిళలు పాల్గొన్నారు.

నూతన వార్డు అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి



నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వార్డు అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి సూచించారు. 29మంది వార్డు అధికారులు తమ తమ జాయినింగ్ రిపోర్టును బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం కమిషనర్ సరస్వతికి అందచేశారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన గ్రూప్ ఫోర్త్ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించి విధుల్లో చేరుతున్న వార్డు అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి, సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఇంకా ప్రజా సేవలో సమయ పాలన పాటించి.. ప్రజలకు అందుబాటులో ఉండి, సేవ చేయాలని సూచించారు. జిల్లా అధికారుల ఆదేశం మేరకు తమ బాధ్యతలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సరస్వతి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, మేనేజర్ నాగేశ్వర్ రావు, ఆర్ఓ. వేణుగోపాల్ రెడ్డి, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను

విమర్శించే స్థాయి మజ్లిస్‌కు లేదు

షర్ఫుద్దీన్ హామీద్



నవతెలంగాణ- బడంగ్‌పేట్

రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే.. ఆ పార్టీతో తన స్వార్థ ప్రయోజనాల కోసం వారితో జత కట్టడం మజ్లిస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని బీఆర్ఎస్ జల్‌పల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హామీద్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో అధికారంలో ఉన్న సమయంలో పదేండ్లలో బీఆర్ఎస్ పార్టీని, మాజీ సీఎం కేసీఆర్‌ను దేశ్ క నేతని పొగడ్తలతో ముంచెత్తిన మజ్లిస్ పార్టీ.. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన కొద్ది రోజుల్లోనే అధికార కాంగ్రెస్ పార్టీతో జతకట్టి, బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పాతబస్తీలో కుటుంబ పాలన సాగిస్తున్న మజ్లిస్ పార్టీకి బీఆర్ఎస్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. గత ఆరు దశబ్దాల నుండి పాతబస్తీపై ఏకఛత్రాధిపత్యం చెలాయిస్తున్న ఎంఐఎం పార్టీ పాతబస్తీలోని ముస్లింల అభివృద్ధి కోసం ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. పాతబస్తీలోని ముస్లింలు ఆర్థికంగా, విద్యాపరంగా వెనకబాటుకు గురైతే మరోపక్క ఓవైసీ కుటుంబం ఆస్తులు వేలకోట్లకు ఎలా పెరిగాయనీ, అందుకు వారు సమాధానం చెప్పాలన్నారు. నగరం అన్ని రంగాలలో అభివృద్ధి చెందితే పాత బస్తిలోని నియోజక వర్గాలలో నేటికీ ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవకాశ వాద రాజకీయాలు చేస్తున్న ఆ పార్టీనీ ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. అవకాశ వాద రాజకీయాలను వదలివేసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో

కళాకారుల పాత్ర ఎంతో కీలకం

టెస్కాబ్ వైస్ ఛైర్మెన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ ఛైర్మెన్ కొత్తకుర్మ సత్తయ్య



నవతెలంగాణ-తుర్కయంజాల్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కళాకారుల పాత్ర ఎంతో కీలకం అని టెస్కాబ్ వైస్ ఛైర్మెన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ ఛైర్మెన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన తెలంగాణ ఉద్యమ కళాకారుల ఆత్మగౌరవ రాష్ట్ర సదస్సుకు తుర్కయంజాల్ నుంచి ఉద్యమకారులు, కళాకారులు తరలివెళ్లారు. ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి ఆద్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో కళాకారులకు ఘనస్వాగతం పలికారు. అంబేద్కర్ విగ్రహానికి పులమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొత్తకుర్మ సత్తయ్య మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఆట, పాటలతో ప్రజలను చైతన్య పరిచిన ఘనత కళాకారులదన్నారు. ఉద్యమ సమయంలో కళాకారులు లేకుండా ఏ కార్యక్రమం జరిగేది కాదన్నారు. అలాంటి కళాకారులను ప్రభుత్వాలు విస్మరించడం సరికాదన్నారు. కళాకారులకు, ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కోశాధికారి బచ్చిగళ్ల రమేష్, ఉద్యమకారులు కారింగుల నరేందర్, నక్క జంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తు విద్యతోనే సాధ్యం



ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ ఛైర్మెన్ కృష్ణ కుమార్

నవతెలంగాణ-చంపాపేట్

యువత ఉజ్వల భవిష్యత్ విద్యతోనే సాధ్యమని ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ ఛైర్మెన్ కృష్ణకుమార్ అన్నారు. హైదరాబాద్ జిల్లా మలక్‌పేట్ నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాల ఎంఈసిఎస్ ప్రాంగణంలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా



నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ ఛైర్మెన్ ఎం. కృష్ణ కుమార్, ఎంఈసిఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. హనుమంత రావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, ఎంఈసిఎస్ పూర్వ విద్యార్థుల సమావేశం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ సమావేశంలో కళాశాలలోని అన్ని హెచ్ఓడీలు, ఫ్యాకల్టీ సభ్యులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత శాస్త్ర దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-హయత్‌నగర్

శ్రీనివాస్ రామానుజన్ జయంతిని పురస్కరించుకుని గణిత శాస్త్ర విభాగం జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపల్ డా. సురేష్ బాబు మాట్లాడుతూ.. శ్రీనివాస్ రామానుజన్ గణిత శాస్త్రంలో సృష్టించిన అద్భుతమైన విషయాలను, అతని జీవితాన్ని కళాశాల విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఉన్నత విద్యను అభ్యసించి సమాజ శ్రేయస్సుకు తోడ్పడాలని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ గణిత శాస్త్ర విభాగ అధిపతి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్రానికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. గణిత విశ్లేషణ, అనంత శ్రేణులు, సంఖ్యాశాస్త్రములలో ఎన్నో పరిశోధనలు చేశారని, నిరంతర పరిశోధనల వల్ల కలిగిన శ్రమ వలన ప్రతికూల వాతావరణ పరిస్థితుల ప్రభావం వలన చాలా తీవ్రమైన పరిశ్రమ చేసి 32 పరిశోధనా పత్రాలు సమర్పించాడని, తీవ్రమైన అనారోగ్యంతో ఉన్నప్పుడు కూడా వారి గురువైన జి. హెచ్. హార్డీకి 1729 సంఖ్య యొక్క ప్రత్యేకతను తెలియజెప్పి ఆయన్ను ఆశ్చర్య చకితున్ని చేశారని గుర్తుచేశారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలు అయిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ డా. బకరం నరసింహ, అధ్యాపకులు అవెస్, మక్ల, మధు, డా.బాల నరసింహ, విద్యాసాగర్, డా. అపర్ణ చతుర్వేది, రమాదేవి, దుర్గాప్రసాద్, డా.వెంకటేశ్వర్లు, డా. యాదగిరి రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ఎంతో కృషి

భాగ్యనగర్ రైతు సహకార సంఘం బ్యాంకు ఛైర్మెన్ మర్రి నర్సింహారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

రైతుల ఆర్థికాభివృద్ధి, సంక్షేమానికి భాగ్యనగర్ రైతు సహకార సంఘం బ్యాంకు ఎంతో కృషి చేస్తుందని భాగ్యనగర్ రైతు సహకార సంఘం బ్యాంకు ఛైర్మెన్ మర్రి నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలోని భాగ్యనగర్ రైతు సేవ సహకార సంఘం బ్యాంకు కార్యాలయం ఆవరణంలో ఛైర్మెన్ మర్రి నరసింహారెడ్డి అధ్యక్షతన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు రైతుల ఆర్థికాభివృద్ధి కోసం అనేక రకాల విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ రుణాలను మంజూరు చేసి రైతుల సంక్షేమానికి తోడ్పాతునందించడం జరుగుతుందన్నారు.



రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పేద రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మెన్ బంగారు బాబు, మాజీ ఛైర్మెన్ పెత్తుల్ల పుల్లా రెడ్డి, డైరెక్టర్లు తోట ప్రతాప్ రెడ్డి, కందా జ్యోతి, ఎల్చల సుదర్శన్ రెడ్డి, తిరుపతి గిరిరాజ్, పెద్దబావి మోహన్ రెడ్డి, బ్యాంక్ మేనేజర్ ఎలైస్ రిబెక్, సంఘ సీ.ఈ.ఓ పిండి నారాయణ రెడ్డి, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు బంజారా సంఘం 10వ వార్షికోత్సవం

నవతెలంగాణ-చంపాపేట్

సేవాలాల్ బంజారా సంఘం 10వ వార్షికోత్సవాన్ని నేడు నిర్వహించనున్నట్టు సేవాలాల్ బంజారా సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సక్రి బాయి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర హైదరాబాద్ జిల్లా యాకుత్ పురా నియోజకవర్గం సైదాబాద్ మండలం పరిధిలోని సింగరేణి కాలనీ ఆవరణలో సక్రి బాయి ఆధ్వర్యంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవాలాల్ బంజారా సంఘం పదో వార్షికోత్సవ మహాసభకు మహిళలు భారీ ఎత్తున బంజారా వేషధారణతో ర్యాలీగా తరలిరావాలని కోరారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మోతిలాల్ నాయక్ పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్రంలో వివిధ జిల్లాల నుండి భారీ ఎత్తున మహాసభకు వస్తున్నారని సక్రిబాయి అన్నారు. గిరిజన హక్కులను, రిజర్వేషన్లు, బంజారా భాష లిపిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని కోరారు. ఈ సమావేశంలో మహిళా సంఘం నాయకులు శాంతి బాయి, సరిత భాయి, సుశీల బాయి, వల్లి బాయి, టైలర్ శాంతి, దేవి బాయి, అలి వేల బాయి, శారదా బాయి, సరోజ, జయమ్మ పాల్గొన్నారు.



విజ్ఞాన ప్రదర్శనతో సృజనాత్మకత పెంపొందుతుంది

● కాంగ్రెస్ తూంకుంట మున్సిపల్ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి



నవతెలంగాణ-శామీర్‌పేట

విద్యార్థులలో సృజనాత్మక, ఆలోచనశక్తి పెంపొందడనికి సాంస్కృతిక విజ్ఞాన ప్రదర్శన దోహదపడుతుందని కాంగ్రెస్ తూంకుంట మున్సిపల్ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి అన్నారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ సెంట్ మేరీస్ పాఠశాలలో శనివారం సంస్కృతిక విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యమానికి భీమిడి జైపాల్‌రెడ్డి హాజరయ్యారు. సంస్కృతిక విజ్ఞాన ప్రదర్శనను ప్రారంభించి, వివిధ స్టాల్స్‌ను సందర్శించి విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో రామాలయం మాజీ ధర్మకర్త నర్సింహ రెడ్డి, పాఠశాల డైరెక్టర్ నీరజా, కరెస్పాండెంట్ మైఖేల్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీరప్పగడ్డలో కెమెరా ప్రారంభం



నవతెలంగాణ-ఉప్పల్

బీరప్పగడ్డ వెల్ఫేర్ అసోసియేషన్ వారి సహకారంతో జీవీపీ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన కెమెరాను శనివారం డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్, డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులుతో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బస్తీల్లో బీరప్పగడ్డ వెల్ఫేర్ అసోసియేషన్ పాత్ర అభినందనీయమన్నారు. బస్తీ వాసులకు చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తూ కాంట్రిబ్యూషన్ ద్వారా కెమెరాను ఏర్పాటు చేసినందుకు అభినందించారు. అనంతరం బీరప్ప గడ్డలోని పలు చెత్త డంపింగ్ అయ్యే ప్రాంతాలను సందర్శించారు. రెగ్యులర్‌గా మానిటర్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీరప్ప గడ్డ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కోకొండ జగన్, ప్రధాన కార్యదర్శి పిట్టల రామచందర్, అసోసియేషన్ సభ్యులు, శానిటేషన్ సూపర్వైజర్ జగన్, వారి సిబ్బంది, తదితరులున్నారు.

పేరేంట్స్ మీటింగ్‌లో పాల్గొన్న కార్పొరేటర్ ప్రభుదాస్



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ మండలంలోని తిరుమలానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి ఇష్టంగా ముందుకొస్తున్నారని అన్నారు. తల్లిదండ్రులకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని కోరారు. పాఠశాలలో మౌలిక వసతులపై, విద్యార్థుల ప్రగతి సామర్థ్యాలపై, రక్షిత మంచినీటి సరఫరా, విద్యార్థుల భద్రత సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు చర్చించారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల ఆరోగ్యం, క్రమశిక్షణ, పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని సూచించారు. బాలికల సంరక్షణపై ఉపాధ్యాయులతో తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు జానకి, కుమారి, దేవీ, కవిత మరియు సిబ్బంది, స్థానిక నాయకులు ఉల్లెం బాలరాజు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ స్వాధీనం చేసుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలి : తాడూరి గగన్‌కుమార్

నవతెలంగాణ-కాప్రా

కాప్రా సర్కిల్ ఏఎస్‌రావు నగర్ డివిజన్ పరిధిలోని జై జవాన్ కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ ను స్వాధీనం చేసుకోకుండా దోబూచులాడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు సాధన సమితి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ తాడూరి గగన్ కుమార్ కోరారు. ప్రజాపాలనలో భాగంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ విషయ మై గతంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే అధికా రులు షాపింగ్ కాంప్లెక్స్‌ను స్వాధీనం చేసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం కల్లబొల్లి కబుర్లు చెబుతూ మాటలు చెబుతూ దాటవేస్తున్నారని అన్నారు. 2013లో అప్పటి ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి నియోజకవర్గ అభివృద్ధి నిధులతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ లో 10 కమర్షియల్ షెటర్స్‌పై వస్తున్న ఆదాయం జీహెచ్‌ఎంసీ కాప్రా సర్కిల్ కోల్పోతుందని తెలిపారు. ఎల్బీ నగర్ జోనల్ కార్యాలయం ఆదేశాల ప్రకారం కాప్రా సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ అధికారులు 10 షాపింగ్ కాంప్లెక్స్‌ను స్వాధీనం చేసుకునేందుకు ఆదేశించినట్టు తెలిపారు. తదుపరి నివేదికను జీహెచ్‌ఎంసీ ఎస్టేట్ ఆఫీసర్ కు సమర్పించాలని సూచించినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు ఆదేశించి రెండు నెలలు అయినా చర్యలు తీసుకోకపోవడంపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్టు గగన్ కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని, అద్దెలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు.

బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడిగా సంజీవ



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపల్ శివారెడ్డి గూడకు చెందిన మేడబోయిన సంజీవను బీసీ సంక్షేమ సంఘం ఘట్కేసర్ మండల అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోపు బాలరాజు యాదవ్ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నివాసంలో సంజీవను సన్మానించి ఆర్.కృష్ణయ్య నియామక పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బీసీల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఎమ్మెల్యే మర్రి నివాసంలో అయ్యప్ప మహా పడిపూజ

● పాల్గొన్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నివాసంలో శనివారం అయ్యప్ప మహా పడి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే కుమారుడు మర్రి ధీరన్‌రెడ్డి కన్య స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన మహా పడిపూజకు బీఆర్ఎస్ కార్పొరేటర్లు హాజరయ్యారు. ఉదయం నుంచి అయ్యప్ప స్వామికి అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అయ్యప్పను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తి గీతాలు పాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం భారీ ఎత్తున అన్నదానం చేశారు.

నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ - చర్లపల్లి

నాచారం పరిధిలోని 33/11కేవీ ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం 10 గంటల నుండి మధ్యాహ్నం 01:00 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ అంతరాయం కలుగు ప్రాంతాలు:

11 కేవీ సాయిబాబా టెంపుల్ ఫీడర్ పరిధిలో అన్నపూర్ణ కాలనీ, రాఘవేంద్ర నగర్ 11 కేవీ రామ్ రెడ్డి ఫీడర్ పరిధిలో దుర్గానగర్, బాబానగర్, నాచారం విలేజ్, ఎర్రకుంట, అంబేద్కర్ నగర్, కమల బాయ్ నగర్, హనుమాన్ నగర్, సావర్కర్ నగర్, రామ్ రెడ్డి నగర్, జనప్రియ అపార్ట్మెంట్స్, శ్రీ రామ్ నగర్ 11కేవీ వైజయంతి ఫీడర్ పరిధిలో కౌండిన్య నగర్, వైజయంతి థియేటర్ మెయిన్ రోడ్డు, రవీంద్ర నగర్ 11 కేవీ గౌతమి పైప్స్ ఫీడర్ పరిధిలో రోడ్డు నెంబర్ 1, 16, ఐడిఏ నాచారం 11కేవీ సూరన నాచారం ఇండోర్ ఫీడర్ పరిధిలో సుప్రభాత స్కూల్, బాబా నగర్ ఐస్ ఫ్యాక్టరీ ఏరియా, సూరన ఇండస్ట్రీస్, రోడ్డు.2 ఐడిఏ నాచారం, అకాడమిక్ హెయిట్స్ స్కూల్ ఏరియా 11కేవీ కాకతీయ కర్షక్ ఫీడర్ పరిధిలో కాకతీయ కర్షక్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ 11కెవి శాంతి గార్డెన్ ఫీడర్ పరిధిలోశాంతి గార్డెన్ అపార్ట్మెంట్స్ , ఇందిరా నగర్, కాంక్రీట్ ప్లాజా, అపార్ట్మెంట్స్ చుట్టుపక్కల ప్రాంతం 11కేవీ కార్తికేయ నగర్ ఫీడర్ పరిధిలో కార్తికేయ నగర్, వీర రెడ్డి నగర్, నాచారం మెయిన్ రోడ్డు విద్యుత్ సరఫరాలలో అంతరాయం కలుగుతుందన్నారు.

మల్లాపూర్ పరిధిలో: ఏఈ కె.నాగరాజు

33/11కేవీ మల్లాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఆదివారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ సరపరలో అంతరాయం కలుగుతుందని మల్లాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ అధికారి కె.నాగరాజు తెలిపారు. విద్యుత్ అంతరాయం కలుగు ప్రాంతాలు. 11కేవీ బిఈఎల్ ఫీడర్ పరిధిలోని మల్లాపూర్ పారిశ్రామిక ప్రాంతం, 11 కేవీ సాయి నగర్ ఫీడర్ పరిధిలోని మల్లాపూర్ ఇండస్ట్రియల్ ఏరియాలో విద్యుత్ సరఫ సరపరలో అంతరంగ కలుగుతుందన్నారు.

చర్లపల్లి పరిధిలో: ఏఈ బాబురావు

చర్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 01:00 వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగుతుందని విద్యుత్ అధికారి బాబురావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆఫీసర్స్ కాలనీ, వెంకట్ రెడ్డి నగర్, పుకట్ నగర్, చర్లపల్లి గ్రామం, మధుసూధన్ రెడ్డి నగర్, పెద్దచర్లపల్లి ఏరియా, చిన్న చర్లపల్లి, అంబేద్కర్ నగర్, నేతాజీ నగర్, వి ఆర్ కాలనీ, డీసీ కాలనీ, లక్ష్మీనగర్, విద్యామారుతీ నగర్, చర్చి నగర్, ఆర్ జికె, యుడిఎ ఫేజ్ ఏరియా ప్రాంతంలో విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందన్నారు.

యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ



నవతెలంగాణ-మేడ్చల్

యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని సంస్థ నిర్వాహకులు తారకేశ్వరరావు తెలిపారు. శనివారం హైదరాబాద్, మేడ్చల్ పట్టణానికి చెందిన పలువురు సంస్థ సభ్యులు శ్రీశైలం నల్లమల్ల అడవి ప్రాంతంలో ఉంటున్న గిరిజన ఆదివాసి ప్రజలు, విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, స్టేషనరీ సామగ్రి, సోలార్ లైట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా శీతాకాలం సందర్భంగా చలికి కప్పుకోవడానికి వీలుగా వారికి దుప్పట్లు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, వారి పిల్లల ఆరోగ్యం కోసం బలవర్ధక పోషక ఆహార పదార్థాలను అందించినట్లు వాలంటీర్లు తెలిపారు.



మేడ్చల్ కోర్టులో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

● హైకోర్టు న్యాయమూర్తి అభినందన్ కుమార్ శావలి

● రూ.90 లక్షలతో కోర్టు అదనపు భవనాల నిర్మాణానికి శంకుస్థాపన





నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ కోర్టులో త్వరితగతిన అన్ని రకాల సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి అభినందన్ కుమార్ శావలి అన్నారు. శనివారం ఆయన మేడ్చల్ పట్టణంలోని కోర్టు సముదాయంలో రూ.90లక్షల నిధుల వ్యయంతో చేపట్టే అదనపు కోర్టు భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కోర్టు ప్రాగణంలో మొక్క నాటి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేడ్చల్ కోర్టులోనే అన్నిరకాల కోర్టులు ఉండేలా కోర్టు భవనాల నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందన్నారు. కోర్టులో అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి కొంత సమయం పడుతుందని తెలిపారు. మేడ్చల్ కోర్టులోనే అన్నిరకాల కోర్టులు ఉండేలా కోర్టు భవనాలకు భూమి చేశామన్నారు. కోర్టులో అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి కొంత సమయం పడుతుందని చెప్పారు. అత్వెల్లిలోని కోర్టును మేడ్చల్ కోర్టుకు తరలిచేందుకు అదనపు గదులు నిర్మించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు చీదు హన్మంత్ రెడ్డి వారిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జిల్లా కోర్టు జడ్జి బాల భాస్కర్ రావు, సెకండ్ అడిషనల్ జిల్లా కోర్టు జడ్జి జీవన్ కుమార్,అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్,ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి లావణ్య, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దిలీప్ కుమార్, మూడవ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి హేమలత,జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, మేడ్చల్ డీవిజన్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి,సీఐ అద్దాని సత్యనారాయణ,బార్ అసోసియేషన్ అధ్యక్షులు చీదు హన్మంత్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి,సీనియర్, జూనియర్ న్యాయ వాధులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రపతి పర్యటన విజయవంతంలో అధికారుల పాత్ర భేష్



● మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనను విజయవంతం చేయడంలో జిల్లా స్థాయిలోని అన్ని శాఖల అధికారుల పాత్ర ఎంతో అభినందనీయమనీ, వారు ఎంతో బాధ్యతాయుతంగా వారి వారి విధులను నిర్వహించారని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. రాష్ట్రపతి శీతాకాల విడిది శనివారంతో ముగియడంతో ఆమె ఢిల్లీకి బయల్దేరిన అనంతరం కలెక్టర్ గౌతమ్ మాట్లాడారు. రాష్ట్రపతి ఈ నెల 17వ తేదీన హకీంపేట విమానాశ్రయానికి చేరుకొన్నప్పటి నుంచి 5 రోజుల పాటు తిరిగి వెళ్ళేంత వరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఒకరినొకరు సమన్వయం చేసుకుంటూ ఎంతో బాధ్యతాయుతంగా తమ విధులు నిర్వహించారనీ, పర్యటన విజయవంతంలో వారి భాగస్వామ్యం ఎంతగానో ఉందని అభినందించారు. రాష్ట్రపతి రానున్న నేపథ్యంలో ఆయా శాఖల అధికారులకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో ఎంతో కృషి చేశారని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది, జిల్లా రెవెన్యూ శాఖ, సమాచార, రహదారులు, విద్యుత్, అటవీ శాఖ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, సివిల్ సప్లయి, అగ్నిమాపక శాఖతో పాటు అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పని చేయడం వల్లే రాష్ట్రపతి పర్యటన విజయవంతంగా ముగిసిందనీ, ఈ విషయంలో పర్యటన ప్రారంభం నుంచి మొదలుకుని ముగిసేంత వరకు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించిన అధికారులు, సిబ్బంది అందరికీ కలెక్టర్ గౌతమ్ అభినందనలు తెలిపారు.

ఉప్పల్ ఎన్‌ఎస్‌ఎల్ యాజమాన్యం భారీ మోసాలు..!

● అందమైన బ్రోచర్లు చూసి మోసపోయిన ప్రజలు

● ప్లాట్ల కోసం రెండు కోట్లు వసూల్ .. సౌకర్యాలు మాత్రం నిల్

● యాజమాన్యం తీరను నిరసిస్తూ ఆందోళన



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ ఎస్ఎస్ఎల్ యాజమాన్యం పేరు గొప్ప ఊరు దిబ్బ అనే చందంగా మారింది. అందమైన రూపురేఖలు చూపించి, అందమైన, లోకం అంటూ బ్రోచర్లు చూపించి ప్రజల నుండి కోట్ల రూపాయలు వసూలు చేసి, ఎలాంటి సౌకర్యాలు లేకుండా అసంపూర్తిగా ఉన్న భవనాలను నిర్మించి ప్రజలకు విక్రయించారు. దీంతో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో శనివారం ఈస్ట్ కౌంటీ వద్ద ప్లాట్ల నిర్వాసితుల ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు రమణ, మంజుల, సత్యవాణి, సాత్వికులు మాట్లాడుతూ.. అపార్టుమెంట్‌లో కనీస సౌకర్యాలు కల్పించకుండా విక్రయాలు చేస్తున్నారని ఆరోపించారు. నామమాత్రపు సదుపాయాలతో విక్రయాలు చేసి కోట్లు దండుకున్నారని వాపోయారు. గత పాలకులకు కోట్లలో డబ్బులు ఇచ్చి అక్రమ అనుమతులు పొందారని ఆరోపించారు.

అనుమతుల విషయంలోనూ పలు ఆరోపణలు..

ఉప్పల్ పారిశ్రామిక వాడలో స్థలాన్ని రెసిడెన్షియల్‌గా జోన్‌గా మార్చి అక్రమంగా విక్రయాలు చేశారని అన్నారు. అపార్టుమెంట్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో గదులలో లీకేజీలు, సెల్లార్లలో లీకేజీలు తలెత్తుతున్నాయన్నారు. కనీసం రోడ్డు సౌకర్యాలు కూడా లేవని, ప్లాట్ విక్రయించేటప్పుడు చెప్పిన వాటిలో ఏ ఒక్కటీ కల్పించలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడున్న సిబ్బంది తమ గోడును యాజమాన్యంతో చెప్పడం లేదని, వారూ పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా యాజమాన్యం తమ సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

నాగారం సెరినిటీ పాఠశాలలో మ్యాథ్స్ పోటీలు

నవతెలంగాణ-కీసర

నాగారం సెరినిటీ పాఠశాలలో మ్యాథ్స్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సెరినిటి మోడల్ హైస్కూల్ పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి మాట్లాడుతూ.. మ్యాథ్స్ చాంపియన్ ఇలాంటి పోటీలు విద్యార్థులలో అంతర్గతంగా నిమిడీకృతమై ఉన్న జ్ఞానాన్ని వెలికితీసి వారిలో నూతన ఉత్తేజం కలుగ జేస్తాయన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించిన గణిత ఉపాధ్యాయుడు ఉపేంద్రరెడ్డిని అభినందించారు. అనంతరం విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఉపేంద్ర రెడ్డి మాట్లాడుతూ.. ఐపిల్ క్రికెట్ మాదిరిగా విద్యార్థులను 10జట్లుగా (మ్యాథ్స్ స్నైపర్స్, మ్యాథ్స్ పైరేట్స్, మ్యాథ్స్ వారియర్స్, మ్యాథ్స్ డిఫెండర్స్, మ్యాథ్స్ మేట్స్, మ్యాథ్స్ టైటాన్స్, యూనిక్ మ్యాథర్స్, మ్యాథ్స్ చాలెంజర్స్, మ్యాథ్స్ సూపర్ కింగ్స్, మ్యాథ్స్ మెజీషియన్స్) విభజించి, రోజుకు మూడు పోటీలుగా మొత్తం 20 రోజులు 60 పోటీలు అనగా డిసెంబర్ 1తేది నుండి డిసెంబర్ 20 వతేది వరకు జరిగాయని తెలియజేశారు. ఈ మ్యాథ్స్ పోటీలు అన్ని హెూరాహెూరీగా జరిగాయన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో మ్యాథ్స్ చాలెంజర్స్ పై మ్యాథ్స్ పైరేట్స్ జట్టు అత్యున్నత ప్రతిభను కనబర్చి విజేతగా నిలిచి 2024-25 మ్యాథ్స్ చాంపియన్ షిప్ అందుకున్నారు. బహుమతి ప్రదానోత్సవంలో విశేషమైన నైపుణ్యం చూపించిన విద్యార్థులను పాఠశాల ముఖ్యకార్యదర్శి నోముల వసంత మనసారా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రేషన్ డీలర్ల సమస్యలపై అసెంబ్లీలో మర్రి పస్తావన



● కృతజ్ఞతలు తెలిపిన డీలర్లు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

రేషన్ డీలర్లు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. రేషన్ డీలర్ల సమస్యలపై పూర్తి అవగాహన తోనే అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. అసెంబ్లీలో రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో శనివారం మల్కాజిగిరి, ఉప్పల్ నియోజకవర్గాల రేషన్ డీలర్లు బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్రి రాజశేఖర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో వందకు పైగా రేషన్ షాపులు ఉన్నాయని, రేషన్ డీలర్ల కుటుంబాలకు ప్రభుత్వం నుండి అందుతున్న కమిషనే జీవనాధారమనీ, వారి కష్ట, నష్టాలను, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన మొదటి ఎమ్మెల్యేగా మర్రిని రేషన్ డీలర్లు అభివర్ణించారు. అన్ని వర్గాల సమస్యలపై స్పందిస్తూ బాధ్యతగా చట్టసభల మాట్లాడడని గర్వకారణం అన్నారు. రాజకీయాలకు అతీతంగా సేవలందించడమే కాకుండా, అరుంధతి హాస్పిటల్ ద్వారా రాష్ట్ర నలుమూలల నుండి వస్తున్న ఎంతో మంది పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలందిస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డి లాంటి వారు ప్రజాక్షేత్రంలో ఉండడం మల్కాజిగిరి ప్రజలు చేసుకున్న అదృష్టమని రేషన్ డీలర్లు అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ.. సంబంధిత మంత్రి ఉత్తమ్ కుమారెడ్డి సానుకూలంగా స్పందించడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపరచిన విధంగా రేషన్ డీలర్లకు అదనగా ఇస్తానన్న ఐదు వేల రూపాయలను కూడా అందిస్తే రేషన్ డీలర్ల కుటుంబాలకు కొంతమేరకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు ఉప్పల సంతోష్ కుమార్, ఠాకూర్ రమేష్, అశుతోష్, కృష్ణ, మధు, బాల్ రెడ్డి, రాహుల్, సంజీవ రావు, శివ కుమార్, సత్తి, రామచందర్, కృష్ణ, సూరం శంకర్, మల్లికార్జున్, తదితరులు ఉన్నారు.

ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నా..

● కౌన్సిలర్ లావణ్య హన్మంత్‌రెడ్డి



నవతెలంగాణ - మేడ్చల్

మేడ్చల్ మున్సిపాలిటీ కౌన్సిలర్‌గా ఎన్నికైనప్పటి నుండి ప్రజల సంక్షేమం, అభివృద్ధి కొరకే నిరంతరం కృషి చేస్తున్నాని కౌన్సిలర్ వంగేటి లావణ్య హన్మంత్ రెడ్డి తెలిపారు. శనివారం మున్సిపల్ పరిధిలోని వార్డులో తన వారిలో రూ.17లక్షలతో చేపట్టిన రోడ్డు పనులకు చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ గత ఐదేండ్లుగా తనను ఎన్నుకున్న ప్రజల కొరకు అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజీ లేకుండా పని చేశానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ రెడ్డి,హన్మంత్ రెడ్డి,రఘుపతి రెడ్డి, అనిల్ రెడ్డి, భిక్షపతి గౌడ్, బల్వంత్ రెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ ఆహార ఉత్సవ కార్యక్రమం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తెలంగాణ ఆహార ఉత్సవ కార్యక్రమాన్ని ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్, హెచ్ఎం అంబటి సురేష్‌తో కలిసి ప్రారంభించారు. అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రవీందర్ రాజు స్టాల్స్‌ను సందర్శించి విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఫుడ్ ఫెస్టివల్ సందర్భంగా విద్యార్థులు 40 స్టాల్స్‌ను ఏర్పాటు చేసి వివిధ ఆహార పదార్థాలను తయారు చేశారు. ఆహార పదార్థాలను రూ.10 చొప్పున విక్రయించి వారి లాభాలను బేరీజు వేసుకున్నారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల చైర్మెన్ లక్ష్మీ, కాలనీ అధ్యక్షులు సత్యమూర్తి, నాయకులు బాబు, బ్రహ్మయ్య, రాము, కిషోర్, గోపి, జగదీష్ పూర్వ విద్యార్థి ప్రతాప్, పాఠశాల ఉపాధ్యాయులు పాపి రెడ్డి, మల్లేశ్వరి, వేణుగోపాల్, కిష్టయ్య, కళ్యాణి, స్వాతి, వాణి, సునేత్రి, తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ ట్రిప్‌లో విద్యార్థులకు అవగాహన

● సీఐ సత్యనారాయణ



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ విద్యార్థులకు పోలీసుల విధులు, బాధ్యతలు, సీసీ కెమెరాలు పర్యవేక్షణ, నగర సంరక్షణ ఏ విధంగా చేస్తారు.. సంరక్షణ ఏ విధంగా చేస్తారో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కొండల్, గణేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ది పింక్ సర్కిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళల కోసం మెగా హెల్త్ క్యాంపు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ది పింక్ సర్కిల్ ఫౌండేషన్ వారు ట్రికార్డర్ డయాగ్నస్టిక్స్ వారి సహకారంతో మహిళలకు అతి తక్కువ ధరలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ నిర్వాహకులు కోరారు. ఆదివారం ఉదయం 10 గంటల నుండి సాయంకాలం నాలుగు గంటల వరకు సైనిక్ నగర్ ఆర్కే పురంలోని టీపీసీఎఫ్ కార్యాలయంలో అతి తక్కువ ధరలలో ప్యాకేజీ ద్వారా మహిళలకు కావాల్సిన అన్ని వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

అయ్యప్ప పూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్మెన్ కొండల్ రెడ్డి



నవతెలంగాణ - పోచారం

పోచారం మున్సిపల్ పరిధి చౌదరిగూడలోని అకిటి శ్రీరామ్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో పోచారం మాజి ఉప సర్పంచ్ అకిటి బాల్‌రెడ్డి నిర్వహించిన అయ్యప్ప స్వామి పూజలో పోచారం మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 150 మంది స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. అనంతరం చైర్మెన్ మాట్లాడుతూ.. ఆ స్వామి వారి ఆశీస్సులు మున్సిపల్ ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్‌తో పాటు కౌన్సిలర్లు అకిటి శైలజ, సామల శ్రీలత బుచ్చిరెడ్డి, గొంగాళ్ళ మహేష్, మెట్టు బాల్ రెడ్డి, సుర్వి రవీందర్ గౌడ్, సుర్వీ సుదలక్ష్మి శ్రీనివాస్ గౌడ్, నాయకులు బద్దం జగన్మోహన్ రెడ్డి, మేనేజర్ అంజన్ రెడ్డి, ఏఈ మహిపాల్ భక్తులు పాల్గొన్నారు.

ఫైర్ ఫ్రీ కుకింగ్ పై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో ఫైర్ ఫ్రీ కుకింగ్ కాంపిటీషన్‌ను ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన ఆహారాన్ని ఎలా చేయాలనే దానిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్స్, విద్యార్థుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కూకట్‌పల్లి

శనివారం రోజు క్యాంపు కార్యాలయములో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేతుల మీదుగా.. మూసాపేట్ డివిజన్‌కు చెందిన జి.సత్తయ్యకి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు అయిన రూపాయలు ఒక లక్ష యాభై వేల రూపాయల చెక్కును అందచేశారు.



హుజూరాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి జన్మదినం సందర్భంగా.. శేర్లింగంపల్లి నియోజకవర్గ ముఖ్య నాయకులతో కలసి కౌశిక్ రెడ్డికి, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు కొండాపూర్‌లోని ఆయన నివాసంలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, కేక్ కట్ చేయించారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

నిరుపేదలకు సీఎం సహాయ నిధి వరం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పేద ప్రజలకు సీఎంఆర్‌ఎఫ్ ఆర్థిక సహాయం చెక్కులను మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ శనివారం అందజేశారు. నిరుపేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. అనారోగ్యంతో కార్పొరేట్‌లో వైద్యం చేపించుకున్న ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని శ్రీశైలం గౌడ్ తెలిపారు. ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన అలీం ఉద్దీన్ అన్సారీ రూ.60,000, తలారి సంపత్ రూ.60,000, డి.లక్ష్మీ, రూ.12,500, టీ.కమల, రూ.20,500, రూ 60,000, సంబశివా రావు, రూ.55,000లకు చెక్కులను మాజీ ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో దుర్గారావు, చాంద్ భాషా, మల్లం శ్రీను, గుబ్బల రమణ, నరేందర్, రజాక్, చోటు, తోకల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి అండగా నిలుస్తుంది...

కేపీహెచ్‌బీ: అపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి అండగా నిలుస్తుందని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అల్లాపూర్ డివిజన్‌కు చెందిన జైనథ్ సుల్తానాకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి రూ. 32,500ల చెక్కును శనివారం బండి రమేష్ చేతుల మీదుగా బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సీఎం సహాయ నిధి నిరు పేదలకు వరమన్నారు. అర్హులైన వారు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బండికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, అస్లాం, రాజేందర్, కిట్టు, నరేందర్, అరుణ్, పర్వేజ్, రవి తదితరులు పాల్గొన్నారు.



సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో

పూర్వ విద్యార్థుల సదస్సు..



నవతెలంగాణ-మేడ్చల్

సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. కళాశాలలో చదివి వివిధ ఉద్యోగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు నోస్టాలజియా 2024 పేరుతో స్పెక్ ఏన్షియన్స్ ఆధ్వర్యంలో.. పూర్వ విద్యార్థులు కలుసుకొని వారు చదువుకున్న ప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని వారికి విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను సన్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని జరుపుకోవడం ఒక శుభ పరిణామము అని సూచించారు. సమ్మేళనానికి వచ్చిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ వివిధ హెూదాల్లో ఉన్న మీరు మీ జూనియర్స్‌కు ఉద్యోగ అవకాశాలు సంపా దించడానికి ఎలాంటి కోర్సెస్ కంప్లీట్ చేయాలి ఎలాంటి పరిజ్ఞానం కలిగి ఉండాలి వాటి మీద అవగాహన కల్పించిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.కె.శ్రీలత మాట్లాడుతూ కళాశాలలో చదివి వివిధ హెూదాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకోవడం అభినందనీయం అని కొనియాడారు. జనరల్ సెక్రెటరీ ఠాగూర్ అభిషేక్ సింగ్, పిఆర్ఓ.రవి, సుధాకర్ పూర్వ విద్యార్థులు అధ్యాపకులున్నారు.

నిజాంపేట జర్నలిస్టు కాలనీ సంక్షేమ సంఘం

అధ్యక్షుడిగా తన్నీరు శ్రీనివాస్



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట జర్నలి స్టు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సీనియర్ పాత్రి కేయుడు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం జర్నలిస్టు కాలనీలోని చర్ల ఎల్లమ్మ దేవాలయ ప్రాంగణంలో కాలనీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశంలో కాలనీ సభ్యుల అందరి ఆమోదం మేరకు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, జర్నలిస్టు కాలనీ ఫౌండర్ ప్రెసిడెంట్, టీయూడబ్ల్యూజే -143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శిఅస్కాన్ని మారుతి సాగర్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా టీయూడబ్ల్యూజే జిల్లా నాయకుడు కొలిపాక వెంకట్, కోశాధికారిగా ఓర్సు లింగస్వామి ఎంపికయ్యారు. అసోసియేషన్ సలహాదారులుగా సీనియర్ జర్నలిస్టులు గుంటూరు శేఖర్, దామర జగదీశ్వర్ గుప్తా, ఉద్దం డపురం వెంకటేష్, సిరిగిరి శ్రీనివాస్, ఈనాడు నరసిం హలు వ్యవహరిస్తారు. కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా ముక్కర్ల లాలయ్య, నాగేంద్ర చారి, ఉపాధ్యక్షులుగా దేవేంద ర్ గుప్తా, శ్రీనివాస్, రాము యాదవ్, మల్లికార్జున్, జాయింట్ సెక్రెటరీలుగా కృష్ణ, మారుతి కుమార్, కె వి సత్యనారాయణ, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ కాలనీలోని ప్రధాన సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి కృషి చేస్తానని అన్నారు.

100 రోబోటిక్ విప్పల్ శస్త్రచికిత్సలతో ప్రయివేటు హాస్పిటల్ కిమ్స్..



- కృష్ణా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కిమ్స్, హైదరాబాద్‌లోని ప్రముఖ మల్టీ-స్పెషాలిటీ హాస్పిటల్స్లో ఒకటి. అత్యంత క్లిష్టమైన ప్యాంక్రియాటిక్ క్యాన్సర్లను 100 రోబోటిక్-సహాయక విప్పల్ తోటి శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేసిన భారతదేశంలో మొదటి ప్రయివేట్ హాస్పిటల్‌గా పేరుపొందిందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కిమ్స్ నిర్వహించిన 100 రోబోటిక్ శస్త్ర చికిత్సల్లో 14 నుంచి 80 ఏండ్ల వయసు కలిగినవారు అధికమన్నారు. వీరంతా హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్ పరిసర ప్రాంతాలకు చెందినవారన్నారు. డాక్టర్ మధు దేవరశెట్టి, సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్, కిమ్స్, హైదరాబాద్ వారు ఈ 100 రోబోటిక్ శస్త్రచికిత్సల మైలురాయిని సాధించిన వైద్య బృందానికి నాయకత్వం వహించారన్నారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ..అత్యంత అరుదైన, సంక్లిష్టమైన ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ కేసులలో ముఖ్య సమస్యలు అధిగమించుటకు, త్వరితంగా కోలుకోవటానికి తాము శస్త్రచికిత్సల కోసం రోబోటిక్ టెక్నాలజీని ఉపయోగించామన్నారు. దీనివలన చాలా మంది రోగులు శస్త్ర చికిత్స తర్వాత ఐదవ రోజున డిశ్చార్జ్ అయ్యి త్వరలో వారి సాధారణ జీవితాలను గడిపే అవకాశం కలిగింది అన్నారు.

మూసాపేట్ జనతా నగర్‌లో క్రైస్ట్ గ్రాస్పెల్ చర్చి వద్ద నిర్వహించిన, సెమీ క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథులుగా మూసాపేట్ మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్ కుమార్,పగడాల బాబు రావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, జిల్లా గోపాల్, పాండు, అక్బర్, అరుణ్, పాల్గొన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి



మహిళా సఫాయి కర్మచారీల కోసం..

అంతరంగిక కమిటీలు ఏర్పాటు చేయాలి





- వేధింపులు ఆపాలి, సమస్యలను పరిష్కరించాలి
- జాతీయ ఎస్సీ, ఎస్టీ, సఫాయి కర్మచారి కమిషన్ చైర్మెన్ ఎం.వెంకటేసన్

నవతెలంగాణ-సిటీబ్యూరో

మహిళా సఫాయి కర్మచారీల కోసం అంతరంగిక కమిటీలను ఏర్పాటు చేసి వారికి ఏమైన వేధింపులు, సమస్యలు ఉంటే వెంటనే కమిటీల ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ, సఫాయి కర్మచారి కమిషన్ చైర్మెన్ ఎం.వెంకటేసన్ తెలిపారు. శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమా వేశ మందిరంలో సఫాయి కర్మచారి జిల్లా స్థాయి సమీక్షా సమా వేశానికి హాజరైన వెంకటేసన్‌ను జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్ పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మెన్ మాట్లాడుతూ సఫాయి కర్మచారీ లకు ఏవైనా సమస్యలుంటే ముందుగా అధికారులకు తెలియ జేయాలనీ, పరిష్కారం కాకుంటే యూనియన్ దృష్టికి తీసుకు రావాలనీ, అక్కడా పరిష్కారం కాకుంటే కమిషన్‌కు ఫోన్ చేసి తెలిపాలని కమిషన్ ఫోన్ నెంబర్ 01124648924 ను సభా ముఖంగా సఫాయి కర్మచారీలకు తెలిపారు. జిల్లాలోని ప్రతి మున్సిపాల్టీ సఫాయి కర్మచారీలను వేదిక వద్దకు పిలుచుకుని వారికి జీతం సరిగా వస్తుందా..? ఏమైనా కోతలు విధిస్తున్నారా..? అని అడిగి వారి ఫోన్‌లో జీతం పడిన తేదీలను, జీతం మొత్తాన్ని పరిశీలించారు. కొంతమంది కర్మచారీలకు తక్కువ జీతం పడటంతో సదరు మున్సిపల్ కమిషనర్‌ను వివరాలను అడిగి తెలుసుకున్నారు. సఫాయి కర్మచారీలకు యూనిఫాం, ఐడీ కార్డులు, నెలలో 4 రోజుల సెలవులు వంటి వారి హక్కులను తెలియజేస్తూ, నెలకొకసారి వారిని కలుసుకుని సమస్యలను తెలుసుకో వాలని లేబర్ కమిషనర్‌ను ఆదేశించారు. సఫాయి కార్మికులకు సబ్బులు, నూనే, గ్లౌజుల వంటి కనీస అవసరాలు అందిచాలని అధికారులకు సూచించారు. మానిటరింగ్ కమీటి సభ్యులు సఫాయి కర్మచారీల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కారించేం దుకు కృషి చేయాలన్నారు. సఫాయికర్మచారీలకు పీఎఫ్, ఈఎస్ఐ ఖాతాల్లో విధిగా జమ చేస్తున్నారా..? అని అడిగి తెలుసుకున్నారు. సఫాయి కర్మచారీలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా వారికి మర్యాద, గౌరవం అందిస్తూ వారితో పనులు చేయించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీఓ శంకర్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మోసిస్ బాబు, సంబంధిత అధికారులు, సఫాయికర్మచారీలు పాల్గొన్నారు.

ఆశాలకు రూ.18వేల వేతనం నిర్ణయించాలి



- ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలి
- ఆశా వర్కర్స్ యూనియన్ బస్సు జాతా పోస్టర్ ఆవిష్కరణ
- తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆశాలకు రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలనీ, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర వ్యాప్త ఆశా వర్కర్ల బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ కమలా నగర్‌లోని సీఐటీయూ కార్యాలంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగి రి జిల్లా కోశాధికారి కె.ఉన్ని కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశాల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. అధికారంలోకి వస్తే బీఆర్‌ఎస్ కంటే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామనీ, ఆశాలకు వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చి, ఆశాల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఆశాల సమస్యలను మాత్రం నేటికీ పరిష్కరించలే దన్నారు. ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు నిర్ణయం చేయాలనీ, ఇతర సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ ఆరోగ్యశాఖ మంత్రి, రాష్ట్ర ఉన్నతాధికారులు, రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలకు, మంత్రులకు అనేకసార్లు వినతిపత్రాల ద్వారా విజ్ఞప్తులు చేయడంతోపాటు నిరంతరం నిరసనలు, పోరాటాలు నిర్వహిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం చలనం లేనట్టు వ్యవహరిస్తున్నదన్నారు. ఈ నేపథ్యంలో ఆశాల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15 నుంచి 31వ తేదీ వరకు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త బస్ జాతా నిర్వహిస్తున్నామనీ, ఈ జతలో ఆశాలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ బస్సు జాతా ఈ నెల 30వ తేదీన జిల్లాకు రానున్నందున ఆశాలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలి పిలుపునిచ్చారు. రేవతి మాట్లాడుతూ ఎన్‌ఆర్‌హెచ్‌ఎం స్కీంలో ఆశా వర్కర్లు 20 ఏండ్లుగా రాష్ట్రంలో మొత్తం 27 వేల మంది ఆశా వర్కర్లు పని చేస్తున్నారనీ, వీరంతా మహిళలు, బడుగు బలహీన వర్గాలకు చెందినవారే ఉన్నారని తెలిపారు. రాత్రనక, పగలనకా నిరంతరం ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నా తక్కువ వేతనమే ఇస్తున్నారని తెలిపారు. ప్రతిరోజు ఉదయం నుంచి రాత్రి వరకు పనిలో ఉండాలనీ, డెలివరీల సమయంలో 2, 3 రోజులు కుటుంబాన్ని వదిలి హాస్పిటల్ వద్ద పడిగాపులు కాస్తున్నామని తెలిపారు. ప్రతీ ఆశాకు 4, 5 కేసులుండాలని టార్గెట్స్ పెట్టి తమను ప్రభుత్వం టార్చర్ చేస్తుందన్నారు. ఇంత చాకిరీ చేసినా నేటికీ రాష్ట్ర ప్రభుత్వం తాము అడుగుతున్న రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం మాత్రం నిర్ణయం చేయడం లేదన్నారు. కేవలం రూ.9,900 పనిని బట్టి పారితోషికాలు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలనీ, ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలనీ, జాబ్ చార్ట్ సరైన పద్ధతిలో రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ, విజయ, లలిత, జ్యోతి, కల్పన, రేణుక, అనురాధ, సత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ పథకాలు అందేలా చేయాలి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ప్రజా పాలనలో భాగంగా.. ఆరు పథకాల కొరకు తీసుకున్న దరఖాస్తులో ఆన్ లైన్ ఎంట్రీలు కాక నిరాశతో ఉన్న ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారని కార్పొరేటర్ రోజా దేవి రంగారావు తెలిపారు. శనివారం శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్‌లోని, వీకర్ సెక్షన్ కాలనీ వెంకటేశ్వర్ నగర్‌లో, ఇందిరమ్మ ఇండ్ల పథకం కొరకు.. దరఖాస్తు చేసుకున్న వారిని గుర్తించడం కోసం, సిఓ పాప గౌడ్‌తో కలిసి స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు పరిశీలించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత, ప్రజాపాలన అని దరఖాస్తుల స్వీకరించడం జరిగింది. అందులో ముఖ్యంగా ఆరు గ్యారెంటీలు 420 అమలు చేస్తామని చెప్పి, మహా లక్ష్మి పథకం, గృహలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత, రైతు భరోసా పథకాల కింద దరఖాస్తు చేసుకోమని దరఖాస్తులు తీసుకోవడం జరిగింది. ఇందిరమ్మ ఇండ్లు పథకం ద్వారా ప్రజాపాలన అప్లికేషన్స్ దారులు, అక్కడికి 50మంది వస్తే దాదాపు 30 మంది వరకి ఇందిరమ్మ ఇండ్లు పథకంలో, ఆన్లైన్లో ఎంట్రీ కాలేదని చెప్తున్నారన్నారు. 20 మందిలో ఐదు స్కీంలకి అప్లై చేసుకుంటే ఏదో ఒక స్కీం, రెండు స్కీములు మాత్రమే ఆన్లైన్లో ఎంటర్ అయ్యి ఉన్నాయన్నారు. ఈ విధంగా వివేకానంద నగర్ డివిజన్‌లో అప్లై చేసిన వారిలో 40శాతం కూడా ఎంట్రీ కాలేవు, ప్రభుత్వం వచ్చి సంవత్సరం గడిచిపోతున్నా.. అస్సలు ఇందిరమ్మ ఇండ్లు ఎక్కడ కడుతున్నారు. ఎన్ని కడుతున్నారు. అన్న క్లారిటీ ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని, ఇప్పటికే అప్లై చేసిన ఫామ్‌లో ఎంట్రీలు చేయక ప్రజలు వార్డ్ ఆఫీస్ చుట్టూ తిరుగుతూ.. అలాగే మీరు పెట్టిన జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌కి వెళ్లినా ఎవరు స్పందించడం లేదని, ప్రజలు వాపోతా ఉన్నారు. కావున ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గానీ, మంత్రులు గానీ, స్పందించి మరి ఎవరైతే ఆన్లైన్ ఎంట్రీ కాలేదు. అప్పుడు ఎవరైతే లేనివారు ఉన్నారో, వారందరికీ కూడా అవకాశం ఇచ్చి, ఈ పథకాలు వాళ్ళందరకి కూడా అందించే విధంగా చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. వీలైనంత తొందరగా వీళ్ళకి అవకాశం ఇవ్వకపోతే వీళ్ళ అందరిని తీసుకొని ముఖ్యమంత్రి నివాసం, ఉప ముఖ్యమంత్రి నివసిస్తున్నటువంటి ప్రజా దర్బార్‌కి వెళ్లి ధర్నా చేయడం జరుగుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో వేముల ఆంజనేయులు, జగదీష్ గౌడ్, రాజశేఖర్, రమేష్ రావు, బాబు, రవీందర్రావు, నాగార్జున, భారతి చౌదరి, తానారాం, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మందుల కొరత లేకుండా చేస్తా



- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

సంబంధిత అధికారులతో మాట్లాడి బస్తీ దవాఖానలో మందుల కొరత లేకుండా చేస్తానని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తెలిపారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్ 1లో ఉన్న పల్లె దవాఖానను డివిజన్ కార్పొరేటర్ తనిఖీ చేశారు. వారు అందిస్తున్న వైద్య సేవల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పల్లె, బస్తీ దవాఖాన, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల రూపేనే ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని రోగాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఆల్విన్ కాలనీ ఫేస్ 1లోని పల్లె దవాఖానలో బిపి, షుగర్‌కు సంబంధించిన మాత్రల(టాబ్లెట్స్) కొరత ఉందని డాక్టర్‌తో మాట్లాడిన తరువాత తెలిసిందన్నారు. వెంటనే ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి మాత్రలు తొందరగా వచ్చే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, బి.వెంకటేష్ గౌడ్, కుమార చారి, రాంరెడ్డి, రఘు, నరసింహ రెడ్డి, హేమలత, రాజేందర్, డాక్టర్ సాయి కృష్ణ, ఏ.ఎన్.ఎం శశికళ తదితరులు పాల్గొన్నారు.

జితేందర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ సేవలు హర్షణీయం

- కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారిణి జెమిని కుమారి
- నెహ్రూనగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో హ్యాండ్ రైటింగ్ శిక్షణా శిబిరం సందర్శన
- అకాడమీ డైరెక్టర్ వంపు మల్లయ్యను సన్మానించిన ఎంఈఓ

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

చక్కని చేతిరాత విద్యార్థులకు మంచి మార్కులను సాధించి పెడుతాయని,ఆత్మ స్థైర్యాన్ని పెంపొందిస్తుందని కుత్బుల్లాపూర్ మండల విద్యా శాఖ అధికారిణి జెమిని కుమారి అన్నారు. గాజుల రామారాం డివిజన్ నెహ్రూనగర్‌లో గల జిల్లా పరిషత్ పాఠశాలలో వారం రోజుల నుంచి జితేందర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న శిక్షణా శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. అనంతరం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి ఉచిత చేతిరాత శిక్షణ శిబిరాలు నిర్వహించడం హర్షించదగ్గ విషయం అని అన్నారు. ఈ శిక్షణా శిబిరాన్ని నిర్వహించిన ఆ సంస్థ డైరెక్టర్ వంపు.మల్లయ్యను ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇన్‌చార్జి శ్రీశైలం, జగదీశ్, పాషా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
ఆదివారం | డిసెంబర్ 22, 2024 | www.navatelangana.com

ఘనంగా సుధాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-అంబర్‌పేట

బీఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు పార్టీ కార్యాలయంలో నాయకుల కార్యకర్తల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవరెడ్డి, సుదీర్ రెడ్డి, జనార్దన్, ప్రకాష్ రెడ్డి, జేడీ, రాహుల్, ప్రణీత్ రెడ్డి, దయానంద్, నందు, లక్ష్మి, శిరీషదేవి, రాజశేఖర్, సాయిపూర్ణ, షర్ఫ్, జైదేవ్,రాజేష్ తదితరులు పాల్గొన్నారు

బుక్‌ఫెయిర్‌లో పుస్తకావిష్కరణ



నవతెలంగాణ-ముషీరాబాద్

పాపారావు రాసిన మానవాళికి మహోదయం పుస్తకాన్ని హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో సాధిక్ వేదికపై శాసన మండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్ ఆవిష్కరించారు. సీనియర్ జర్నలిస్ట్ వేణుగోపాల్ పుస్తకాన్ని పరిచయం చేశారు. జర్నలిస్టులు పాశం యాదగిరి, జతిన్, పబ్లిషర్ చంద్రమోహన్ పాల్గొన్నారు.

అవగాహన కోసమే కొత్త టీచర్ల సమావేశం



- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన హెచ్‌టీపీఎఫ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

షేక్‌పేట్ మండలంలో ఈనెల 13న ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశం కేవలం అవగాహన కోసమేనని హైదరాబాద్ టీచర్స్ ప్రొటెక్షన్ ఫోరం(హెచ్‌టీపీఎఫ్) తెలిపింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి ఫోరం నాయకులు వినతి పత్రం అందజేశారు. 2024 డీఎస్సీలో ఎంపికయిన ఉపాధ్యాయులకు పీఏవోఐడీ నంబర్, పాన్ దరఖాస్తు ఎలా చేయాలో వివరించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఎలా అందించాలనే అంశాలపై ఈ సమావేశంతో పాటు భోజన సదు పాయాన్ని ఏర్పాటు చేసినట్టు ఈ సందర్భం గా వారు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్, ఎస్టీయూటీఎస్, పీఆర్టీయూటీఎస్, టీపీటీఎఫ్, టీఎస్‌జీహెచ్ఎంఎ, డీటీఎఫ్, టీఎస్టీయూ, పీఆర్టీయూ టీజీ, టీజీటీఏ, తపస్, ఎంటీయూ, ఆర్‌యూపీపీటీ సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి

- తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో "రాస్తారోకో"



నవతెలంగాణ-సిటీబ్యూరో

కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా హైదరాబాద్ నగరంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఎక్స్ రోడ్‌లో రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర అధ్యక్షులు జె.కుమారస్వామి మాట్లాడుతూ.. 20 ఏండ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో వైద్య ఆరోగ్య శాఖలో అనేక సేవలు, రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ పిలుపులను అమలు చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయడంలో ఇప్పటి వరకు వచ్చిన ప్రభుత్వాలు అన్నీ మోసం చేస్తూనే ఉన్నాయన్నారు. ప్రజాపాలన, ప్రజా ప్రభుత్వం అని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం సైతం గత ప్రభుత్వాల మాదిరి నిర్లక్ష్యం చేయకుండా రెగ్యులర్ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వంతో, రాష్ట్ర మంత్రితో ఇప్పటికే చర్చలు జరిగిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ ఏఎన్ఎంల రెగ్యులరైజేషన్‌పై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఏఎన్ఎం భర్తీ నోటిఫికేషన్ తిరిగి ఈ ప్రభుత్వం మళ్లీ విడుదల చేసిందనీ, ఒకవక్క కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు మమ్మల్ని నేరుగా రెగ్యులరైజేషన్ చేయమని కోరుతూ ఉంటే ప్రభుత్వం రాత పరీక్ష ద్వారా అందరితో పోటీపడి రెగ్యులర్ ఉద్యోగంలోకి రావాలని అనడం సమంజసం కాదన్నారు. ఇన్నేండ్లు వీరి సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని కోరారు. అనేక రాష్ట్రాల్లో వైద్యారోగ్య శాఖ కాంట్రాక్టు ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేశారని తెలిపారు. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వంపై ఎలాంటి అదనపు భారం పడదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏఎన్ఎంల భర్తీ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేసి కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను యధాతథంగా రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు ఎ.కవిత, నగర కార్యదర్శి కిరణ్‌మై, నగర నాయకులు లక్ష్మిభాయ్, రమ, బాలమని, అమ్మాజీ, మంగ, షీలా, సులోచన, సంతోషమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాపై కేసు నమోదు చేయాలి



- మాజీ ఎంపీ వీహెచ్

నవతెలంగాణ-అంబర్‌పేట

డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలపై కేసు నమోదు చేయాలని అంబర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలిని కాంగ్రెస్ పార్టీ పీసీసీ మాజీ అధ్యక్షులు, మాజీ రాజ్యసభ సభ్యులు వీ హనుమంతరావు ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోనే ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షా తక్షణమే తన పద వికి రాజీనామా చేయాలన్నారు. అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యల అంశం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు బీజేపీ ఇతర అంశాలను లేవనెత్తుతోందని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపు నూరి కృష్ణ గౌడ్, డివిజన్ అధ్యక్షులు, గడ్డం శ్రీధర్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కోటం అనిల్ కుమార్, రామ్మోహన్ రావు, జమీర్, సునీల్, ఫరీద్, తదితర నాయకులు పాల్గొన్నారు.

అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలి

- ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్
- ట్యాంక్ బండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆప్ నిరసన



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాజ్యాంగం ద్వారా దేశ పౌరులకు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అందించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను కించపరిచిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. అణగారిన ప్రజల గొంతు, భారతదేశ ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన అంబేద్కర్‌ను అగౌరవపరుస్తూ అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఆప్ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. అమిత్ షా ద్వారా బీజేపీ తన దళిత వ్యతిరేక మనస్తత్వాన్ని బహిరంగంగా వెల్లడించిందన్నారు. శనివారం హైదరాబాద్, ట్యాంక్ బండ్ వద్ద ఉన్న బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట అమిత్ షా చేసిన అవమానకరమైన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆప్ నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని ఖునీ చేసి మనుస్మృతిని తీసుకురావడానికి బీజేపీ అగ్ర నాయకత్వం అంబేద్కర్‌ను అవమానిస్తుందని మండిపడ్డారు. దేశ ప్రజలకు నరకం చూపించిన మనుస్మృతిని డిసెంబర్ 25, 1927న బాబాసాహెబ్ అంబేద్కర్ బహిరంగంగా దహనం చేసి రాజ్యాంగం ద్వారా స్వర్గం కల్పించారని గుర్తు చేశారు. దేశంలోని లక్షలాది మంది దళితులు, పేదలు, అణగారిన, వెనుకబడిన వర్గాలకు అంబేద్కర్ దేవుడు కంటే తక్కువేమీ కాదని అమిత్‌షాకు గుర్తు చేశారు. అంబేద్కర్‌ను ప్రస్తావించడం అభిరుచి అని ఫ్యాషన్ కాదన్నారు. దేశ ప్రజల పురోగతి పథంలో వెలుగులు నింపిన అంబేద్కర్ శాశ్వతమైన జ్ఞాపకం, మనం ఊపిరి పీల్చుకున్నంత కాలం, ఈ భూమిపై సూర్యచంద్రులు ఉన్నంత కాలం అయన స్మృతి ఉంటుందని పేర్కొన్నారు. బీజేపీ శ్రేణులు అంబేద్కర్‌ను హేళన చేస్తే ఉరుకునేదిలేదని తాట తీస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యమునా గౌడ్, డాక్టర్స్ విభాగం అధ్యక్షులు డాక్టర్ లాక్ష్యా నాయుడు, యువజన విభాగం అధ్యక్షులు విజయ్ మల్లంగి, పార్టీ అధికార ప్రతినిధులు ఆఫ్సా సలాం, జావీద్ షరీఫ్, ఖలీమ్ బాబా, అహసన్ అబ్బాస్, ఉప్పల్ నియోజకవర్గం అధ్యక్షులు సుధారాణి, నాయకులు జయసింగ్ జాదవ్, ధర్మేంద్ర తివారి, అజీమ్ బైగ్, లక్ష్మణ్, వైశాలి, మౌనికా, డాక్టర్ షకీల్, అక్బర్ పాల్గొన్నారు.

దళిత గొంతుక వీటీ.రాజశేఖర్



- ప్రొఫెసర్ కంచె ఐలయ్య

నవతెలంగాణ-ముషీరాబాద్

దళితుల పక్షనా చరిత్రలో మొట్టమొదటి సారి అధిపత్య కులాలానికి చెందిన వ్యక్తి వీటీ.రాజశేఖర్ దళితుల గొంతుకగా మారడని ప్రొఫెసర్ కంచె ఐలయ్య అన్నారు. దళిత్ వాయిస్ ఎడిటర్, రచయిత, అంబేద్కర్ కార్యకర్త, బహుజన ఐక్యత మెధావి వీటీ.రాజశేఖర్ సంస్మరణ సభ సమాంతర అధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సభలో తొలితరం దళిత నేత బత్తుల శ్యామ్ సుందర్ పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రొపెసర్ కంచె ఐలయ్య మాట్లాడుతూ.. మహ రా ష్ట్రలో జరిగిన దళిత్ పాంథర్స్ ఉద్యమాన్ని దేశమంతా ప్రచారం చెశాడన్నారు. దళిత్ అనె పదానికి అర్థం చెప్పిన మహ మెధావి వీటీ.రాజశేఖర్ అని అ న్నారు. దళిత్ వాయిస్ పత్రిక ద్వారా ఎన్నో రచనలు చేశాడని తెలిపారు. దళితుల, ముస్లింల ఐక్యత కొసం కృషి చెశాడన్నారు. ఈ సంస్మరణ సభలో విటి.రాజశేఖర్ కుమారుడు సలిమ్ శెట్టి, ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్, మసూద్, ప్రకాశ్ మూల భారతి, డాక్టర్ ఆలీమ్ ఖాన్, సమాంతర ఎడిటర్ వరుణ్ కుమార్, గద్దర్ పౌండెషన్ ప్రధాన కార్యదర్శి జి.వి.సూర్య కిరణ్, సినియర్ దళిత నేతలు కొరివి వినయ్ కుమార్, జె.గౌతమ్, డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, నల్ల బాబు, క్రాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రీట్ లైట్‌లను క్రమబద్ధీకరించాలి

- కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

గాంధీనగర్ డివిజన్ వ్యాప్తంగా వెలగని వీధి దీపాలతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారనీ, వెంటనే మరమత్తులు జరిపించాలని డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ అన్నారు. శనివారం కార్పొరేటర్ కార్యాలయంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. స్ట్రీట్ లైట్ సమస్యలపై పలు మార్లు జోనల్ కమిషనర్‌కు సంభందిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు ఎందుకు మరమత్తులు చేయాలేదని ప్రశ్నించారు. ప్రజలు ప్రభుత్వ టాక్స్‌లు కడుతున్నపటికి వారి సమస్యలు పరిష్కరించకపోవడంపై అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. డివిజన్‌లో అనేక చోట్ల వీధి దీపాలు వెలగక గాఢాంధకారం ఏర్పడిందని, సీనియర్ సిటిజన్‌లు, మహిళలు సాయంత్రం బయటకు రాలేక భయాందోళనకు గురవుతున్నారనీ, చీకటిలో పలు చోట్ల ఆక్సిడెంట్లు, చైన్ స్నాచర్ల భయంతో రాత్రి సమయంలో ప్రజలు బయటకు రాలేక తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. స్ట్రీట్ లైట్స్ సమస్యలతో డివిజన్ ప్రజల నుంచి తమకు అనేక ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ఇకనైనా అధికారులు నైతిక భాద్య తలు వహించి వెంటనే వెలగని స్ట్రీట్ లైట్స్‌లకు మరమత్తులు చేయాలన్నారు. అసలు స్ట్రీట్ లైట్స్ లేని చోట నూతన లైట్లు ఏర్పాటు చేయా లని, లేని పక్షంలో డివిజన్ ప్రజలతో కలిసి సంభందిత అధికారుల కార్యాలయం ఎదుట పెద్ద యెత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు.

బండారి దయానంద్‌కు ఉద్యోగపతి అవార్డు



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ప్రముఖ ఇండస్ట్రీస్, ఎస్డీఎస్ఎంసీ గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మెన్ బండారి దయానంద్ యాదవ్‌కు 'ఉద్యోగపతి అవార్డు-2024'ను అందజేయనున్నట్టు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ వ్యాపారవేత్త రతన్ టాటా 86వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని, ఈ నెల 28వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు బొగ్గులకుంట అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో జరిగే ఉత్సవాలలోఈ అవార్డు ప్రధానం చేయనున్నట్టు ఆయన తెలిపారు. ప్రముఖ సెక్యూరిటీ కంపెనీ ఎస్డీఎస్ఎంసీ గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మెన్ బండారి దయానంద్ యాదవ్ ఆదర్శ హిందీ మహా విద్యాలయం నుంచి విద్యార్థి సంఘం యూనియన్ అధ్యక్షుడిగా మూడు సార్లు 1974 నుంచి 1976 ఏడాదిలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బీకాం, ఎంబీఏ పూర్తి చేసి తన కంపెనీ ద్వారా 2,275 మందికి ఉపాధి కల్పిస్తు న్నారు. భారత జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భం గా సేవారత్న పురస్కారం, సమాజసేవలో మదర్ థరిస్సా స్మారక అవార్డు అందుకున్నారు. సమాజానికి, పేదలకు విద్య కోసం స్కాలర్ షిప్‌లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఆకలితో ఉన్న వారికి ఆహారం అందజేసి ఎన్నో సంస్థల ద్వారా ప్రశంసలు, అవార్డులు అందుకున్నారన్నారు. దయానంద్ మొదటి కుమార్తె ఆర్థోపెడిక్ సర్జన్‌గా గాంధీ ఆస్పత్రిలో సేవలందిస్తున్నారన్నారు. రెండో కుమార్తె అమెరికా దేశంలో ప్రముఖ సాఫ్ట్ వేర్ కంపెనీ ఇంజనీర్‌గా, కుమారుడు అమెరికా దేశ ఆర్మీలో చేరి సాఫ్ట్‌వేర్ పూర్తిచేసి అమెరికా సిటిజన్‌గా సేవలు అందిస్తూ రాణిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..



- తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మెన్ వెన్నెల గద్దర్

నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ ఉద్యమకారులు, కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతుగా కృషిచేస్తానని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మెన్ వెన్నెల గద్దర్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఆధ్వర్యంలో ఆత్మగౌరవ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వెన్నెల గద్దర్ మాట్లాడుతూ.. మన హక్కులను సాధించుకునేందుకు ఉద్యమకారులు చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. గత ఎన్నికల్లో నేను ఎమ్మెల్యేగా పోటీ చేశానని, నేను ఓడిపోయినా ప్రజాపాలన గెలిచిందన్నారు. నిశబ్ద విప్లవమే ఓటు హక్కు అని అన్నారు. గద్దరన్న ఆశయ సాధన కోసం తాను కృషిచేస్తానంటూ నన్ను కన్నతల్లులారా అంటూ ఆలపించిన పాట అందరిని ఆకట్టకుంది. ఉద్యమకారుల ఫోరం చైర్మెన్ డాక్టర్ టీమ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి రూ.10వేల కోట్లు కేటాయించాలని, అర్హులైన ఉద్యమకారులకు రూ.25వేల పెన్షన్ కల్పించాలని, వెయ్యిమంది అర్హులైన వారికి సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు ఇవ్వాలని, కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందివ్వాలని, ఇందిరమ్మ ఇండ్లలో 10శాతం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫోరం కన్వీనర్ యేల్లా పోశెట్టి, ప్రధాన కార్యదర్శి పల్లోళ సురేందర్‌రెడ్డి, గాయకుడు వెన్నెల కిషోర్, వరాల దేవయ్య, బొడ్డ రాములు, దయానంద్ కొంతం యాదిరెడ్డి తదితర ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.

ప్రీమియర్ షోలు రద్దు అభినందనీయం

- బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రీమియర్ షోలకు అనుమతులు ఇవ్వబోమని సీఎం ఎ.రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించడం పట్ల బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సంధ్య థియేటర్ ఘటనపై హీరో అల్లు అర్జున్, చిత్ర యూనిట్, థియేటర్ యాజమాన్యంపై తాము శుక్రవారం జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశామని గుర్తు చేశారు. వేగంగా స్పందించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.25 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించడమే కాకుండా అధికారంలో ఉన్నంత వరకు బెనిఫిట్ షోలు, టికెట్లు రేట్ల పెంపుకు అనుమతించే ప్రసక్తే లేదని సీఎం అసెంబ్లీలో ప్రకటించడం హర్షణీయమన్నారు. సంధ్య థియేటర్ ఘటనపై ప్రభుత్వం మొదటి నుంచి సీరియస్‌గానే ఉందని, సెలబ్రిటీ అయినా లెక్క చేయకుండా హీరోని అరెస్ట్ చేసి సామాన్యుల పక్షం వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పెద్ద సినిమాలను ప్రోత్సహించడం కాకుండా చిన్న సినిమాలకు ప్రోత్సాహకాలు అందిస్తే సినీ పరిశ్రమ నిలదొక్కుకుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం సామాన్య ప్రజల విషయంలో వ్యవహరిస్తున్న తీరుపై తెలంగాణ సమాజం హర్షిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు అనంతుల రామ్మూర్తి గౌడ్, బడేసాబ్, రాఘవేందర్, అంజన్న యాదవ్, మహేందర్ నాయుడు, గౌతమ్ శంకర్, దేవర శివ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ దీప్తి సరోజిని కూచిపూడి నాట్యం అదరహో...




నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో సప్తరంజని ది సెలస్టియల్ జాయ్ ఆఫ్ డ్యాన్స్ పేరిట సరోజిని కూచిపూడి. రంగప్రవేశ కార్యక్రమం మంత్ర ముగ్దులను చేసింది సంచలన స్కూల్ ఆఫ్ డ్యాన్స్ సంస్థ వ్యవస్థాప కురాలు ప్రఖ్యాత నాట్య గురువు పద్మ కళ్యాణ్ మార్గదర్శకత్వంలో డాక్టర్ దీప్తి సరోజిని నాట్యాన్ని ప్రదర్శించారు. ఎనిమిది ఏండ్ల కఠోర సాధన, కూచిపూడి నాట్యం పట్ల గురు శిష్యులకు ఉన్న అభిరుచి, మక్కువ ఈ ప్రదర్శనలో ప్రతిబింబించాయి. ఏడు అంశాలను దాదాపు గంటా నలభై అయిదు నిమిషాల పాటు నిర్విరామంగాను అలవోకగాను ప్రదర్శించటం అందులోను అభినయాన్ని సమన్వయ పరచుకుంటూ చేయడం అభినందనీయం, కార్యక్రమానికి పద్మ భూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ స్వప్న సుందరి నృత్య కళాకారిణి, గురువు కలసి ఈ కళకు చేస్తున్న కృషిని కొనియాడారు.

ఈ కార్యక్ర మానికి తెలం గాణ మెడికల్ కౌన్సిల్ చైర్మెన్ డాక్టర్ మహేష్ కుమార్. ఉప చైర్మెన్ డాక్టర్ జి. శ్రీనివాస్, డాక్టర్ విజయ్ రావు, ప్రముఖ డాక్టర్లు విచ్చేశా రు. నలభై ఏండ్లు దాటిన వయస్సులో మోకాలు కి రెండు సార్లు శస్త్ర చికిత్స జరిగినా, పట్టుద లతో నాట్యం పైన ఉన్న మక్కువతో డాక్టర్. దీప్తి సరోజిని చేసిన ప్రదర్శన కూచిపూడి చరిత్రలోనే మైలురాయిగా నిలుస్తుంది అన్నారు.



బేగంబజార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ అరవింద్ కుమార్, ఏఎన్ఎంలు ,ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

విద్య ద్వారానే సమాజంలో మార్పు

- గీతాంజలి విద్యా సంస్థల సెక్రటరీ ఎన్.శాంతా
- గీతాంజలి హైస్కూల్ 42వ వార్షికోత్సవం
- ప్రముఖ సినీ మాటల రచయిత పరుచూరి వెంకటేశ్వరరావుకు అవార్డు ప్రదానం



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని గీతాంజలి విద్యా సంస్థల సెక్రటరీ ఎన్.శాంతా అన్నారు. గీతాంజలి హైస్కూల్ 42వ వార్షికోత్సవం సందర్భంగా పలువురి ప్రముఖులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీవీ యాక్టర్, ఆర్టిస్ట్ ప్రీతి నిగమ్, కె.నాగేష్, డీఎస్ఎన్ఏ మూర్తి, డీజీపీ డా.శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రముఖ సినీ మాటల రచయిత పరుచూరి వెంకటేశ్వరరావుకు 'సీఎస్ రావు మెమోరియల్ థియేటర్' అవార్డు ప్రధానం చేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎస్.శాంతా మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు విజయవాడలో నిరాశ్రయులైన 100 మంది నిరుపేదలకు తమ పాఠశాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు బియ్యం, నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేసినట్లు అమె తెలిపారు. తమ పాఠశాలలో ఎస్ఎస్సీ ఫలితాలు ప్రతి ఏడాది వంద శాతం ఫలితాలు సాధిస్తాయన్నారు. నగరంలో వివిధ కళా సంస్థలు నిర్వహించే పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు అనేక బహుమతులు గెలుస్తున్నారని పేర్కొన్నారు. తమ పాఠశాలలో ప్రతి ఏడాది సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తూ విద్యార్థుల్లో సైన్స్‌పై అవగాహన పెంచుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పద్మ, ఇంద్రజ, లక్ష్మీ, మమత, సుస్మిత, కవిత తదితరులు పాల్గొన్నారు.

హర్యానా మాజీ సీఎం ఓం ప్రకాష్ చౌతాల మృతి రాజకీయ రంగానికి తీరని లోటు

- ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

హర్యానా మాజీ సీఎం, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ పార్టీ నాయకులు ఓం ప్రకాష్ చౌతాల మృతి రాజకీయ రంగానికి తీరని లోటని ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు అన్నారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు ఓంప్రకాష్ చౌతాల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హర్యానాలోని ఒక ప్రముఖ రాజకీయ కుటుంబానికి చెందిన ఓంప్రకాష్ చౌతాల ఐదు సార్లు పంజాబ్ ముఖ్యమంత్రిగా పని చేశారని, జనతాదళ్ పార్టీలో ఉన్న సమయంలో 1989 డిసెంబర్‌లో తొలిసారిగా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారని గుర్తు చేశారు. తరువాత 1990 జులై, 1991 ఏప్రిల్‌లో రెండు సార్లు స్వల్పకాల వ్యవధిలో ముఖ్యమంత్రిగా పనిచేశారని, ఐఎన్ఎల్‌ఎలో చేరిన తరువాత రెండు సార్లు (1999, 2000) ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఓంప్రకాష్ చౌతాల మృతి పట్ల ప్రగాఢ సంతాపం, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందిని తక్షణమే పర్మినెంట్ చేయాలి

- కనీస వేతనం రూ.21 వేలు అమలు చేయాలి
- తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్



నవతెలంగాణ-అంబర్‌పేట

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్డు తదితర పద్ధతులలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులందరినీ తక్షణమే పర్మినెంట్ చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో సుమారు 65వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఎటువంటి సంక్షేమ పథకాలు లేకుండా, తక్కువ వేతనాలకు పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి మున్సిపల్ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని, ఈలోగా ఏపీలో ఇస్తున్నట్టు రూ.21వేల రూపాయల వేతనం అమలుచేయాలని డిమాండ్ చేశారు. కేటగిరీల వారీగా వేతనాలు ఇవ్వాలని, 8గంటలు పనివిధానాన్ని అమలుచేయాలని, హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఇండ్లు, స్థలాలు ఇవ్వాలని, పెరుగుతున్న పట్టణ విస్తరణకు అనుగుణంగా కొత్త సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు జే.వెంకటేష్, పి. సుధాకర్, ఎర్రానర్సింహులు, వి.నాగమణి, ఉప్పలయ్య, గుర్రం అశోక్, ఎస్. వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ అరెస్ట్‌కు రంగం సిద్ధం

- నాలుగేండ్లలో వీలైనన్ని ఉద్యోగాలు ఇవ్వడం మా ధ్యేయం..
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్..
- ఓయూలో కృతజ్ఞత బహిరంగ సభ



నవతెలంగాణ-ఓయూ

నాలుగేండ్లలో వీలైనన్ని ఉద్యోగాలు ఇవ్వడం తమ ధ్యేయమని, కేటీఆర్ అరెస్ట్‌కు రంగం సిద్ధమైందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ 50 వేల ఉద్యోగాలు ఇచ్చి, జాబ్ క్యాలెండర్ ఇచ్చినందుకు గాను హైదరాబాద్ ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట శనివారం రాత్రి టీపీసీసీ అధికార ప్రతినిధి, ఓయూ పీహెచ్‌డీ విద్యార్థి చనగని దయాకర్ ఆధ్వర్యంలో ఆయన అధ్యక్షతన ఏర్పాటు చేసిన కృతజ్ఞత బహిరంగ సభలో టీపీసీసీ చీఫ్ పాల్గొని మాట్లాడారు. ఆర్ట్స్ కళాశాల తెలంగాణ తొలి మలి ఉద్యమలకు ఊపిరి పోసిన గడ్డ అని, ఇక్కడికి రావడం గర్వంగా ఉందన్నారు. 16 సీఎంలు రూ. 72 వేల కోట్లు అప్పు చేస్తే ఒకే ఒక్క సీఎం రూ.6 లక్షల 71వేల కోట్లు అప్పు చేశారని విమర్శించారు. ఒక్క కాళేశ్వరం ద్వారా కోట్లు దోచుకున్న కుటుంబం కేసీఆర్ కుటుంబం అన్నారు. దేశ చరిత్రలో కేసీఆర్ కుటుంబం చేసిన అవినీతి ఏ కుటుంబం చేయలేదన్నారు. కాంగ్రెస్ వచ్చాక స్కిల్ ,స్పోర్ట్స్ యూనివర్సిటీ తెచ్చామని, నెలకు 5వేల ఉద్యోగాలిచ్చామని తెలిపారు. రానున్న 4 ఏండ్లలో ఇచ్చిన ప్రతి వాగ్దానం అమలు చేస్తామన్నారు. ప్రభుతానికి ప్రజలకు మధ్య వారధిగా గాంధీ భవన్ దేవాలయంగా పనిచేస్తుందని చెప్పారు. గత 10 ఏండ్ల పాలనకు తమ ఏడాది పాలనపై బేరీజు వేసుకోవాలన్నారు. ప్రతిపక్ష నేత ఎందుకు ఫామ్ హౌస్ ఉన్నారని, అసెంబ్లీ రారా అని నిలదీశారు. వచ్చే ఎన్నికల వరకు కేసీఆర్, కేటీఆర్ తప్ప కవిత, హరీశ్‌రావు కూడా పార్టీలో ఉండరన్నారు.

భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని రాబందుల్లా దోచుకున్న వారు నేడే సోషల్ మీడియాలో కాంగ్రెస్‌ను అభాసు పాలు చేస్తూ ప్రచారం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజల్లో విష బీజాలు నాటుతున్నారని చెప్పారు. జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని దీమా వ్యక్తం చేశారు. ఒక సంవత్సరంలో ఎంతో చేసిన చెప్పుకోలే పోతున్నాం అని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ హనుమంతరావు మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో పనిచేసిన వారిని వీసీలుగా నియమించడం నాకు నచ్చలే అన్నారు. అమిత్ షా నిండు సభలో అంబేద్కర్‌ను అవహేళన చేస్తు మాట్లాడడం బాధాకరం అన్నారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నోటిఫికేషన్‌లు ఇవ్వలేదని, ఇస్తే లీక్‌లు, చివరకు ఆర్డర్ కాపీలు వచ్చే వరకు ఆందోళన చెందాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం ప్రతి కేసును పరిష్కరించి ఉద్యోగాలు ఇచ్చామన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయల చైర్మెన్ రియాజ్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివా సేనా రెడ్డి, ఓయూ సివిల్ సర్వీస్ అకాడమీ డైరెక్టర్ ప్రొ. కొండ.నాగేశ్వర్ రావు, డా.దుబ్బ రంజిత్ , ఎన్ఎస్‌యూఐ ఓయూ అధ్యక్షుడు మెడ శ్రీనివాస్, ఏపూరి సోమన్న హాజరయ్యారు. సభకు విద్యార్థులు భారీగా తరలివచ్చారు.

అండగా ఉంటాం.. న్యాయ సలహాలందిస్తాం

- హైడ్రా సదస్సులో న్యాయనిపుణుల వెల్లడి



నవతెలంగాణ-సిటీబ్యూరో

చెరువుల పరిరక్షణ, పునరుజ్జీవనానికి కృషి చేస్తున్న హైడ్రాకు తగిన న్యాయ సలహాలు అందించడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని న్యాయ నిపుణులు వెల్లడించారు. ప్రభుత్వ స్థలాలతో పాటు రహదారులు, పార్కులు కబ్జా కాకుండా కాపాడుతున్న హైడ్రాను న్యాయ నిపుణులు అభినందించారు. చెరువుల పరిరక్షణ, ప్రభుత్వ భూములను కాపాడడంలో తలెత్తుతున్న ఇబ్బందులు, న్యాయపరమైన అంశాలలో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయాలపై శనివారం హైదరాబాద్‌లోని హైడ్రా కార్యాలయంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో పలువురు న్యాయ నిపుణులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేసిన విశ్రాంత అధికారులు పాల్గొని విలువైన సూచనలు చేశారు. అనేక అంశాలపై సందేహాలను నివత్తి చేశారు.

చెరువులను పునరుద్ధరించడం.. వరద కాలువలను సజీవంగా ఉంచడంతోనే నగరానికి వరద ముప్పు తప్పుతుందని నిపుణులు సూచించారు. గొలుసుకట్టు చెరువులు లింకు తెగిపోవడంతో 2 సెంటీమీటర్లు దాటి వర్షం పడితే నగర రహదారులు, లోతట్టు ప్రాంతాలు నీట మునుగుతున్నాయని అభిప్రయాపడ్డారు. చట్టాలను పటిష్టంగా అమలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని హైడ్రా తీసుకువచ్చి.. భవిష్యత్ తరాలకు పర్యావరణంతో కూడిన మెరుగైన జీవనాన్ని అందిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. చెరువు శిఖం భూముల విషయంలో ప్రయివేటు పట్టాలున్న వారు వ్యవసాయం మాత్రమే చేసుకోవాల్సి ఉంటుందని మరే ఇతర హక్కులు ఉండవని చెప్పారు. చెరువుల మధ్యనుంచి పలు చోట్ల రహదారులు నిర్మించారని.. అయితే ఇరువైపులా నీటికి అడ్డు లేకుండా పై వంతెనలు కడితే బాగుంటుందని సూచించారు. చెరువుల బఫర్ జోన్లలో మట్టితో నింపేసి.. వారి స్థలం ముంపు ప్రాంతంలో లేదని చూపించే ప్రయత్నాలను ఎన్ఆర్ఎస్ఏ, సర్వే ఆఫ్ ఇండియా, గ్రామీణ మ్యాప్‌ల ద్వారా నివారించవచ్చునన్నారు. చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అనుమతి లేని లే ఔట్లలోని ఇంటి స్థలాలను రిజిస్ట్రేషన్ చేయడానికి అవకాశం లేని వ్యవస్థ రావాలని సూచించారు. అలాగే మాస్టర్ ప్లాన్‌లో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు దుర్వినియోగమైతే నేరుగా చర్యలు తీసుకోవచ్చునన్నారు.

హెచ్ ఎం డీఏ పరిధిలోకి గ్రామాలు చేరినప్పుడు గ్రామపంచాయతీ లే ఔట్లు ఎట్టి పరిస్థితుల్లోనూ చెల్లవని స్పష్టం చేశారు. లే ఔట్లలో 30 శాతం భూమిని ప్రజావసరాలకోసం కేటాయించాల్సి ఉంటుందన్నారు. భూ వినియోగానికి సంబంధించిన సవరణలు ప్రభుత్వ పరిధిలోనే ఉంటాయన్నారు. అనుమతి పొందిన లే ఔట్‌ను అతిక్రమించి నిర్మాణాలు చేపడితే చట్టం ప్రకారం కూల్చివేయవచ్చని చెప్పారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది రేసు మహేందర్ రెడ్డి, హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్ కె. రవీందర్‌రెడ్డి, హైకోర్టు అసిస్టెంట్ స్టాండింగ్ కౌన్సిల్ సీహెచ్. జయకష్ణ, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్, న్యాయ, రెవెన్యూ రంగ నిపుణుడు ఎస్. శ్రీనివాస్ రావు, సీసీఎల్ ఏ రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి. మధుసూధన్, మాజీ సీనియర్ అడ్వకేట్, ప్రొఫెసర్ డా. పి. రాజ్ గోపాల్‌తో పాటు పలువురు సీనియర్ న్యాయవాదులు, వివిధ శాఖలకు చెందిన నిపుణులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **Rajani Ganti** W/o. Late Srinivas Ganti aged about 45 Yrs residing at Tower-A,608, Road No.12, Raheja Vistas, IDA, Nacharam, Medchal-Malkajgiri Dist-500076 T.S., India, do hereby declare that my Name "**RAJANI GANTI**" & "**RAJANI KUMARI N** "D/o of Late Pandu Ranga N (Father) Late Jayalakshmi N (Mother) both Names Are Same. please consider My name as "**RAJANI GANTI**" for all future purposes.

మహారాజశ్రీ గౌరవ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు సత్తుపల్లి
ఓ.ఎస్ నెంబరు 275 / 2021

బిట్వీన్ :
కొటారు విజయభాస్కరరావు .....వాది
మరియు
కే.రామ్మూర్తి ......ప్రతివాది

టు,
ప్రతివాది :
కే .రామ్మూర్తి తండ్రి : రామకృష్ణ, వృత్తి : వ్యాపారం, నివాసం : ఇంటి నెంబరు : 1-2-607/5/3, జలవాయు టవర్స్ దగ్గర, లోయర్ ట్యాంక్‌బండు హైదరాబాద్.

ఇందుమూలముగా ప్రతివాది అయిన. కె. రామ్మూర్తికి తెలియజేయునది ఏమనగా, మీపై వాది వేసిన పై దావా ది 31.12.2024వ తేదీన ఉదయం 10:30ని పై కోర్టు వారు, మిమ్ములను కోర్టుకు హాజరు కావలసినదిగా ఈ ప్రకటన ద్వారా తెలియ జేయుచున్నారు. కావున మీరు గాని మీ తరపున న్యాయవాది ద్వారా గాని హాజరు కావలెను. లేనియెడల మీకు పరోక్షముగా న్యాయ నిర్ణయము జరుగును.

//కోర్టు వారి అనుమతితో //

ఇట్లు
మంత్రిప్రగడ జగన్‌మోహన్‌రావు
న్యాయవాది, ఖమ్మం
ఖమ్మం
ది.21.12.2024

డాక్యుమెంట్ పోయినది

నేను కామేశ్వరి అన్నవజ్జల భర్త లేట్ డా.పి.రామచంద్రన్, నివాసం:3-4-875/బి, బర్కత్‌పుర, హైదరాబాద్-500 027, తెలంగాణ. నేను నా ఒరిజినల్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం:1-4132, తేది.04-08-2018నాటి నా పేరు కామేశ్వరి అన్నవజ్జల మరియు సునీత శ్రీరామ్ అన్నవజ్జల పేరునగల రెసిడెన్షియల్ ప్రాపర్టీ విల్లానెం.140 కోసం హైదరాబాద్‌లోని ఐడీబీఐ బ్యాంక్ బషీర్‌బాగ్ సమీపంలో పోగొట్టుకున్నాను. ఎవరైనా వాటిని కనుగొంటే దయచేసి నా టెలిఫోన్: 9949005568 కి కాల్ చేయండి.

పుస్తక పఠనం వల్ల దివ్యమైన జ్ఞానాన్ని సంపాదించవచ్చు


పుస్తక ప్రదర్శనను సందర్శించిన హర్యానా గవర్నర్ దత్తాత్రేయ, సన్మానించిన బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్ వాసు


వెలుగు వైపుగా పుస్తకావిష్కరణ


బుక్స్ ఇన్ డిజిటల్ ఇయర్స్ అనే అంశంపై చర్చ

- హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

నవతెలంగాణ-ముషీరాబాద్

పుస్తక పఠనం వల్ల దివ్యమైన జ్ఞానాన్ని సంపాదించవచ్చు అని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శనివారం ఇందిరాపార్క్ ఎన్టీఆర్ స్టేడియం ఏర్పాటు చేసిన హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌ను హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సందర్శించారు. బుక్ ఫెయిర్‌లోని అన్ని స్టాళ్లకు తిరుగుతూ పుస్తకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్షలాది మంది ఆలోచనలు పుస్తక రూపంలో తెచ్చి ప్రజల్లోకి తీసుకువెళ్లే రచయితల కృషిని అభినందిస్తున్నానన్నారు. పుస్తక పఠనం చాలా అవసరం దివ్యమైన జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చు. వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడానికి పుస్తకాలు అవసరం. లోతైన విజ్ఞానం రావాలంటే చదువు చాలా అవసరం. నేటి యువతరం కోసం గ్రంథాలయాలను పెంచి పుస్తక పఠనం ప్రోత్సహించాలి. ఈ కార్యక్రమంలో బుక్ ఫెయిర్ అధ్యక్షులు యాకూబ్, సెక్రటరీ ఆర్ వాసు ఉన్నారు. అనంతరం గవర్నర్ బండారు దత్తాత్రేయను బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్ వాసు ఘనంగా సన్మానించారు.

వెలుగు వైపుగా పుస్తకాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉంది

వెలుగు వైపుగా పుస్తకాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందని హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షులు కవి యాకుబ్ అన్నారు. ధూపాటి ప్రభాకర్ రాసిన వెలుగు వైపుగా పుస్తకావిష్కరణ హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో జరిగింది. కవి యాకూబ్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆంగ్లంలో రాసిన ఈ పుస్తకాన్ని పలువురు రచయితలు తెలుగులోకి అనువదించారు. ఈ సందర్భంగా యాకూబ్ మాట్లాడుతూ.. వెలుగు వైపుగా పుస్తకాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. పంతుల గోపాలకృష్ణ పుస్తకాన్ని పరిచయం చేస్తూ, ఇందులో 63 కథలున్నాయి. దూపాటి ప్రభాకర్ అద్భుతమైన కథకుడు అన్నారు. ఈ కార్యక్రమంలో గంటి జానకి, సుగుణ తాళ్లూరి, సావిత్రి రమణారావు, పద్మిని తదితరులు పాల్గొన్నారు.

బుక్‌ఫెయిర్‌లో బుక్స్ ఇన్ డిజిటల్ ఇయర్స్ అనే అంశంపై చర్చ

హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో బుక్స్ ఇన్ డిజిటల్ ఇయర్స్ అనే అంశంపై వక్తలు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో అపర్ణ ఠాకూర్, ఉషారామన్, అపర్ణ రాయప్రోలు, పూర్ణిమ తమ్మిరెడ్డిలు చర్చించుకున్నారు. ఉషారామన్ మాట్లాడుతూ. నేను 8 ఏండ్లుగా చిన్నపిల్లల కోసం లైబ్రరీ నడుపుతున్నాను. పిల్లలు కచ్చితంగా లైబ్రరీకి వచ్చి చదవాలనే లక్ష్యంతో ఇది ప్రారంభించాను. కరోనా సమయంలో అది కష్టమైపోయింది. అప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో పేజీ స్టార్ట్ చేసాను. అక్కడ మంచి స్పందన దొరికింది. కరోనా తర్వాత గూగుల్, ఇన్‌స్టా రివ్యూస్ చదివి లైబ్రరీకి వస్తున్న పిల్లల సంఖ్య పెరిగింది. అయితే తల్లితండ్రులు, పిల్లలు ఇప్పటికి ఫిజికల్‌గా బుక్స్ ఇవ్వడానికే ప్రాధాన్యత ఇస్తున్నారుని తెలిపారు. ఉషారామన్ మాట్లాడుతూ.. ఈ తరం అంతా డిజిటల్ వేదికలపైనే క్రియాశీలంగా ఉంటుంది. డిజిటిల్ ఫార్మాట్‌లో పుస్తకాలు చదివినప్పుడు నచ్చిన పాయింట్స్ మార్క్ చేసుకోవచ్చు, నచ్చిన లైన్స్ నచ్చిన వాళ్ళకి సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకోవచ్చు అని అన్నారు. అపర్ణ రాయప్రోలు మాట్లాడుతూ.. ఫింగర్ టిప్స్ మీదే చాలా కంటెంట్ దొరుకుతుంది. చాలా సులువుగా, ఈ బుక్స్, ఆర్టికల్స్, ఆడియో బుక్స్ అందుబాటులో ఉన్నాయి. ఇది ఆనందించాల్సిన విషయమే కానీ, అన్నీ డౌన్లోడ్ చేసుకుని, అందుబాటులో ఉంచుకున్నాక చదవకుండా పక్కన పెట్టేస్తే ప్రమాదమే ఎక్కువ ఉందన్నారు. పూర్ణిమ తమ్మిరెడ్డి మాట్లాడుతూ.. నేను మంటో రచనలని తెలుగులోకి అనువాదం చేయాలి అనుకున్నప్పుడు డిజిటల్ వేదికలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. మంటో వ్యాసాలు, సమీక్షలు, కథలు చాలా చదివి మరింత పదునుగా రాసేందుకు ఉపయోగపడ్డాయి. నేను 40 కథలు రాస్తే అందులో 2 మాత్రమే ప్రింట్‌లో వచ్చాయి. డిజిటల్ వేదికల మీద పబ్లిష్ అయిన కథలకి మంచి స్పందన లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రొ. విజయ కుమార్ అధ్యక్షత వహించారు.

బుక్‌ఫెయిర్‌లో దాశరథి బ్యాలెన్స్ సమగ్ర నృత్య రూపకం

హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో దాశరథి బ్యాలెన్స్ సమగ్ర నృత్య రూపకం బాలోత్సవ్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో దాశరథి పాత్రను, దాశరథి జీవితంలోని ఘట్టాలను తీస్కొని తెలంగాణ సాహిత్య అకాడెమీ తొలి చైర్మెన్ నందిని సిధారెడ్డి ఈ బ్యాలెన్స్‌ను రచించారు. దర్శకత్వం దాశరథి కుమార్తె ఇందిరా పరుశురాం. దాశరథి పాత్రలో రాజ్ కుమార్ నటించారు. త్రైలోక్య ఆర్ట్ అసోసియేషన్ విద్యార్థులు బ్యాలెలో వివిధ పాత్రలు ప్రదర్శించారు. దాశరథి కుమార్తె ఇందిరా, అల్లుడు గౌరీశంకర్, తెలంగాణ సాహిత్య అకాడెమీ కార్యదర్శి నామోజు బాలా చారి, బుక్ ఫెయిర్ అధ్యక్షులు యాకూబ్, సెక్రటరీ ఆర్ వాసు, వైస్ ప్రెసిడెంట్ బాల్ రెడ్డి, ట్రెజరీ నారాయణ రెడ్డి, నిర్వాహకులు భూపతి వెంకటేశ్వర్లు, సుజావతి పాల్గొన్నారు.


బుక్‌ఫెయిర్‌లో దాశరథి బ్యాలెన్స్ సమగ్ర నృత్య రూపకం

IN THE COURT OF THE VII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT: AT: HYDERABAD
O.S.No.2343 OF 2022

BETWEEN:
CANARA BANK, SHAIKPET BRANCH, HDYERABAD ...PLAINTIFF
AND
LALITHA SWASHAKTI SANGAM and others ..DEFENDANTS

07. Smt GAJWEL NAGAMANI, W/o.Late Mutyalu, H.No.5-105/2/A, Serilingampally, Raidu gam Golconda, HYD-500 008.

The Plaintiff above named filed the above suit for recovery of money against the Defendants and the matter now posted to 31.01.2025 for your appearance. If you fail to appear before the Honorable Court on **31.01.2025** at 10.30 A.M. either in person or through Counsel the matter will be decided in your absence.

//BY ORDER OF THE COURT//
DISHIT BHATTACHARJEE
B.SATISH
ADVOCATES
FLAT No.101 and 102, NIRMAN TOWER EAST MARREDPALLY,SECUNDERABAD-500 026
Mobile No.9949936611

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT SANGAREDDY
O.S.No. 15 OF 2021

Between:
Smt.Pingili Lakshmi ... Plaintiff
AND
Sri. Kesana Srinivas Rao and another. ...Defendants

To,
1. Sri. Kesana Srinivas Rao S/o. Venk-ata Subba Rao, Age: 56 years, Occ: working as General Manager M/s.GPR Housing Pvt.Ltd, R/o. Plot No.62. Vikasapuri, Sanjeevareddy Nagar, Hyderabad, TS.PIN-500038.

Whereas the petitioner/plaintiff filed the above suit against you on the file of the HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT SANGAREDDY for suit for perpetual injunction against the defendants herein in respect of Suit Schedule Property and the said suit now stands posted on 10-01-2025 for your appearance.

Hence, you are hereby informed to appear before the HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT SANGAREDDY on 10-01-2025 at 10:30 a.m. either in person or through counsel, failing which, the matter will be decided ex-parte as per law.

//By order of the court//
N.MURALI MOHAN
ADVOCATE
MOB: 9177222913

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT MEDAK
I.A No. 224 OF 2024
IN
O.S. No. 25 OF 2018

Between:
M. Laxmi Padmavathi ...Petitioner/Plaintiff
And
A. Ramakrishna Goud & Others ...Respondents/Defendants

NOTICE

R5) Muddapappu Divya Lavanya W/o. Sharathchandra murthy, Age; Major, occ. House wife,
R6) Pericherla Harika W/o. Kundaraju Shivarama Chandra Raju Age; Major, Occ: House wife Both are R/o.H.No.5-3-416, Plot No. 281, beside Rajarajeshwari Ashram Srikrishna Nagar, Kukatpally, Medchal Malkajigiri Distirict.

To Take notice that the plaintiff has filed the above Case for specific performance of agreement of sale against respondents, and you are impleaded by the petitioner as Respondent No. 5 & 6 in this case, the petitioner filed a petition for substitute service of notices in the above case which is stand posted to 03-01-2025 for your appearance you are therefore required to appear before this Hon'ble Court on the day at 10.30 A.M. directed to appear either in persons or through Advocate without failed in case you are fail to appear on that day the matter will be decided Exparte.

//BY ORDER OF THE HON'BLE COURT//
Sd/-
G. Laxman Kumar
Advocate,
H.No. 1-6-81/1/B,
Back side of Sangam Theatre,
J.N Road, Medak-502110.

IN THE COURT OF HON'BLE SENIOR CIVIL JUDGE :: RANGA REDDY DISTRICT :: AT CHEVELLA
O.S.No. 34 Of 2024

Between:
Fatima Bee (Died per LRs)
Syed Nizamuddin Hussaini & others ...Proposed Plaintiff No.2 to 6
AND
Mohammed Yahiya Ali & others ...Defendants

NOTICE

To,
Mohammed Azam Ali, S/o. Mohammed Basheer Ali, aged about 38 years, Occ. Business, R/o. H. No. 19-5-16/2/A/2, M.O. Colony, Bahadur Pura, Hyderabad-500064, T.G State. ...Defendant No.31

Take Summons that Mrs.Late Fatima Bee filed the above suit for Partition and Separate Possession of the suit schedule property against the defendants herein and the same is posted on 27-01-2025 for your appearance.
You are hereby directed to appear in this court in person or by a pleader duly instructed on the **27-01-2025** at 10-30 O'clock, failing which the said case will be decided as per law.

// BY ORDER OF THE COURT //
Syed Naseeb Faheem,
Advocate
D.No.17-1-376/B/50,
Opp.Mumtaz Park,Housing Board Colony,Hyderabad-500059
Cell:9618165997

NOTICE
IN THE COURT OF THE CHAIRMAN: MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL (SC/ST DISTRICT JUDGE) : AT NALGONDA: O.P.No. 24 OF 2023

BETWEEN:
Palle Janaiah & others ...**PETITIONERS**
AND
Muppani Satalin & anothed ...**RESPONDENTS**

TO
R1. Muppani Satalin S/o Rangaiah Aged: Major R/o Flat No.202,FC-3 Vaishnavi Enclave,Pragathi Enclave Miyapur Hyderbad,
R2 Palem Sasi Raja S/o Lakshmi Narayana. Aged: major R/o Flat no. 104,Block No 10B, PrajaCity Apartment Niyarur Ranga Reddy District (Owner of the car bearing No.TS-07-HA-9205)

Take notice that the above named Petitioners filed the above case for grant of compensation against you and the said case is posted to 31-12-2024 for your appearance.
Therefore, you are hereby informed to be present on 31-12-2024 at 10-30 a.m., in person or through Pleader before the above said court, failing which the matter will be decided against your absence.

//BY ORDER OF THE COURT//
R.BHUPAL REDDY
PADAM SEENAIAH,
Advocate Nalgonda.
NALGONDA,
Dt. 22-12-2024.

IN THE COURT OF THE HON'BLE I ADDL. FAMILY COURT KALPATARV BUILDING AT HYDERABAD
I.A.NO.895 OF 2023
IN
FCOP.NO.869 OF 2019

Between:
A.Bhargavi Renuka W/o A.Prabhakar Aged about 50 Years, Occ: Housewife R/o H.No.301, Sai Saumya Homes Balaji Nagar, MIG 101, Kukatpally, Hyderabad-72 AND ...Petitioner/Plaintiff
Prabhakar Anthannagari ..Respondent/Defendant S/o Shankaraiah Aged about 51 Years, Occ: Software Engineer, C/o Hari Krishna Pendli (Brother in law of respondent) H.No.1-2-39/L/SN.F-103, Sri Nivasam Appts. Lakeview Colony, Nizampet Road, Hydernagar, Hyderabad-72 Permanent Address C/o A.Shankaraiah (Father of Respondent) H.No.2-5-20, J.N.Road, Medak-502110,TS Cell No.8309038642/9666227842 IBM India Pvt.Ltd., Department: INETI Building 3, Mind Space, Madhapur, Hyderabad-500081 Office: EMP ID: 0432B1744

Please take notice that the above name Petitioner filed a petition U/s 13(1)(1)(a),25 and Hindu Marriage Act. The said case is posted on 03-01-2025 at 10:30 AM, either in person or through advocate at 10:30 AM on 03-01-2025 before the Hon'ble court failing which, matter will be proceeded as per law. // BY THE ORDER OF COURT// Mohd. Ghulam Rasool G.Padma Advocates Hyderabad Cell.7337423201

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT, AT: KUSHAIGUDA
O.S.NO.504 OF 2015

Between:
R.UPENDER REDDY
And others ... PLAINTIFFS
AND
R.JANAKI REDDY
And others ... DEFENDANTS
K.NAGALAXMI
And others ... PROPOSED/DEFENDANTS
1. POONDUR POCHAIAH, S/o Poondru Sailu (Deceased)
2. POONDRU LAXAMMA, W/o Late Poondru Yellaiah (Deceased)
The address of both the deceased were R/o Keesara Village and Mandal, Medchal-Malkajgiri Dist ... Proposed/Defendants

NOTICE

Please take notice that the Plaintiff filed an I.A.No.339 of 2021 under Order 1 Rule 10, R/w Section 151 of CPC along with others. The Notices were sent to the above said two proposed Defendants through Court and RP and the same were returned as they died. Thereafter, the Hon'ble Court has ordered for substitute service to the legal heirs of the above said deceased proposed Defendants and posted the matter on 31.12.2024 at 10.30 am to appear personally, through agent or Advocate for filing of your counter and disposal on merits. Hence, this Notice.

[BY ORDER OF THE COURT]
A.KESHAVA REDDY,
Advocate,
H.No.3-4-129/A, Street No.6,
Barkatpura, Hyderabad.

IN THE COURT OF THE PRINICIPAL DISTRICT JUDGE AND SESSION JUDGE CUM FAMILY COURT MEDCHAL-MALKAJGIRI DISTRICT COURT AT: KUSHAIGUDA
O.S.NO: 168 OF 2022

Between:-
V.Krishna ...Plantiff
V.Kalavathi and others ...Defendants

To,
15.Smt.V.Nagalakshmi W/o Late V.Pandarinath.
16.Smt. Ramya Priya D/o Late V.Pandarinath.
17.Smt.Sravani D/o Late V.Pandarinath.
18.Mr.Ramakrishna S/o Late V.Pandarinath. (15 to 18 are Lr's of Defendant no:2 and R/o H.no: 5-6-7, Yapral, Kindi Basti, Alwal Mandal, Medchal-Malkajgiri district TS 500087.)

Madam/Sir,
Take summons that the above named Plaintiff namely, sri V.Krishna s/o Late V.Arjuna as party in person filed the above case for partition and separate possession of the joint family properties Le Land admeasuring Ac.8.7 Gts. In Sy no: 137,141,150 to 155 total admesuring of Ac.46.36 Gts in Yapral village, Alwal Mandal, Medchal-Malkajgiri District TS 500087. and for perpetual injunction against you and other defendants. The above said defendants were not attending the hon'ble court sense from longtime. The said case is posted to 7/01/2025 at 10:30 AM for your before the Hon'ble court of the prinicipal district judge and session judge cum family court medchal- malkajgiri district court at kushaiguda either personally or through your counsel, failing which the matter will be decided exparte.

// BY ORDER OF THE COURT//
V.Krishna
Party is Person
H.no:5-47, Yapral, Alwal mandal Medchal-Malkajgiri Dist, TS-500087 Ph:9885790028

PUBLIC NOTICE

DATE :22-12-2024

THE GENERAL PUBLIC IN LARGE IS HEREBY INFORM THAT MY CLIENT MOHAMMED YAKUB S/O. LATE G.A. GAFFAR R/O.PADMASHALI COLONY, BHOLAKPUR, MUSHEERABAD, HYDERABAD, TG, (CLIENT M:9949973119) ENTERED INTO AGREEMENT TO PURCHASE HOUSE BEARING MUNICIPAL NO: 13-6-823/A – AS PER GHMC H.NO.13-6-823/A/2/4, ADMEASURING 167 SQ YDS OR 139.63 SQ.MTRS SITUATED AT MEHDI COLONY, LANGER HOUZE, HYDERABAD-TG., FROM ITS OWNER MRS. HAJIRA BEGUM W/O. ZAKIR AHMED, RESIDENCE OF ESSAKHAM BHAG, VIKARABAD, K.V. RANGA REDDY DISTRICT, TG., AND MY CLIENT PAID AN EARNEST AMOUNT TOWARDS THE TOTAL SALE CONSIDERATION.
IF ANY PERSON/S, GOVT / SEMI GOVT/ CORPORATE / HAVE ANY OBJECTION/ CLAIM/ INTEREST/ RIGHTS OVER THE SAID TRANSACTION MAY CONTACT WITH ALL RELEVANT DOCUMENTS WITHIN (7) SEVEN DAYS FROM THE DATE OF PUBLICATION OF THIS NOTICE. THEREAFTER NO CLAIMS WILL BE ENTERTAINED.

SHOUKAT ALI, B.Sc., L.L.B
ADVOCATE
OFF: D.NO.8-1-10/1, TOMBS ROAD, TOLICHOWKI, HYDERABAD. TG. 500008.
CELL : 9700057056, 9392485578

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR
S.O.P.NO.31 OF 2024

Between:
Srinivas Reddy & others ...Petitioners
AND
M/s.N.S.D.L.& others ...Defendants

NOTICE

That the above named Petitiners filed the above Succession Petition filed for Declaration to declare them as legal heirs of deceased LATE.MUNNAMGI LAKSHMA REDDY, who died intestate on 18.02.2022, due to ill-heath by leaving behind the petitiners as her legal heirs against you and another and the above suit is pending before the Hon'ble Prl. Senior Civil Judge, Ranga Reddy District At:L.B.Nagar and the above petition is posted on 06.01.2025 for any objections. If any person/s is/are having any objections he/she may appear before the Hon'ble Court on 06.01.2025 at 10.30 A.M. either in person or through an advocate, failing which the matter will be decided as per Law in your absence.

SCHEDULE OF PROPERTY

Munnamgi Lakshma Reddy's NSDL ID : 107209975
Munnamgi Lakshma Reddy's PAN No.ANQPM6570J
.No.of ISINs/
Accouont Type Account Details Schemes Value in Rs.
NSDL Demat A/c HDFC Bank Ltd. 1 3,20,705-00DP ID:IN301549
Client ID:30388145
CDSL Demat A/c HDFC Bank Ltd. 0 0-00DP ID:13012400
Client ID:01810019
Mutual Fund Folios 4 (four) Folios 6. 29,92,412-95
Total Sum Assured is Rs.33,13,117-95

//(BY ORDER OF THE COURT)//
M/s.B.MADANNA
P.GURUVA REDDY
S. KISHAN
Advocates
Ibrahimpatnam, R.R. District
Cell No. 9951275450
Counsel for Plaintiff

IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE - CUM-METROPOLITAN MAGISTRATE, RANGA REDDY DISTRICT, AT : LB NAGAR
I.A. No. 57 of 2023
IN
O.S. No. 378 of 2019

Between:
1. L.K. Lakshmikantha Rao (Died) per LRs
2. L.K. Umakanth Rao& Others ... Petitioners/Proposed Parties
AND
Gaddam Mohan Reddy& Others ... Respondents/ Defendants

To,
1. Gaddam Mohan Reddy, S/o. Yella Reddy,Aged about: 67 years, Occ: Agriculture.
2. GaddamSudarshan Reddy, S/o. Yella Reddy,Aged about: 62 years, Occ: Agriculture.
3. GaddamVenkat Reddy, S/o. Yella Reddy,Aged about: 67 years, Occ: Agriculture.All are R/o. Nadergul village, Balapur Mandal, Ranga Reddy Dist, T.S.
4. D.Kasthuri, W/o. D. Ashok, Aged about: 46 years, Occ: Household,R/o. H. No. 10-1-92/3/161/A, Janake Enclave, Lingojiguda, R.R Dist., T.S. ... Respondents/ Defendants

Please take notice that the above application for bringing legal heirs on record is posted for your notice, and as all of you have been dodging to receive the notice, the Hon,ble Courthas directed to take notice by way of paper publication and posted the above suit to **26-12-2024** for your appearance. Therefore, all of you are hereby directed to appear before the Hon'ble Court on **26-12-2024** either in person or through counsel and in the event of your non-appearance on the said day, the said suit will be proceeded with and decided ex-parteas per law.

/ /By Order of the Court//
B. DHANANJAYA,
ADVOCATE
(Counsel for Petitioners/ Proposed Parties)
Office at No.3-5-1090/A/8, Narayanaguda, Hyderabad – 500 029
Cell: 9848662339

ఓయూ ఎస్ఎఫ్ఐ నూతన అధ్యక్షుడిగా ఉదయ్ కుమార్



నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఎస్ఎఫ్ఐ నూతన అధ్యక్షుడిగా కలకోటి ఉదయ్ కుమార్ ఎన్నికయ్యారు. ఓయూ ఆర్ట్స్ కాలేజ్ సెమినార్ హల్‌లో శనివారం ఎస్ఎఫ్ఐ విస్తత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ ఎల్ మూర్తి హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనివర్సిటీలో కేంద్రీకరించి పనిచేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వవిద్యాలయాల పట్ల అనుసరిస్తున్న విధానాలను విద్యార్థుల దష్టికి తీసుకెళ్లాలని, నూతన జాతీయ విద్యా విధానం ముసుగును ఎండగట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ కార్యదర్శి అశోక్, ఓయూ కార్యదర్శి రవి నాయక్, కృష్ణ, నూతన ఉపాధ్యక్షులు అనంత్ శర్మ, అజయ్, మల్బూర్ సహాయక కార్యదర్శి పవన్ కళ్యాణ్‌లను ఎన్నుకున్నారు

ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయూ

డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి శనివారం బాలాపూర్ లోని ఎస్‌టైల్ కన్వెన్షన్ హాల్ నిర్వహించిన స్టైల్ ఎగ్జిబిషన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. నగర మహిళలకు మరింత చేరువగా ఉండే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగించుకోవాలని ఆమె సూచించారు.



శ్రీతేజ కోలుకునేంత వరకు ఆస్పత్రి ఖర్చులు భరిస్తా

- ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ.25 లక్షల ఇస్తా
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- సంధ్య థియేటర్ ఘటన బాలుడిని పరామర్శించిన మంత్రి

నవతెలంగాణ-బేగంపేట

సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ కుటుంబానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రూ.25 లక్షల ఆర్థికసాయం ప్రకటించారు. [illegible]

కుచించుకుపోతున్న పెద్దన్న పెద్దరికం

- నానాటికి తగ్గుతున్న ఓయూ ప్రాధాన్యత
- ఎడ్ సెట్, పీఈ సెట్ కన్వీనర్స్ ఎంపికపై రాద్ధాంతం
- టీజీ సెట్స్‌కు అర్హులున్నా ఇతర వర్సిటీలకు అప్పగింతలపై అసంతృప్తి వ్యక్తం



నవతెలంగాణ-ఓయూ

దేశంలోనే ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయం ఓయూ ప్రాధాన్యత తను గత ప్రభుత్వం మెల్లమెల్లగా తగ్గిస్తే తామేం తక్కువా అంటూ ఈ ప్రభుత్వం కూడా అదే కోవలో తగ్గిస్తున్నట్లుగా [illegible]

నాడు పెద్దన్న పాత్ర మరి నేడు ?

[illegible]

ఎన్‌సీటీఈ నిబంధనలు ఉల్లంఘనేనా ?

[illegible]

ఓయూకు ఇవ్వకపోవడం బాధాకరం

[illegible]



- ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డీన్, మాజీ వీసీ పాలమూరు వీసీ ప్రొ. లక్ష్మీ కాంత్ రాథోడ్

అడిగిన రెండు సెట్స్‌కు పేర్లు ఇచ్చాము



ఓయూ నుండి రెండ్ సెట్స్, లా - సెట్ , ఈ - సెట్ లకు ఉన్నత విద్యామండలి పేర్లు అడిగారు.దానికి కోసం నిబంధనల ప్రకారం ఒక్కొ సెట్ కు మూడు పేర్లు వారికి మేము పంపించాము.

- ఓయూ వీసీ ప్రొ. ఎం.కుమార్

కారణం అని తెలిసింది.

ఉన్నత విద్యామండలికి ఓయూ ప్రొఫెసర్స్ ఫిర్యాదు..

[illegible]

ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన వారినే కన్వీనర్ గా నియమించాలి



ఎడ్ సెట్ మొదటి నుండి ఇప్పటి వరకు ఎడ్యుకేషన్ విభాగానికి సంబం ధించిన విభాగానికి చెందిన ప్రొఫెసర్లనే కన్వీనర్ గా నియమిస్తారు. ఇది ఆనవాయితీగా వస్తుంది. ఎడ్యుకేషన్ ఒక ప్రొఫెషన్ కోర్స్ ఎడ్యుకేషన్ కు చెందిన వారిని నియమిస్తే ఎంట్రెన్స్ టెస్ట్ పారదర్శకంగా ఉంటుందని మా అభిప్రాయం.

- ఓయూ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్



ఘనంగా ఇగ్నైట్ 2024

- సృజనాత్మక ఆలోచనలకు కేరాఫ్ ఇలాంటి వేదికలు : కళాశాల చైర్మెన్ సంజీవ్ రెడ్డి.

నవతెలంగాణ-ఓయూ

హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఇంటర్ కాలేజ్ ఫెస్ట్ ఇగ్నైట్ - 2024కు జంటనగరాల్లోని వివిధ కళాశాలల నుండి 100 మంది పాల్గొన్నారు. [illegible]



'మల్టీ పర్పస్ కమ్యూనిటి హాల్ నిర్మాణం చేపట్టాలి'

సీపీఐ(ఎం) సికింద్రాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన



నవతెలంగాణ-ఓయూ

అడ్డగుట్ట డివిజన్ పరిధిలో నిలిచిన మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను వెంటనే చేపట్టి నిర్మాణం పూర్తి చేయాలని సీపీఐ(ఎం) హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేష్ డిమాండ్ చేశారు. [illegible]

పేదరికం నిర్మూలనలో పొదుపు సంఘాలు కీలకం

- బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్



నవతెలంగాణ - జూబ్లీహిల్స్

పేదరికం నిర్మూలించడంలో పొదుపు సంఘాలు కీలకమని బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. [illegible]

మంచినీటి పైపులైన్ పనులు ప్రారంభం

బోరబండ డివిజన్‌లోని ఎస్ఆర్ఆర్ పురం సైట్ -4 [illegible]



అత్యంత ప్రాధాన్యత కలిగిన బ్రాండ్‌గా ఫ్రీడమ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్

- ఆరోగ్యం, స్వచ్ఛత, రుచిలో నూతన ప్రమాణాలను నెలకొల్పిన ఆయిల్ ఫ్రీడమ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ఫ్రీడమ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను 2024-25కు గాను అత్యంత ఇష్టమైన బ్రాండ్‌లలో ఒకటిగా ఇండియా టుడేతో కలిసి మార్కెట్‌మెన్ డైలీ సంస్థ గుర్తించింది. [illegible]

విల్లా మేరీ కాలేజీలో వైబ్రంట్‌గా విల్లా ఫెస్టా ఉత్సవాలు



నవతెలంగాణ - బంజారాహిల్స్

విల్లా మేరీ కాలేజ్ వైబ్రంట్‌గా విల్లా ఫెస్టా ఉత్సవాలు నిర్వహించారు. [illegible]

హనుమాన్ ఆలయ కమిటీ డైరెక్టర్‌గా ధర్మేందర్ నాయక్



నవతెలంగాణ-ఓయూ

దేవాదాయశాఖ ధర్మాదాయ శాఖ హబ్సిగూడ ఎన్‌జీఆర్ఐ హనుమాన్ ఆలయ కమిటీ డైరెక్టర్ (సభ్యులు)గా శనివారం కాంగ్రెస్ పార్టీ హబ్సిగూడ ప్రధాన కార్యదర్శి ధర్మేందర్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. [illegible]

అరువు సొమ్ము బరువు చేటు

ప్రియమైన నేను గీతికకు...

ఎలా ఉన్నావు తల్లీ? ఆఫీస్ ఫంక్షన్ బాగా జరిగిందా? ఫంక్షన్‌కి నువ్వు కొనుక్కున్న డ్రెస్, ఫాన్సీనగలే వేసుకున్నాను అన్నావు. చాలా మంచి పనిచేశావు. మంచి పని అని ఎందుకు అన్నానంటే... నీ దగ్గర లేకున్నా వెళ్లి కావలసినవి కొనుక్కున్నావు. కొందరికి వేరే వాళ్ళ నగలు బట్టలు వేసుకోవడం అలవాటు. అందుకని ఆ మాట అన్నాను. అరువు సొమ్ము బరువు చేటు అన్నారు పెద్దలు.

నువ్వు చిన్నప్పుడు మన అపార్టుమెంట్‌లో ట్యూషన్ చెప్పించుకోవడానికి వెళ్ళేదానివి. ఒక రోజు ఆ ఆంటి మన ఇంటికి వచ్చి 'ఏవండి మీ బంగారు గొలుసు ఇస్తారా, రేపు మా తమ్ముడి ఇంటికి శుభకార్యానికి వెళ్ళాలి' అని అడిగారు. నాకు చాలా ఆశ్చర్యం, భయం రెండు

అమ్మ లేఖ



వేసాయి. భయం ఎందుకంటే తను అడుగుతుంది బంగారు గొలుసు. ఒక వేళ అది పోతే పరిస్థితి ఏంటీ. ఆ తర్వాత గొడవలు జరిగి ఇద్దరి మధ్య సంబంధాలు తెగిపోతాయి.

ఇక ఆశ్చర్యం ఎందుకంటే ఇతరుల విలువైన వస్తువులను ఇలా నిర్మొహమాటంగా అడగటం. నాకు ఏం చెప్పాలో తోచలేదు. ఆ సమయానికి మొహమాటంతో సరే అన్నాను కానీ, లోలోపల భయంగానే ఉంది. సరే ఏమైతే అది అయ్యింది, ఆవిడ ఫంక్షన్ రోజు వస్తానని చెప్పి వెళ్లారు కదా.. అప్పుడు చూద్దాంలే అనుకున్నాను. ఏమైందో తెలియదు తను రాలేదు. హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నాను. తర్వాత తను కలిసినా నేను ఆ ప్రస్తావన తీసుకురాలేదు.

ఈ విషయాలన్నీ నీకెందుకు చెబుతున్నానంటే. నువ్వు ఒక విషయం తెలుసుకోవాలి. చిన్న చిన్న వస్తువులంటే ఇచ్చినా పర్వాలేదు కానీ. ఎప్పుడు కూడా విలువైన వస్తువులు అంటే వెండి, బంగారం, పట్టు చీరలు వంటివి ఎవరికీ ఇవ్వొద్దు. అడగవద్దు. పోయిన తర్వాత ఎవరినీ ఏమి అనలేము. బాధపడటం తప్ప మిగిలేది ఏమీ ఉండదు. గొడవలు, మాట్లాడకోక పోవడం మొదలవుతాయి. ఇవన్నీ అవసరమా? మనకు ఉన్నదాంట్లో తయారై వెళ్ళాలి. తక్కువ ధరవైనా పర్లేదు కొన్ని మంచి దుస్తులు కొనుక్కోవాలి. మనవి మాత్రమే వేసుకోవాలి.

కొందరు వేరే వాళ్ళ బట్టలు, చెప్పులు, హాండ్ బాగ్‌లు, నగలు వేసుకుని తిరుగుతుంటారు. ఇలాంటి అలవాట్లు నువ్వు ఎప్పటికీ అలవర్చుకోకు. ఇంకొకరి దగ్గర అడిగి తీసుకోవద్దు. సరేనా బంగారు తల్లి. ఉంటాను మరి...



ప్రేమతో అమ్మ
- పాలపర్తి సంధ్యారాణి



ఆటిజం పిల్లల కోసం 'బటర్‌ఫ్లై స్పెషల్ వింగ్స్'

అందరిలాగే ఆటుపోట్లు ఎదుర్కొంది. అవమానాలకూ గురైంది. ఓ కార్పొరేట్ కళాశాలలో చిన్నచూపు భరించింది. అయినా కుంగిపోలేదు. పట్టుదలతో 'సీతాకోకచిలుక'లా తనకంటూ ఓ రంగుల ప్రపంచాన్ని నిర్మించుకోవాలనుకుంది. అవయవాలన్నీ సక్రమంగా ఉన్న పిల్లలే వర్ణనాతీతమైన బాధలు అనుభవిస్తుంటారు. ఇక మానసిక ఎదుగుదల లేని పిల్లల పరిస్థితి ఏంటి..? వారిని కన్న తల్లిదండ్రుల అవస్థలేంటి..? ఇవే ఆమెను ఆటిజం వైపు నడిపించాయి. బటర్‌ఫ్లై స్పెషల్ వింగ్స్ స్థాపనకు బీజం వేశాయి. మానసిక ఎదుగుదల లోపించిన చిన్నారుల తల్లిదండ్రులకు ఖమ్మంలోని ఈ స్పెషల్ థెరపీ కంప్లీట్ ట్రైనింగ్ సెంటర్ ఆశాకిరణంగా అవతరించింది. 'ఆటిజం పిల్లల్లో' పరిపక్వతకు మరో పేరైంది. వారిలో విశ్వాసం, పరివర్తనతో కూడిన ఆమోదయోగ్యమైన సరికొత్త ప్రారంభానికి వేదికగా నిలుస్తోంది. ఏంటీ బటర్‌ఫ్లై స్పెషల్ వింగ్స్... తెలుసుకోవడానికి ముందు దీని ఫౌండర్ అండ్ చైర్‌పర్సన్ డాక్టర్ లక్ష్మి ఆకుల మనోగతం క్లుప్తంగా...

లక్ష్మి తల్లిదండ్రులు భారతి, రాంగోపాల్. వీరికి ఈమె చివరి సంతానం. ఆమె తల్లి ఓ స్ట్రాంగ్ ఉమెన్. బట్టల వ్యాపారం చేస్తూ పిల్లల్ని పోషించింది. ఎంఎస్సీ మెడికల్ సైన్స్ చదివిన లక్ష్మి 2010లో హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా రూ.3,000 వేతనానికి ఉద్యోగంలో చేరారు. అక్కడ ఆమెకు ఎదురైన అనుభవాలతో డాక్టర్ అవ్వాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే 2010లో ఆమెకు పెళ్లైంది. భర్త బి.భానుప్రకాశ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. అత్తమామలు నిర్మల, బీవీ ప్రసాద్. మామయ్య బ్యాంక్ మేనేజర్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. వీరంతా చేదోడు వాదోడుగా ఉంటూ లక్ష్మిని చదువు కొనసాగించేలా ప్రోత్సహించారు.



అవకాశాలు వచ్చినా వదిలేసి

కుటుంబ సహకారం వల్ల పెండ్లయిన మహిళలకు ఉండే ఆంక్షలేవీ ఆమెకు లేవు. అందుకే ముందుకెళ్లగలిగారు. మలేషియాలోని లింకన్ యూనివర్శిటీలో బ్రెస్ట్ క్యాన్సర్ లైన్స్‌లో పీహెచ్‌డీ సీటు సాధించారు. డాక్టర్ పూర్ణచందర్‌రావు ఆమెకు మెంటార్‌గా వ్యవహరించారు. భవిత గవర్నమెంట్ ఇనిస్టిట్యూషన్ నుంచి స్పెషలిస్ట్ ఇన్ ఆటిజం (న్యూరలాజికల్ డిజార్డర్- మెదడుకు ఆలస్యంగా సంకేతాలు అందటం)పై అధ్యయనం చేశారు. తర్వాత ప్రొఫెసర్‌గా అనేక అవకాశాలు వచ్చాయి. విదేశాలకు వెళ్తే మంచి భవిష్యత్తూ ఉంటుంది. కానీ అవేవీ ఆమె వద్దనుకున్నారు. నేర్చుకున్న విద్య మన దేశంలోని పిల్లలకే ఉపయోగించాలనుకున్నారు. అందుకే ఆటిజం పిల్లల కోసం ఓ సంస్థను స్థాపించారు.

బటర్‌ఫ్లై 'స్పెషల్' వింగ్స్‌తో మారిన భవిత...

బటర్‌ఫ్లై స్పెషల్ వింగ్స్ అనేక మంది మానసిక వైకల్యం ఉన్న పిల్లల భవితను మార్చింది. ఖమ్మంలో ఈ కంప్లీట్ ట్రైనింగ్ సెంటర్‌ను రెండు బ్రాంచీలుగా నిర్వహిస్తున్నారు. 20 మందికి పైగా థెరపిస్టులు వీటిలో పనిచేస్తున్నారు. ఇందులో 50 మంది ఆటిజం పిల్లలకు తగ్గకుండా ట్రైనింగ్ ఇస్తున్నారు. ఫీజుల విషయంలో తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టకుండా ఆర్థికస్తోమతను బట్టి వసూలు చేస్తున్నారు. మున్సిపల్ కార్మికులు మొదలు ఎన్ఆర్ఐల పిల్లల వరకు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. కేసు తీసుకునేటప్పుడే తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పిల్లల్లో మానసిక ఎదుగుదల తీసుకు వస్తామనే నమ్మకం ఉంటేనే చేర్చుకుంటున్నారు. బ్రెయిన్ డిపెక్ట్స్, చెబితే అర్థం చేసుకుంటారా? ఐ కాన్టాక్ట్, కూర్చొనే సామర్థ్యం ఉందా? అనే అంశాలను పరిశీలించాకే పిల్లలను జాయిన్ చేసుకుంటున్నారు.

ఆటిజం అంటే ఏంటి?

ఆటిజం అనేది మెదడు వృద్ధికి సంబంధించిన సమస్య. దీన్ని పిల్లల ఒకటి, రెండేండ్ల వయసులోపు గుర్తించాలి. పిల్లలు మాట్లాడేటప్పుడు కండ్లలో కండ్లుపెట్టి మాట్లాడకపోవడం, తరచూ చేసిన పనే చేయటం, ఒంటరిగా ఆడుకోవడం, చెప్పిన పదాలే మళ్లీ మళ్లీ చెప్పడం, తమ అవసరాలను గుర్తించపోవడం, ఆకలైనా..వాష్‌రూమ్‌కు వెళ్లాలన్నా తెలియకపోవడం... వంటి లక్షణాలు ఉంటే ఆ పిల్లలు ఆటిజం బారిన పడినట్టే. దీన్ని ఎంత చిన్నవయసులో గుర్తిస్తే అంతమంచిది. 2017 నాటికి అభివృద్ధి చెందిన దేశాలలో 1.5శాతం మంది పిల్లలు ఏఎస్‌డీ (ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్)తో బాధపడుతున్నారు. పిల్లలు ఎక్కువగా జన్యుపరమైన సమస్యల వల్ల ఆటిజం బారిన పడుతున్నట్లు నిపుణులు గుర్తించారు.

పిల్లలకే కాదు...

16 ఏండ్లు వచ్చినా బుద్ధిమాంద్యంతో ఓ యువకున్ని అతని తల్లిదండ్రులు బటర్‌ఫ్లై స్పెషల్ వింగ్స్‌లో చేర్పించేందుకు సంప్రదించారు. ఆ వయసు కుర్రాన్ని చేర్చుకునేందుకు సంశయించినా తల్లిదండ్రుల బలవంతంపై తీసుకున్నారు. రోజుకు గంట ట్రైనింగ్ ఇచ్చి ఏడాది తిరగకముందే అతనిలో మార్పు తీసుకొచ్చారు. ప్రస్తుతం కిరాణషాపు నిర్వహిస్తూ మంచి ఆదాయాన్ని ఆ విద్యార్థి సంపాదిస్తుండటం గొప్ప విషయం.

బటర్‌ఫ్లై స్పెషల్ వింగ్స్ ప్రత్యేకతలు

బటర్‌ఫ్లై స్పెషల్‌వింగ్స్‌లో స్పీచ్ థెరపీ, యాక్టివిటీ క్లాసెస్, ఆకుపేషనల్ థెరపీ, సెన్సోరీ ఇంటిగ్రేషన్ థెరపీ, లైఫ్ స్కిల్స్ ట్రైనింగ్, పేరెంటెల్ కౌన్సెలింగ్, ఫిజియోథెరపీ, మ్యూజిక్ థెరపీ, డ్రాయింగ్ వంటి ప్రత్యేక సౌకర్యాలు ఉన్నాయి. డాక్టర్ లక్ష్మీతో పాటు సీనియర్ థెరపిస్టు సుకృతి, విజయ ఆధ్వర్యంలో నిష్ణాతులైన పదిమంది థెరపిస్టులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఆటిజం, ఏడీహెచ్‌డీ, డౌన్స్ సిండ్రోమ్, స్పెషల్ కేసెస్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి రాత్రి 8 వరకు రోజుకు 11 గంటల పాటు పిల్లలను తమతోనే ఉంచుకొని ఓపికతో శిక్షణ ఇస్తున్నారు. ఆటిజం బారిన పడిన అనేక మంది పిల్లల తల్లిదండ్రులు ఖమ్మం నుంచే కాదు చుట్టుపక్కల జిల్లాల నుంచి కూడా వచ్చి ఇక్కడే ఉంటూ తమ పిల్లలకు ట్రైనింగ్ ఇప్పిస్తున్నారంటే అతిశయోక్తి కాదు.



సామాజిక సేవలోనూ మేటి...

సామాజిక సేవలోనూ లక్ష్మి తన ప్రత్యేకత చాటుతున్నారు. మొన్నటి మున్నేరు వరదల్లో చిక్కుకున్న వందలాది మందికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అలాగే క్యాన్సర్ పేషెంట్స్‌కు, వృద్ధాశ్రమాలకు తనవంతు సహాయం అందిస్తున్నారు. వేసవిలో మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. ఇలా ఆమె నెలకో సేవ కార్యక్రమమైనా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 22 నెలలుగా దీన్ని కొనసాగిస్తున్నారు. అనాథపిల్లలకు స్టేషనరీ, నిరుపేదలకు బియ్యం బస్తాలు, కూరగాయల పంపిణీ వంటి సేవ కార్యక్రమాలు అనేకం నిర్వహిస్తున్నారు. ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆమె జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డులు అందుకున్నారు. కిట్స్ ఫార్మసీ, కాకినాడ నుంచి జేడీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా, యూఏఈ- ఇండో బెస్ట్ రిసెర్చ్ అవార్డు -2022 తో పాటు బయోకెమెస్ట్రీలో ఐఎంఆర్ఎఫ్ అవార్డును డాక్టర్ మహమూద్ నుంచి దుబాయ్‌లో అందుకున్నారు.

- కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం

ప్రజల ప్రాణాలతో చెలగాటమా ?

- సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'కొడుకు ఆ హీరో అభిమాని. కొడుకు కోసం ఒక్కో టికెట్ రూ.3 వేల చొప్పున రూ.12వేలు పెట్టి ఆ కుటుంబం సినిమా టికెట్లు కొన్నది. థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో తల్లి చనిపోయింది. పిల్లవాడు చావుబతుకుల మధ్య ఉన్నాడని పోలీసులు చెప్పినా ఆ హీరో వినలేదు. రోడ్‌షో మాదిరిగా వెళ్లటం వల్లే ఈ ఘటన జరిగింది. నేటికీ చిన్నారిని ఆ హీరో పరామర్శించలేదు. అలాంటి మానవత్వం లేని వాళ్ళను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్తే తప్పేంటి? పదేండ్లు మంత్రులుగా చేశామని గొప్పగా చెప్పుకునే వాళ్లు కూడా ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. చావుకు కారణమైన వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిస్తే తప్పు పట్టి ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని ఎంతో నీచమైన భాష వాడారు. ఈ ఘటనపై కొన్ని రాజకీయ పార్టీలు పైశాచికత్వం ప్రదర్శించాయి' అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఇలాంటి ఘటనలు జరిగితే సినిమాలకు ప్రత్యేక రాయితీలు, బెనిఫిట్ షోలుండవని స్పష్టం చేశారు. సంధ్య థియేటర్ ఘటనపై పోలీసుల విచారణ కొనసాగుతున్నదనీ, బాధ్యులకు శిక్ష తప్పదని అన్నారు. శనివారం శాసనసభలో ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ.. 'పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ చనిపోయింది. ఓ పిల్లాడు చావుబతుకుల మధ్య కోమాలో ఉన్నాడు. అసలు ఆ ఘటన ఎలా జరిగిందనే దానిపై ప్రభుత్వం సభలో ఒక ప్రకటన చేయాలి' అని డిమాండ్ చేశారు. తాను మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల్లో పెద్దపెద్ద బహిరంగ సభల్లో పాల్గొన్నా ఇలాంటి బాధాకర ఘటనలు జరగలేదన్నారు. ప్రభుత్వం ఎందుకు భద్రత ఏర్పాటు చేయలేదు? హీరో రక్షణ కోసం బౌన్సర్లు ప్రజలను తోసేయడమేంటి? అని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ..సంధ్య థియేటర్ ఘటన ప్రస్తావన సభలో వస్తుందని అనుకోలేదన్నారు. ఇలాంటి ఘటన జరగడం బాధాకరమన్నారు. పుష్ప-2 సినిమా రిలీజ్ సందర్భంగా సంధ్య థియేటర్‌కు హీరో అల్లు అర్జున్, హీరోయిన్, ఇతర సినిమా బృంద సభ్యులు వస్తారనీ, అనుమతి ఇవ్వాలని యాజమాన్యం డిసెంబర్ 2వ తేదీన చిక్కడపల్లి పోలీసులకు దరఖాస్తు పెట్టుకుందన్నారు. సంధ్య థియేటర్ లోపలికి వెళ్లేందుకు, బయటకు వచ్చేందుకు ఒకే దారి ఉందనీ, పక్కనే రెస్టారెంట్లు, పలు థియేటర్లు ఉండటంతో సెలెబ్రిటీలు వస్తే ఇబ్బందులు తలెత్తుతాయని చిక్కడపల్లి సీఐ అనుమతికి నిరాకరించారన్నారు. ఇదే విషయాన్ని రాతపూర్వకంగా లెటర్ ద్వారా ఇచ్చారన్నారు. అనుమతి ఇవ్వకపోయినా పుష్ప సినిమా హీరో థియేటర్‌కు వెళ్లారని చెప్పారు. అతను కేవలం థియేటర్‌కు వెళ్లి సినిమా చూసి వెళ్ళిపోతే అభ్యంతరం ఉండేది కాదన్నారు. థియేటర్‌కు వెళ్ళేటప్పుడు రోడ్డుపై కారు రూఫ్ టాప్ ఓపెన్ చేసి రోడ్ షో చేసుకుంటూ వెళ్లారనీ, అన్ని థియేటర్ల నుంచి అభిమానులు ఒకేసారి రోడ్డు మీదకు రావడంతో నిరంతరం రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో పరిస్థితి ఇబ్బందికరంగా మారిందన్నారు. సంధ్య థియేటర్ లోనికి వెళ్లేందుకు గేటు తీసి లోపలికి వెళ్లే సమయంలో పెద్దఎత్తున అక్కడ ప్రజలు పోగుకావడం, మరోవైపు బౌన్సర్లు అభిమానులను దూరంగా నెట్టేయడం, అభిమానులు ముందుకు తోసుకురావడం అక్కడ తొక్కిసలాటకు కారణమైందని వివరించారు. పోలీసులు అక్కడున్నవారందనీ పక్కకు చెదరగొట్టి చూడగా తొక్కిసలాటలో తల్లి రేవతి చనిపోయిందనీ, ఆమె కొడుకు కోమాలోకి వెళ్ళాడని ఆవేదన వ్యక్తం చేశారు. అంత తొక్కిసలాటలో కూడా ఆ తల్లి కొడుకు చేయి విడిచిపెట్టలేదనీ, బిడ్డపై తల్లి ప్రేమ అలాంటిదని ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. చివరకు కొడుకు చేయి పట్టుకునే తల్లి ప్రాణాలు విడిచిందన్నారు. ఈ విషయాన్ని హీరోకు చెప్పి అక్కడ నుంచి పంపించేద్దామని చూసినా పోలీసులను లోనికి వెళ్లనీయకుండా బౌన్సర్లు అత్యుత్సాహం చూపారని తెలిపారు. థియేటర్‌లో హీరో సినిమా చూసే సమయం లోనూ కింది నుంచి అభిమానులు షేక్ హ్యాండ్ ఇచ్చేందుకు బాల్కనీలోకి ఎక్కిపోయే క్రమంలోనూ తొక్కిసలాట జరిగిందన్నారు. ఈ విషయాన్ని హీరోకు ఏసీపీ చెప్పినా శాంతి భద్రతలు చేయి దాటే ప్రమాదం ఉందని హెచ్చరించినా హీరో అల్లు అర్జున్ వినకుండా బాధ్యతారాహిత్య సమాధానాలు చెబుతూ దురుసుగా ప్రవర్తించారని పోలీసులు చెప్పార న్నారు. బయటకు వెళ్లడానికి హీరో ఒప్పుకో లేదని సిటీ కమిషనర్ తెలిపారన్నారు. అక్కడ నుంచి వెళ్లకపోతే అరెస్టు చేస్తామని హెచ్చరించి బలవంతంగా హీరోను కారు ఎక్కించి పంపే యత్నం చేశారన్నారు. అంత జరిగాక కూడా వెళ్ళేటప్పుడు కూడా ఆ హీరో కార్ రూఫ్ టాప్ ఓపెన్ చేసి రోడ్ షో చేస్తూ వెళ్లడమేంటని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో హీరోపై , యాజమాన్యం పై పోలీసులు కేసు పెట్టారని చెప్పారు. బాధ్యతారాహిత్యంగా సమాధానాలు ఇవ్వడం వల్లే పోలీసులు వారి విధి నిర్వహణలో భాగంగా కేసు నమోదు చేశారన్నారు. సినీ పరిశ్రమను ప్రోత్సహించాలని భావించి తమ ప్రభుత్వం ప్రత్యేక షోలకు అనుమతి ఇస్తే హీరోలు ఇలా చేయడమేంటని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రాణాలు బలి తీసుకుంటే వాళ్లను ఏమీ అనొద్దనటమే న్యాయమా? సినీ, రాజకీయ ప్రముఖులకు ప్రత్యేక చట్టం ఏమైనా చేశారా? అని అడిగారు. ఓ పక్క తల్లి చనిపోయి..మరోపక్క పిల్లవాడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేసులో హీరో అరెస్టు అయితే, ఒక్కరోజు జైలుకుపోతే ఇంత హడావిడి ఎందుకు? హీరో ఇంటికి పోయి క్యూకట్టి మరీ ప్రభుత్వాన్ని తిట్టడమేంటి? ఆయన కాలు పోయిందా? కన్ను పోయిందా? కిడ్నీ కరాబైందా? సీఎంగా తనపై ఈ తప్పుడు ప్రచారాలు, పోస్టింగ్‌లు ఏంటి? అని ప్రశ్నల వర్షం కురిపించారు. అంబేద్కర్ రూపొంది ంచిన రాజ్యాంగానికి లోబడే తమ ప్రభుత్వం నడుచుకుంటోందన్నారు. జైలుకు వెళ్లి వచ్చిన హీరో ఇంటికి క్యూ కట్టిన సినీ ప్రముఖుల్లో.. బాధిత కుటుంబాన్ని ఒక్కరైనా కలిశారా? అని ప్రశ్నించారు. ఇంతవరకు ఆ స్టార్ పిల్లాడిని పరామర్శించలేదని విమర్శించారు. మంత్రి సీతక్క, అధికారులు అక్కడకు వెళ్లి పిల్లాడిని పరామర్శించారనీ, ప్రభుత్వం నుంచి వైద్యం అందేలా చూస్తున్నారని తెలిపారు. సినీ ఇండస్ట్రీలో ఉన్న ప్రముఖులు ఏం కోరుకుంటున్నరో తెలియడం లేదన్నారు. 'వ్యాపారాలు చేసుకోండి... ప్రజల ప్రాణాలతో చెలాగాటమాడటానికి మేం ఒప్పుకోం' అని స్పష్టం చేశారు. తాము అధికారంలో ఉన్నంత కాలం అలాంటి ఆటలు సాగవని హెచ్చరించారు. కేసును విచారించా ల్సిందే..బాధ్యులకు శిక్ష వేయాల్సిందే అని స్పష్టం చేశారు.

కావాలని చేసింది కాదు..

- సినీ హీరో అల్లు అర్జున్

'నాపై చేసినవన్నీ తప్పుడు ఆరోపణలే. నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నా వ్యక్తిత్వాన్ని దిగజార్చేలా చేస్తున్న ఆరోపణలను మనసుకి తీసుకోలేకపోతున్నాను' అని హీరో అల్లుఅర్జున్ ఆవేదన వ్యక్తం చేశారు.సంధ్య థియేటర్ ఘటనపై అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో శనివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. తన వ్యవహారశైలిపై వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. తన క్యారెక్టర్‌ను తక్కువ చేసే ప్రయత్నం జరుగుతోందంటూ భావోద్వేగానికి గురయ్యారు. అల్లుఅర్జున్ మాట్లాడుతూ, 'సినిమా రిలీజ్ టైమ్‌లో థియేటర్ యాజమాన్యం, పోలీసులు, మా వాళ్ళు.. ఇలా అందరూ ఓ మంచి ఇంటెన్షన్‌తోనే ఉన్నప్పటికీ అనుకోకుండా ఈ ఘటన జరిగింది. ఇది కావాలని ఎవ్వరూ చేసింది కాదు. ఓ యాక్సిడెంట్ మాత్రమే. అయితే ఈ విషయంలో నాపై చేసినవ్నీ తప్పుడు ఆరోపణలే. నేను థియేటర్ దగ్గర ఎలాంటి రోడ్ షో చేయలేదు. విపరీతమైన జనం కారణంగా థియేటర్‌కి కొంచెం దూరంలో నా కారు ఆగిపోయింది. చేయి చూపిస్తూ ముందుకు కదలండని పోలీసులు చెబితేనే, నేను బయటకు వచ్చి చేతులు ఊపాను. రేవతి చనిపోయినట్టుగాని, ఆమె కొడుకు చావు బతుకుల్లో ఉన్నట్టుగానీ ఏ పోలీస్ అధికారి నాకు చెప్పలేదు. థియేటర్ బయట చాలా పెద్ద క్రౌడ్ ఉందని, మీరు ఇక్కడ్నుంచి వెళ్తే బాగుంటుందని మా వాళ్ళు చెబితే, వెంటనే అక్కడ్నుంచి వెళ్ళిపోయాను. జరిగిన ఘటన గురించి నాకు తరువాత రోజు తెలిసి, చాలా బాధపడ్డాను. బాధితులను కలవమని మా బన్నీవాసుకి చెప్పాను. నేనూ వెళ్ళాలని సిద్ధమయ్యాను. హాస్పిటల్‌కి వెళ్ళిన బన్నీవాసు అక్కడి పరిస్థితి చెప్పి, నాపై కేసు నమోదు చేశారని చెప్పాడు. దీంతో లీగల్‌గా అక్కడికి వెళ్ళడానికి సాధ్యపడలేదు. అందుకే వెంటనే బాధిత కుటుంబానికి అండగా ఉంటానని చెబుతూ వీడియోని రిలీజ్ చేశా. హాస్పిటల్‌లో ఉన్న బాబు శ్రీతేజ్ పరిస్థితి గురించి ఎప్పటికప్పుడు మా వాళ్ళతో కనుక్కుంటున్నా. మా నాన్నని, దర్శకుడు సుకుమార్‌ని.. ఇలా మావాళ్ళని పంపాలని ప్రయత్నించా. కానీ కేసు వలన వాళ్ళు హాస్పిటల్‌కి వెళ్ళలేకపోయారు. హాస్పిటల్‌కి మేం వెళ్ళలేనంత మాత్రానా మేం అస్సలు బాధపడటం లేదంటే ఎలా?, నా అభిమానులే కాదు.. ఏ హీరో అభిమానులకూ ఏమైనా జరిగితే వెంటనే ఆదుకుంటా.. ఎంత దూరమైన సరే వెళ్ళి పరామర్శిస్తా.. అలాంటిది నా అభిమాని కుటుంబానికి ఇలా జరిగిందంటే నేనెలా సంతోషంగా ఉంటాను?, అసలు నేను సినిమాలు చేసేదే వాళ్ళ కోసం.

థియేటర్లను నేను దేవాలయంగా భావిస్తా. థియేటర్లకి వచ్చే నా అభిమానులకు, ప్రేక్షకులకు వినోదాన్ని అందించాలనేదే నా తపన. థియేటర్ దగ్గర ఘటన జరిగినప్పుడు నా వెంట నా బాబు, పాప ఉన్నారు. ఓ తండ్రిగా నాకూ బాధ్యత తెలుసు. అలాంటిది ఓ తల్లి చనిపోయిందని, బాబు చావు బతుకుల్లో ఉన్నాడని తెలిస్తే నేనెలా బాధ్యతారాహిత్యంగా థియేటర్ నుంచి వెళ్తాను. నేను ఇలా చేశాను, అలా చేశాను.. అంటూ నా వ్యక్తిత్వం గురించి తక్కువ చేస్తూ ఆరోపణలు చేస్తున్నారు. వీటిని నా మనసుకి తీసుకోలేకపోతున్నా. నా సినిమా అనేకాదు గత కొన్నేండ్లుగా అదే థియేటర్‌లో సినిమాలు చూస్తున్నా. పైగా నేను చేసిన సినిమాని తప్పకుండా చూస్తాను. ఎందుకంటే వందల కోట్లు పెట్టి తీసిన సినిమా ఎలా ఉందనే విషయం ముందు నాకు తెలియాలి.

ఆ టైమ్‌లో చాలా విషయాలు నేర్చుకుంటాను. ముున్ముందు ఇవన్నీ నాకెంతో ఉపయోగపడతాయి. ఆ ఉద్దేశంతోనే నేను థియేటర్‌కి వచ్చి సినిమాని చూశానే తప్ప, ఏదో రోడ్ షో చేయాలని మాత్రం కాదు. పైగా పోలీసులు ఇచ్చిన డైరెక్షన్‌లోనే థియేటర్ లోపలికి వెళ్ళా. అలాంటప్పుడు పర్మిషన్ లేదని నేనెలా అనుకుంటాను?. బాబు శ్రీతేజ్ ట్రీట్‌మెంట్‌కి రెస్పాండ్ అవుతున్నాడని తెలిసి కొంచెం ఊపిరిపీల్చుకున్నా. అతని కుటుంబానికి అండగా ఉండాలని పెద్ద మొత్తంలో ఫిక్స్ డిపాజిట్ చేయాలనుకున్నాం. అలాగే ఫిజియోథెరపీ కూడా చేయించాలని అనుకున్నాం. బాధ్యతగా లేకపోతే ఇవన్నీ ఆలోచించం కదా. 'పుష్ప2' సినిమా ప్రపంచవ్యాప్తంగా ఎంతో గొప్పగా ఆడుతుంది. ఎన్నో చోట్ల సక్సెస్‌మీట్ ఫంక్షన్లు చేయాలనుకున్నాం. జరిగిన ఘటన దృష్ట్యా వీటిని వద్దనుకున్నాం. తెలుగువాళ్ళ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని నేను ప్రయత్నం చేస్తుంటే, తప్పుడు ఆరోపణలతో నా వ్యక్తిత్వాన్ని దిగజార్చుతూ మనల్ని మనమే కిందకు లాక్కోవడం బాధగా ఉంది. నాపై చేస్తున్న ఆరోపణలన్ని నూటికి నూరు శాతం అవాస్తవం' అని చెప్పారు.

కేజ్రీవాల్‌పై విచారణకు ఎల్‌జీ అనుమతి ?

(మొదటిపేజీ తరువాయి)

కేసులో ప్రభుత్వ ముందస్తు అనుమతి లేనిదే ఉద్యోగులను విచారించకూడదని నవంబర్ 6న సుప్రీంకోర్టు రూలింగ్ ఇచ్చింది.

కేజ్రీవాల్‌ను ఈడీ, సీబీఐ మార్చి 21, జూన్ 26 తేదీలలో అరెస్ట్ చేశాయి. ఎక్సైజ్ పాలసీ కుంభకోణానికి సంబంధించి ఆయనపై మనీ లాండరింగ్, అవినీతి కేసులు నమోదు చేశారు. అయితే ఈ రెండు కేసుల్లోనూ సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసింది. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు చేసిన అవమానం నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేజ్రీవాల్ విచారణకు లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి ఇచ్చారంటూ అబద్ధం ఆడుతున్నారని ఢిల్లీ మాజీ మంత్రి, ఆప్ నేత మనీష్ సిసోడియా ఆరోపించారు. 'కేజ్రీవాల్‌ను విచారించేందుకు అనుమతి ఇచ్చి ఉంటే ఈడీ దాని ప్రతిని ఎందుకు చూపడం లేదు? ఇది తప్పుడు, తప్పుదోవ పట్టించే వార్త అన్నది సుస్పష్టం. ప్రజల దృష్టిని దారి మళ్లించేందుకు తప్పుడు హామీలు ఇవ్వడం ఆపేయండి' అని ఆయన అన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్ మంజూరు చేసిన అనుమతి లేఖను చూపాలని ఆప్ ప్రధాన ప్రతినిధి ప్రియాంక కక్కర్ కూడా ఈడీని కోరారు.

విషాహారంపై రాజకీయాలు తగవు

(మొదటిపేజీ తరువాయి)

ఒక్కో గురుకులంలో అత్యధికంగా 640 మంది వరకు, కేజీబీవీల్లో 360 మంది వరకు, మోడల్ స్కూళ్లలో వంద మంది వరకు విద్యార్థులున్నారని చెప్పారు. నిజంగా ఎవరి నిర్లక్ష్యం వల్లనైనా ఘటన జరిగినట్టు బాధ్యులను గుర్తిస్తే వారిపై చర్యలు తీసుకోవచ్చని అభిప్రాయపడ్డారు. అయితే అకస్మాత్తుగా జరిగే వాటికి పెద్ద ఎత్తున స్పందించడం ద్వారా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో భయాందోళన వ్యక్తమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. గురుకులాలు, కేజీబీవీలు, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో క్వార్టర్స్ లేకపోవడంతో ఉపాధ్యాయులు దూరం నుంచి వస్తున్నారని చెప్పారు. కొన్ని చోట్ల క్వార్టర్స్ ఉన్నా ... శిథిలావస్థలో ఉన్నాయని తెలిపారు. క్వార్టర్స్ నిర్మిస్తే టీచర్లు అక్కడే ఉండేందుకు అవకాశముంటుందని చెప్పారు.

ప్రతీక్ ఫౌండేషన్ నుంచి రూ.25 లక్షలు

- రేవతి కుటుంబానికి ప్రభుత్వ పరంగా అండగా ఉంటాం
- ఇకపై టికెట్ల రేట్ల పెంపు బెనిఫిట్ షోలుండవు : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


పుష్ప -2 సినిమా విడుదల సందర్భంగా సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో రేవతి మరణించడం బాధాకరమనీ, ఆమె కుటుంబానికి కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ నుంచి ప్రభుత్వం ద్వారా రూ.25 లక్షలు అందజేస్తామని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటిం చారు. ఆమె కుమారుడు శ్రీతేజ వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని హామీని చ్చారు. శనివారం శాసనసభలో ఆయన మాట్లాడారు. ఇకపై సినిమాల విడు దలకు ముందుకు ఎలాంటి బెనిఫిట్ షోలుండవనీ, టికెట్ల రేట్ల పెంపునకు అను మతివ్వబో మని నొక్కిచెప్పారు. ప్రత్యేక సందర్భాల్లోనూ మినహాయింపు అంశంపై సమీక్షిస్తామ న్నారు. హీరోలు కూడా థియేటర్లకు వెళ్లవద్దని సూచించారు. రేవతి కుటుంబానికి పరిహారం ఇస్తానని చెప్పి అల్లు అర్జున్ హామీ నిలబెట్టుకోలేదని విమర్శించారు.

పంటల బీమాను పునరుద్ధరిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. శనివారం శాసనసభలో రైతు భరోసాపై స్వల్పకాలిక చర్చను చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు. అన్ని పంటలకూ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని పరిశీలిస్తామన్నారు. రైతులకు మరింత న్యాయం చేసేందుకుగానూ కేంద్రం సహాయం తీసుకుంటామన్నారు. రైతుభీమా యథాతథంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. 1400 కోట్ల రూపాయల ప్రీమియం చెల్లించామన్నారు. రైతు భరోసాను కొనసాగిస్తామన్నారు. తమది రైతు ప్రభుత్వమని చెప్పడానికి బడ్జెట్‌లో 35 శాతం నిధులు కేటాయించడమే నిదర్శనమని చెప్పారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో సన్నాలను పండించే రైతుల శాతం 61 శాతానికి పెరిగిందని తెలిపారు.

చలి చంపేస్తోంది



(మొదటిపేజీ తరువాయి)

అలాగే 1891 నుంచి ఇది మూడో కనిష్ట ఉష్ణోగ్రత అని వాతావరణ శాఖ తెలిపింది. పహల్గాం, గుల్మార్గ్, కొనిబాల్, పాంపోర్, ఖాజిగుండ్, కుప్వారా వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు క్షీణించాయి. తక్కువ ఉష్ణోగ్రతతో దాల్ సరస్సులో చాలా భాగం గడ్డకట్టింది. అలాగే లోయలోని అనేక ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుంది. కాగా, చిల్లై కాలన్ అనేది దాదాపు 40 రోజుల పాటు ఉంటుంది. ఈ సారి ఈ కాలం 2025 జనవరి 31 వరకూ ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీని తరువాత చిల్లై-ఖుర్ద్ (చిన్న చలి), చిల్లై-బచ్చా (పిల్లల జలుబు) అనే శీతాకాలాలు కూడా జమ్ముకాశ్మీర్‌లో ఉంటాయి.

క్యూబాపై అమెరికా దుష్ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

క్యూబాను కొనసాగించడం, నిర్దాక్షిణ్యంగా ఆంక్షలను అమలు చేయడం తక్షణమే విరమించాల్సి వుందని అధ్యక్షుడు స్పష్టం చేశారు. తమ హక్కులు, సార్వభౌమాధికారం విషయంలో క్యూబన్లు అందరూ సమైక్యతతోనే వున్నారని ఈ ప్రదర్శన మరోసారి స్పష్టం చేసింది.



19 ఏండ్లుగా ఆశాలతో వెట్టి

వారికి ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలివ్వాలి

- ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలి
- కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి సేవలు : సీఐటీయూ నేతలు చుక్క రాములు, ఎస్.వీరయ్య
- సంగారెడ్డి, వికారాబాద్‌లో ఆశా కార్మికుల జాతాకు ఘన స్వాగతం

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి/వికారాబాద్ కలెక్టరేట్

జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా ఆశా కార్మికులతో 19 ఏండ్లుగా పాలకులు వెట్టి చేయించుకుంటున్నారని, వారికి ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ఉపాధ్యాక్షులు ఎస్.వీరయ్య అన్నారు. ఆశా కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో చేపట్టిన జాతా శనివారం సంగారెడ్డికి, ఆ తర్వాత వికారాబాద్‌కు చేరుకుంది. సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద వేలాది మంది ఆశా కార్మికులు జాతాకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి శ్రద్ధ స్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో నాయకులు మాట్లాడుతూ.. 19 సంవత్సరాలుగా ఆశా వర్కర్లు ఎంతో కష్టపడి అనేక రకాల పనులు చేస్తున్నా ఇప్పటి వరకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించకుండా పారితోషికం మాత్రమే ఇస్తున్నారన్నారు. వేతనం పెంచాలని అడిగితే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రోజు వేతనం రూ.178 సరిపోతుందని చెప్పడం సిగ్గు చేటన్నారు. ధరలు పెంచడం తప్ప కార్మికుల బతుకుల్ని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఆశాలతో అధిక పనులు చేయించుకుంటున్నా కనీస వేతనం ఇవ్వాలన్న ఆలోచన చేయట్లేదన్నారు. ఎన్నికల్లో మాత్రం ఓట్ల కోసం తాము అధికారంలోకి వస్తే ఆశాలకు రూ.18 వేల వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఏడాది పాలన గడుస్తున్నా ఆశాలకు ఎందుకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశాలకు నెలకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా కార్మికుల సమస్యల్ని పరిష్కరించకుంటే రాబోయే కాలంలో మరిన్ని సమరశీల ఉద్యమాలు నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

వికారాబాద్ చేరిన బస్సు జాతా

ఆశావర్కర్ల బస్సు జాతా శనివారం ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి వికారాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. బస్సు జాతాకు వికారాబాద్ పట్టణ కేంద్రంలో ఆశావర్కర్లు ఘన స్వాగతం పలికారు. వీరిని పూలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వీరికి సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.మహిపాల్, పి.రామకృష్ణ మద్దతు తెలిపారు. అనంతరం పట్టణంలోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మంగమ్మ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభలో జయలక్ష్మితోపాటు సీఐటీయూ నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అమృత, కోశాధికారి ఉమాదేవి, అరుణ, స్వరూప, పద్మ అరుణ, విజయలక్ష్మి, యశోద, లలిత, అండాలు, సులోచన, అంజమ్మ పాల్గొన్నారు.

పారితోషికంతో బతికేదెట్ల.. : జయలక్ష్మి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాల పనులు చేయిస్తూ కేవలం పారితోషికం ఇస్తే కుటుంబాల్ని పోషిస్తూ బతికేదెట్ల అని తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి అన్నారు. కరోనా కాలంలో ప్రాణాలకు తెగించి పని చేసిన ఆశాల పట్ల పాలకులు చిన్న చూపు చూస్తున్నారన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వం ఆశాలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. తాము అధికారంలోకి వస్తే వెంటనే రూ.18 వేల జీతం ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ సైతం హామీల్ని మర్చిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు నీలాదేవి, గంగామణి, పద్మ సీఐటీయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.మల్లేశం, జి.సాయిలు, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి, ఆశా యూనియన్ నాయకులు వరలక్ష్మి, యశోద, ప్రశాంతి, వీరమణి, గంగలక్ష్మి, సంగీత, సువర్ణ, విమల పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ తీర్మానం చేద్దాం

- ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానించేలా కేంద్ర హెూంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ తీర్మానించాలని శనివారం శాసనసమండలిలో కాంగ్రెస్ సభ్యులు మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. రాజ్యాంగం వల్లే ప్రజా ప్రతినిధులమయ్యామని గుర్తుచేశారు. బీఆర్ఎస్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, ఎక్కడో ఉన్న వారి కన్నా, ముందు ఇక్కడున్న అంబేద్కర్ విగ్రహానికి దండ వేయాలన్నారు. అంబేద్కర్ విగ్రహం తాళం తీయాలని డిమాండ్ చేశారు. దీంతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కించపరుస్తున్న వారి వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరముందన్నారు.

జార్జ్ లెహ్‌మాన్, బ్రూస్ టేలర్, ఇమ్రాన్ ఖాన్, రిచర్డ్ హాడ్లీ.. ప్రపంచ టెస్టు క్రికెట్‌లో జట్టు బౌలింగ్ భారాన్ని ఒంటిచేత్తో బాధ్యతగా తీసుకున్న దిగ్గజాలు. ఓ టెస్టు సిరీస్‌లో ఒక్క బౌలరే వికెట్ల వేట బాధ్యత తీసుకోవటం 40 ఏండ్ల తర్వాత ప్రపంచ క్రికెట్ చూస్తోంది!. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా అటువంటి అసమాన ప్రదర్శన చేశాడు.

అతనొక్కడే..!

బుమ్రాపై భారత బౌలింగ్ భారం
సిరాజ్, ఆకాశ్, హర్షిత్ విఫలం

నవతెలంగాణ క్రీడావిభాగం



భారత్, ఆస్ట్రేలియా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ. ప్రపంచ క్రికెట్‌లో అగ్రజట్లు తలపడుతున్న ఉత్కంఠ సమరంలో తొలి మూడు టెస్టులు ముగిశాయి. ప్రత్యర్థి శిబిరంలో పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, జోశ్ హాజిల్‌వుడ్ లేదంటే మరో బెంచ్ బౌలర్ వికెట్ల వేటలో సమానంగా రెచ్చిపోతున్నారు. ఏ ఒక్క బౌలర్‌పై ఆస్ట్రేలియా అతిగా ఆధారపడటం లేదు. భారత శిబిరంలో పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా సాగుతోంది. పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా ఒక్కడే.. వికెట్ల వేట బాధ్యత భుజాలపై వేసుకున్నాడు. ఐదు మ్యాచుల టెస్టు సిరీస్ ఇప్పుడు 1-1తో సమంగా ఉంది. ఇప్పటికైనా భారత పేసర్లు మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, హర్షిత్ రానాలు బుమ్రాకు జతగా నిప్పులు చెరిగితే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని ముచ్చటగా మూడోసారి ఆసీస్ గడ్డపై నెగ్గవచ్చు.

బుమ్రా ఓ అద్భుతం :

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో జస్‌ప్రీత్ బుమ్రా అసమాన ప్రదర్శన చేస్తున్నాడు. పెర్త్, ఆడిలైడ్, బ్రిస్బేన్‌లో ప్రతి ఇన్నింగ్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన బౌలర్‌గా అతడు నిలిచాడు. మూడు మ్యాచుల్లో బుమ్రా ఏకంగా 21 వికెటుల పడగొట్టాడు. ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ 14 వికెట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. సగటు 10.90, ఎకానమీ 2.60, స్ట్రయిక్‌రేట్ 25.14తో బుమ్రా ఓ అద్భుతం అనిపించాడు. ఇదే సమయంలో భారత శిబిరంలో ఇతర పేసర్లు మరీ తీసికట్టుగా రాణించారు. మహ్మద్ సిరాజ్ మూడు మ్యాచుల్లో 23.92 సగటుతో 13 వికెట్లు పడగొట్టగా, హర్షిత్ రానా రెండు టెస్టుల్లో 50.75 సగటుతో 4 వికెట్లు, ఆకాశ్ దీప్ ఓ టెస్టులో 41.00 సగటుతో 3 వికెట్లు, నితీశ్ కుమార్ మూడు టెస్టుల్లో 60.00 సగటుతో 3 వికెట్లు పడగొట్టారు. బుమ్రా సగటు 10.90 కాగా.. ఇతర భారత బౌలర్ల సగటు 36.81. బుమ్రాతో ఇతర బౌలర్ల సగటు వ్యత్యాసం నిష్పత్తి 3.38. ప్రపంచ క్రికెట్‌లో ఇటువంటి ప్రదర్శన గత 40 ఏండ్లలో ఇదే ప్రథమం. చివరగా 1985-86 ఆసీస్, కివీస్ టెస్టు సిరీస్‌లో రిచర్డ్ హాడ్లీ 3.78 నిష్పత్తి వ్యత్యాసం చూపించాడు. ఆ తర్వాత అటువంటి అసమాన ప్రదర్శన బుమ్రా చేశాడు. ఆస్ట్రేలియా పేసర్లు పాట్ కమిన్స్ (14 వికెట్లు), మిచెల్ స్టార్క్ (14 వికెట్లు), జోశ్ హాజిల్‌వుడ్ (6 వికెట్లు), స్కాట్ బొలాండ్ (5 వికెట్లు) సమిష్టిగా వికెట్ల వేటలో రాణిస్తున్నారు. హాజిల్‌వుడ్ రెండు టెస్టుల్లో ఆడగా.. అందులో ఓ టెస్టు ఆరంభంలోనే గాయంతో తప్పుకున్నాడు. స్కాట్ బొలాండ్ ఒక్క టెస్టులోనే ఐదు వికెట్లు పడగొట్టాడు. బుమ్రాకు ఇటువంటి సహకారం సహచర భారత పేసర్ల నుంచి లభించటం లేదు.

'ఉదయం నుంచి సాయంత్రం వరకు వికెట్‌కు రెండు వైపులా బుమ్రానే బౌలింగ్ చేయాలని ఆశించలేమని' రోహిత్ శర్మ భారత బౌలింగ్ విభాగంపై వ్యాఖ్యానించాడు. 'ఒకరికొకరు వేలెత్తి చూపించే పరిస్థితిలోకి వెళ్లాలని అనుకోవద్దు. ఇది తరం మార్పిడి దశ. సహచర బౌలర్లకు మద్దతుగా నిలువటం నా బాధ్యత' అని బుమ్రా హుందాగా మాట్లాడాడు. మాజీ బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్‌తో కలిసి మహ్మద్ సిరాజ్ తన బౌలింగ్‌పై కసరత్తులు చేస్తున్నాడు. రానున్న మెల్‌బోర్న్, సిడ్నీ టెస్టుల్లోనైనా సిరాజ్, ఆకాశ్ దీప్‌లు ఆశించిన సహకారం అందిస్తే బుమ్రా తన మ్యాజిక్‌తో సిరీస్‌ను సాధించగలడు!.


అవనీశ్ సెంచరీ

నాగాలాండ్‌పై హైదరాబాద్ గెలుపు



అహ్మదాబాద్ : దేశవాళీ 50 ఓవర్ల ఫార్మాట్ టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ శుభారంభం చేసింది. గ్రూప్-సిలో నాగాలాండ్‌పై హైదరాబాద్ 42 పరుగుల తేడాతో విజయం సాధించింది. యువ ఆటగాడు అరవెల్లి అవనీశ్ (100, 82 బంతుల్లో 14 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో చెలరేగాడు. కెప్టెన్ తిలక్ వర్మ (0) డకౌట్‌గా నిష్క్రమించినా.. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (51, 54 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), వరుణ్ గౌడ్ (57, 78 బంతుల్లో) అర్థ సెంచరీలతో రాణించారు. నాగాలాండ్‌తో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 48.1 ఓవర్లలో 276 పరుగులకు ఆలౌటైంది. ఛేదనలో నాగాలాండ్ చేతులెత్తేసింది. 50 ఓవర్లలో 234/8 పరుగులే చేసింది. యుగంధర్ సింగ్ (80, 110 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), జగదీశ సుచిత్ (66, 54 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించటంతో నాగాలాండ్ ఆఖరు వరకు పోరాడింది. నాగాలాండ్‌పై 42 పరుగుల తేడాతో గెలుపొందిన హైదరాబాద్ విలువైన నాలుగు పాయింట్లు ఖాతాలో వేసుకుంది. అరవెల్లి అవనీశ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. గ్రూప్-సిలో తర్వాతి మ్యాచ్‌లో సోమవారం ముంబయితో హైదరాబాద్ తలపడనుంది.

ప్రేక్షకులకు గొప్ప త్రీడీ అనుభూతినిచ్చే సినిమా


మోహన్‌లాల్

మోహన్ లాల్ టైటిల్ రోల్‌లో నటిస్తూ, స్వీయ దర్శకత్వం వహిస్తున్న ఎపిక్ ఫాంటసీ అడ్వంచర్ 'బరోజ్ 3డీ'.

ఈ ఎపిక్ డ్రామా ఫాంటసీ సినిమాని ఆశీర్వాద్ సినిమాస్ పతాకంపై ఆంటోని పెరుంబవూర్ నిర్మిస్తున్నారు.

మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఈ సినిమాని తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. క్రిస్మస్ కానుకగా ఈనెల 25న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో మోహన్ లాల్ మీడియాతో ముచ్చటించారు.

- ఇదొక త్రీడీ ఫాంటసీ ఫిల్మ్. ఇప్పటివరకూ మలయాళం నుంచి మూడు త్రీడీ సినిమాలే వచ్చాయి. అయితే ఈ సినిమాలో ఇప్పుడున్న టెక్నాలజీని వాడుకొని చాలా యూనిక్‌గా సినిమాని రూపొందించాం. సినిమా అద్భుతంగా వచ్చింది. విజువల్ వండర్‌తో పాటు స్టోరీ టెల్లింగ్‌ని రీడిస్కవర్ చేసేలా ఉంటుంది. పిల్లలు, పెద్దలు అందరికీ నచ్చేలా ఉంటుంది.
- 'గార్డియన్ ఆఫ్ డి గామాస్ ట్రెజర్' నవల ఆధారంగాలొక ఇమాజనరీ అడ్వంచర్ కథని రూపొందించాం. వాస్కో డి గామాలో దాగి ఉన్న రహస్య నిధిని కాపాడుతూ వచ్చే బరోజ్, ఆ సంపదను దాని నిజమైన వారసుడికి అందించడానికి చేసే ప్రయత్నాలు చాలా అద్భుతంగా ఉంటాయి. స్టోరీ టెల్లింగ్ చాలా కొత్త ఉంటుంది. ప్రేక్షకులు ఓపెన్ మైండ్‌తో వచ్చి ఈ ఇమాజినరీ వరల్డ్‌ని ఎక్స్‌పీరియన్స్ చేయాలని కోరుకుంటున్నాను.
- ఈ సినిమాకి ప్రఖ్యాత సాంకేతిక నిపుణులు పని చేశారు. హాలీవుడ్ పాపులర్ కంపోజర్ మార్క్ కిల్లియన్ బీజీఎం ఇచ్చారు. 12 ఏళ్ల లిడియన్ నాదస్వరంతో ఈ సినిమాకి సాంగ్స్ కంపోజ్ చేయడం మరో విశేషం. త్రీడీ సినిమా చేయడం అంత ఈజీ కాదు. అన్ని కెమెరాల విజన్ పర్ఫెక్ట్‌గా సింక్ అవ్వాలి. ప్రేక్షకులకు గొప్ప త్రీడీ అనుభూతి ఇవ్వడానికి అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. సంతోష్ శివన్ కెమరా వర్క్ మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిస్తుంది.
- గత నలభై ఏళ్ళుగా ఇలాంటి సినిమా రాలేదు. దర్శకుడిగా ఇది నాకు కొత్త అనుభూతి. దర్శకుడిగా తొలి సినిమానే త్రీడీలో చేయడం సవాలుగా అనిపించింది. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఈ సినిమాని తెలుగులో రిలీజ్ చేయడం చాలా ఆనందంగా ఉంది.


అనన్య నాగళ్ల

వెన్నెల కిషోర్ టైటిల్ రోల్ పోషిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. రైటర్ మోహన్ రచన, దర్శకత్వం వహించారు. అనన్య నాగళ్ల, సీయా గౌతమ్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని లాస్యారెడ్డి సమర్పణలో శ్రీ గణపతి సినిమాస్ బ్యానర్‌పై వెన్నపూస రమణారెడ్డి నిర్మించారు. 'క, పొలిమేర 2, కమిటీ కుర్రోళ్లు' చిత్రాలతో విజయాలు అందుకున్న వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం ఈనెల 25న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ అనన్య నాగళ్ల శనివారం మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

మంచి క్రిస్మస్ గిఫ్ట్‌లాంటి చిత్రం..

'దర్శకుడు మోహన్ కథ చెప్పినపుడు చాలా డిఫరెంట్ కథ అనిపించింది. ప్రేక్షకులకు వందశాతం ఈ సినిమా మంచి క్రిస్మస్ గిఫ్ట్ అవుతుంది. ఇందులో నా పాత్ర పేరు భ్రమరాంబ. కథలో నా రోల్ చాలా బావుంటుంది. ఇప్పటివరకూ చేయని రోల్. అలాగే ఇది ఎక్స్‌ట్రార్డినరీ స్టోరీ. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వైజాగ్ పర్యటన ముగించుకొని, అదే రోజు శ్రీపెరంబుదూర్ వెళ్లి అక్కడ చనిపోయారు. ఒక పెద్ద ఇన్సిడెంట్ జరిగినప్పుడు చిన్న సంఘటనలని ఎవరూ పట్టించుకోరు. అదే రోజు ఓ కేసు జరిగింది. ఆ కేసు తీగలాగితే డొంక కదిలినట్లుగా చాలా మలుపులతో కథనం ఎంగేజింగ్‌గా ఉంటుంది. థ్రిల్, సస్పెన్స్ అన్నీ ఉంటాయి. అలాగే ఇందులో ఒక క్యూట్ లవ్ స్టోరీ కూడా ఉంది. ప్రస్తుతం తెలుగుతో పాటు హిందీలో ఓ ఫీమేల్ ఓరియెంటెడ్ సినిమా చేస్తున్నాను'.


తమన్నా

శక్తివంతమైన నాగ సాధు

తమన్నా భాటియా ప్రధాన పాత్రధారిణిగా నటిస్తున్న చిత్రం 'ఓదెల 2'. ఇది 2021లో హిట్ అయిన 'ఓదెల రైల్వే స్టేషన్'కి సీక్వెల్.

అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ నిర్మించిన ఈ చిత్రం ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. నాగ సాధు పాత్రలో తమన్నా ఫెరోషియస్, స్టన్నింగ్ పోస్టర్స్ క్యూరియాసిటీని పెంచాయి. తమన్నాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ నాగ సాధు అవతార్‌లో ఉన్న తమన్నాని ప్రజెంట్ చేస్తూ సరికొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. పోస్టర్‌లో ఆమె పుర్రెలపై ధైర్యంగా నడుస్తున్నట్లు కనిపించారు, రాబందులు పైన ఎగరడం టెర్రిఫిక్‌గా ఉంది. ఈ అద్భుతమైన పోస్టర్ చిత్రంలో ఆమె పాత్ర ఇంటెన్స్, పవర్‌ఫుల్ నేచర్‌ని సూచిస్తున్నాయి. ప్రేక్షకులను అలరించే బ్రెత్ టేకింగ్ స్టంట్స్‌ని చేయడానికి తమన్నా తన పాత్ర కోసం ఇంటెన్స్ ట్రైనింగ్ తీసుకున్నారు. భారీ బడ్జెట్, హై క్యాలిటీ ప్రొడక్షన్ వాల్యూస్‌తో ఈ సినిమాని రూపొందిస్తున్నారు. ఈ సినిమా ఓ అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని ఇవ్వనుంది. ఎంగేజింగ్ కథాకథనాలతో థ్రిల్లింగ్ యాక్షన్‌ను బ్లెండ్ చేయడంలో పాపులరైన సంపత్ నంది ఈ చిత్రాన్ని సూపర్ విజన్ చేస్తున్నారు అని చిత్ర యూనిట్ తెలిపింది.

'తమన్నా ఇప్పటివరకు నటించిన చిత్రాలు, పాత్రలతో పోలిస్తే ఈసినిమా పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ఆమెను గతంలో ఎన్నడూ చూడని పాత్ర తీరు తెన్నులను ప్రేక్షకులు చూసి సర్‌ప్రైజ్ అవుతారు. ఈ సినిమా తప్పకుండా అందర్నీ అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని మేకర్స్ అన్నారు. హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహ, యువ, నాగ మహేష్, వంశీ, గగన్ విహారి, సురేందర్ రెడ్డి, భూపాల్, పూజా రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాత: డి.మధు, దర్శకత్వం: అశోక్ తేజ, డీవోపీ: సౌందర్ రాజన్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, ఆర్ట్ డైరెక్టర్: రాజీవ్ నాయర్.

నవచిత్రం

ఈ గుర్తింపు మరింత బాధ్యతని పెంచింది


విజయ్ పోలాకి

"పుష్ప 2- టైటిల్ సాంగ్, జాతర పాటకి వచ్చిన అద్భుతమైన రెస్పాన్స్ కొరియోగ్రాఫర్‌గా గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. అంతేకాదు నా కెరీర్‌లో మైల్ స్టోన్‌గా నిలిచిపోతుంది' అని కొరియో గ్రాఫర్ విజయ్ పోలాకి అన్నారు. రీసెంట్‌గా ఆయన కొరియోగ్రఫీ చేసిన 'పుష్ప 2' టైటిల్ సాంగ్, జాతర పాటలు టాప్ ట్రెండింగ్‌లో నిలిచిన నేపథ్యంలో శనివారం మీడియాతో సంభాషించారు.

- ఈ మధ్య కాలంలో ఏ కొరియోగ్రాఫర్‌కి రాని గుర్తింపు నాకు రావడం, అలాగే ట్విట్టర్‌లో ట్రెండింగ్ కొరియో గ్రాఫర్‌గా వైరల్ అవ్వడం చాలా హ్యాపీగా అనిపించింది. ఏ సాంగ్ వచ్చిన బెస్ట్ ఇవ్వాలనే బాధ్యతని ఈ గుర్తింపు మరింత పెంచింది.
- మాస్టర్ అవ్వాలనే ఆలోచన హీరో రామ్ వల్లే వచ్చింది. నా వీడియోస్ చూసి, డెమోస్ చేసి చూపించమన్నారు. నా డెమోస్ చూసి కార్డ్ ఉందా అని అడిగారు. నేనూ కార్డ్ తీసుకోవచ్చు, నేనూ మాస్టర్ కావచ్చనే ఆలోచన ఆయన ప్రోత్సాహంతోనే మొదలైంది. 2015లో డ్యాన్సర్ కార్డ్ తీసుకున్నాను. డ్యాన్సర్‌గా చేశాను. తర్వాత మాస్టర్ అయ్యాను. నేను కొరియోగ్రఫీ చేసిన మొదటి సాంగ్ 'కొబ్బరిమట్ట' సినిమాలోని 'అఆ ఇఈ..'. తర్వాత పలాసలో అన్ని పాటలు చేశాను.
- అందులో 'నక్కిలీసు గొలుసు..' పాట వైరల్ హిట్ అయ్యింది. తర్వాత అల్లు అర్జున్, సుకుమార్ 'పుష్ప' సినిమా అవకాశం వచ్చింది. 'ఊ అంటావా మామ' సాంగ్‌కి కొరియోగ్రఫీ చేశాను. ఈ పాట బాగా హిట్ అవ్వడంతో ఇక నేను వెనక్కి తిరిగి చూసుకోలేదు.
- పుష్ప 2' కోసం సుకుమార్ నుంచి కాల్ వచ్చింది. అసలు ఇది నేను ఊహించలేదు. సుకుమార్ జాతర సాంగ్ వినిపించారు. మొదట ఒక బిట్ సాంగ్‌లా చేద్దామని అనుకున్నారు. నేను ఫుల్‌సాంగ్ కొరియోగ్రఫి చేసిన తర్వాత 'అదిరిపోయింది మాస్టర్ ఇలానే వెళ్దాం' అన్నారు. ఆ సాంగ్ నచ్చిన తర్వాత 'పుష్ప పుష్ప..' టైటిల్ సాంగ్‌కి కూడా అవకాశం ఇచ్చారు. ఏం చేసిన పుష్ప క్యారెక్టర్ నుంచే రావాలని సుకుమార్ చెప్పారు. ఆయన విజన్‌కి తగ్గట్టుగానే చాయ్ గ్లాస్ స్టెప్, ఫోన్ స్టెప్, ఫైర్ సిగరెట్ స్టెప్.. ఇవన్నీ కంపోజ్ చేశాను. గంగమ్మ తల్లి జాతర సాంగ్ నుంచి ట్రావెల్ అవుతున్నాను కాబట్టి ఆ క్యారెక్టర్‌లో లీనమైపోయాను. టీ మూమెంట్ చూసిన తర్వాత బన్నీ అదిరిపోయింది మాస్టర్ అని చెప్పారు.
- ప్రస్తుతం సాయి ధరమ్ తేజ్ 'సంబరాల ఏటిగట్టు', రామ్ సినిమా, బెల్లంకొండ శ్రీనివాస్ 'భైరవం', 'మ్యాడ్2'కి సింగిల్ కార్డ్ చేస్తున్నాను. హిందీలో 'బేబీ' చేస్తున్నాను.

పక్కా మాస్ బీట్ సాంగ్



డైస్ ఆర్ట్ ఫిల్మ్స్ ఆధ్వర్యంలో గాయకుడు నోయెల్ పాడిన 'తెలుగోడి బీట్ సాంగ్..' లాంచ్ ఈవెంట్ విజయవంతంగా జరిగింది. పలువురు ప్రముఖులు, విద్యార్థులు పాల్గొని ఈ వేడుకను మరింత ప్రత్యేకం చేశారు. డైస్ ఆర్ట్ ఫిల్మ్స్ టీమ్ హర్షడైస్, మనస్వి రాజేష్ కన్నా మాట్లాడుతూ,'నోయెల్ సాంగ్ ఈవెంట్ భారీ విజయాన్ని సాధించింది. దీన్ని మర్చిపోలేని విధంగా చేసినందుకు నా విద్యార్థులకు, అతిథులకు ధన్యవాదాలు. నోయెల్ తన అద్భుతమైన ప్రదర్శనకు, మాతో చేరినందుకు మా అతిథులకు ప్రత్యేక ధన్యవాదాలు' అని తెలిపారు.

మ్యూజిక్ డైరెక్టర్ నోయల్ మాట్లాడుతూ,'సాంగ్ చాలా బాగా వచ్చింది. ఇంత బాగా రావడానికి కారణం అయినా ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఈ పాటకు పని చేసిన డిఓపి భార్గవ్ అత్యద్భుతమైన విజువల్స్ అందించారు. పాటలో స్టన్నింగ్ విజువల్స్ ఉన్నాయి. అలాగే కొరియోగ్రాఫర్ సుభాష్ మాస్టర్ డాన్స్ చాలా బాగా కంపోజ్ చేశారు. ఈవెంట్‌కు రాహుల్ సీప్లు గంజ్ రావడం ఎంతో ప్రత్యేకం. ఈ పాట అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను. ఈనెల 31, సంక్రాంతి పండుగలకు దుమ్ము రేపుతుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు.

"తెలుగోడి బీట్ పాట'లో ఫుల్ మాస్ బీట్ ఉంది. ప్రేక్షకులు కచ్చితంగా ఈ పాటని ఘనవిజయం చేస్తారు. ఈ పాట చేసిన నోయల్‌కు అభినందనలు. ఈ పాట ప్రతి ఒక్కరిని షేర్ చేయాలని, ఇలాంటి పాటలు మరెన్నో చేయాలని రాహుల్ సిప్లిగంజ్ పేర్కొన్నారు. అన్ని వేడుకల్లో దుమ్మురేపుతుంది' అని రాహుల్ సిప్లిగంజ్ అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నవతెలంగాణ

27 నుంచి ఏఈ అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ శాఖలకు చెందిన విభాగాల్లో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ), మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్, టెక్నికల్ ఆఫీసర్ అండ్ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకు తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థులకు రెండో విడతలో ఈనెల 27 నుంచి హైదరాబాద్‌లో నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (పీఎస్‌టీయూ)లో ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం కానుంది. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 27 నుంచి 31 వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉదయం 10.30 గంటల నుంచి జరుగుతుందని వివరించారు. ఈనెల 29న ధ్రువపత్రాల పరిశీలన ఉండబోదని తెలిపారు. గైర్హాజరైన అభ్యర్థుల కోసం వచ్చేనెల రెండో తేదీన కూడా ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతోపాటు రెండు జతల జిరాక్స్ ప్రతులను వెంట తెచ్చుకోవాలని సూచించారు. అందుకు సంబంధించిన వివరాలు ఒఒఒ.ంజూంఎ.స్రీశీఙ.ఱఅ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని కోరారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలను తీసుకురాలేకపోతే ఆ తర్వాత ఈ అవకాశం ఉండబోదని స్పష్టం చేశారు. 837 ఏఈ పోస్టుల భర్తీకి 2022, సెప్టెంబర్ 12న టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే.

కాళేశ్వరం న్యాయ విచారణ

- కమిషన్ గడువు పెంపు
- ఫిబ్రవరి 28 వరకు పొడిగింపు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం జ్యూడీషియల్ కమిషన్ గడువును వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శనివారం జీవో 31ని విడుదల చేసింది. నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్‌బొజ్జా ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటికే పలుమార్లు న్యాయ కమిషన్ గడువును పొడిగించిన విషయం విదితమే. ఇప్పటివరకు దాదాపు వంద మంది అధికారులు, ఇతరులను విచారించిన కమిషన్, తాజాగా ఐఏఎస్ అధికారులను ఆహ్వానించింది. కాగా విచారణ తుది దశకు వచ్చిన నేపథ్యంలో ఇక రాజకీయ నాయకులకు నోటీసులు ఇచ్చే అవకాశముంది. తొలుత అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఆ తర్వాత మాజీ సీఎం కేసీఆర్‌కు సైతం నోటీసులు ఇవ్వనున్నట్టు సమాచారం. తొలుత అఫిడవిట్లు తీసుకోవడం, ఆతర్వాత క్రాస్ ఎగ్జామినేషన్ చేసే ప్రక్రియను కమిషన్ అమలు చేస్తున్నది. విచారణ సందర్భంగా అధికారులపై న్యాయ కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలూ ఉన్న విషయం విదితమే.

రైతు భరోసా ఎగ్గొట్టేందుకు కాంగ్రెస్ కుట్ర

- శాసనసభ సాక్షిగా సీఎం రేవంత్ అబద్ధాలు
- ఈడీకి, మోడీకి భయపడం : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతు భరోసాను ఎగ్గొట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం సబ్‌కమిటీ పేరిట కుట్రలు పన్నుతోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతుబంధుకు మొండి చేయి చూపుతారని ఎన్నికలకు ముందు కేసీఆర్ అన్నారనీ, ప్రస్తుతం అదే జరుగుతోందని అన్నారు. "ఎన్నికలకు ముందు అందరికీ అన్నీ.. ఎన్నికలయ్యాక కొందరికే కొన్ని" అంటూ ఉద్యోగులు, ఐటీ, పాన్‌కార్డు హెూల్డర్లకు కటింగ్‌లు పెట్టి ఏదో రకంగా తప్పించుకోవాలన్న ఎజెండా తప్ప రైతులపట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. సన్నాలకు రూ.500 బోనస్ పేరిట మొత్తం సీజన్లో రూ.700 కోట్లు చెల్లించి, రూ.7,500కోట్లకు ఎగనామం పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన రైతు భరోసాను డిసెంబర్ 9న చెల్లిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఏడాది గడిచినా అడుగు ముందుకు వేయలేదనీ, ఇప్పుడేమో మళ్లీ సంక్రాంతి అంటూ దాటవేస్తోందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను రైతు భరోసాపై నిలదీయాలని పిలుపునిచ్చారు.

రుణమాఫీ విషయంలోనూ కాంగ్రెస్ రైతులను మోసం చేసిందని ఆరోపించారు. రూ.28 వేల కోట్ల రుణమాఫీ, రూ.73 వేల కోట్ల రైతుబంధు మొత్తంగా బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో రూ.లక్ష కోట్లు రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశామని చెప్పారు. రైతుల ఆత్మహత్యల విషయంలోనూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభ సాక్షిగా అబద్దాలు మాట్లాడారని విమర్శించారు. నేషనల్ క్రైం రికార్డ్సు బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) గణాంకాల ప్రకారం 2014లో తాము అధికారం చేపట్టినప్పుడు రైతుల ఆత్మహత్యల శాతం 11.1గా ఉంటే 2023లో దాన్ని 1.57 శాతానికి తగ్గించామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయలేక బీఆర్‌ఎస్ నాయకులపై కేసులు పెట్టి డైవర్ట్ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. ఎన్ని కేసులు పెట్టినా ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల గురించి కాంగ్రెస్ పార్టీని నీడలా వెంటాడుతామని హెచ్చరించారు. తనపై నమోదైన ఈడీ కేసు గురించి మాట్లాడుతూ ఈడీ, మోడీకి భయపడేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేపీ.వివేకానంద, అనిల్‌జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మండలిలో 'రైతు భరోసా' గిలిటెన్

- నిరవధిక వాయిదా

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

శాసనమండలి రైతు భరోసా స్వల్పకాలిక చర్చను గిలిటెన్ చేసింది. ఎలాంటి చర్చ లేకుండానే చర్చ జరిగినట్టుగా చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చర్చను ప్రారంభిస్తూ 'సభ్యులు అలసిపోయినట్టుగా కనిపిస్తున్నారు. రైతు భరోసా పథకానికి సంబంధించి సభ్యులందరికీ నోట్ పంపానని, మీ సలహాలు, సూచనలు ఉంటే చైర్మెన్‌కు పంపాలనీ, వాటిని పరిగణనలోకి తీసుకుంటాం' అని చెప్పారు.

దీనికి చైర్మెన్ స్పందిస్తూ మంత్రి కోరిన విధంగా రైతు భరోసాకు సంబంధించి సందేహాలు, ఇతరాలు ఏమైనా ఉంటే నాకు ఇవ్వాలనీ, వాటిని ప్రభుత్వానికి పంపిస్తానని అన్నారు. చర్చకు శ్రీకారం చుట్టకముందే బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, వాణిదేవీ సభ నుంచి వెళ్లిపోయారు. మరో ఎమ్మెల్సీ స్పందిస్తూ చైర్మెన్ రైతుభరోసాపై రైతు నాయకులని చర్చ చేయకపోవడం సరికాదని వ్యాఖ్యానించారు.

మండలి నిరవధిక వాయిదా

శాసనమండలి నిరవధికంగా వాయిదా పడింది. చైర్మెన్ సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ మండలి మొత్తం ఏడు రోజుల్లో 28.3 గంటలపాటు పనిచేసిందన్నారు. ప్రశ్నోత్తరాల్లో సభ్యులు 38 ప్రశ్నలు వేశారని చెప్పారు. పలు బిల్లులతోపాటు ఆయా అంశాలపై స్వల్పకాలిక చర్చ జరిగిందని వివరించారు.

రైతు రుణమాఫీ చారిత్రాత్మకం

- కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రైతు రుణమాఫీ చారిత్రాత్మకమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో రెండు సార్లు చేసిన రుణమాఫీ రైతుల వడ్డీలకే సరిపోయిందని ఎద్దేవా చేశారు. రైతు భరోసా కింద చెల్లించిన రూ.73 వేల కోట్లల్లో రూ.22 వేల కోట్లు రాళ్లు, రప్పలు, కొండలు, గుట్టలకే పోయిందని ఎద్దేవా చేశారు. ప్రజాధనం దుర్వినియోగం జరగకూడదనే రైతు భరోసాపై కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన మాట తప్పదని గుర్తు చేశారు. రైతు భరోసాపై బీఆర్‌ఎస్ నేతలు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

టీబీ నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్

9 జిల్లాల్లో వంద రోజుల పాటు నిర్వహణ

- 26 మొబైల్ టెస్టింగ్ ల్యాబ్స్ ఏర్పాటు : మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి
- కేంద్ర మంత్రి నిర్వహించిన వీసీలో పాల్గొన్న మంత్రి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


టీబీ నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. 9 జిల్లాల్లో వంద రోజుల పాటు నిర్వహణతో పాటు 26 మొబైల్ టెస్టింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌పై శనివారం కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. దేశంలో 2025 చివరి నాటికి టీబీని పూర్తిగా నిర్మూలించాలన్న లక్ష్యానికి, తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఈ నెల 7న, 9 జిల్లాల్లో (ఆదిలాబాద్, కొత్తగూడెం, కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్, నాగర్‌కర్నూల్, పెద్దపల్లి, సూర్యాపేట్, వనపర్తి) టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారభించినట్టు తెలిపారు. టీబీ రిస్క్ ఉన్న ప్రజలను గుర్తించి, టెస్టులు చేసేందుకు 26 మొబైల్ టీబీ టెస్టింగ్ వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. అన్ని వాహనాల్లోనూ డిజిటల్ ఎక్స్-రే మిషన్లు, సీబీ నాట్ మిషన్లను అందుబాటులో ఉంచామని తెలిపారు. వంద రోజుల కార్యక్రమానికి సరిపడా టెస్టింగ్ రీఏజెంట్స్, డ్రగ్స్ అందుబాటులో ఉంచామని చెప్పారు. ఇప్పటి వరకూ 7,219 మందికి స్క్రీనింగ్ చేయగా, 181 మందికి టీబీ పాజిటివ్ వచ్చిందని కేంద్ర మంత్రికి దామోదర వివరించారు. 2023లో 5.74 లక్షల మందికి టీబీ టెస్టులు చేయగా, 2024లో 7.82 లక్షల మందికి టెస్టులు చేసినట్టు వివరించారు. ట్రీట్‌మెంట్ సక్సెస్ రేటు దేశంలో సగటున 87 శాతం ఉంటే, తెలంగాణలో 90 శాతం ఉందని చెప్పారు.

టీబీ పేషెంట్ల గుర్తింపు, ట్రీట్‌మెంట్ కోసం వంద రోజుల ఇంటెన్సిఫైడ్ టీబీ ఎలిమినేషన్ ప్రోగ్రాంను నిర్వహించాలని కేంద్ర వైద్యారోగ్యశాఖ నిర్ణయించింది. గతేడాది తక్కువ టెస్టులు జరిగిన జిల్లాలను, టీబీ హైరిస్క్ ప్రజలు ఎక్కువగా ఉన్న జిల్లాలను ఈ కార్యక్రమం కోసం కేంద్రం ఎంపిక చేసింది.దేశవ్యాప్తంగా 347 జిల్లాల్లో(తెలంగాణలో 9 జిల్లాలు) ఈ నెల 7న కార్యక్రమాన్ని ప్రారంభించారు.2024 మార్చి 17 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా టీబీ హైరిస్క్ ప్రజలను గుర్తించి, టెస్టులు చేయాల్సి ఉంటుంది. దీనికోసమే మన రాష్ట్ర ప్రభుత్వం 26 మొబైల్ స్క్రీనింగ్ వాహనాలను ఏర్పాటు చేసింది.

ఏం చెబితిరి...ఏం చెబితిరి ?

వివాదాలు వద్దంట...సామరస్యమే ముద్దంట

- హిందూ సమాజం ప్రతినిధిలా భగవత్ సుద్దులు
- మీరు వారి గొంతుక కాదంటూ మితవాద నేతల చురక



పూనే : ఆర్‌ఎస్‌ఎస్ అధిపతి మోహన్ భగవత్ తాను యావత్ హిందూ సమాజానికి ప్రతినిధిలా వ్యవహరించడం మొదలు పెట్టారు. మందిరం-మసీదు రగడ ఇకపై వద్దంటూ ఆయన చిలక పలుకులు పలికారు. పూనేలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఆహుతులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ సూచన చేశారు. దేశంలోని పలు ప్రాంతాల్లో మందిరాలు, మసీదులపై నెలకొన్న వివాదాల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ దేశంలోని ప్రజలందరూ సామరస్యంగా మెలగాలంటూ హితబోధ చేశారు. మైనారిటీ, మెజారిటీ అనేదే లేదని, అందరూ సమానులేనని చెప్పుకొచ్చారు. కాగా భగవత్ వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు వ్యంగోక్తులు విసిరాయి. పెట్టాల్సిన చిచ్చు పెట్టి, ఇప్పుడు ఏమీ ఎరగనట్లు సూక్తులు చెబుతున్నారని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ విమర్శించారు. భగవత్ వ్యాఖ్యలు, సూక్తిముక్తావళిని చూస్తుంటే ఆయన గతాన్ని, సంఘ్ పరివార్ చరిత్రను మరచిపోయారేమోనని అనిపిస్తుంది. ఎందుకంటే అయోధ్యలో రామమందిర నిర్మాణంతో పాటు మధుర, కాశి కూడా సంఘ్ అజెండాలోనే ఉన్నాయి. ఇటీవల సంభాల్‌లో కల్కి మందిరం ముందుకు వచ్చింది. తాజాగా ఈ జాబితాలో వచ్చి చేరింది అజ్మీర్ దర్గా. దీనికి అంతం ఎప్పుడు? ఆ విషయం ఎవరు చెబుతారు?గతంలో మందిరాలను ధ్వంసం చేసి మసీదులు నిర్మించారని, ఇప్పుడు వాటిని తిరిగి హిందూ సమాజాలకు అప్పగించాలని కోరుతూ దేశంలోని పలు ప్రాంతాల్లోని న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. ఆయా ప్రాంతాల్లో ఉన్న మసీదుల్లో సర్వేలు నిర్వహించాలని పిటిషన్‌దారులు కోరారు. ఈ వివాదంపై భగవత్ స్పందిస్తూ 'రామమందిర నిర్మాణం తర్వాత కొందరు వ్యక్తులు తాము హిందువులకు నాయకులమని భావిస్తున్నారు. ఇది ఆమోదయోగ్యం కాదు' అని అన్నారు. ప్రతి రోజూ ఏదో ఒక వివాదాన్ని రేపి సమాజాల మధ్య శతృత్వాన్ని పెంచడం సరికాదని చెప్పారు. 'దేవాలయం పైన కూర్చున్నంత మాత్రాన కాకి గద్ద అవుతుందా?' అని హిందూ నేతలను ఎత్తిపొడిచారు. అయితే భగవత్ ఇక్కడ ఓ విషయాన్ని విస్మరించారు. హిందూమతంలో అనేక తెగలు, సమాజాలు ఉన్నాయి. వాటికి వేర్వేరుగా నాయకులు ఉన్నారు. క్రైస్తవం, ఇస్లాంలో మాదిరిగా ఒకరో లేదా కొందరు వ్యక్తులో యావత్ హిందూ సమాజానికి ప్రాతినిధ్యం వహించరు. వేలాది మంది హిందువులు తనను ప్రశ్నించకుండా ఆర్‌ఎస్‌ఎస్ అధినేత భగవత్ నిలువరించలేరు. పూనే కార్యక్రమంలో కొందరు హిందూ మితవాద నాయకులు భగవత్‌ను కలిసి యావత్ హిందూ సమాజానికి ప్రతినిధిగా మారేందుకు ప్రయత్నించవద్దని కోరారు. 'మీరు కేవలం ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మాత్రమే. యావత్ హిందూ సమాజం గొంతుక కాదు' అని వారు తెగేసి చెప్పారు.

సివిల్ రైట్స్ డే నిర్వహించాలి

- కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో సివిల్ రైట్స్ డేను నిర్వహించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. శనివారం శాసనమండలిలో ఆ మేరకు ప్రత్యేక ప్రస్తావన చేశారు. ఇప్పటికీ రాష్ట్రంలో కులవివక్షత, ఎవరి గ్లాసు వారు కడుక్కునే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. కొన్ని చోట్ల దేవాలయాల్లో కూడా ప్రవేశం కూడా కల్పించడం లేదని చెప్పారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రతి నెల చివరి ఆదివారం సివిల్ రైట్స్ డే నిర్వహించేదనీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జరపడం లేదని తెలిపారు. ఆ డేను నిర్వహించాలనీ, మండల స్థాయిలో ప్రజా ప్రతినిధులను కూడా భాగస్వాములను చేస్తే ప్రయోజనం ఉంటుందని సూచించారు.

బీఆర్‌ఎస్ సభ్యులు ఎన్.నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ ఒకటి తర్వాత చేరిన ఉద్యోగులకు ఓపీఎస్ వర్తింపజేయాలని కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ 2003 వరకు నియామక ప్రక్రియ పూర్తయి, నియామకపత్రాలు అందని వారు 3000 మంది ఉన్నారని చెప్పారు. వారి కోసం కేంద్రం మెమో విడుదల చేసిందనీ, వారికి ఓపీఎస్ వర్తింపజేస్తే, రాష్ట్ర ప్రభుత్వానికి కూడా రూ.260 కోట్లు కేంద్రం నుంచి వస్తాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ సభ్యులు తీన్మార్ మల్లన్న, ఫార్మా కంపెనీలు కెమికల్ ట్రయల్స్ నిర్వహించకుండా చర్యలు తీసుకునేలా ఆ సమాచారాన్ని అందరికి ఇవ్వాలని కోరారు. నిమ్స్‌లో ఆంధ్ర ప్రదేశ్ వారికి అవకాశమిస్తూ, తెలంగాణ స్థానికులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ సభ్యులు టి.జీవన్‌రెడ్డి మాట్లాడుతూ హెూంగార్డుల వేతనాలను పెంచాలని కోరారు. బీఆర్‌ఎస్ సభ్యులు టి.రవీందర్ రావు మాట్లాడుతూ మహబూబాబాద్ లో కూరగాయల మార్కెట్ తరలించాలని హైకోర్టు ఆదేశించినా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేటశారు. బీఆర్‌ఎస్ సభ్యులు ఎల్.రమణ మాట్లాడుతూ దీక్షలు చేస్తున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్ సభ్యులు తాతా మధు మాట్లాడుతూ రాష్ట్ర ఆదాయానికి గండి కొడుతున్న ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. అధికారులు పట్టుకుంటున్న మంత్రుల నుంచి ఫోన్ లలో ఒత్తిడి రావడంతో ఏం చేయలేకపోతున్నారని విమర్శించారు. సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాయలని కోరారు. బస్వరాజు సారయ్య మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులు, రజకులకు ఉచిత విద్యుత్ బకాయి బిల్లులు విడుదల చేయాలని కోరారు.

సభ్యులు ఎం.ఎస్.ప్రభాకర్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌లో ఆయా కార్పొరేషన్ల కాంట్రాక్టు ఉద్యోగులను కూడా చేర్చాలని సూచించారు. కాంగ్రెస్ సభ్యులు బల్మూరి వెంకట్ మాట్లాడుతూ అనుమతి లేకున్నా ప్రీలాంచ్ పేరుతో మధ్యతరగతి ప్రజలను మోసం చేస్తున్న రియల్ ఎస్టేట్ కంపెనీల నుంచి వారిని కాపాడాలని కోరారు. సభ్యులు యెగ్గె మల్లేశం మాట్లాడుతూ డీడీలు కట్టిన కురుమలకు గొర్రెలను ఇవ్వాలని కోరారు. గొర్రెల స్కాంకు సంబంధించిన విచారణపై ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా? అని ప్రశ్నించారు. మాదకద్రవ్యాలు ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి రాకుండా నిఘా పటిష్టం చేయాలని బీఆర్‌ఎస్ సభ్యురాలు సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు.

నల్లగొండ జిల్లాలో గత సర్కారు ఒక ఎకరాకు నీళ్లివ్వలేదు

- కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులతోనే అక్కడ సాగునీరు : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్‌ఎస్ ప్రభుత్వం నల్లగొండ జిల్లాలో ఒక ఎకరాకు నీళ్లు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాడు నిర్మించిన ప్రాజెక్టులతోనే ఇప్పుడు అక్కడ సాగు నీరు అందుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గుర్తు చేశారు. కరెంట్ కూడా 24 గంటలు ఇవ్వలేదని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని శాసనసభలో రైతు భరోసాపై స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో తాను ఒక సబ్ స్టేషన్ వెళ్లి లాగ్‌బుక్ పరిశీలించానని గుర్తుచేశారు. 10గంటలు మాత్రమే కరెంట్ వస్తుందని సబ్‌స్టేషన్ సిబ్బంది చెప్పారని ఈ సందర్భంగా తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో 24గంటల కరెంట్ ఇచ్చామని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పిన మాటలను ఉపసంహరించు కోవాలని కోరారు. బీఆర్‌ఎస్ పాలనలో నల్లగొండ జిల్లా తీవ్రంగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాగార్జున సాగర్, శ్రీశైలం, శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందని గుర్తుచేశారు. దళితుడిని సీఎం చేస్తానని చెప్పిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మోసం చేసి పదేండ్లు పాలించారన్నారు. నాగార్జున సాగర్ కేసీఆర్ కట్టారా? మీ నాన్న కట్టిండా? అని మాజీ మంత్రి హరీశ్ రావును ప్రశ్నించారు. నల్లగొండకు నీళ్లు ఎవరు ఇచ్చారో అడుగుదాం హరీశ్‌రావు, కేటీఆర్ చర్చకు రావాలని కోమటిరెడ్డి సవాల్ విసిరారు. నల్లగొండ జిల్లాలో కాళేశ్వరం నీళ్లు ఒక్క ఎకరానికి ఇచ్చినట్లు నిరూపించినా తాను రాజీనామా చేస్తానని ఛాలెంజ్ చేశారు. ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు పుణ్యాన వచ్చిందని గుర్తుచేశారు. బావ బామ్మర్ది హరీశ్‌రావు, కేటీఆర్ కలిసి నల్లగొండ ప్రజలను చంపేస్తారా? అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మూసీని బాగుచేస్తున్నారని తెలిపారు. దానికి కూడా బావ,బామ్మర్ది అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసాపై సూచనలు చేయాలని కోరారు. అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా బీఆర్‌ఎస్ మారిపోయిందన్నారు. కాళేశ్వరం అని చెప్పి కూలేశ్వరం కట్టారని ఎద్దేవా చేశారు.

ఐదేండ్లలో 47 టీవీ ఛానళ్ల లైసెన్సులు రద్దు



శివదాసన్ రాజ్యసభలో ప్రైవేట్ బిల్లును ప్రవేశపెట్టారు.

న్యూఢిల్లీ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గత ఐదేళ్లలో 47 టీవీ ఛానళ్ల లైసెన్సులను రద్దు చేసింది. ఈ విషయాన్ని ఇటీవల రాజ్యసభలో సిపిఎం ఎంపి వి.శివదాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ సమాధానంలో వెల్లడించారు. రద్దు చేసిన టీవి న్యూస్ ఛానళ్ల లైసెన్స్‌ల సంఖ్య 2020లో 14, 2021లో 24, 2022లో ఐదు, 2023లో మూడు, 2024లో ఒకటిగా ఉందని తెలిపారు. అలాగే గత ఐదేళ్లలో 110 ఛానళ్లకు కొత్త లైసెన్సులు ఇవ్వగా 269 లైసెన్సులు రెన్యూవల్ అయ్యాయి. అలాగే 34 ఛానెల్స్ లైసెన్స్ దరఖాస్తును తిరస్కరించినట్లు మంత్రి తెలిపారు. చారిత్రాత్మక రైతుల సమ్మె జరిగిన 2020-21లో అత్యధిక సంఖ్యలో లైసెన్స్‌లు రద్దు చేశారు. కాగా, ఛానెల్ లైసెన్స్ పొందడానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి కూడా అనుమతి అవసరమని మంత్రి తెలిపారు. దీనిపై శివదాస్ మాట్లాడుతూ చానళ్లు, ఇతర మీడియాలకు అనుమతులు ఇచ్చే ప్రక్రియ పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉందని, ఇది ప్రజాస్వామ్యానికి సవాల్ అని శివదాసన్ విమర్శించారు. లైసెన్స్ రద్దు భయంతో మీడియా కూడా కేంద్ర విధానాలను విమర్శించేందుకు భయపడుతోందన్నారు. మీడియా లైసెన్సింగ్ అధికారాన్ని 'ఇండియన్ బోర్డ్ ఆఫ్ మీడియా సర్వీసెస్' అనే స్వతంత్ర కమిటీకి బదిలీ చేసేందుకు

ఉద్యోగ ప్రోత్సాహక పథకాలకు కోత

- కేటాయింపుల్లో 30 శాతం తగ్గించాలని కేంద్రం ప్రణాళిక
- బడ్జెట్ కేటాయింపుల, అంచనాల మధ్య అసమతుల్యత : పార్లమెంటరీ ప్యానెల్



న్యూఢిల్లీ : కేంద్రం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడు ఉద్యోగ సంబంధిత ప్రోత్సాహక(ఈఎల్‌ఐ) పథకాలకు కేటాయింపులను 30 శాతం తగ్గించాలని చూస్తున్నది. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ.. పార్లమెంటరీ ప్యానెల్‌కు వెల్లడించిన సమాచారం ద్వారా ఇది తెలిసింది. 2024-25కు గానూ ఉద్యోగ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన పథకాలకు కేటాయింపులను తగ్గించటంలో గల ఉద్దేశాన్ని కార్మిక విభాగానికి సంబంధించిన స్టాండింగ్ కమిటీ సదరు మంత్రిత్వ శాఖను ప్రశ్నించింది. బీజేపీ నేత బసవరాజ్ బొమ్మై నేతృత్వంలోని కమిటీ ఈ నివేదికను ఈనెల 16 పార్లమెంటులో ప్రవేశపెట్టింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ జరిపిన రూ.10 వేలకోట్ల కేటాయింపులకు గానూ 2024-25లో దాదాపు రూ.6,800 కోట్లను ఖర్చు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నదని నివేదిక పేర్కొన్నది. బడ్జెట్ కేటాయింపులు, మంత్రిత్వ శాఖ అంచనాల మధ్య అసమతుల్యతను కమిటీ ఎత్తి చూపింది. వ్యయ ఆర్థిక కమిటీ పథకాలను ఆమోదించిందనీ, క్యాబినెట్ నోట్‌ను అనుమతి కోసం అందించినట్టు ఈనెల 19న కార్మిక మంత్రిత్వ శాఖ.. కమిటీకి తెలిపింది. పథకాల కోసం రాబోయే ఆరున్నరేండ్లకు బడ్జెట్ కేటాయింపు రూ.1.07 లక్షల కోట్లుగా వివరించింది. "ఈ ఏడాది నూతన ఈఎల్‌ఐ పథకం కారణంగా మాకు రూ.10వేల కోట్ల బడ్జెట్ అంచనాలు అందాయి. ఈ ఏడాది మాకు పరిమిత మొత్తం ఉన్నది. కాబట్టి, సవరించిన అంచనాల్లో ఇది దాదాపు రూ.6,799 కోట్లుగా ఉన్నది. ఈ పథకాలు క్యాబినెట్ ఆమోదం కోసం ఎదురుచూస్తున్నాయి. వచ్చే నెల నాటికి ఈ పథకం కింద ఖర్చు చేస్తామన్న ఆశ మాకు ఉన్నది" కార్మిక మంత్రిత్వ శాఖ ప్యానెల్‌కు తెలిపింది.మొదటి ఈఎల్‌ఐ పథకం కింద, అన్ని ఫార్మల్ సెక్టార్లలో నెలకు రూ. లక్ష జీతం కంటే తక్కువ ఉన్న నూతన ఉద్యోగుల (ఫస్ట్ టైమ్ ఎంప్లాయిస్)కు గరిష్టంగా ఒక నెలకు రూ.15 వేలను అందించాలని ప్రభుత్వం యోచిస్తున్నది. రెండో ఈఎల్‌ఐ పథకం కింద బేస్‌లైన్ వర్కర్లలో 50 కంటే ఎక్కువ మంది లేదా 25 శాతం మంది(ఏది తక్కువ ఉంటే అది) యువతను నియమించే యాజమాన్యాలకు నాలుగేండ్లు ప్రోత్సాహకాలు అందించనున్నారు.

40 కేజీల వెండి.. నోట్ల కట్టలు

- 'రవాణా' మాజీ కానిస్టేబుల్ ఇంటిలో సోదాలు
- స్వాధీనం చేసుకున్న మధ్యప్రదేశ్ లోకాయుక్త పోలీసులు



భోపాల్ : మధ్యప్రదేశ్‌లో రవాణా విభాగానికి చెందిన ఒక మాజీ కానిస్టేబుల్ ఇంటిపై లోకాయుక్త పోలీసులు దాడులు నిర్వహించారు. 40 కేజీల వెండిని, పెద్ద ఎత్తున నోట్ల కట్టలను స్వాధీనం చేసుకున్నారు. మాజీ కానిస్టేబుల్‌కు చెందిన రూ.3 కోట్లకు పైగా విలువైన ఆస్తులను(ఇందులో రూ.2.85 కోట్ల నగదు) రికవరీ చేసిన తర్వాత రోజే ఇది చోటు చేసుకోవటం గమనార్హం. నోట్ల కట్టలు, వెండితో పాటు.. రూ.50 లక్షల విలువైన బంగారాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆస్థులకు సంబంధించిన పత్రాలను కనుగొన్నామనీ, వాటిని పరిశీలిస్తున్నామని లోకాయుక్త డీఎస్పీ తెలిపారు. ఒక మాజీ కానిస్టేబుల్ ఇంటిలో పెద్ద ఎత్తున వెండి, నోట్ల కట్టలు బయటపడటంతో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అధికారుల దర్యాప్తులో మరిన్ని విషయాలు బహిర్గతమయ్యే అవకాశాలున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

సాహిత్య అకాడమీ అవార్డుకు ఎ.ఆర్ వెంకటాచలపతి ఎంపిక



న్యూఢిల్లీ : పరిశోధనా విభాగంలో ఎ.ఆర్. వెంకటాచలపతి సాహిత్య అకాడమీ అవార్డు 2024కు ఎంపికయ్యారు. ప్రొఫెసర్, చరిత్రకారుడు అయిన ఈయనకు దక్షిణాదిలో భారత స్వాతంత్ర్య ఉద్యమంపై చేసిన పరిశోధనకు గానూ ఈ అవార్డు వరించింది. ఆయన చేసిన పరిశోధన రచన కన్యాకుమారిలోని నాగర్‌కోయిల్ కేంద్రంగా పని చేసే కలచువాడు పబ్లికేషన్స్ 2022, జనవరిలో ప్రచురించింది. వెంకటాచలపతి పుస్తకం 1908లో తిరునెల్వేలి జిల్లాలో జరిగిన అల్లర్లు, ఇతర అవాంతరాలకు సంబంధించి లోతుగా సాగుతుంది. ఈయన ప్రస్తుతం మద్రాసు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్‌లో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

జైపూర్ ఘటనలో 14కు చేరిన మృతుల సంఖ్య



జైపూర్ : రాజస్థాన్‌లో ఒక ట్రక్కు సృష్టించిన అగ్నిప్రమాద ఘటనలో మృతుల సంఖ్య 14కు పెరిగింది. పశ్చిమ జైపూర్ డీసీపీ అమిత్ కుమార్ ఈ విషయాన్ని వెల్లడించారు. రసాయనాలతో నిండి ఉన్న ఓ ట్రక్కు శుక్రవారం సీఎన్‌టీ ట్యాంకర్, ఇతర వాహనాలను ఢీ కొనడంతో భారీ విస్ఫోటనం జరిగి, మంటలు చెలరేగటం, అది కాస్తా అక్కడి పెట్రోల్ పంపునకు అంటుకోవటంతో పెద్ద ఎత్తున అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఘటన అనంతరం క్షతగాత్రులను ఎస్‌ఎంఎస్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అక్కడ చికిత్స పొందుతున్న వారిని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సచిన్ పైలట్ పరామర్శించారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు. దర్యాప్తు పారదర్శకంగా ఉండాలన్నారు. "ప్రమాదం జరిగిన ప్రదేశం గురించి అందరికీ తెలుసు. అక్కడ నిర్మాణ పనులు ఎందుకు పూర్తి కాలేదు. కాంట్రాక్టర్, ఏజెన్సీ ఎవరు? సమగ్ర దర్యాప్తు తర్వాత ఈ నిజాలన్నీ తెలియాలి" అని సచిన్ పైలట్ అన్నారు. రోజురోజుకూ పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాలపై ప్రభుత్వాలు సీరియస్‌గా దృష్టి సారించాలనీ, భద్రతా ప్రమాణాల అమలవుతున్నాయో, లేదో చూడాలని సూచించారు.

అమరావతిలో 'పైసా వసూల్'



ఖర్చు చేసిన ప్రతి రూపాయి రాబట్టడానికి ప్రణాళిక

- ప్రపంచబ్యాంకుకు ప్రభుత్వ హామీ
- ప్రత్యక్ష, పరోక్ష పన్నుల మోత
- యూజర్ ఛార్జీల వాత
- తాజా నివేదికలో వెల్లడి

అమరావతి : రాజధాని అమరావతి నిర్మాణానికి ఖర్చు చేసే ప్రతి రూపాయిని రాష్ట్ర ప్రభుత్వం తిరిగి వసూలు చేయనుంది. దీనికోసం ప్రజలపై పెద్ద ఎత్తున ప్రత్యక్ష పరోక్ష పన్నులను విధించనుంది. యూజర్ ఛార్జీల మోత మోగించనుంది. ఈ మేరకు ప్రపంచబ్యాంకుకు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ హామీలలోని అంశాల ఆధారంగా 'అమరావతి ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం' పేరిట ప్రపంచబ్యాంకు తాజాగా ఒక నివేదికను రూపొందించింది. అమరావతి నిర్మాణంకోసం రాష్ట్ర ప్రభుత్వం 15వేల కోట్ల రూపాయలకు పైగా రుణం తీసుకుంటున్న సంగతి తెలిసిందే. దీనిలో ప్రపంచబ్యాంకు 6,791 కోట్లరూపాయలను రుణంగా ఇవ్వనుంది. ఈ మొత్తాన్ని సాధారణ రుణం కాకుండా 'ఫలితాల ఆధారిత రుణం (రిజల్ట్స్ బేస్డ్ లెండింగ్-ఆర్‌బిఎల్) పద్ధతిలో ఇస్తోందని, దీనికోసం ప్రపంచబ్యాంకు విధించే నిర్దేశించే లక్ష్యాలు (షరతులు)ను తప్పకుండా సాధించాల్సి ఉంటుందని ప్రజాశక్తి కొద్దిరోజుల క్రితం ప్రచురించిన విషయం విదితమే! ప్రపంచబ్యాంకు విడుదల చేసిన 62 పేజీల తాజా నివేదికలో ఈ కీలకమైన 'కాస్ట్ రికవరికి' సంబంధించిన మరికొన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. నివేదికలోని 18నుండి 21 వరకు, ఆ తరువాత మరికొన్ని పేరాల్లోనూ కాస్ట్ రికవరి, ప్రైవేటు పెట్టుబడి అభివృద్ధికి సంబంధించిన అంశాలను పేర్కొన్నారు. అయితే, ఇవి తక్షణమే కాకుండా దశలవారిగా అమలులోకి రానున్నాయి. దీనికి సంబంధించిన యంత్రాంగాన్ని కూడా ప్రభుత్వం అదే విధంగా ఏర్పాటు చేయనుంది. 'దీర్ఘకాల అమరావతి అభివృద్ధి ప్రణాళిక'గా దీనిని నివేదికలో పేర్కొన్నారు. 'క్రియాశీల ఆర్థిక , సమ్మిళిత, నష్టాలను తట్టుకుని నిలిచే సుస్థిరాభివృద్ధి, పర్యావరణ హిత నగరంగా' అమరావతిని తీర్చిదిద్దడానికి ఈ చర్యలు దోహదపడతాయని వివరించారు.

స్వయం సమృద్ధిగా తొలిదశ

తొలిదశ నిర్మాణ పనులు 92 చదరపు కిలో మీటర్లలో సాగుతాయని నివేదికలో ప్రపంచబ్యాంకు తెలిపింది. ఐదు సంవత్సరాల్లో పూర్తయ్యే తొలిదశను స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు.జోన్1 నుండి 7వరకు, 10వ నెంబర్ జోన్‌లోనూ ఈ పనులు జరుగుతాయని, 98 శాతం సమీకరణకోసం తీసుకున్న భూముల్లోనే తొలిదశ నిర్మాణాలు ఉంటాయని నివేదికలో బ్యాంకు తెలిపింది. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు సృష్టించి, ప్రజలను అక్కడే స్థిరపడేలా ఎకనామిక్ మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.తాత్కాలిక, స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళికను రూపొందిస్తామని, నిర్వహణ కోసం ప్రత్యేక ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ఒప్పందంలో తెలిపారు. ఆస్తిపన్నులు (మార్కెట్ విలువ ఆధారిత ఆస్తిపన్ను) కాస్ట్ రికవరీ టారిఫ్(ప్రభుత్వ ఆర్థికలావాదేవీలు), భూమి విలువను పెంచడం వంటి పద్ధతుల్లో నిధులు సమకూర్చు కుంటామని పేర్కొన్నారు. సిఆర్‌డిఏపై ఆర్థిక భారం లేకుండా చేస్తామని వివరించారు. దీనికోసం నిర్దిష్ట కాలపరిమితితో ఆర్థిక ప్రణాళికను సిద్ధం చేస్తామని హామీనిచ్చినట్లు ప్రపంచబ్యాంకు నివేదికలో పొందుపరిచారు.

'ప్రైవేటు'కే సేవలు

పౌరసేవా రంగాలన్నింటిన్ని ప్రైవేటు రంగానికి అప్పగించడం ద్వారా కాస్ట్ రికవరి విధానాన్ని, యూజర్ ఛార్జీలను పటిష్టంగా అమలు చేయాలని ఈ నివేదికలో ప్రపంచబ్యాంకులో సూచించింది. పైగా దీనిని ' ఫలితాలు వచ్చే ప్రాంతాల్లో ఒకటవ విభాగంలోచేర్చడం (రిజల్ట్స్ ఏరియాస్ -1) ద్వారా బ్యాంకు ప్రాధాన్యత ఏమిటో స్పష్టమవుతోంది. 'నీళ్లు, పారిశుద్ధ్యం, డ్రైనేజితో పాటు ఇతర మౌలికసదుపాయల నిర్వహణకు వృత్తిపరమైన నిపుణులను ప్రభుత్వం నియమించాలి. నివసించే ప్రజలకు, వ్యాపార సంస్థలకు ఈ సేవలను అందించడంతోపాటు ఖర్చుకు తగ్గట్టుగా రికవరి టారిఫ్‌ను సిద్ధం చేసి, వసూళ్లు చేసే నైపుణ్యం వారికి ఉండాలి. క్రమేణా యూజర్ ఛార్జీలను వసూలు చేయడం, ప్రైవేటు రంగాన్ని ఈ సేవల్లోకి తీసుకురావడం వంటి పనులు చేయాలి' అని పేర్కొన్నారు. రుణ మంజురుకు సంబంధించిన పత్రంలోనే 'ప్రైవేటు రంగ ఏర్పాటుకు, స్థిరపడటానికి, అభివృద్ధి చెందడానికి అవకాశం ఉండాలి' అని బ్యాంకు పేర్కొన్న విషయం ఈ సందర్భంగా గమనార్హం. కమ్యూనిటీ, పరిసర ప్రాంతాల అభివృద్ధి వంటి పనుల్లో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇక్కడ భాగస్వామ్యం అంటే, ఏదో రకంగా ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపడమే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనిలో భాగంగానే ఏయే సేవారంగానికి ఎంత మొత్తాన్ని రుణంగా ఇస్తున్న అంశాన్ని కూడా ప్రపంచబ్యాంకు వివరించింది, ఉదాహరణకు రోడ్లు, నీళ్లు, విద్యుత్, డ్రైనేజి తదితర మౌళిక వసతుల రంగానికి 884 మిలియన్ డాలర్లను కేటాయిస్తున్నట్లు ప్రపంచబ్యాంకు పేర్కొంది. ఆర్‌బిఎల్ విధానం ప్రకారం ఈ మొత్తాన్ని ఖర్చు చేసే సమయానికి ఆ మేరకు నిర్దేశించిన 'ఫలితాలను' కూడా సాధించాలి. ఇక్కడ ఫలితాలంటే ఏమిటో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అమరాతికి తీసుకునే అప్పును ప్రజల నుండే వివిధ రూపాల్లో వసూలు చేస్తారని 2016లోనే ప్రజాశక్తి ప్రచురించడం గమనార్హం.

భూభారతి కాదు భూహారతి

- తెలంగాణ రైతుకు రక్షణ కవచం ధరణి : మండలిలో కవిత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భూభారతి బిల్లుతో కాంగ్రెస్ ప్రభుత్వం భూములకు భూహారతి పాడుతుందని బీఆర్‌ఎస్ సభ్యులు కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ రైతులకు రక్షణ కవచంగా ధరణి ఉందనీ, దాన్ని రద్దు చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. శాసనమండలిలో శనివారం భూభారతి బిల్లుపై చర్చ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమాత పోర్టల్ భూమేతకు దారి తీస్తుందని ఆరోపించారు. భూభారతి తిరోగమన చర్య అని విమర్శించారు. ధరణి వచ్చిన తర్వాత భూమోసాలు పోయాయని అన్నారు. ధరణితో ఆటలాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చరిత్ర క్షమించదని చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీ అంటే భూ రక్షణ సమితి అని వివరించారు. రైతులకు భూభద్రతను కల్పించిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. రాష్ట్రంలో 2.8 కోట్ల ఎకరాల భూమి ఉందనీ, అందులో 1.5 కోట్ల ఎకరాలు సాగు భూమి ఉందని వివరించారు. 17.8 లక్షల ఎకరాల భూమి మాత్రమే వివాదాల్లో ఉందన్నారు. గతంలో కౌలుదారులు కేసులు వేస్తే 20-25 ఏండ్ల పాటు రైతులు కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని అన్నారు. కేసీఆర్ రైతుకు మాత్రమే భూమికి యాజమన్య హక్కు ఉండే విధంగా ధరణి పోర్టల్‌ను తెచ్చారని వివరించారు. ధరణి వచ్చిన తర్వాత ఒక్క గుంట ప్రభుత్వ భూమి కూడా అన్యాక్రాంతం కాలేదన్నారు. భూ రిజిస్ట్రేషన్ వ్యవస్థను బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేరువ చేసిందని చెప్పారు. భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ఒకే సారి చేయడం వల్ల రైతులు, ప్రజలకు మేలు కలిగిందన్నారు. 66 లక్షల మంది రైతుబంధు, రైతు బీమా, పంటరుణాలు అందించడానికి వీలైందని అన్నారు. ప్రయివేటు వడ్డీ వ్యాపారుల నుంచి రైతులు విముక్తి అయ్యారని చెప్పారు. ఎంజాయ్‌మెంట్ సర్వే వల్ల గ్రామాల్లో తగాదాలు వస్తాయన్నారు. మాన్యువల్‌గా పహానీలను రాయడం వల్ల పాత వ్యవస్థ వస్తుందనీ, రైతుల మధ్య వివాదాలు తలెత్తుతాయని అన్నారు. భూవ్యవహారాల్లో తప్పు జరిగితే ప్రభుత్వ ఉద్యోగులకు శిక్ష వేస్తామంటూ భయపెట్టడం సరికాదని సూచించారు, భూభారతిలో కౌలుదారులు, అనుభవదారుల నిబంధనను పెట్టే ఆలోచనను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని ఆమె కోరారు. కౌలుదారులను వేరే విధంగా ఆదుకోవాలనీ, పెన్షన్ వంటివి ఇవ్వాలని అన్నారు.

పాక్ అల్లర్లలో 25మంది పౌరులకు జైలు శిక్షలు విధించిన మిలటరీ కోర్టు

ఇస్లామాబాద్ : గతేడాది మే 9న జరిగిన అల్లర్ల కేసులో 25మంది పౌరులకు పాకిస్తాన్ మిలటరీ కోర్టులు శిక్షలు విధించాయి. అల్లర్ల సందర్భంగా మిలటరీ స్థావరాలపై దాడులు జరిపినందుకు వీరికి రెండు నుండి పదేళ్ల పాటు జైలు శిక్షలు విధించినట్లు ఆర్మీ శనివారం ప్రకటించింది. మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను అరెస్టు చేయడంతో అల్లర్లు తలెత్తాయి.

2023 మే 9న తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ (పిటిఐ) మద్దతుదారులు రావల్పిండిలోని ఆర్మీ హెడ్ క్వార్టర్స్, ఫైసలాబాద్‌లోని ఐఎస్‌ఐ భవనంతో సహా పలు మిలటరీ స్థావరాలపై దాడులు జరిపారు. అవినీతి కేసులో తమ నేతను అరెస్టు చేసినందుకు వారు ఆవేశంతో ఈ దాడులకు దిగారు.

దేశంలో పలు ప్రాంతాల్లో రాజకీయంగా ప్రేరేపించబడిన హింసాకాండ చెలరేగింది. ఇది పాకిస్తాన్ చరిత్రలో చీకటి అధ్యాయమని మిలటరీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇటువంటి రాజకీయ తీవ్రవాదం ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదని వీటికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం వుందని ఆ ప్రకటన పేర్కొంది. మొదటి దశలో 25మందికి శిక్షలు విధించామని, మిగిలిన వారిపై ఇంకా విచారణ జరుగుతోందని, అవి కూడా త్వరలో ప్రకటిస్తామని ఆ ప్రకటన తెలిపింది. వీరిలో 14మందికి పదేళ్ళ పాటు శిక్ష విధించగా, మిగిలిన వారికి స్వల్పకాలిక శిక్షలు పడ్డాయి.

కెనడా ప్రధాని ట్రూడేపై అవిశ్వాసం పెడతా

- ఎన్‌డిపి నేత జగ్‌మీత్ సింగ్ ప్రకటన



టొరంటో : కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడే నాయకత్వ భవితవ్యం అనిశ్చితిలో పడినట్లు కనిపిస్తోంది. మైనారిటీ లిబరల్ ప్రభుత్వాన్ని కూల్చివేయడానికి తీర్మానం ప్రవేశపెడతానని కీలక మిత్రపక్షమైన న్యూ డెమోక్రటిక్ పార్టీ (ఎన్‌డిపి) నేత జగ్‌మీత్ సింగ్ ప్రకటించడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైంది. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో బహిరంగ లేఖ పెట్టారు. కొత్త సంవత్సరంలో ట్రూడే నాయకత్వంలోని లిబరల్ ప్రభుత్వంపై అవిశ్వాసాన్ని ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ చర్యకు ఇతర ప్రతిపక్షాలు కూడా మద్దతిచ్చినట్లైతే సత్వరమే ఎన్నికలు వచ్చే అవకాశం వుందని భావిస్తున్నారు. ట్రంప్ టారిఫ్‌లపై ప్రధానితో విభేదాలు తలెత్తి కెనడా డిప్యూటీ ప్రధాని రాజీనామా చేశారు. అక్టోబరులోగా కెనడాలో ఎన్నికలు నిర్వహించాల్సి వుంది. లిబరల్స్‌కు మరోసారి అవకాశమిచ్చేందుకు అర్హత లేదని సింగ్ తన లేఖలో వ్యాఖ్యానించారు. అందువల్లే ఈ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఎన్‌డిపి భావిస్తోందన్నారు. ప్రస్తుతం శీతాకాల విరామంలో వున్న పార్లమెంట్ జనవరి 27న సమావేశమవుతుంది. కాగా మరోవైపు 21మంది లిబరల్ ఎంపీలు కూడా ప్రధాని రాజీనామాను డిమాండ్ చేస్తున్నారు. ఈ వారంలో ట్రూడే ప్రభుత్వానికి తగిలిన రాజకీయ ఎదురు దెబ్బల్లో సింగ్ లేఖ తాజాది.

ఎన్నికల నిబంధనల్లో మార్పులు

- కాంగ్రెస్ విమర్శలకు నిదర్శనాలు : జైరాం రమేష్

న్యూఢిల్లీ : ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నియామాల్లో మార్పులు చేయడం ఎన్నికల ప్రక్రియపై కాంగ్రెస్ చేసిన విమర్శలకు, వాదనలకు నిదర్శమని ఆ పార్టీ నాయకులు జై రాం రమేష్ పేర్కొన్నారు. సోషల్ మీడియా ఎక్స్‌లో జైరాం రమేష్ ఈ మేరకు ఒక పోస్టు చేశారు. ఇటీవల జరిగిన హర్యానా అసెంబ్లీల్లో ఒక బూత్‌కు సంబంధించిన వీడియో, సిసిటివి ఫుటేజ్‌ను పిటీషనర్‌కు అందచేయాలని ఫంజాబ్‌హర్యానా హైకోర్టు ఆదేశించిందని, ఈ ఆదేశాలతో కేంద్రం ఎన్నికల సంఘం, కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖలు పై నిబంధనల్లో మార్పులు చేశాయని తెలిపారు. కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ శుక్రవారం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ఎన్నికల నియమావళిలోని రూల్ 93(2)(ఎ)ను మార్చిందని తెలిపారు. గతంలో ఉన్న 'ఎన్నికలకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు ప్రజల తనిఖీ కోసం ఉంచబడతాయి' అనే నిబంధనను ఇప్పుడు 'ఎన్నికలకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు ప్రజలు చదవడం కోసం ఉంచబడతాయి' అని మార్చిందని తెలిపారు. ఇటీవల కాలంలో కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించే ఎన్నికల ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలు సరైనవి అని చెప్పడానికి నిదర్శమని అన్నారు. ఎన్నికలకు సంబంధించిన చట్టబద్ధమైన మొత్తం సమాచారాన్ని ప్రజలతో పంచుకోవాలని కాంగ్రెస్ గతంలోనే కోరిందని, దాన్ని ఇప్పుడు పంజాబ్-హర్యానా హైకోర్టు ఆదేశించిందని అన్నారు. అయినా ఇంకా కూడా హైకోర్టు ఆదేశాలను పాటించడానికి బదులుగా బహిరంగం చేయాల్సిన డాక్యుమెంట్ల జాబితాను తగ్గించడానికి భారత ఎన్నికల సంఘం ప్రయత్నిస్తుందని విమర్శించారు. 'పారదర్శకత అంటే ఇసిఐ ఎందుకు భయపడుతోంది? ఇసిఐ చర్యలు చట్టబద్ధమైన మార్గంలో సవాల్ చేయబడుతుంది' అని జైరాం రమేష్ తెలిపారు.

పదేండ్లలో ఉగ్రవాదం తగ్గుముఖం

- అమిత్ షా



అగర్తల: దేశంలో గత పదేండ్లలో ఉగ్రవాదం తగ్గుముఖం పట్టిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. ముఖ్యంగా పదేండ్లలో ఈశాన్య భారతంలో దాదాపు 9వేల మంది సాయుధ ఉగ్రవాదులు లొంగిపోయారని చెప్పారు. అగర్తలలో జరిగిన నార్త్ ఈస్టర్న్ కౌన్సిల్ (ఎన్‌ఈసీ) 72వ ప్లీనరీ సమావేశంలో అమిత్ షా పాల్గొని, ప్రసంగించారు. 20 శాంతి ఒప్పందాల ద్వారా ఈశాన్య భారత్‌లో ప్రధానమంత్రి మోడీ శాంతి నెలకొల్పారని..రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేశారని అమిత్‌షా తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఈశాన్య భారత్‌లో రైలు అనుసంధానత కోసం రూ.81 వేల కోట్లు, రోడ్ల నిర్మాణానికి రూ.41 వేల కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు.

అదేవిధంగా ఈశాన్య రాష్ట్రాల్లో సేంద్రియ సాగుపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే నేషనల్ ఆర్గానిక్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌ఓసీఎల్)ను ఏర్పాటు చేసిందన్నారు. సేంద్రీయ ఉత్పత్తుల ప్యాకేజింగ్, మార్కెటింగ్, ఎగుమతి కోసం ఎన్‌ఓసీఎల్‌తో ఒప్పందాలు కుదుర్చుకోవాలని ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులను కేంద్ర మంత్రి అభ్యర్థించారు. గత నాలుగు దశాబ్దాలుగా ఇక్కడి పోలీసులు వేర్పాటువాదులతో పోరాడారని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రాల్లో వారి దాడులు తగ్గాయి కాబట్టి.. ఇకపై ప్రజలకు సత్వర న్యాయం చేసేలా పోలీసు యంత్రాంగం తీరులో మార్పు రావాల్సిన సమయం ఆసన్నమైందని అమిత్ పేర్కొన్నారు. ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసిన మూడేండ్లలోపు బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని షా సూచించారు.

మెట్రో విస్తరణకు వేగంగా సన్నాహాలు

- ఓల్డ్‌సిటీలో భూసేకరణకు నష్టపరిహారం ఖరారు
- చదరపు గజానికి రూ.81 వేలు : హెచ్‌ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ ఓల్డ్‌సిటీలో మెట్రో మార్గంలో రోడ్డు విస్తరణకు సంబంధించిన భూసేకరణ వేగవంతమైందని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్, హెచ్‌ఏఎంఎల్ అధికారులు ప్రభావిత ఆస్తుల యజమానులతో పలు దఫాలుగా సంప్రదింపులు జరిపారని చెప్పారు. ఆస్తుల నష్టపరిహారం చదరపు గజానికి రూ.81వేలుగా జిల్లా కలెక్టర్ నిర్ణయించారని ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. మెట్రో ప్రయాణికుల కోసం ప్రత్యేక ధరలతో ఫస్ట్ అండ్ లాస్ట్ మైల్ కనెక్టివిటీని అందించడానికి ఎల్అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్‌తో 'రాపిడో' శనివారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో మెట్రో విస్తరణ పనులు వేగవంతంగా చేపట్టాలని ధృఢ నిశ్చయంతో ఉన్నారని, అందుకు అనుగుణంగా పాత నగరంలో భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నామని తెలిపారు. ఇప్పుడు నిర్ణయించిన నష్టపరిహారానికి అనుగుణంగా కొందరు యజమానులు ఇప్పటికే తమ అంగీకార పత్రాలను సమర్పించారని, వారికి 10 రోజుల్లోగా నష్టపరిహారం నేరుగా చెక్కు రూపంలో చెల్లిస్తామని చెప్పారు. మిగిలిన ఆస్తుల యజమానులూ వీలైనంత త్వరలో తమ అంగీకార పత్రాలను హెచ్‌ఏఎంఎల్ కార్యాలయానికి అందజేస్తే వారికీ త్వరలోనే నష్టపరిహారాన్ని చెక్కుల ద్వారా చెల్లిస్తామని మెట్రో ఎండీ తెలిపారు.

హైదరాబాద్ మెట్రో రైల్, రాపిడో మధ్య భాగస్వామ్యం హైదరాబాద్‌లో అర్బన్ మొబిలిటీ ఇంకా మెరుగుపరచడంలో తమ నిబద్ధతకు ఉదాహరణ అని తెలిపారు. క్లిష్టమైన మొదటి, చివరి-మైలు కనెక్టివిటీ సవాళ్లను పరిష్కరించడం ద్వారా, ఈ చొరవ నగర ప్రయాణికులకు కీలకమైన లైఫ్‌లైన్‌గా మెట్రో రైలు స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. ప్రయాణికులను వారి గమ్యాలకు చేర్చే రాపిడో లాంటి వాహన సేవలు మహిళలకూ తగు ప్రాధాన్యత కల్పించి, వారిని పైలట్‌లుగా భాగస్వామ్యులయ్యేలా కృషి చేయాలని సూచించారు. దీని వల్ల మహిళలలో భద్రతాభావం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎల్అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ సీఈఓ మురళీ వరదరాజన్, రాపిడో చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ పవన్ దీప్ సింగ్ పాల్గొన్నారు.ం



అసోం అభయారణ్యంలో 72 శాతం క్షీణించిన పక్షి జాతులు

గౌహతి : అసోంలోని ప్రఖ్యాత బోర్డోయిబామ్-బిల్‌ముఖ్ పక్షుల అభయారణ్యం(బీబీబీఎస్)లో గత 27 ఏండ్లలో దాదాపు 72 శాతం పక్షి జాతులు క్షీణించాయి. స్వతంత్ర పరిశోధకులు లఖిజ్యోతి సైకియా, సిద్ధార్థ సుమన్ బోరా, ఖిరోద్ శంకర్ దాస్ చేసిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడయింది. ఈ అధ్యయనం వివరాలను జర్నల్ ఆఫ్ థ్రెటెండ్ టాక్సాలో ప్రచురించారు. 1997లో ఈ అభయారణ్యంలో మొత్తం 167 పక్షి జాతులు ఉండగా, ఇటీవల 18 నెలలపాటు చేసిన అధ్యయనంలో కేవలం 47 పక్షి జాతులను మాత్రమే గుర్తించారు. ముఖ్యంగా 2018 నుంచి పక్షి జాతులు వేగంగా క్షీణించడం ప్రారంభించాయని అధ్యయనం గుర్తించింది. అలాగే పక్షి జాతులు క్షీణించడానికి కొన్ని ముఖ్య కారణాలను కూడా అధ్యయనం గుర్తించింది. ఎక్కువ సంఖ్యలో చేపలు పట్టడం, చెట్లను ఎక్కువగా నరకడం, పక్షులను వేటాడటం, పక్షి గుడ్లను సేకరించడం వంటివి ఉన్నాయి. అలాగే నీటి వనరులకు సమీపంలో అధునిక యంత్రాలతో పంటల సాగు చేయడం కూడా కారణాలుగా తెలిపింది. బీబీబీఎస్ చుట్టూ కఠినమైన పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని అధ్యయనం ప్రస్తావించింది. ధేమాజీ, లఖింపూర్ జిల్లాలో సముద్ర మట్టానికి 90 నుంచి 95 మీటర్లలో ఎత్తులో దాదాపు 11.25 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఈ బీబీబీఎస్ విస్తరించి ఉన్నది. భారతదేశంలో అత్యంత జీవవైవిధ్యం కలిగిన రాష్ట్రాల్లో అస్సాం ప్రముఖమైనది. అక్కడ దాదాపు 950 పక్షి జాతులు ఉన్నట్లు అంచనా. అలాగే ఈ రాష్ట్రంలో 55 ముఖ్యమైన పక్షి, జీవ వైవిధ్య ప్రాంతాలు ఉన్నాయి.

జర్మనీలో క్రిస్మస్ మార్కెట్‌పై దాడి

- ఐదుగురు మృతి, 200మందికి పైగా గాయాలు



బెర్లిన్ : జర్మన్ నగరమైన మగ్డెబర్గ్‌లో రద్దీగా వున్న క్రిస్మస్ మార్కెట్‌పై జరిగిన దాడిలో ఐదుగురు మరణించారు. 200మందికి పైగా గాయపడ్డారు. వీరిలో చాలామందికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ మేరకు సాక్సోనీ-అన్హల్ట్ రాష్ట్ర గవర్నర్ రెయినర్ హేజెలాఫ్ శనివారం ఒక ప్రకటన చేశారు. శుక్రవారం సాయంత్రం సౌదీ డాక్టర్ ఒకరు ఉద్దేశ్యపూర్వకంగానే నల్ల బిఎండబ్ల్యు కారును మార్కెట్‌లోకి నడుపుకుంటూ వెళ్లారని ఆ ప్రకటన తెలిపింది. రాత్రి 7గంటల సమయంలో ఈ దుర్ఘటన జరిగిన వెంటనే డ్రైవర్‌ను అరెస్టుచేశారు. ఆ సమయంలో పండుగ కోసం షాపింగ్ చేసేవారితో మార్కెట్ అంతా రద్దీగా వుంది. అనుమానితుడిని ఆ పక్కనే రోడ్డుపైనే అరెస్టు చేసినట్లు వీడియో పుటేజీని బట్టి తెలుస్తోంది. 50ఏళ్ళ సౌదీ డాక్టర్ 2006లో జర్మనీకి వలస వచ్చేశారు. కాగా పోలీసులు దీనిపై వ్యాఖ్యానించడానికి అందుబాటులోకి రాలేదు. తొలుత ఇద్దరే మరణించారని భావించినా, తర్వాత మృతుల సంఖ్య పెరిగింది. తీవ్రంగా గాయపడిన వారు 127మంది వున్నారని, 78మందికి స్వల్ప గాయాలయ్యాయని మీడియా వార్తలు తెలిపాయి. ఈ దాడి వార్త నగర ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసింది. మేయర్ కళ్ళనీళ్ళ పర్యంతమయ్యారు. ఈ సంఘటనకు సంఘీభావంగా పలు ఇతర పట్టణాల్లో వారాంతపు క్రిస్మస్ మార్కెట్లను మూసివేశారు.

ఎలక్ట్రానిక్ రికార్డుల బహిరంగ తనిఖీ కుదరదు

- ఎన్నికల నిబంధనను సవరించిన కేంద్రం



న్యూఢిల్లీ : సిసిటివి కెమెరా, వెబ్‌కాస్టింగ్ ఫుటేజ్ అలాగే అభ్యర్థుల వీడియో రికార్డింగ్‌లు వంటి నిర్దిష్ట ఎలక్ట్రానిక్ పత్రాల దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు బహిరంగంగా వాటిని తనిఖీ చేయడాన్ని నివారిస్తూ ఎన్నికల నిబంధనను ప్రభుత్వం సవరించింది. ఎన్నికల కమిషన్ సిఫారసు మేరకు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఎన్నికల నిర్వహణా నిబంధనలు, 1961లోని 93వ నిబంధనను సవరించింది. అటువంటి పత్రాలు లేదా వీడియోల బహిరంగ తనిఖీని నియంత్రించింది. ఎన్నికలకు సంబంధించిన అన్ని పత్రాలను బహిరంగంగా తనిఖీ చేయవచ్చని రూల్ 93 పేర్కొంటోంది. తాజాగా చేసిన మార్పులో 'పత్రాలు' అన్న పదం తర్వాత 'ఈ నిబంధనల్లో పేర్కొన్న ప్రకారం' అన్న సవరణ పొందుపరిచారు. ఒక కోర్టు కేసు కారణంగానే ఈ సవరణ తీసుకువచ్చినట్లు న్యాయ శాఖ, ఈసీ అధికారులు వేర్వేరుగా తెలిపారు. ఎన్నికల నిబంధనలను ఉటంకిస్తూ కొన్ని ఎలక్ట్రానిక్ రికార్డులను అందచేయాలని కోరే సందర్భాలు వున్నాయి. తాజాగా చేసిన సవరణ ప్రకారం నిబంధనల్లో ప్రస్తావించని పత్రాలు వేటినీ బహిరంగ తనిఖీకి అనుమతించారని ఇసి అధికారి వివరించారు. సీసీటీవీ కెమెరా ఫుటేజ్ వంటి వివరాలు అభ్యర్థులకు అందుబాటులో వుంటాయన్నారు. ఈ సవరణ వచ్చినా వారికి అడ్డేమీ వుండద న్నారు.హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన అవసరమైన పత్రాల కాపీలను అందచేయాల్సిందిగా పంజాబ్, హర్యానా హైకోర్టు ఇటీవల ఈసీని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈ సవరణ చేశారు. కాగా ఈ సవరణ వల్ల మొత్తంగా ఎన్నికల ప్రక్రియ సమగ్రత దెబ్బతింటోందని కాంగ్రెస్ విమర్శించింది.

సంబంధాల బలోపేతమే లక్ష్యం

- కువైట్‌లో ప్రధాని పర్యటన
- రామాయణ, మహాభారతాలను అరబిక్‌లో అనువదించిన వారితో మోడీ భేటీ



కువైట్ : భారత ప్రధాని నరేంద్రమోడీ రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం కువైట్ చేరుకున్నారు. 1981లో ప్రధానిగా ఉన్న సమయంలో ఇందిరాగాంధీ కువైట్‌ని సందర్శించారు. 2009లో భారత ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ ఈ అగ్నేయాసియా దేశాన్ని సందర్శించారు. దాదాపు 43 ఏండ్ల తర్వాత కువైట్‌లో పర్యటించిన రెండవ ప్రధానిగా మోడీ నిలిచారు. కువైట్ అమీర్ షేక్ మెషల్ అల్ అహ్మద్ అల్ జాబర్ అల్ - సబాహ్ ఆహ్వానం మేరకు ప్రధాని మోడీ పర్యటించనున్నారు. మోడీ రెండు రోజుల పర్యటనలో కువైట్ ప్రధాని, ఆ దేశ యువరాజు సబా అల్ - ఖాలిద్ అల్ - సబాతో ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, విద్యుత్, సంస్కృతులపై, ప్రజల మధ్య సంబంధాలపై ఇరువురు ప్రధానులు చర్చించుకోనున్నారు. కాగా, ఈ పర్యటనలో భాగంగా మోడీ భారతీయ బ్లూ కాలర్ కార్మికులు ఉన్న లేబర్ క్యాంప్‌ను కూడా సందర్శించనున్నారు. ప్రవాస భారతీయులు కూడా కలుసుకోనున్నారు. గల్ఫ్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ఆయన హాజరుకానున్నారు. మోడీ పర్యటన ఇరు దేశాల మధ్య కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ తెలిపింది. రామాయణ, మహాభారతాలను అరబిక్‌లోకి అనువదించిన అబ్దుల్లా అల్ బరౌన్, వాటిని ప్రచురించిన అబ్దుల్ లతీఫ్ అల్ నసీఫ్‌లను మోడీ శనివారం కలుసుకున్నారు.ఇరు దేశాల మధ్య భవిష్యత్తుల్లో భాగస్వామ్యానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవడానికి ఈ పర్యటన ఒక అవకాశం కల్పించిందని మోడీ ఢిల్లీ నుండి బయలుదేరడానికి ముందుగావ్యాఖ్యానించారు. కువైట్‌తో తరాల తరబడి పెంచి పోషించుకుంటూ వస్తున్న చారిత్రక సంబంధాలకు తామెంతో విలువిస్తామన్నారు. కేవలం పటిష్టమైన వాణిజ్య, ఇంధన సంబంధాలే కాదని, పశ్చిమాసియాలో శాంతి, సుస్థిరత, భద్రత, సంక్షేమం ప్రయోజనాలే ప్రధానంగా పంచుకుంటామని చెప్పారు. కువైట్‌లో భారతీయులు 21శాతంగా వున్నారు. అక్కడి కార్మిక శక్తిలో 30శాతం మంది భారతీయులే.